
డిసెంబరు 2015
కార్తీకము-మార్గశిరము | శాలివాహన శకం 1937 ₹ 5

ఆంధ్రప్రదేశ్



ఎన్టీఆర్ భరోసా

దేశంలోనే అతిపెద్ద సంక్షేమ పథకం



భారీ వర్షాలు, వరదలతో నెల్లూరు, చిత్తూరు, కడప, ఉభయగోదావరి జిల్లాలలో తీవ్ర నష్టం జరిగింది. తక్షణమే స్పందించిన ప్రభుత్వం సహాయక చర్యలను చేపట్టింది. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యవేక్షణలో మంత్రులూ, అధికారులూ రాత్రింబవళ్లూ శ్రమించి సాధారణ పరిస్థితి నెలకొల్పేందుకు కృషి చేశారు. ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి, ఇళ్లు, చేపలు, రొయ్యల చెరువులు, వరి పంట, ఉద్యాన పంటలు, పశు సంపదకు జరిగిన నష్టంపై అంచనాలను సత్వరం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. సహాయ, పునరావాస కార్యక్రమాలు, నీటి నిర్వహణపై విపత్తు నిర్వహణ అధికారులు, జల వనరుల శాఖ అధికారులకు చంద్రబాబు పలు సూచనలు ఇచ్చారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలందరకీ, ప్రభుత్వం వారి వెంట ఉన్నదన్న భరోసా కల్పించే రీతిలో పనిచేయాలని సూచించారు.

ప్రభుత్వం పట్ల పూర్తి నమ్మకం కలిగి బాధితుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించే రీతిలో సహాయ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఆయా ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఇప్పటికే చెరువులు, రిజర్వాయర్లలో చేరిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకుని, ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు.

ఈ సంచికలో...

ఆంధ్రప్రదేశ్

తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ప్రచురితం

సంపుటి 59 సంచిక 5

శాలివాహన శకం 1937 కార్తీకము–మార్గశిరము

పబ్లిషర్ కమిషనర్
డా. పి కృష్ణమోహన్

ప్రధాన సంపాదకుడు
కందుల రమేష్

సంపాదకుడు
నున్నా నరేష్

సహ సంపాదకులు
నీరుకొండ ప్రసాద్
జాస్తి గోపాల ప్రసాద్
డబ్బీరు రామకృష్ణ పట్నాయక్

ముఖచిత్రం
కవర్ ఫొటో సిఎన్ రావు (విజయవాడ)

రెండవ కవర్
రాష్ట్రంలో భారీ వర్షాలతో తెగిన రోడ్లు

మూడవ కవర్
ముఖ్యమంత్రి కార్యక్రమాల చిత్రమాలిక

నాల్గవ కవర్
పేదరికంపై గెలుపు ప్రకటన

ప్రచురణ
సమాచార, పౌరసంబంధాల శాఖ
సమాచార భవన్, ఎ.సి.గార్డ్స్
హైదరాబాద్ – 500 028
ఫోన్: 040 – 23300258

రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి చెందినవి కానక్కరలేదు.

రూపకల్పన
కార్తీక్ బీసు

ఫొటోలు
టి.శ్రీనివాస రెడ్డి, విజయవాడ

ముద్రణ
కాక్స్‌టన్ ఆఫ్‌సెట్ ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్

www.andhrapradeshmagazine.org
Email: apchiefeditor@gmail.com
www.ipr.ap.nic.in

ముఖ్యమంత్రి ఉక్కు సంకల్పం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పట్టుదల కారణంగా రాష్ట్ర పాలనా కేంద్రం విజయవాడకు మారింది. మరో ఎనిమిదిన్నరేళ్ళు హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా మనకు హక్కులున్నప్పటికి, రాష్ట్రం నుంచే పాలన కొనసాగడం సముచితం అని తలిచిన ముఖ్యమంత్రి విజయవాడకు తన కార్యాలయాన్ని తరలించారు. ఇక్కడనుంచే, పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు.

అయితే, ఇదేమీ అంత తేలికయిన వ్యవహారం కాదు. ఇప్పటికిప్పుడు, విజయవాడలో పరిపాలనకు అవసరమైన సకల వసతులు కల్పించడం సాధ్యమయ్యే పని కాదు. అరకొర సౌకర్యాలతోనే, ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి అంటే ఒక ఒక వ్యక్తి కాదు. ఒక పదవి కాదు. ఒక వ్యవస్థ. పాలనా వ్యవహారాలకు దిక్సూచిగా ఉండే ముఖ్యమంత్రి చుట్టూ ఒక పెద్ద వ్యవస్థే అల్లుకొని ఉంటుంది. అందుకే, ముఖ్యమంత్రితో పాటు, ఆయన కార్యాలయ నిర్వాహకులు, వివిధ శాఖల పెద్దలు అందరూ విజయవాడ నుంచే విధి నిర్వహణ చేయాల్సి ఉంటుంది.

ఎన్నో కష్ట నష్టాల మధ్య, ఇబ్బందుల నడుమ కూడా మన రాష్ట్రంనుంచే మన పాలన సాగాలనే ముఖ్యమంత్రి ధృఢనిశ్చయం వల్లనే ఈ మార్పు సాధ్యమైంది. ఆయనను ఆదర్శంగా తీసుకొని, సమాచార పౌరసంబంధాలు వంటి కొన్ని శాఖలు ఇప్పటికే విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్నాయి. మరికొన్ని, విజయవాడకు తరలి వెళ్ళే ప్రయత్నంలో ఉన్నాయి.


ఇదంతా నల్లేరు మీద బండి నడక కాదు. అయినా ముఖ్యమంత్రి ముందు చూపుతో తనే ఆదర్శంగా నిలబడ్డారు. ఇల్లుకట్టి చూడు, పెళ్లి చేసి చూడు అన్నది నానుడి. అటువంటిది, ఆయన ఒక రాష్ట్రాన్నే పునాదుల నుండి నిర్మిస్తున్నారు. ఆ చేత్తోనే మరో వైపు సంపద సృష్టి కోసం, ఉపాధి కల్పన కోసం సర్వ శక్తులూ ఒడ్డుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎదుర్కొంటున్నన్ని సవాళ్లు అన్నీ ఇన్నీ కావు. బహుశా దేశంలో మరే రాష్ట్రమూ ఇటువంటి విషమ పరిస్థితులని ఎదుర్కోవడం లేదు. సమస్యల సుడిగుండంలో ఈ రాష్ట్రాన్ని ఏర్పాటుచేశారు. అయినా, ఉక్కు సంకల్పం ఉంటే అసాధ్యాలను కుడా సుసాధ్యాలను చేయొచ్చని చంద్రబాబు నాయుడు నిరూపిస్తున్నారు.

కందుల రమేష్

కందుల రమేష్
చీఫ్ ఎడిటర్

Printed and Published by DR P KRISHNA MOHAN on behalf of Commissioner, Information and Public Relations Dept., (on behalf of Govt. of AP); Published at Samachar Bhavan, AC Guards, Hyderabad - 500028 Ph: 040-23300258 Printed at M/s Caxton Offset Pvt. Ltd., 11.5.416/3, Red Hills, Hyderabad - 500 004 Chief Editor: Ramesh Kandula



ఆద్యంతం ఆసక్తిదాయకం

ఆంధ్రనగరి అమరావతి శంకుస్థాపన ముఖచిత్రంతో విడుదలైన ఆంధ్రప్రదేశ్ నవంబరు సంచిక ఆద్యంతం అలరించింది. అపూర్వ ఘట్టం అమరావతి శంకుస్థాపన కథనం ఆసక్తికరంగా సాగింది. ఉద్దండరాయునిపాలెం ప్రత్యేకతను గూర్చి తెలుసుకున్నాం. 'సీమకే వరం అనంతపురం' కథనం బాగుంది. "దర్శక రత్నాలు" శీర్షికలో బి.ఎన్.రెడ్డి గొప్పతనం గూర్చి రావి కొండలరావు రాసిన అంశాలు ఆకట్టుకున్నాయి. "బళ్ళారి రాఘవీయం!" వ్యాసం శ్రీ రమణ చక్కగా రాశారు. మీకు ప్రత్యేక అభినందనలు

– వాండ్రంగి కొండలరావు, సీనియర్ పత్రికా రచయిత, పొందూరు

నరేంద్రుడితో చంద్రుల కలయిక అద్భుతం..!

నవ్యాంధ్ర రాజధాని అమరావతి శంకుస్థాపన కార్యక్రమములో ఎ.పి. సి.ఎం. చంద్రబాబు, తెలంగాణా సి.ఎం. చంద్రశేఖరరావుల కలయిక తెలుగు ప్రజలల్లో చాలా ఆనందాన్ని కల్గించింది. ఏపిని అన్ని విధాలుగా

ఆదుకొంటామని ప్రధాని నరేంద్ర మోడి ప్రసంగంలో తెల్పడం ప్రత్యేకహోదా , సాయంకి పరోక్ష సంకేతంలా అన్పించింది. కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు కే.సీ,ఆర్ ల ప్రసంగాలు చాలా బాగున్నాయి. రిజిస్ట్రేషన్ల అక్రమార్కులపై వ్రాసిన కథనం బాగుంది. రైతురుణ మాఫీ అంశంలో ఇచ్చిన వ్యాసం చాలా బాగుంది.

– టెకి విశ్వాంభరరావు, మందారాడ

ప్రతి పేజీ విలువైనది

ఆంధ్రప్రదేశ్ నవంబరు సంచికలో సి.ఎస్.కి అరుదైన గౌరవం అంటూ ప్రచురించినది బాగుంది. కవరు పేజీ ఫోటోలు చాలా బాగున్నాయి. వెనుక కవరు పేజీ లోపల ఫోటో చిరంజీవి దేవాన్ష్ తో ప్రధాని మోడీ ముద్దు ముచ్చట చిత్రం చాలా చాలా అద్భుతంగా ఉంది. అందించినందులకు ధన్యవాదములు బళ్ళారి రాఘవీయం గురించి శ్రీరమణ బాగా రాశారు.

– శిడిగం దొరయ్య, ఏలేశ్వరం

శివలెంక కవితల కోసం...

తెలుగులో మేలైన కవితలు రాసి, ఇటీవల కాలం చేసిన కవయిత్రి శివలెంక రాజేశ్వరీదేవి. ఆమె స్వీయ కవితా సంపుటిని మిత్రులం ప్రచురించదలచాం. రాజేశ్వరీదేవి రచనల రాతప్రతులు, పత్రికా ప్రచురితాలు తమ వద్ద వున్నట్లయితే అవి ఈ కింది చిరునామాకు పంపించమని కోరుతున్నాం.

– నామాడి శ్రీధర్, 3 – 129, అంబాజీపేట, తూర్పు గోదావరి, ఆంధ్రప్రదేశ్.
పిన్ : 533214. ఫోన్ : 9396807070.
ఈమెయిల్ : namadisreedhar@gmail.com

'ఆంధ్రప్రదేశ్' పత్రికకు చందా ఇలా కట్టాలి

'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికకు చందాదారులుగా చేరాలనుకుంటున్న వారు వార్షిక చందా నిమిత్తం 50 రూపాయల మనియార్డరును 'అకౌంట్స్ ఆఫీసర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, హైదరాబాద్' పేరిట పంపాలి. (మీరు డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) తీసుకునేట్లయితే, బ్యాంకు నిబంధనల ప్రకారం రూ. 60 కి డిడి పంపాలి.) తమ పూర్తి చిరునామాను, తాము 'ఆంధ్రప్రదేశ్ ' పత్రికను ఏ భాషలో కోరుకుంటున్నారో కూడా ఆ మనియార్డరులో రాయాలి. ఆ మనియార్డర్‌ను ఈ క్రింది చిరునామాకు పంపాలి.

అకౌంట్స్ ఆఫీసర్, ఆంధ్రప్రదేశ్ సమాచార, పౌర సంబంధాల శాఖ, సమాచార భవన్, ఏ.సి.గార్డ్స్, మాసాబ్ ట్యాంక్, హైదరాబాద్ – 500 028.

చందాదారులు తమ చిరునామా మార్పు, కాపీలు అందకపోవడం గురించి ఈ ఫోన్ నెంబరుకు కాల్ చేసి వివరాలు కనుక్కోవచ్చు: +91-9989662462.

రచయితలకు గమనిక

'ఆంధ్రప్రదేశ్' పత్రికపై అభిమానంతో రచనలను పంపుతున్న రచయితలు రచనతోపాటు తమ బ్యాంకు అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజీ ఫోటో కాపీ గానీ, బ్లాంక్ చెక్కు కొట్టేసి పంపితేనే, ప్రచురితమైన రచనలు పారితోషికం ఆయా అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని అకౌంట్స్ అధికారి తెలియజేస్తున్నారు. రచయితలూ, రచయిత్రులు దీని ప్రాధాన్యత గ్రహించి, మాతో సహకరించవలసిందిగా కోరుకుంటున్నాం.

– సంపాదకులు

ఆంధ్రుల భవితకి ఓ కరదీపిక

సంపాదకులు, ఆంధ్రప్రదేశ్ వారికి నమస్సులు! ఆంధ్రప్రదేశ్ పత్రిక ఆంధ్రుల భవితను తీర్చిదిద్దగలిగే ఒక విన్నూత్న కరదీపిక... ముఖ్యంగా తెలుగు భాషాభివృద్ధికి–తెలుగు లెస్స పేజీ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యె నిరుద్యోగులకు వినూత్న సమాచారాన్ని అందించే వ్యాసాలతో పాటూ వర్తమాన అంశాలు–'కరంట్ అఫైర్స్' ప్రభుత్వం నుంచి వెలువడుతున్న ప్రభుత్వ ఉత్తర్వుల విశ్లేషణ అందిస్తున్న ఘనత మీది. కొత్త పుస్తకం–పేజీలో పుస్తక పరిచయం. అనేక అద్భుత అంశాలని రమణీయంగా ఒక మణిహారంగా తయారు చేసి అత్యంత స్వల్ప ధరకు రూ.5/– అందించటం మాత్రం విశేషించి అభినందనీయం.

– మందా శ్రీధర్, ఉపాధ్యాయుడు, శ్రీకాకుళం


దాచుకోవలసిన పత్రిక

ఆంధ్రప్రదేశ్ పత్రిక తరతరాలకు అందించే తరగని సాహిత్య అభ్యుదయ సంపదగా ప్రతి ఒక్క ఆంధ్రుడు జాగ్రత్తగా భద్రపరుచుకొని ముందు తరలవారికి అందించవలసిన అవసరం ఎంతైన ఉంది. "నేటి వర్తమానం భవిష్యత్ తరానికి చరిత్ర" ఆ చరిత్రను అందించే అపురూప వరప్రదాయినీ ఆంధ్రప్రదేశ్ మాసప్రత్రిక.

– ఎస్. నాగేశ్వరరావు, రాజరాజేశ్వరీ పేట, విజయవాడ.

ఆంధ్రప్రదేశ్ (తెలుగు, ఇంగ్లిష్) పత్రికను పాఠకులు ఇంటర్నెట్‌లో www.andhrapradeshmagazine.org లో కూడా చదువుకోవచ్చు.

ఏడాదిన్నరలో ఏపీ ప్రోగ్రెస్...



గ్రాఫిక్: సుమిత్రో
(టెలిగ్రాఫ్ఇండియా)

ఎక్కడో ఒంగోలులో పెట్రో కెమికల్ ఇండస్ట్రీ వస్తే శ్రీకాకుళానికేంటి ?

మొబైల్ హబ్ తిరుపతిలో ఉంటే బెజవాడకేం లాభం ?

విశాఖలో లులూ గ్రూపు పెట్టుబడి పెడితే పశ్చిమగోదారికేమొస్తుంది?

రుతుపవన మేఘాలు, అభివృద్ధి వ్యూహాలు ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం అనుకుంటే పొరపాటు. జిల్లాల వారీగా వికేంద్రీకరణ.... ప్రాంతాల వారీగా ప్రాజెక్టుల ఆకర్షణ... స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల్ని బట్టి వ్యూహాలు సిద్ధమవుతున్న సమయంలో అసలు అలాంటి ఆలోచనకే ఆస్కారం లేదు. రాష్ట్రం అనుసరిస్తున్న వైఖరేంటో... అభివృద్ధి వ్యూహమేంటో... ఏడాదిన్నరలో ఎక్కడ నుంచి ఎంత వరకూ వచ్చామో తెలిస్తే, ఏపీ స్టేట్ ఏంటో... స్టేటస్ ఏంటో ఇట్టే అర్థమైపోతుంది. ఓవైపు పునాదులు నిర్మిస్తూ... మ-రోవైపు వర్తమానాన్ని నడిపిస్తూ...భవిష్యత్ పై భరోసా కల్గిస్తూ ముక్కోణపు వ్యూహంతో ముందుకెళుతోంది. రాజధాని నిర్మాణం లాంటి బృహత్ కర్తవ్యాన్ని నెరవేరుస్తూ... జీతాలకి కూడా సరిపడా రాబడి లేని రాష్ట్రాన్ని సాకేందుకు అసలు అనుసరిస్తున్న వ్యూహమేంటి? ఇన్ క్లూసివ్ స్ట్రాటజీ అంటూ వినిపిస్తున్న మాటకి అర్థమేంటి? లాంగ్‌టర్మ్ ఎకనామిక్ వయొబులిటీ లాంటి గాఢమైన పదాలు లేకుండానే... అసలు ఏం జరుగుతోందో చూద్దాం.

నిజానికి ఏపీలో నిశ్శబ్ద విప్లవం నడుస్తోంది. ఓవైపు నుంచి మౌలిక రంగాల్ని పునరుత్తేజం చేయడం... మరోపక్క నుంచి ప్రాధాన్యతా రంగాలకి ప్రాణప్రతిష్ట చేసే కార్యక్రమం ఏకధాటిగా సాగుతోంది. వీటికి జతచేస్తూ అభివృద్ధి ప్రాజెక్టులు పట్టాలెక్కుతున్నాయి. అండర్ కరెంట్ గా పరిస్థితులు మారుతున్నాయ్. నీటిపారుదలకి భారీ కేటాయింపులు జరుగుతున్నాయ్. హంద్రీనీవాకి ఊపొచ్చింది. దాదాపు పదేళ్లుగా నిరుపయోగంగా ఉన్న పోలవరం కాల్వలకి కూడా నీరొచ్చింది. భారీ ప్రాజెక్టుల్లోనూ కదలిక కనిపిస్తోంది. నీటిపారుదలలో కనెక్టివిటీ, కవరేజ్‌లకి ప్రాధాన్యమిస్తూ అనుసంధానం దిశగా అడుగులు పడుతున్నాయ్. వ్యూహాలు... విధానాలు... పెట్టుబడుల ఆకర్షణ... ఏపీ వేస్తున్న అడుగులు.... ఇలా అన్నిట్లోనూ ఒక ముద్ర స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్రానికి కావాల్సింది డెకరేషన్స్ కాదు... జనరేషన్స్ పాటు నిలబడే పునాదులు అంటూ చంద్రబాబు అనుసరిస్తున్న వ్యూహాలు ఏపీని పటిష్టంగా తీర్చిదిద్దుతున్నాయ్. ఏమవుతుందో అనిపించే స్థితి నుంచి... ఔరా, అంటే ఏ స్థాయిలో ఉంటుందో అనిపించేతగా పరిస్థితిని మారుస్తున్న సిగ్నేచర్ చంద్రబాబుదే!

పెట్టుబడులొస్తే... ప్రాజెక్టులొస్తే పరిస్థితి ఎలా మారుతుంది?

ప్రాజెక్టులొస్తే, ఎక్కడో ఓ చోట దృష్టంతా కేంద్రీకరిస్తున్నారని మిగతా ప్రాంతాల పరిస్థితి ఏంటన్న వితండం విపరీతమవుతోంది ఏపీలో ! ఇది పూర్తిగా వాస్తవ దూరం. ఎకనామిక్ డైనమిక్స్ ని అర్థం చేసుకోకుండా మాట్లాడుతున్న మాటలు. లేదంటే లేనిపోని గందరగోళాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం కూడా ! నిజానికి ప్రభుత్వం ఏ చిన్న ప్రాజెక్టు చేపట్టినా... ఏపీకి కొత్తగా ఏ ప్రాజెక్ట్ వచ్చినా రాష్ట్రమంతటా ఆ ప్రభావం ఉంటుంది. ఊపు ఉత్తరాంధ్ర నుంచి అనంత వరకూ కనిపిస్తుంది. ఎందుకంటే ఏ ప్రాజెక్టుకోసమైనా... ఖర్చు చేసే ప్రతి రూపాయిలో కనీసం పావలా ప్రభుత్వానికే జమ అవుతుంది. ప్రత్యక్షంగా ట్యాక్సుల రూపంలో కొంత... సిమెంట్ కొనుగోలు మొదలు జరిగే ప్రతి కార్యకలాపాలపైనా ప్రభుత్వానికి పన్ను కట్టాల్సిఉంటుంది కాబట్టి అలాంటి పరోక్ష పన్నుల రూపేణా కూడా ఖజానాకి ఎనర్జీ పంప్ అవుతుంది. అందుకే ఫైనాన్షియల్ యాక్టివిటీ జరగడం అంటే... దీర్ఘకాలిక ప్రాజెక్టులు భారీ పరిశ్రమలు కొత్త పెట్టుబడులు రావడం అంటే వర్తమానంలో రాబడి వస్తున్నట్టే లెక్క. ఆ ఆదాయాన్ని ప్రభుత్వం ఎలాగూ రాష్ట్రమొత్తానికి కేటాయిస్తుంది కాబట్టి వికేంద్రీకరణ అప్పటికప్పుడు జరుగుతుంది. దీనికితోడు ప్రాజెక్టుల కేటాయింపు, ఎంపిక కూడా జిల్లాల వారీగా జరుగుతోందిప్పుడు. అంటే ప్రతి చోటా ఏదో ఓ రూపంలో క్రియాశీలకం అవుతోంది ఎకానమీ.

ఇది ప్రత్యక్ష నిదర్శనం

పరోక్ష నిదర్శనాలు కూడా ఉన్నాయ్. ఉదాహరణకి అనంతపురాన్నే తీసుకుందాం. కరువుతో అల్లాడిపోతున్న ప్రాంతంలో ఇపుడు కొత్త కళాకాంతులు కనిపిస్తున్నాయ్. తయారీ పరిశ్రమ ఊపిరిపోసుకుంటోంది. సబ్బుల తయారీ, బైక్ ల తయారీ యూనిట్లు వస్తున్నాయ్ ఒక్కొక్కటిగా. దాంతోపాటే భూముల రేటు పెరుగుతోంది. రెండేళ్ల

కాళ్ల మీద నిలబడడమే గగనం అనుకునే స్థితి నుంచి, అవునా... అంటూ తలెత్తి చూడాల్సిన స్థాయి దిశగా ఏపీ పుంజుకుటోంది. సామాజిక పరిభాషలో ఇది పునరుర్ధానం. ఎకామిక్స్‌లో చెప్పాలంటే ప్రాధాన్యాల్ని పునర్నిర్వచించుకోవడం... మొత్తంమ్మీద అద్భుతాన్ని సాకారం చేసుకోవడం. శిథిలం నుంచి శిఖరం వైపు అడుగు వేయడం!

కిందట 70,000–80,000 పలికిన ఎకరం ఇపుడు అమాంతం ఐదారు లక్షలకి ఎగసింది. అంటే ఆస్తుల విలువ పెరిగి... ఆలోచన స్థాయిని పెంచుతోంది. దాంతోపాటే జీవన ప్రమాణాలు, విధానాలు కూడా మారతాయ్. ఓ ఎకరం లక్ష రూపాయలు కూడా లేనప్పుడు ఆలోచించే తీరు వేరు... ఇప్పుడు వ్యవహరించే తీరు వేరు. అంటే... చూస్తూచూస్తుండగానే ప్రమాణాలు పెరిగి పేదలు మధ్య తరగతికి... మిడిల్ క్లాస్ ఎబౌ మిడిల్ క్లాస్ కి మారుతోంది ఏపీలో !

దీనికితోడు దేశీయ, అంతర్జాతీయ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నాయ్. ఇప్పటి వరకూ ఉన్న డేటా ప్రకారం రాష్ట్రానికి రెండు లక్షల కోట్ల రూపాయలకి పైగా పెట్టుబడులు ఖరారయ్యాయ్. ప్రభుత్వ రంగసంస్థలు 60 వేల కోట్ల వరకూ పెట్టుబడులు పెట్టేందుకు రంగం సిద్ధమైంది. 48 ప్రతిష్టాత్మక సంస్థలు సహా దేశ విదేశీ ప్రైవేటు పెట్టుబడులు మరో లక్షా 65 వేల కోట్ల వరకూ ఉంటాయ్.

ప్రతిపాదనల దశ దాటిన పెట్రోకెమికల్స్ లాంటి ఇండస్ట్రీ కూడా ఓసారి పట్టాలెక్కితే ఏపీ శక్తిసామర్థ్యాలు అమాంతం పెరుగుతాయ్. యూపీ లాంటి రాష్ట్రాలు బ్రాండ్ ప్రమోషన్ కోసమే ఏకంగా 600 కోట్లు ఖర్చుచేస్తున్నాయ్ ఏడాదికి. అలాంటిది ఏపీ కేవలం... సీఎం కరిష్మాతోనే చక్రం తిప్పుతోంది. లెక్కలు మారుస్తోంది. పెట్టుబడులతో రాష్ట్రానికి రెక్కలు తొడుగుతోంది.

ఒకప్పటి సదరన్ ఎక్స్ ప్రెస్...

దక్షిణాదిలో ఏపీ ఒకప్పుడు తురుపు ముక్క. ఓ ఇరవై ఏళ్లు ముందుకెళ్లి ఆలోచించిన రాష్ట్రం అప్పట్లో! దార్శనికత, దూకుడు ఉన్న నిర్ణయాలతో రాష్ట్రాన్ని పట్టాలెక్కించారు చంద్రబాబు. పరుగులు పెట్టించారు. ఐటీ విప్లవం... రాబోయే అవసరాలకి తగ్గట్టుగా విద్యావిధానంలో మార్పులు... సాఫ్టువేర్ అవకాశాల్ని గ్రామస్థాయి వరకూ విస్తరించే వ్యూహం అన్నీ అభివృద్ధికి ఆయువుపట్టులా కనిపించాయ్. అప్పటికే ఎస్టాబ్లిష్ అయిన బెంగళూరుతో పోటీ పడటం... వ్యూహాత్మకంగా అడుగు ముందుకేయడం... దానికోసం ఏకంగా ఇమేజ్ మేకోవర్ చేయడం... ఐటీ అనే పదాన్ని సామాన్యులకి కూడా చేరువచేయడం లాంటివన్నీ ఆ వ్యూహంలో భాగమయ్యాయ్. పరిపాలనా పరంగానూ అభివృద్ధి కోణంలోనే కాదు ఆర్థికంగా కూడా ఆంధ్రప్రదేశ్ రూపురేఖల్ని మార్చిన కాలమది. గత పదిపన్నెండేళ్లుగా పరిస్థితి తారు మారైంది. పడిన పునాదితో పండగ చేసుకోవడమే తప్ప కొత్తగా విస్తరించింది కానీ వ్యూహాత్మకంగా అడుగు వేసింది కానీ లేదు. అందుకే ఐటీ అభివృద్ధి హైద్రాబాద్ చుట్టుపక్కలకే పరిమితమైపోయింది. ఎకానమీకి ఇంజిన్ లాంటి ఇండస్ట్రీ, సర్వీస్ సెక్టర్ ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన ఫలితమిది. అందుకే మన 13 జిల్లాలు ఎక్కడివక్కడే ఉండిపోయాయ్. పైగా విభజన రాజకీయం విష ప్రభావం చూపింది. అడ్డంకుల్ని దాటి... మళ్లీ ఇపుడు అంతటి వేగాన్ని నేర్పుని అందుకునేందుకు ఆగమేఘాల మీద అడుగేస్తోంది ఏపీ!

నిర్మాణాత్మక అభివృద్ధికి నమూనా ఏపీ...

పరిస్థితులకి తగ్గట్టుగా అవసరాల్ని కుదించుకోవడం వెనుకబాటు. అదే అవసరాలకి తగ్గట్టు సామర్థ్యాల్ని పెంచుకోవడం, అవకాశాల్ని అందుకోవడం దార్శనికత. ఇలాంటి ముందుచూపుతోనే రాష్ట్రాన్ని నడుపుతోంది చంద్రబాబు నాయకత్వం. 30 ఏళ్ల తర్వాత ఎదురయ్యే పరిస్థితులకి తగ్గట్టుగా రాజధాని నిర్మాణం, పారిశ్రామిక ప్రణాళికలు సిద్ధం చేయడమే దానికో ఉదాహరణ. అందుకే ఇటుక మీద ఇటుక పెట్టి కట్టినట్టు... నిర్మాణాత్మకంగా పటిష్టంగా ప్రణాళికాబద్ధంగా అడుగేస్తోంది ఏపీ. నాయకుడి ప్రయత్నానికి పరిస్థితులు కూడా తోడైతే ఇక... ప్రభంజనం అనే మాట అంత పెద్దదేం కాదు. కచ్చితంగా !

సుదీర్ఘ సముద్రతీరం... విశాల భూభాగం... పెట్టుబడులకి అనువైన పరిస్థితులు, అందుబాటులో మానవ వనరులు... అన్నిటికీతోడు ఆకట్టుకునే ప్రభుత్వ విధానం. అన్నీ ఉన్నాయ్. కరెంటు కోతల్లేని మూడు నాల్గు రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీకి ఇప్పటికే ఆకర్షణ ఉంది. నీటి వసతి అద్భుతం. పట్టిసీమ కట్టిన తర్వాత... హంద్రీనీవా అడుగులు వేగవంతం అవుతున్న తరుణంలో అవకాశం కలిసొచ్చింది. కుండపోతతో సీమ భూగర్భ జలమట్టం అమాంతం పెరిగింది. అన్నీ శుభశకునాలే ! వీటితోపాటు గుజరాత్ మహారాష్ట్ర లాంటి అతికొద్ది రాష్ట్రాలకే సాధ్యమైన ప్రత్యేకత ఏపీ సొంతం కాబోతోందిప్పుడు! పారిశ్రామిక అవసరాల కోసం పుష్కలంగా సహజవాయువు అందుబాటులోకి రాబోతోంది. ఏపీ ఎదుగుదలకి ప్రాణవాయువు. క్రిష్ణపట్నం సమీపంలో గ్యాస్ టెర్మినల్ సిద్ధమవుతోంది. మలేషియా కొలాబరేషన్ తో మొదలవుతున్న యూనిట్ నెల్లూరు– అనంత మధ్య గ్యాస్ కారిడార్ ఏర్పాటుకి ప్రాణం పోస్తుంది.

రేపటి ప్రపంచం చూసే నవోదయం ఏపీ...

మోస్ట్ వైబ్రెంట్ స్టేట్ ఏపీ అని జర్మనీ ప్రతినిధులు ఎందుకు అన్నారో సమాధానం ఇప్పుడు దొరుకుతుంది. బ్రిటన్ ప్రధాని కెమెరూన్ అమరావతి పేరును తనంతట తానుగా ప్రస్తావించి, సాయం ఎందుకు ప్రకటించారో అర్థమవుతుంది. దావోస్ సమ్మిట్ ఏడాది కిందటే... మా ప్రణాళికల్లో మీరూ భాగమే అంటూ ఎందుకు అక్కున చేర్చుకుందో తెలుస్తుంది. మనకంటే ముందుగా మన బలాబలాల్ని, అవకాశాల్ని అంచనా వేసిన ఫలితం ఇవన్నీ! వాస్తవాలు ఇప్పుడిక మన వరకూ వస్తున్నాయ్. ప్రాజెక్టులు ఇటు... గ్రౌండ్ లెవెల్లో సన్నాహాలు మరోవైపు... మౌలిక సదుపాయాలతో ఆకర్షణ ఇంకోవైపు. ముక్కోణపు వ్యూహంతో ఏపీ ముందుకు అడుగు వేస్తోంది. రాళ్లూ రప్పా తప్పించి... చెట్టూపుట్టా చదును చేసి పునాదులు తీసేందుకు గ్రౌండు సిద్ధమైంది. కాంక్రీట్ లాంటి వ్యూహాలు, భవిష్యత్ అవసరాల్ని అందుకునే భారీ ప్రణాళికలు ఇప్పటికే ఉన్నాయ్. ఇక పని ప్రారంభం కాబోతోంది. ఆంధ్రప్రదేశ్ అద్భుతాంధ్ర ప్రదేశ్‌గా, స్వర్ణాంధ్రగా తనని తాను ఆవిష్కరించుకునే తరుణం ముందుంది. అమరావతి నిర్మాణాలు, కేంద్రం నుంచి అందాల్సిన సహాయ సహకారాలు, మనవంతుగా పెట్టే పెట్టుబడులు ఇవన్నీ అదనం. కాళ్ల మీద నిలబడడమే గగనం అనుకునే స్థితి నుంచి, అవునా... అంటూ తలెత్తి చూడాల్సిన స్థాయి దిశగా ఏపీ పుంజుకుటోంది. సామాజిక పరిభాషలో ఇది పునరుత్థానం. ఎకనామిక్స్‌లో చెప్పాలంటే ప్రాధాన్యాల్ని పునర్నిర్వచించుకోవడం... మొత్తంమీద అద్భుతాన్ని సాకారం చేసుకోవడం. శిథిలం నుంచి శిఖరం వైపు అడుగు వేయడం !

– కామేష్ గూటాల

బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా నవంబరులో ఆంధ్రప్రదేశ్‌లో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు అపార నష్టాన్ని మిగిల్చాయి. నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాలలో తీవ్రనష్టం జరిగింది. మిగిలిన జిల్లాలలో కూడా భారీవర్షాల వల్ల పంటలు బాగా దెబ్బతిన్నాయి. పంట చేతికొచ్చే సమయంలో అతివృష్టి అటు రైతులకు, ఇటు ప్రజలకు కన్నీటినే మిగిల్చింది. నవంబరు 9 నుంచి 12 వరకు, 15 నుంచి 19 వరకు కురిసిన భారీ వర్షాలు, వరదలతో పంటలకు, మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో నెల్లూరు జిల్లా తీవ్రంగా ప్రభావితం కాగా, చిత్తూరు, కడప జిల్లాలకు కూడా భారీ నష్టం జరిగింది. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వరి పంటకు తీవ్ర నష్టం జరిగింది. అనంతపురం, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో కొద్దిపాటి పంట నష్టాలు నమోదయ్యాయి. సాగునీటి చెరువులు, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ రోడ్లు, విద్యుత్తు వ్యవస్థ బాగా దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో 95 చోట్ల అతి భారీ వర్షపాతం నమోదైంది. వర్షాలు, వరదల కారణంగా 35 మంది మృతి చెందారు. 613 పశువులు మృతి చెందాయి. 146 గ్రామాలు ప్రభావితం కాగా, 467 ఇళ్లు పూర్తిగా, 2029 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 2 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. 188 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి, 26,206 మందికి అక్కడికక్కడ తాత్కాలిక వసతి కల్పించారు. 10 ఎన్డీఆర్ఎఫ్‌బృందాలు సహాయ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యాయి. మృతుల కుటుంబాలకు జాతీయ విపత్తు సహాయ నిధి (ఎన్‌డిఆర్ఎఫ్) నిర్దేశించిన మొత్తం కంటే ఎక్కువగా రూ.5 లక్షలు చొప్పున ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణం స్పందించి ప్రమాద తీవ్రతను తగ్గించడం, బాధితులను పునరావాసానికి తరలించడం, సహాయ చర్యలలో అన్ని స్థాయిల అధికారులను విధుల్లో నియమించడం వంటి చర్యల్లో అనుభవమున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈసారి కూడా భారీ వర్షాలు, వరద పీడిత ప్రాంతాల ప్రజలను ఆదుకోవడంలో సత్వర చర్యలు తీసుకొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయం పర్యవేక్షణలో నాడు హుద్ హుద్ తుపాను, గోదావరి పుష్కరాల సందర్భంగా సమర్థంగా, సమన్వయంగా చేసినట్లే వరద సహాయక చర్యలలో అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేసి బాధితులకు సేవలు అందించారు. నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాలకు సహాయ పునరావాస కార్యక్రమాల పర్యవేక్షణకు ఆరుగురు మంత్రులను నియమించారు. ఎన్డీఆర్ఎఫ్, రెవిన్యూ సిబ్బంది అప్రమత్తం చేశారు. భారీ వర్షాల వల్ల వచ్చిన నీటితో అన్ని చెరువులు నింపడానికి, తద్వారా భూగర్భజలాలు ఇనుమడించేలా చర్యలు చేపట్టారు. ప్రతి చెరువు/వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పర్యవేక్షణకు ఒక అధికారిని నియమించారు. భారీ వర్షాల నేపథ్యంలో నెల్లూరు జిల్లాలో ఇప్పుడొక పంట వేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించడం సీఎం రైతుల పక్షపాతి అని మరోసారి రుజువు చేస్తోంది.

అప్రమత్తత ముందు వరదలు బలాదూర్

విపత్తులెదుర్కోవడంలో సీఎం చంద్రబాబు మేటి



కనీవినీ ఎరుగని రీతిలో కురిసిన వర్షాల మూలంగా అకస్మాత్తుగా అనేక జిల్లాల్లో వరదలు ముంచెత్తాయి. అయినా వరద ప్రాంతాలన్నింటిలోనూ సహాయచర్యలలో ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ముఖ్యమంత్రి ప్రజలకు అండగా నిలిచారు. ఫలితంగా వరద బీభత్సం ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ ప్రమాద తీవ్రత నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ప్రభుత్వ యంత్రాంగం సఫలీకృతమైంది. వర్షాలు ప్రారంభమైన నాటి నుంచి వాటి తీవ్రత నెలకొన్న జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులకు టెలికాన్ఫరెన్స్‌లో సీఎం ఎప్పటికప్పుడు అవసరమైన ఆదేశాలు ఇచ్చారు. నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాలలో మూడు రోజులపాటు ఆయన పర్యటన కూడా జరిపి బాధితులను పరామర్శించారు. ఈ వర్షాల మూలంగా రూ.3000 కోట్లు నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వ వర్గాలు అంచనా వేశాయి. భారీ వర్షాలతో ఒక్క నెల్లూరు జిల్లాలోనే రూ.1500 కోట్లకు పైగా ఆస్తి నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో తక్షణ సాయంగా రూ.వెయ్యి కోట్లు ఇచ్చి ఆదుకోవాలని కేంద్రానికి చంద్రబాబు లేఖ రాశారు. తుఫాను బాధితులను తరలించేందుకు ఎన్.డి.ఆర్.ఎఫ్. (చెన్నై) నుంచి 2 హెలికాప్టర్లను తెప్పించి చిత్తూరు, నెల్లూరు జిల్లాలలో సహాయ కార్యక్రమాల్లో వినియోగించారు. గత సంవత్సరం హుద్‌హుద్ తుఫాన్ బాధితులకు ఇచ్చినట్లుగా 20 కిలోల బియ్యం, 2లీటర్ల కిరోసిన్ పంపిణీ చేశారు. నవంబరు తుపాన్ల సీజన్ కాబట్టి ప్రతి జిల్లాలో ఇటువంటి ఉపద్రవాలను ఎదుర్కొనేలా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించడం ఆయన భవిషత్ దృక్కోణాన్ని సూచిస్తుంది.

రాష్ట్రంలో వర్షాలు ఆరంభమైన తక్షణమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి ఎక్కడెక్కడ అవసరమో ఆయా ప్రాంతాలకు మేన్‌పవర్, మెటీరియల్ అన్నీ మోహరించండని ❖

"భారీవర్షాలతో దెబ్బతిన్న ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోండి"



వరద నష్టాన్ని విహంగవీక్షణం ద్వారా అంచనా వేస్తున్న ముఖ్యమంత్రి

నవంబర్‌లో రెండు దఫాలుగా రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాని నరేంద్రమోడీతో పాటు హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్‌సింగ్‌లకు ఇటీవల రాసిన లేఖలలో నష్టం వివరాలను పొందుపరిచారు. సహాయ పునరావాస కార్యక్రమాల కోసం కేంద్రం నుంచి ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

భారీ వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం కలగటమే కాకుండా, చెరువులు, కుంటలు, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి రహదారులు ఘోరంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. చాలా చోట్ల విద్యుత్ వ్యవస్థ కుప్పకూలిందన్నారు. గత ఐదు రోజులుగా రాష్ట్రంలోని 95 కేంద్రాలలో 200 మి.మీ నుంచి 657 మి.మీ వరకు వర్షపాతం నమోదైందని తెలిపారు.

నెల్లూరు జిల్లా దారుణంగా దెబ్బతిన్నదని, చిత్తూరు, కడప జిల్లాలు కూడా అతలాకుతలమయ్యాయని వివరించారు. ఉభయ గోదావరి జిల్లాలో భారీగా పంటనష్టం జరిగిందని, అనంతపురం, ప్రకాశం, కృష్ణా జిల్లాలలో స్వల్పంగా నష్టపోయారని పేర్కొన్నారు.

వర్షాల కారణంగా రాష్ట్రంలో 35 చనిపోయారని, 613 మూగజీవాలు మృతి చెందాయని ముఖ్యమంత్రి తెలిపారు.

మొత్తం 146 గ్రామాలలో వర్షప్రభావం తీవ్రంగా వున్నదని వివరించారు. 467 ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, 2029 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని, 2 లక్షల హెక్టార్లకు పైగా వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయన్నారు. 550 సాగునీటి వనరులు నాశనమయ్యాయని చెప్పారు. 1,860 కి.మీ మేర రహదారి వ్యవస్థ చిన్నాభిన్నమయ్యింది సీయం పేర్కొన్నారు. గూడూరు దగ్గరలోని మనుబోలు గ్రామంలో 100 మీటర్లకు పైగా జాతీయ రహదారి తెగిందని, నెల్లూరు-చెన్నయ్ మధ్య రాకపోకలు స్తంభించాయని వివరించారు. తాను స్వయంగా వర్షప్రభావిత జిల్లాలలో పర్యటించి సహాయ పునరావాస చర్యలను పర్యవేక్షించానని ముఖ్యమంత్రి తెలిపారు. 188 సహాయ శిబిరాలను ఏర్పాటు చేశామని, 26,206 మందికి ఆహార, వసతి సదుపాయాలు కల్పించామని చెప్పారు.

దెబ్బతిన్న జాతీయ రహదారి పునరుద్ధరణ పనులు సత్వరం పూర్తిచేయగలిగామని, 10 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. 10 లక్షల మంచినీటి పొట్లాలు, బిస్కెట్లు, పాలు, 12 వేల దుప్పట్లు నెల్లూరు జిల్లాకు పంపించామన్నారు. వర్ష బాధిత ప్రాంతాలలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యపనులు చేపట్టామని చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని, అత్యవసర ప్రాతిపదికన రహదారి మరమ్మతులు చేస్తున్నామన్నారు. చెరువులకు గండ్లు పూడ్చి నీటి సంరక్షణ చర్యలు చేపట్టామని తెలిపారు.

ఎన్డీఆర్ఎఫ్ చెబుతున్న నిబంధనలకు మించి రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం ప్రకటించిందని, చనిపోయిన వ్యక్తి కుటుంబానికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నామని ముఖ్యమంత్రి ఆ లేఖలో పేర్కొన్నారు. అలాగే 20 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటరు పామాయిల్, కిలో చక్కెర అందిస్తున్నామని తెలిపారు.

జరిగిన నష్టం విలువ 3 వేల కోట్లకు పైగా వుంటుందని, నష్టం అంచనాలపై పూర్తి నివేదికను మరికొన్ని రోజుల్లో అందజేస్తామని చెప్పారు. తక్షణ సహాయం కింద వేయి కోట్లు వెంటనే మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ లేఖలో ప్రధానిని కోరారు.

ఆదేశించారు. వివిధ శాఖల ముఖ్యకార్యదర్శులు, జిల్లా కలెక్టర్ స్థాయి నుంచి గ్రామ సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, స్థానిక సంస్థల ప్రతినిధులు, జన్మభూమి కమిటీలు సహాయ, పునరావాస చర్యలలో చురుకుగా పాల్గొనాలన్నారు. అవసరమైన ప్రాంతాలకు ఇతర జిల్లాల నుంచి ఆయా శాఖల అధికారులను, సిబ్బందిని తరలించి సహాయ, పునరావాస చర్యలు ముమ్మరం చేశారు. వరద సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయ నివేదిక తెప్పించుకోవడంతో అందుకనుగుణంగా చర్యలు తీసుకున్నారు. అవసరమైన చోట్ల ప్రత్యేక వాహనాల ద్వారా సరుకులను వరద ప్రభావిత ప్రాంతాలకు యుద్ధప్రాతిపదికన రవాణా చేశారు. నెల్లూరు, చిత్తూరు, కడప జిల్లాలలో గండ్లు పడిన చెరువులకు యుద్ధప్రాతిపదికన మరమ్మత్తులు పూర్తిచేశారు. మనుబోలు వద్ద రోడ్డు కోసుకుపోయిన పనులను సీఎం ఆదేశానుసారం మంత్రి సిద్దా రాఘవరావు స్వయం పర్యవేక్షణలో 24 గంటల్లో పూర్తి చేసి జాతీయ రహదారిని పునరుద్ధరించారు. రేషన్ కార్డులు పోగొట్టుకున్న బాధితుల విషయంలో ఉదారంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టర్లను ఆదేశించారు. ఆ మేరకు శిబిరాలలోనే బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు.

– జాస్తి గోపాలప్రసాద్

బి.మరిడయ్య, విజయవాడ



దేశానికే ఆదర్శ సంక్షేమ పథకం

ఎన్టీఆర్ భరోసా

అభాగ్యులకు ఐదు రెట్లు ఆనందాన్ని పంచి ఇవ్వడమే కాదు ఎన్టీఆర్ భరోసా విశిష్టత. వృద్ధులు, వితంతువులు, వికలాంగులతో పాటు కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, కళాకారులకు కూడా పింఛన్లు ఇస్తున్న ఏకైక ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్. వికలాంగుల్లో కూడా వైకల్యం తక్కువైనా, వారికి కూడా పింఛను అందించే కొత్త విధానానికి చంద్రబాబు నాయుడి ప్రభుత్వం నాంది పలికింది. ఆర్థిక ఇబ్బందులను లెక్కచేయకుండా ఏడాదికి దాదాపు రూ.5 వేల కోట్ల రూపాయలను ఈ సంక్షేమ పథకం కింద ఖర్చు పెడుతోంది.

చీకటి వెలుగులు అంటే ఏమిటని పోట్లూరి సువార్తమ్మని అడిగి చూడండి: నిన్న–నేడు అంటుంది. 'ఎన్టీఆర్ భరోసా పథకం' కింద వృద్ధాప్య పింఛను నెలకి వెయ్యి రూపాయలు తొలి దఫా అందుకున్న రోజు నుంచి ఆమెకి వెలుగు; రెండొందల రూపాయల నుంచి ఏకంగా 500 శాతం పెరిగినప్పటి నుంచే ఆమె బతుకులో వెలుగు. నిన్న రెండొందలు... నేడు వెయ్యి! సువార్తమ్మది గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలం ఆరుంబాక గ్రామ శివార్లలో యానాది సంగం. యానాది సంగంలోని పది గుడిసెల్లో ఒకటి ఆమెది. బండెడు సంసారాన్ని ఆమె బక్క భుజాల మీద మోపి, వైధవ్యాన్ని అదనంగా అందించి ఆమె భర్త తొందరపడి కన్నుమూశాడు. రెక్కలు ముక్కలు చేసుకొని నాలుగిళ్లలో పాచిపని చేస్తూ కుటుంబాన్ని సాకింది. పిల్లలు రెక్కలొచ్చి వెళ్లిపోయారు. అయితే, సువార్తమ్మ దురదృష్టానికి తోడుగా, కూతురు కూడా విధవగా ఆమె పంచన చేరింది. అలాగని అంతా చీకటని అనడానికి లేదు; చివికిపోయిన గుడిసె పైకప్పు కంతల్లో నుంచి ఏండ పొడ సువార్తమ్మ ఇంట్లోకి వెలుగు తెస్తూనే ఉంటుంది. ఈ లోపు చూపు బాగా మసకేసి, ఆ కాస్త కాంతిని కూడా కనిపెట్టలేక పోయే పరిస్థితులు దాపురించాయి. అటువంటి దీనావస్థల నిన్న గడిచి పోయి, కొత్త రోజు మొదలైనట్టు సరికొత్త వెలుగులు తెచ్చింది చంద్రబాబు ప్రభుత్వం. సువార్తమ్మకి వృద్ధాప్య పింఛను, ఆమె కూతురు ప్రమీలకి వితంతు పింఛను!

నిశ్శబ్ద సామాజిక విప్లవం

ఇది ఒక సువార్తమ్మ కత మాత్రమే కాదు, ఓ మారుమూల పల్లెలో ఒక యానాది సంగపు తీరిన వెత మాత్రమే కాదు. ఒక నిశ్శబ్ద సామాజిక విప్లవాన్ని కళ్లకు కట్టిన గణాంకాల ప్రకారం చెప్పాలంటే– ఒక్క గుంటూరు జిల్లాలోనే

జిల్లాల వారిగా పింఛన్లు, లబ్ధిదారులు – 2014–2015

జిల్లా	వృద్ధులు	చేనేత	వికలాంగులు వైకల్యం 80% పైన	వికలాంగులు వైకల్యం 80% లోపు	వితంతువు	కల్లు గీత కార్మికులు	కళాకారులు	మొత్తం
శ్రీకాకుళం	145015	4173	8212	23425	98090	659	2310	281884
విజయనగరం	123694	2321	15576	21059	94156	993	2345	260144
విశాఖపట్నం	154698	2354	12532	26028	127901	1072	2928	327513
తూర్పుగోదావరి	235199	8657	25531	37843	175921	3295	4620	491066
పశ్చిమగోదావరి	192607	3339	26021	19353	106365	1996	3691	353372
కృష్ణా	149660	5292	23484	24126	136168	2754	3368	344852
గుంటూరు	193022	6598	20367	23126	130100	895	5383	379491
ప్రకాశం	159716	6556	13502	19893	95830	158	4091	299746
నెల్లూరు	121242	4728	9265	21582	95416	948	2653	255834
చిత్తూరు	210539	5766	17855	29640	135588	306	2346	402040
కడప	130144	8913	11299	21317	81008	52	1400	254133
అనంతపురం	213174	11651	17410	39166	118774	193	3183	403551
కర్నూలు	150131	3725	21503	19143	124765	163	269	319699
మొత్తం	**2178841**	**74073**	**222557**	**325701**	**1520082**	**13484**	**38587**	**4373325**

చంద్రబాబు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ల మొత్తం

పింఛను వివరం	పింఛన్ల సంఖ్య	మొత్తం (కోట్లలో)
వృద్ధుల పింఛను	2178841	227.82
వితంతువు	1520082	160.05
వికలాంగులు 40% నుంచి 79% మధ్య ఉన్నవారు	325701	34.58
వికలాంగులు 80% కంటే ఎక్కువ	222557	35.12
చేనేత	74073	7.68
కల్లు గీత కార్మికులు	13484	1.38
కళాకారులు	38587	3.86
మొత్తం	**4373325**	**470.48 (నెలకు)**

గత ప్రభుత్వం వితంతువులకు, వృద్ధులకు, ఇతర వర్గాల వారికి రూ.200, వికలాంగులకు రూ.500 చెల్లించేది. దీని కోసం గత ప్రభుత్వం నెలకు రూ 100 కోట్లకు కొంచెం పైన మాత్రమే ఖర్చు పెట్టేది. ఉదాహరణకు, 2013–2014 లో కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు పెట్టింది రూ. 1349.64 కోట్లు మాత్రమే. ఇవాళ చంద్రబాబు ప్రభుత్వం ఇంతకూ మూడున్నర రెట్లకు పైగా మొత్తాన్ని పింఛన్ల రూపంలో పంపిణి చేస్తోంది.

ఏడాదికి తెలుగు దేశం ప్రభుత్వం పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్న మొత్తం రూ. 5,645.76 కోట్లు

1,93,022 మంది వృద్ధుల కథ. 13 జిల్లాల్లో 21,78,841 వయోవృద్ధుల జీవితాల్లో కొత్త కాంతులు నింపిన విజయగాథ.

ఎన్టీఆర్ భరోసా పథకం వయసుడిగిన అభాగ్యులకు మాత్రమే పరిమితమైన పథకం కాదు. డెబ్భై నాలుగు వేల మంది చేనేత కార్మికులు, ఇరవై రెండు లక్షలకు పైగా వికలాంగులకూ, మరో ముప్ఫై మూడు లక్షలు పాక్షిక వైకల్యం ఉన్నవారు, పదిహేను లక్షల వితంతువులు, మరో యాభై వేల మంది కల్లు గీత, ఎయిడ్స్ బాధితులు, విభిన్న వృత్తుల వారు, నిరాశ్రయులైన కళాకారులు – మొత్తం నలభై నాలుగు లక్షల మంది నిరుపేదల్ని, నిర్భాగ్యుల్ని, నిస్సహాయుల్ని, నిలవనీడలేని ఆర్తుల్ని అక్కున

గత ప్రభుత్వంలో జిల్లాల వారిగా పింఛన్లు, లబ్ధిదారులు – 2013-2014

జిల్లా	వృద్ధులు	వితంతువులు	వికలాంగులు	చేనేత	గీత కార్మికులు	మొత్తం
శ్రీకాకుళం	172287	89847	33034	4514	498	300180
విజయనగరం	158482	86310	37230	2623	826	285471
విశాఖపట్నం	166327	115450	38139	2405	927	323248
తూర్పుగోదావరి	250795	149391	64598	8692	2433	475909
పశ్చిమగోదావరి	197182	87022	43815	3135	1611	332765
కృష్ణా	149004	117241	45275	5048	1970	318538
గుంటూరు	200097	109835	42097	6733	671	359433
ప్రకాశం	192584	84458	33937	7027	128	318134
నెల్లూరు	137518	90724	31094	4894	677	264907
చిత్తూరు	230401	120212	45665	5916	112	402306
కడప	145505	66570	31019	8999	20	252113
అనంతపురం	246068	106293	54403	11802	131	418697
కర్నూలు	174737	114666	38352	4138	124	332017
మొత్తం	**2420987**	**1338019**	**538658**	**75926**	**10128**	**4383718**

గత ప్రభుత్వం అందించిన పింఛన్ల మొత్తం

వివిధ పింఛన్‌దారుల వివరాలు	మొత్తం పింఛన్లు (లక్షల్లో)	మొత్తం కోట్లలో
వృద్ధులు	2420987	684.67
వితంతువు	1338019	321.12
వికలాంగులు	538658	323.19
చేనేత	75926	18.23
గీత కార్మికులు	10128	2.43
మొత్తం	**4383718**	**1349.64 (ఏడాదికి)**

డబ్బు కంటే విలువైనది – భరోసా; పెద్ద వయసులో ఊతకర్రగా, అసహాయతలో ఆసరాగా.... నేను ఉంటానని వెన్ను తట్టి ధైర్యం నింపడమే భరోసా; చేదోడువాదోడుగా నేను ఉన్నానని మద్దతునివ్వడమే భరోసా! అటువంటి విశ్వాసాన్నీ, బ్రతుకు పట్ల ధీమానీ, నమ్మకాన్ని కలగజేసినందుకే ఎన్టీఆర్ భరోసా పథకం ఒక విలక్షణమైన, అపూర్వమైన పథకం.

గత ప్రభుత్వం ఏడాదికి రూ.1349.64 కోట్లు పింఛన్ల కోసం ఖర్చు పెడితే, ఈ ప్రభుత్వం ఖర్చు చేస్తోంది ఏడాదికి రూ.5,645.76 కోట్ల రూపాయలు.

చేర్చుకున్న పింఛను పథకం. సంక్షేమ పథకాల చరిత్రలో నూతన అధ్యాయం.

వెలుతురు వాకిళ్ల వైపు...

ప్రభుత్వం ఇస్తున్న పింఛన్లను రూ200 నుండి రూ1000 లకు, వికలాంగుల పింఛన్లను 500 నుంచి రూ. 1500కు పెంచారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. జీవితాన్ని చీకటి నుంచి వెలుతురు వాకిళ్ల వైపుకి నడిపించేది ఐదు రెట్లు పెరిగిన డబ్బు ఒక్కటేనా? డబ్బు కంటే విలువైనది– భరోసా; పెద్ద వయసులో ఊతకర్రగా, అసహాయతలో ఆసరాగా.... నేను ఉంటానని వెన్ను తట్టి ధైర్యం నింపడమే భరోసా; చేదోడువాదోడుగా నేను ఉన్నానని మద్దతునివ్వడమే భరోసా! అదే అసలైన వెలుతురు. అటువంటి విశ్వాసాన్నీ, బ్రతుకు పట్ల ధీమానీ, నమ్మకాన్ని కలగజేసినందుకే ఎన్టీఆర్ భరోసా పథకం ఒక విలక్షణమైన, అపూర్వమైన పథకం.



సామాజిక భద్రతా ఫించన్ల కోసం ఇంత పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్న రాష్ట్రం దేశంలో మొదటిది. దేశంలోనే ఇది గొప్ప పథకం అయ్యిందంటే, దాని వెనక మహానాయకుడు చంద్రబాబు తపన, సంకల్పం ఉన్నాయి. దీనిని ఎటువంటి దుర్వినియోగానికి తావు లేకుండా, నేరుగా లబ్ధిదారులకు చేరేందుకు ఈ ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది.

నిస్సహాయుల్లో 'ఎన్టీఆర్ భరోసా పథకం' అసహాయ శూరత్వాన్ని వంటి ధీరత్వాన్ని నింపిందనడానికి ఒక తాజా ఉదాహరణ: ఆంధ్ర జాతి పురానవ చరిత్రకి ప్రతీక, ఆశేష ఆంధ్రావని సామూహిక కలల రాజధాని అమరావతి నిర్మాణంలో తాము కూడా పాలుపంచుకోవడం. నవ్యాంధ్ర రాజధానికి వారి పింఛను నుంచి రూ 100 తమ వంతు చందాగా అందించారు. కొత్త రాజధానికి ఇ-బ్రిక్స్ ఎత్తిన కూలీలుగా కాదు, ఆ రాజధాని మీద హక్కుదార్లుగా.

భారాన్ని లక్ష్యపెట్టని బాధ్యత

అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ మొత్తానికీ పింఛన్ల పథకం కోసం గత ప్రభుత్వం నెలకు రూ 100 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత 2014 అక్టోబర్ 2న గాంధీ జయంతి నాడు ప్రారంభమైన ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా 13 జిల్లాల నవ్యాంధ్రలోని లబ్ధిదారులకే నెలకు రూ 500 కోట్లు ఖర్చు పెడుతున్నారు. దీనిద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికి రూ 6000 వేల కోట్ల భారం పడుతోంది . పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు కన్నా మన రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల కోసం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తోంది. సామాజిక భద్రతా పింఛన్ల కోసం ఇంత పెద్ద ఎత్తున ఖర్చు చేస్తున్న రాష్ట్రం దేశంలో మొదటిది. దేశంలోనే ఇది గొప్ప పథకం అయ్యిందంటే, దాని వెనక మహానాయకుడు చంద్రబాబు తపన, సంకల్పం ఉన్నాయి.

అధికారంలోకి రాక ముందు చంద్రబాబు 2800 కిలో మీటర్ల పాదయాత్ర చేశారు. సమాజంలోని అనేక వర్గాల్ని స్వయానా కలుసుకున్నారు. వారి వెతలు, అవస్థలూ ఆయనకి తెలియనివి కావు. కానీ, ముఖ్యంగా ఒక సంఘటన ఆయనని కదిలించింది. పాదయాత్ర సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లా ఓ పల్లెలోని ఒక గుడిసెలో మంచం పట్టిన ఒంటరి అవ్వ పరిస్థితి చూసి చలించిపోయారు చంద్రబాబు. అయినవాళ్లు ఉన్నా, అవసరం తీరిపోయిందని అవసాన దశలో అనాథగా వదిలివేయబడింది ఆ వృద్ధురాలు. వృద్ధాప్య పింఛను రూ 200 నుంచి రూ 1000 కి పెంచడం ఒక్కటే కాకుండా, ఆ అవ్వలాగా నిజమైన అభాగ్యులకి చేరాలని ఆనాడే సంకల్పించి, ప్రకటించారు చంద్రబాబు.

అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక పక్క ఋణమాఫీ, మరో పక్క నిరంతరాయ విద్యుత్తు, ఇంకా అనేక పథకాల అమలు. అటువంటి పరిస్థితుల్లో ఐదు రెట్ల పైగా భారం వేయనుండే 'ఎన్టీఆర్ భరోసా పథకం' విషయం పునరాలోచించమని ఆర్థికవేత్తలు ముఖ్యమంత్రి మీద ఒత్తిడి తెచ్చినప్పటికీ ఆయన వెనకడుగు వేయలేదు. అర్హులందరికీ ఈ పథకం ఫలాలు అందాలన్న దృఢ నిశ్చయంతో నగదును దళారులు స్వాహాచేయకుండా ఉండేందుకు ఆధార్ ను అనుసంధానం చేయించారు చంద్రబాబు. గతంలో అర్హతలేని వారికి కూడా పింఛన్లు మంజూరు చేశారు. మగవారికి కూడా వితంతు పింఛన్లు ఇచ్చిన అవకతవక సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ ప్రభుత్వం ఇప్పుడు పింఛనుదారులకు ఇంటి వద్దనే అందించడానికి అన్నీ చర్యలు తీసుకుంది. గత ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కమిషన్ ఇచ్చి పింఛన్లు పంపిణీ చేసే వారు కానీ ఇప్పుడు గ్రామ, వార్డు స్థాయిలో పంచాయితీ కార్యదర్శులు ద్వారా, బయోమెట్రిక్ విధానం ద్వారా పంపిణీ చేయడంతో ప్రభుత్వానికి ఏటా రూ 3 నుండి రూ 4 కోట్లు ఆదా అవుతున్నాయి. డూప్లికేట్స్, బినామీ ఫించన్లను సమర్థవంతంగా నిరోధించింది ప్రభుత్వం. ఇన్ని అంశాల వల్ల 'ఎన్టీఆర్ భరోసా పథకం' దేశంలోనే గొప్ప పథకమయ్యింది. సంక్షేమ పథకాల రూపకల్పనకే ఆదర్శమై నిలిచింది.

– నీరుకొండ ప్రసాద్

'ఉపాధిహామీ' పనులు మరింత పారదర్శకం, ప్రణాళికాబద్ధం

- ఏపీ స్టేట్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ కౌన్సిల్ ఏర్పాటు
- ముఖ్యమంత్రి అధ్యక్షతన 32మంది సభ్యులతో కౌన్సిల్



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు మరింత పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా వుండేలా పూర్తిస్థాయిలో సాంకేతికతను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. ఈ పథకం కింద చేపట్టే పనులలో 'నీరు-చెట్టు'కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, సిమెంట్ రహదారుల నిర్మాణానికి, వ్యక్తిగత మరుగుదొడ్ల ఏర్పాటుకు రెండో ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. పనుల ఎంపిక, ధృవీకరణ జన్మభూమి గ్రామ కమిటీలు, స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ భాగస్వాముల ద్వారా జరిగేలా చూడాలని చెప్పారు. తన కార్యాలయంలో జరిగిన 'ఏపీ స్టేట్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ కౌన్సిల్' సమావేశంలో ముఖ్యమంత్రి కొన్ని మార్గదర్శకాలు చేశారు.

ఎంజీఎన్ఆర్‌జీఏ కింద ఉపాధిపొందేవారి ఎంపిక విధానంలో పూర్తిస్థాయి ప్రక్షాళన జరగాలని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మేట్, సీనియర్ మేట్ అనే రెండే కేడర్లు వుండేలా ఎంపిక విధానంపై పునఃసమీక్ష చేయాలని చెప్పారు. ఏడాది, లేదా ఆర్నెల్లకు ఒకసారి రొటేషన్ పద్ధతిలో ఉపాధిపొందే వారిని ఎంపిక జరగాలన్నారు. జన్మభూమి గ్రామ కమిటీలు, సాగునీటి సంఘాలు, మహిళా స్వయంశక్తి సంఘాలను భాగస్వాముల్ని చేసే ప్రతిపాదనను పరిశీలించాలన్నారు. ఆడిటింగ్, జియో ట్యాగింగ్ సక్రమంగా వుండేలా చూడటం ద్వారా వ్యవస్థలో కచ్చితంగా మార్పు వస్తుందన్నారు. డ్యాష్ బోర్డులో ఒక పనిని ఎవరు చేశారు, ఎప్పుడు చేశారు అనే అంశాలపై పీరియాడికల్, హిస్టారికల్ డేటా కచ్చితంగా వుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఎక్కడా బోగస్ పనులు, పనివావారు వుండటానికి వీల్లేదని, జియో ట్యాగింగ్, ఫింగర్ ప్రింట్స్, ఆన్‌లైన్ మస్టర్ అటెండెన్సుతో అన్నిరకాల అవకతవకలకు చెక్ పెట్టవచ్చునని సూచించారు.

ఒక పనిని చేపట్టిన వెంటనే ముందు దాని ఛాయాచిత్రాన్ని తీసుకుని డ్యాష్ బోర్డులో వుంచాలని, తరువాత సంబంధిత పనులు జరిగే తీరును దశలవారీగా ఛాయాచిత్రాలు తీసి వాటిని ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ పనుల మొత్తం ప్రగతిని ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఛాయాచిత్ర ప్రదర్శన ద్వారా ప్రజలు తెలుసుకునేలా చేయాలని సూచించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 'నీరు-చెట్టు' కార్యక్రమం కోసం 3నెలలుగా సాగిన పనులతోనే ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు వంటి నీటి వనరులు నిండుకుండలా కనిపిస్తున్నాయని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. ఏడాది పొడవునా ఇలాంటి పనులు చేపడితే రాష్ట్రం సుభిక్షం అవుతుందన్నారు.

కేరళ తదితర రాష్ట్రాలలో అటెండెన్స్ బట్టి చెల్లింపులు చేస్తున్నారని, చేసే పని ఆధారంగా మన రాష్ట్రంలో చెల్లింపులు జరుగుతున్నాయని అధికారులు వివరించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న పనులలో ఇప్పటికే సాంకేతికతను జోడించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందిందని వారు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. రిజిస్ట్రేషన్లు, పనుల ప్రణాళిక, పనుల పర్యవేక్షణ, చెల్లింపుల విధానం, పారదర్శకత, జవాబుదారితనం, ఇలా ప్రతి అంశంలో సాంకేతికతను విరివిగా అమలు చేస్తున్న రాష్ట్రం దేశం మొత్తం మీద మనదేనని చెప్పారు. మస్టర్ మేనేజ్‌మెంట్, మెజర్‌మెంట్ చెక్, బ్యాంకుల ద్వారా చెల్లింపుల విధానం, ఆధార్ అనుసంధానం, స్మార్ట్ మొబైల్ ఫోన్ల వినియోగం, సోషల్ ఆడిట్, విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అంశాలలో వీలైనంత సాంకేతిక పద్ధతుల్ని అనుసరిస్తున్నామన్నారు.

ఏ బ్యాంకు నుంచైనా డబ్బు డ్రా చేసుకునేలా చెల్లింపుల విధానాన్ని మరింత సులభతరం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. చెల్లింపులకు రశీదు ఇవ్వడమే కాకుండా సెల్ ఫోన్ ద్వారా చెల్లింపు ప్రక్రియ పూర్తయినట్లు సందేశం పంపాలన్నారు. అంతేగాక, ఐవీఆర్ఎస్ ద్వారా ఉపాధి పొందేవారి నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని, ఏవైనా ఫిర్యాదులు వుంటే స్వీకరించాలని చెప్పారు. ఉపాధిహామీ పనివాళ్లకు మూడేళ్లకు ఒకసారి అవసరమైన పనిముట్లను అందించాలని, ఈ విషయంలో ఎక్కడా దుర్వినియోగం జరగకుండా వేలి ముద్రలు తీసుకుని సామాగ్రిని అందజేయాలని అన్నారు. ఏఏ శాఖలకు ఎటువంటి పనులు అవసరమో గుర్తించి తగిన ప్రణాళికను సిద్ధం చేయాలని, రానున్న రోజులలో ఎన్ఆర్ఈజీఏను సమర్థంగా వినియోగించుకుంటున్న రాష్ట్రంగా ఏపీకి గుర్తింపు రావాలని ముఖ్యమంత్రి లక్ష్యాలను నిర్దేశించారు.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ కౌన్సిల్ ఏర్పాటుకు సంబంధించి ఈ సమావేశంలో కొంత కసరత్తు జరిగింది. ముఖ్యమంత్రి అధ్యక్షతన ఈ కౌన్సిల్ పనిచేస్తుంది. 17 మంది మంత్రులు, కార్యదర్శులతో అధికారిక సభ్యుల బృందం, మరో 15 మంది ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో అనధికార సభ్యుల బృందం ఈ కౌన్సిల్ కోసం పనిచేస్తుంది. సమావేశంలో మంత్రులు అయ్యన్నపాత్రుడు, అచ్చెన్నాయుడు,

ఉన్నతాధికారులు శశిభూషణ్, రామాంజనేయులు, రాజమౌళి, ప్రద్యుమ్న తదితరులు పాల్గొన్నారు.

❖

అద్భుత కళాఖండం తెలుగు సాంస్కృతిక నికేతనం



ప్రపంచ తెలుగు సమాఖ్య, వుడా సంయుక్త ఆధ్వర్యంలో రూ. 12.75 కోట్ల అంచనా వ్యయంతో కైలాసగిరిపై నిర్మించిన తెలుగు సాంస్కృతిక నికేతనాన్ని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడుతో కలిసి నవంబర్ 19న ముఖ్యమంత్రి ప్రారంభించారు.

తెలుగు జాతి చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయం, భాషా, వారసత్వసంపదకు సజీవ తార్కాణం తెలుగు సాంస్కృతిక నికేతనమని, అటు వంటి అద్భుత కళాఖండాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. తెలుగు జాతి ప్రాశస్త్యాన్ని భావితరాల వారికి తెలియజెప్పే విధంగా తీర్చిదిద్దిన తెలుగు సాంస్కృతిక నికేతనాన్ని అద్భుతంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములైన వారందరికీ ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ప్రపంచ తెలుగు సమాఖ్య, వుడా సంయుక్త ఆధ్వర్యంలో రూ. 12.75 కోట్ల అంచనా వ్యయంతో కైలాసగిరిపై నిర్మించిన తెలుగు సాంస్కృతిక నికేతనాన్ని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వెంకయ్యనాయుడుతో కలిసి నవంబర్ 19న ముఖ్యమంత్రి ప్రారంభించారు.


తెలుగు సాంస్కృతిక నికేతనం ప్రారంభోత్సవానికి కైలాసగిరికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతంపలికారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం కేంద్ర మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు హోం శాఖ మంత్రి ఎన్ చిన్నరాజప్ప, జిల్లా మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావులతో కలిసి ప్రాంగణంలో కలియతిరిగి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. తదుపరి సాంస్కృతిక నికేతనం ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తెలుగు సాంస్కృతిక నిలయంలోని రివాల్వింగ్ సిటింగ్‌లో కూర్చుని 48 ఘట్టాలతో రూపొందించిన తెలుగు సాంస్కృతిక వైభవాన్ని తిలకించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య ధర్మకర్త ఆచార్య యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్, కళాఖండాల రూపకర్త తోట తరణి, సినీనటుడు సాయి కుమార్ తదితరులు నిలయంలో ఏర్పాటు చేసిన చారిత్రక ఘట్టాల గురించి ముఖ్యమంత్రికి వివరించారు.

అనంతరం తెలుగు సాంస్కృతిక నికేతనం ప్రాంగణంలో ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రతినిధులు, ఇతర ప్రముఖులతో మాట్లాడుతూ సహజసిద్ధమైన ప్రకృతి అందాలతో అలరారే కైలాసగిరిపై ఈ అద్భుత కళాఖండాన్ని తీర్చిదిద్దడంలో ప్రముఖ ప్రాత్రపోషించిన ప్రపంచ తెలుగు సమాఖ్య చైర్‌పర్సన్ వి.ఎల్.ఇందిరా దత్‌ను, రూ. 7 కోట్ల మేర నిధులు సమకూర్చిన దాతలను అభినందించారు. తెలుగు జాతి చరిత్రలో ఈ సాంస్కృతిక నిలయం ఒక గొప్ప కళాఖండంగా నిలుస్తుందని, తెలుగు చరిత్ర సంస్కృతి, సాంప్రదాయాలను భవిష్యత్ తరాలు తెలుసుకొనేందుకు ఎంతగానో దోహదపడుతుందని ప్రశంసించారు. ఈ మ్యూజియంను పదికాలాలపాటు పదిలంగా పరిరక్షించుకొనేందుకు ప్రభుత్వ పరంగా ఒక ఉత్తమమైన గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేస్తామని, ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకొనేందుకు వీలుగా ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం నిర్మాణానికి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో ఇదే తరహాలో తెలుగు మ్యూజియంను నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రతినిధులకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ తెలుగు జాతి చరిత్రను, వైభవాన్ని దృశ్య, శ్రవణం ద్వారా తెలియజేప్పే విధంగా తెలుగు సాంస్కృతిక నికేతన్‌ను తీర్చిదిద్దడాన్ని అభినందించారు. ఈ కేంద్రాన్ని మరింత అద్భుతంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర సాంస్కృతిక శాఖ పూర్తిగా సహకరిస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలుగు సాంస్కృతిక నిలయాన్ని తీర్చిదిద్దడమైందన్నారు. కొన్నేళ్ల క్రితమే ఈ కేంద్ర నిర్మాణం ప్రారంభం అయినప్పటికీ, గత ఏడాది కాలంలో నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేశామన్నారు. హైదరాబాదు రవీంద్రభారతి తరహాలో ఎం.వి.పి.కాలనీలో రూ.30 కోట్లతో సాంస్కృతిక కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఇందిరాదత్ మాట్లాడుతూ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్.టి.రామారావు 1992 లో ప్రపంచ తెలుగు సమాఖ్యను ప్రారంభించారన్నారు. వారిచ్చిన స్ఫూర్తితోనే ఈ తెలుగు సాంస్కృతిక నిలయాన్ని నిర్మించేందుకు తమ సమాఖ్య పూర్తి స్థాయిలో మద్దతు ఇచ్చిందన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో కూడా ఇదే తరహాలో నిర్మిస్తామన్నారు. ❖

నవ్యాంధ్రకి నవ రాజమహేంద్రనగరి!

సిఎం పూనికతో రాజమహేంద్రవరంగా రాజమండ్రి



రాజమండ్రి పేరును రాజమహేంద్రవరంగా మారుస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. పేరంటే నాలుగైదు అక్షరాల అల్లిక మాత్రమే కాదని అది ఒక ఐతిహ్య సూచి అని ఆయన చేసిన ప్రకటన చెప్పకనే చెప్పింది. వలస పాలనలో వంకర్లు తిరిగిన వైభవం తిరిగి వన్నెకెక్కనున్నదని సంకేతించింది.

కూచిపూడి నాట్యానికి పునరుజ్జీవం... నవ్యాంధ్ర రాజధానికి 'అమరావతి' నామకరణం... రాజమహేంద్రవరమై వెలిగిన పురాస్ఫూర్తి- వెరసి చంద్రబాబు సారథ్యంలో వెల్లివిరిసిన ఓ సాంస్కృతిక చైతన్యం!

తెలుగునాట జాతీయ స్థాయిలో సుపరిచితమైన పట్టణాలలో రాజమహేంద్రవరం వెయ్యేళ్ళకు పైగా చారిత్రక వైభవం కలిగిన ప్రాచీన నగరం. పూర్వం దంతపురి, పంచగిరిగా పురాణ ప్రసిద్ధి పొందిన ఈ పట్టణం పుష్పగిరి, కమలాచలం, వేదాద్రి శిలా శిఖరాలపై విలసిల్లిందంటారు. ప్రాచీన హైందవ ధర్మ విశిష్టతకు ఆలవాలమైన వారణాసి వంటి గంగానదీ తీర ప్రాంత పట్టణ ప్రాధాన్యత, గోదావరీ నదీ తీరంలో వున్న రాజమహేంద్రిని వరించింది. అఖండ గోదావరి తీరంగా, త్రేతాయుగం నాటి శ్రీ మద్రామాయణంలో ప్రస్తావించబడిన నదీ తీర పవిత్రత, జమదగ్ని, అత్రి, భరద్వాజుడు, గౌతముడు, వాసుదేవుడు, విశ్వామిత్రుడు, వసిష్టుడు, మార్కండేయుడు వంటి ఎందరో మహర్షుల పాదస్పర్శతో పునీతమైన సాగర సంగమ పుణ్యక్షేత్ర సాన్నిహిత్యం ఈ నగర ప్రాచీన ధార్మి, ఐశ్వర్యం, ఆర్యావర్తంలో ప్రవేశించిన గోదావరి, దండకారణ్యం మీదుగా రుద్రేశ్వరుని దివ్య కోటిలింగ క్షేత్రాల వంటి పుణ్యక్షేత్రాలు, ప్రాచీన కాలం నాటి రాక్షస సంహారాల పురాణ, ఐతిహాసక కథనాలకు రాజమహేంద్రి సాక్షీభూతంగా విలసిల్లుతోంది.

రాజమహేంద్రపురం, రాజమహేంద్రవరం, రాజమహేంద్రం, రాజమందిరి ప్రస్తుతం రాజమండ్రిగా వ్యవహరింప బడుతున్న ఈ మహానగరం తెలుగు ప్రజాభీష్టం మేరకు నవ్యాంధ్ర ఆవిర్భావ శుభోదయంలో మళ్ళీ రాజమహేంద్రవరంగా నామకరణం పొందటం విశేషాంశం. ఆదికవి, వాగనుశాసనుడు నన్నయ భట్టారకుడు తెలుగు మహాభారత రచనకు శ్రీకారం చుట్టిన 11వ శతాబ్దం, చోళ సామ్రాజ్యాధినేత రాజరాజనరేంద్రుని రాజధానీ

నగరంగా రాణ్మహేంద్రవరంతో అజరామ-రమైంది. రాజరాజ నరేంద్రుని అభ్యర్థన మేరకు నన్నయ, రాజమహేంద్రవరం నదీతీర ఇసుక తిన్నెల మీద కూర్చుని ఆంధ్ర మహాభారతానికి శుభారంభం చేసిన కథనం వినవస్తోంది. ఆనాటి వేంగీ సామ్రాజ్యానికి నాయక రత్నమైన రాజమహేంద్రపురం నుంచి ఆంధ్ర మహాభారతం నన్నయ ఘంటం నుంచి అమృతనదీ ప్రవాహంగా జాలువారింది. రాజరాజనరేంద్రుని కీర్తి ప్రతిష్ఠలు, రాజ్యాధిపత్య పునాదిపై కాకుండా, రాజమహేంద్రవర పౌరాణిక, సాహిత్య, సాంస్కృతీ వైభవం ఆధారమైంది. తూర్పు చాళుక్యుల కాలంనాటి ప్రాచీన ప్రభావాన్ని నిక్షిప్తం చేసుకొన్న ఈ పట్టణ ఆవిర్భావం మొదటి అమ్మరాజు విష్ణువర్ధనుని కాలం (919-934) నాటి నిర్మాణమనే అభిప్రాయం కూడా వుంది. రాజరాజనరేంద్రుడు ఈ పట్టణ నిర్మాతగా, విన్నకోట పెద్దనామాత్యుడు తన కావ్యాలంకార చూడామణిలో 'రాజమహేంద్రపుర స్థాత రాజరాజనరేంద్రుడు' అని పేర్కొన్న ఆధారం స్పష్టంగా వుంది. తూర్పు చాళుక్య యుగానికి ముందేవున్నట్టుగా కొన్ని చారిత్రక పురావస్తు సంబంధిత ఆధారాలు లభ్యమైన వైనాన్ని, ప్రముఖ సామాజిక సేవా నిరతులు, రాజమహేంద్రి సాంస్కృతిక చైతన్య మూర్తి వై.ఎస్ నరసింహారావు తన చారిత్రక అధ్యయన వివరాలలో పేర్కొన్నారు. 1978లో పురావస్తు తవ్వకాలలో బయటపడిన నందీశ్వర విగ్రహం, బొమ్మూరు సన్యాసి మెట్టు మీద బౌద్ధయుగ అవశేషాల వెలుగులో, రాజమహేంద్రి ప్రాచీన చరిత్రను పరిశీలించవలసి ఉంది. రాజరాజ నరేంద్రుని అనంతరం చోళ రాజేంద్రుని పుత్రిక అమ్మంగ మహాదేవి వలన పుట్టిన కుమారుడు రాజేంద్రుడు స్థానంలో సవితి సోదరుడు విజయాదిత్యుడు సింహాసనాన్ని ఆక్రమించి తన కొడుకు శక్తివర్మను పట్టాభిషిక్తున్ని చేసాడు. ఏడాదిలోనే కొడుకు మరణించటంతో తానే రాజు కాగలిగాడు. నాటి కాలంలో చోళ రాజ్యంలో చాళుక్య ఐక్యం కావటం, వేంగీ సింహాసనం విజయాదిత్యుని పరమైంది. రాజేంద్రుడు పినతండ్రిపై యుద్ధం ప్రకటించి వేంగిని స్వాధీనం చేసుకొన్నాడు. చాళుక్య, కళింగ, ఛేది రాజ్యాలతో యుద్ధానంతరం 1075 లో తూర్పు చాళుక్య వంశం అంతరించి, రాజమహేంద్ర ప్రాంతాన్ని రాజరాజ నరేంద్రుని కొడుకు కులోత్తుంగ చోళుడు, వారసులు రెండు దశాబ్దాలు పాలించారు. కాకతీయ గణపతి దేవుని కాలంలో రాజమహేంద్రపురం కాకతీయ సామ్రాజ్యంలో అంతర్భాగమైంది. కాకతీయ సామ్రాజ్యం అంతరించిన తరువాత మహ్మద్ బీన్ తుగ్లక్, రాజమహేంద్ర దుర్గాన్ని స్వాధీనం చేసుకొని హుమాయూన్ గుజ్జార్ ను పాలనాధికారిగా నియమించాడు. నేడు రాజమండ్రి పెద్ద మసీదు ముఖద్వారంలో వున్న ఘియాజ్ ఉద్దీన్ తుగ్లక్ పేరిటనున్న శాసనం, కొన్ని నాణాలు ఈ విషయాలను ధృవపరుస్తున్నాయి. వేంగీ చాళుక్యుల కాలంలో నిర్మించబడిన వేణుగోపాల స్వామి ఆలయం, మసీదుల నిర్మాణానికి సంబంధించిన శాసనాధారాలున్నాయి. కోటగుమ్మం, దాననాయిపేట వంటి పలు ప్రాంతాలపై చారిత్రక కథనాలున్నాయి. రాజరాజుకు ఇష్టదైవమైన వేణుగోపాలస్వామి ఆలయాన్ని శ్వేత గిరిపై నుంచి తరలించి కంభం సత్రం దగ్గర పునర్నిర్మించారు. నగరానికి వేణుగోపాలస్వామి క్షేత్రపాలకులు.

ఈస్టిండియా కంపెనీ పాలన కింద ఉండగా రాజమండ్రిలో గోదావరి జిల్లా కేంద్రంగా కలెక్టరేట్ స్థాపించారు. 1802 లో జిల్లా కోర్టు, 1868 లో గౌతమీ గ్రంథాలయం, 1854 లో సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం ఆనకట్ట, 1853 లో డిస్ట్రిక్ట్ స్కూలుగా గవర్నమెంటు ఆర్ట్స్ కళాశాల, 1848 లో మహోన్నత సంస్కర్త వీరేశలింగం జననం, 1900 లో ప్రప్రథమ రైలు వంతెన, 1905 లో బిపిన్ చంద్రపాల్ రాక, దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రధాన భూమిక నిర్వర్తించింది. నేడు రాజమహేంద్రవరం, ఆంధ్రజాతి మహోన్నత కళా, సాహితీ, సాంస్కృతిక రాజధానిగా విలసిల్లుతోంది. ఒకప్పటి బెజవాడ విజయవాడగా మారినట్టే నవ్యాంధ్ర నూతన రాజధానిగా అమరావతి ఆవిర్భవిస్తున్నట్టే, నవ్యాంధ్రప్రదేశ్ పునరుజ్జీవ వికాసంలో రాజమహేంద్రవరం మకుటాయమానంగా విరాజిల్లుతుంది.

అందుకే ప్రముఖ కవివరేణ్యులు మల్లంపల్లి శరభేశ్వర శర్మ రాజమండ్రి గురించి ఇలా అన్నారు.

" ఏ రాజ్యమ్ములు సాగనీ మరియు నిన్నే రాజులే యేలనీ

చేరన్ నాటికి నేటికిన్ కవులు నిన్ శ్రీ గౌతమాపత్య వా

పూరంపున్ సయిదోడుగా సుకవి భోగం బవిచ్చిన్నధా

రా రమ్యంబగు రాణ్మహేంద్ర నగరీ! రాజద్యశో వైఖరీ!"

– జయసూర్య

నవ్యాంధ్రలో ప్రవాసాంధ్రుల పెట్టుబడులకు ఎర్రతివాచీ

అసెంబ్లీ స్పీకర్ డా. కోడెల శివప్రసాద్



కొత్తగా ఏర్పాటైన నవ్యాంధ్రలో పరిశ్రమలు పెట్టేవారికి త్వరిత గతిలో అనుమతులు ఇచ్చేందుకు వీలుగా ఏకగవాక్ష విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు అన్నారు.

ఆయన ఇటీవల ఐదు రోజులపాటు జర్మనీ పర్యటనకు వెళ్లిన సందర్భంగా ప్రవాసాంధ్ర పెట్టుబడిదారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కోడెల అక్కడ ఎయిర్‌బస్ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. నవ్యాంధ్రప్రదేశ్ తరపున హాంబర్గ్‌లో జరిగిన ఇండియా వీక్-2015 ఉత్సవాలకు హాజరయ్యారు. నవ్యాంధ్రలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కోడెల ప్రవాసాంధ్ర పెట్టుబడిదారులకు విజ్ఞప్తి చేశారు.

పరిశ్రమలు, ఇతర సంస్థలను నెలకొల్పేందుకు ముందుకు వచ్చే ఔత్సాహికులకు ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానం ద్వారా అందించే ప్రయోజనాలను వివరించి, వారిని ఆకర్షించగలిగారు.

కోడెల ఆహ్వానానికి పలువురు ప్రవాసాంధ్ర పెట్టుబడిదారులు సానుకూలంగా స్పందించారు. అనంతపురం జిల్లాలో ఎయిర్‌బస్ కంపెనీ తన ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పాలని నిర్ణయించడంపట్ల కోడెల హర్షం వ్యక్తం చేశారు. ఎయిర్‌బస్ తరహాలోనే ఇతర కంపెనీలు, సంస్థలు కూడా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర రాజధాని అమరావతి మహానగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించేందుకు కార్యాచరణ ప్రణాళికలు సంసిద్ధంగా ఉన్నాయని డాక్టర్ కోడెల తెలిపారు.

పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమైన రాష్ట్రాలలో నవ్యాంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉన్నదని, ఇప్పటికే అంతర్జాతీయ స్థాయి సంస్థలు ముందుకు వస్తున్నాయని ఆయన అన్నారు. ప్రవాసాంధ్రులంతా ఎలాంటి సంకోచం లేకుండా పెట్టుబడులు పెట్టేందుకు ప్రాజెక్టు ప్రతిపాదనలతో ముందుకు రావాలని కోడెల పిలుపునిచ్చారు.

❖

పట్టాలకెక్కనున్న నడికుడి - శ్రీకాళహస్తి రైలుమార్గం



గుంటూరు జిల్లా నడికుడి నుంచి చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి వరకు రైల్వే మార్గం వాస్తవరూపం ధరించనుండటంతో రైలు ప్రయాణీకులకు మరింత సౌకర్యం కలగనుంది. ఇందుకోసం భూసేకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గం మూలంగా రాజధాని నుంచి రాయలసీమకు అనుసంధానం పెరుగుతుంది.

నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైను నిర్మాణానికి మార్గం సుగమమైంది. నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైను పనులు ఎట్టకేలకు పట్టాలపైకెక్కనున్నాయి. ప్రధాని కార్యాలయం స్వయంగా ఈ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తోంది. ఈ ఏడాది బడ్జెట్‌లో నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే మార్గానికి కేంద్రం రూ.110 కోట్లు కేటాయించింది. తొలివిడతగా రూ.18 కోట్లు విడుదల చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐ.వై.ఆర్. కృష్ణారావు ఈ ప్రాజెక్టు పనులను శీఘ్రగతిన నిర్వహించడానికి ఎప్పటికప్పుడు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షిస్తున్నారు. ఆ మేరకు నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే లైను కోసం భూసేకరణను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవిన్యూ అధికారులు భావిస్తున్నారు. డిసెంబరు చివరి నాటికి రైల్వే శాఖకు భూమిని అప్పగించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నారు.

గుంటూరు జిల్లా నడికుడి నుంచి చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి వరకు రైల్వే మార్గం వాస్తవరూపం ధరించనుండటంతో రైలు ప్రయాణీకులకు మరింత సౌకర్యం కలగనుంది. ఇందుకోసం భూసేకరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. డిసెంబరు నాటికి భూమిని అప్పగించాలని గుంటూరు జిల్లా రెవిన్యూ యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసింది. నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే మార్గం భూసేకరణ కోసం ఇప్పటికే ప్రాథమికంగా నోటిఫికేషన్ విడుదలైంది. రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తున్నారు. గుంటూరు జిల్లాలో 15 గ్రామాల్లో భూసేకరణ చేపట్టారు. భూముల ధరలు నిర్ణయించడానికి మార్కెట్ విలువపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

తొలిదశలో నడికుడి నుంచి శావల్యాపురం వరకు భూసేకరణ ప్రక్రియ చేపట్టనున్నారు. గ్రామ గ్రామానికి పరిహారం మారనుందని రెవిన్యూ అధికారులు పేర్కొంటున్నారు. డిసెంబరు 15 నాటికి గుంటూరు జిల్లాలో భూమిని అప్పగించాలని భావిస్తున్నారు. భూ ధరల నిర్ణయాన్ని రైతులతో చర్చించి నిర్ణయించనున్నారు. ప్రయివేట్ భూములతో కలిపి 732. ఎకరాలు సేకరించదలిచారు. అమరావతి ప్రాంతంలో భూధరలు అధికంగా ఉన్నాయి.భూసేకరణలో రైతుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాకున్నా న్యాయమైన ధరలు చెల్లించాలని రైతుల విన్నపాన్ని రెవిన్యూ అధికారులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గం మూలంగా రాజధాని నుంచి రాయలసీమకు అనుసంధానం పెరుగుతుంది.

“ఈ ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాము. సరిపడినన్ని నిధులు కేటాయించడం జరిగింది. నడికుడి నుంచి పనులు ప్రారంభిస్తాం” అని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజరు విజయశర్మ పేర్కొన్నారు. 309 కిలోమీటర్లు ఉన్న ఈ రైల్వే మార్గం పూర్తయితే చెన్నై నుంచి నేరుగా హైదరాబాద్ చేరుకోవడానికి వీలవుతుంది. సుమారు 80 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ ప్రాజెక్టులపై సమీక్షించిన సీఎస్

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ పనుల ప్రగతిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు తరచూ సంబంధిత అధికారులతో సమీక్షలు నిర్వహించడంలో భాగంగా నవంబరులో మరోసారి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైల్వే, రవాణా, రహదారులు, భవనాలశాఖ అధికారులతో కలిసి ఆయన ముగ్గురు కలెక్టర్లతో మాట్లాడారు. నాగార్జునసాగర్-ఏర్పేడు మధ్య రహదారిని జాతీయ రహదారిగా మార్చడంపై చర్చ జరిగింది. రైల్వే లైన్‌కు అవసరమైన భూమిని డిసెంబర్ 15కల్లా రైల్వే అధికారులకు అప్పగించనున్నామని గుంటూరు జిల్లా అధికారులు సీఎస్ దృష్టికి తెచ్చారు. గుంటూరు జిల్లాలోని 14 గ్రామాల్లో సుమారు 688 ఎకరాలు ఇందుకోసం అవసరం కానుందన్నారు. 'నెల్లూరు జిల్లాలో 2,900 ఎకరాలకు సంబంధించిన ఉమ్మడి సర్వే పూర్తయింది. పట్టా భూముల సర్వే మాత్రం పెండింగ్‌లో ఉంది. రైల్వేలైన్ కు సంబంధించిన పూర్తిస్థాయి నోటిఫికేషన్ ను బహిరంగ ప్రకటన కోసం సిద్ధం చేస్తున్నామని' వారు వివరించారు. ఈ విషయమై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఐవైఆర్ స్పందిస్తూ కొత్త రైల్వే లైన్లు, జాతీయ రహదారుల నిర్మాణం కోసం చేపట్టిన సర్వే పనులను నెల రోజుల్లో పూర్తిచేయాలని ఆయన కలెక్టర్లను ఆదేశించారు. ❖

అంతర్జాతీయ విపణివీధిలో

డ్వాక్రా వ్యవసాయోత్పత్తులు

రాష్ట్రంలో పేదరిక నిర్మూలన, సమ్మిళిత వృద్ధి లక్ష్యాలుగా మహిళా స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారు. విజయవాడ గేట్‌వే హోటల్‌లో 'గ్రామీణ సమ్మిళిత అభివృద్ధి ప్రాజెక్టు'పై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాలతో కలిసి పనిచేయడానికి ముందుకొచ్చిన వాల్‌మార్ట్, ఐటీసీ, ఓలమ్ ఆగ్రో, మహీంద్ర అండ్ మహీంద్ర, శ్రేష్ఠ వంటి 16 దిగ్గజ వ్యాపార సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. డ్వాక్రా మహిళల ద్వారా జరిగే వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించే అంశంపై ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గ్రామీణ మహిళల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. రెండంకెల వృద్ధి ఆకర్షణీయమే గానీ, సమ్మిళిత అభివృద్ధి కూడా అవసరమే అని సీయం అభిప్రాయపడ్డారు. రూ.660 కోట్లతో సెర్ప్ నేతృత్వంలో గ్రామీణ సమ్మిళిత అభివృద్ధి ప్రాజెక్టు చేపడుతున్నట్టు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.



ఇవీ ఒప్పందాలు

ఏపీలోని 80 వేల మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా సమున్నతుల్ని చేసి, గ్రామీణ సమ్మిళిత వృద్ధికి ఊతమిచ్చేందుకు 15 కంపెనీలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందాలు (ఎంఓయూలు) కుదుర్చుకున్నాయి. గేట్‌వే హోటల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. 'స్కేల్, స్కిల్, సైజ్, స్పీడ్'ను లక్ష్యాలుగా చేసుకుని కార్యాచరణ అమలులో దూసుకెళ్లాలని సీఎం పిలుపునిచ్చారు. ఒప్పందాలు వివరాలు ఇలావున్నాయి

వాల్‌మార్ట్: అనంతపురం, తూర్పుగోదావరి జిల్లాలలో రైతుల నుంచి బియ్యం, మిర్చి సేకరిస్తున్నారు. రాష్ట్రంలో నూతనంగా వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ పై ఔత్సాహిక మహిళలకు శిక్షణ ఇస్తుంది. గుంటూరు, రాజమండ్రి, విజయవాడలలో వాల్‌మార్ట్ కేంద్రాలకు 132 మంది స్వయం సహాయక సంఘాలతో అనుబంధం వుంది. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కింద రాష్ట్రంలోని వాల్‌మార్ట్ కేంద్రాలకు రిన్యువబుల్ ఎనర్జీ ద్వారా విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేస్తారు. ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్లను తయారుచేయడానికి కంపెనీ వెంటనే ఒక ప్రత్యేక విభాగాన్ని తయారుచేస్తున్నట్టు సదస్సులో ప్రకటించింది.

ఐటిసి: గుంటూరు కేంద్రంగా అగ్రి బిజినెస్‌ను అభివృద్ధి చేస్తారు. పొగాకు, మిరప లాంటి పంటల ఉత్పత్తులను ప్రోత్సహిస్తారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంతో అనుసంధానమై అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధికి తోడ్పాటు.

ఓలమ్ ఆగ్రో ఇండియా: జీడిపప్పు శుద్ధి ప్రక్రియ చేస్తుంది. కాఫీ, పత్తి, మిరప, బియ్యాన్ని శుద్ధి చేయాలన్నది కంపెనీ ప్రణాళిక. ఈ ప్రక్రియలో మహిళలకు నైపుణ్యాలపై శిక్షణనిస్తారు. రాష్ట్రంలో దుస్తుల తయారీ ఎలా చేస్తున్నారో, జీడిపప్పు శుద్ధిలో కూడా మహిళలను భాగస్వాములను చేస్తారు.

మహింద్రా అండ్ మహింద్రా అగ్రి డివిజన్ : రాష్ట్రంలో వ్యవసాయ యంత్రీకరణలో రైతులకు, మహిళలకు శిక్షణనిస్తారు. అగ్రిబిజినెస్ సొల్యూషన్, భూమి సాగు, పరీవాహక ప్రాంతాల్లో సాగుపై కూడా శిక్షణనిస్తారు. శిక్షణ కోసం సమృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.

ఎన్‌డిడివి డెయిరీ సర్వీసులు: మేలు జాతి పశు గణాభివృద్ధి, పోషక విలువలున్న దాణా అందించి పాల ఉత్పత్తిని పెంచేందుకు కృషి చేస్తారు. ధాన్యం సేకరించి మార్కెటింగ్ చేస్తారు. రెండు జిల్లాలలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తారు.

ఆర్ఎంఎఎల్ ఇన్ఫర్మేషన్ ప్రైవేట్ లిమిటెడ్ : రైతులకు సాగులో మెళకువలు నేర్పేందుకు మొబైల్ అప్లికేషన్లను అభివృద్ధి చేస్తారు. ఎస్ఎంఎస్, నేరుగా సమాచారం ఇస్తారు. స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములను చేసి అధికారులతో కలసి అవసరమైన సమాచారం సమకూరుస్తారు.

స్టార్ అగ్రి వేర్ హౌసింగ్ అండ్ కొలాటల్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ : రైతులు గిడ్డంగులు నిర్మించి ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు ఆర్థిక సహాయం అందిస్తుంది. చిన్న చిన్న గిడ్డంగులకు కూడా ఆర్థిక సహాయం అందిస్తుంది.

శ్రేష్ఠ నేచురల్ బయో ప్రోడక్ట్స్ లిమిటెడ్ : రాయలసీమ జిల్లాలలో వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, కొర్ర, రాగులు, సజ్జల ఉత్పత్తులకు 24 మంత్ర ఆర్గానిక్ ఫుడ్ బ్రాండ్ కింద సాగును అభివృద్ధి చేస్తారు. సేకరణతో పాటు ఈ-మార్కెటింగ్ నైపుణ్యాలు నేర్పుతారు.

ఎయిర్ టెల్: స్వయం సహాయక మహిళలను మూడు నెలల వ్యవధిలో డిజిటల్ అక్షరాస్యులుగా చేస్తారు. తొలుత జిల్లా, డివిజన్ కేంద్రాలలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో కంప్యూటర్ వినియోగంలో శిక్షణ ఉ ంటుంది.

ఇంటెల్: తెలుగు భాషలో మహళలకు కంప్యూటర్ వినియోగంలో శిక్షణ ఉంటుంది.


ఫ్యూచర్ గ్రూప్: ధాన్యం, మిరప పంట ఉత్పత్తులను సేకరిస్తారు. ప్రభుత్వ చౌక దుకాణాలను రిటెయిల్ వ్యాపారానికి అనువుగా మారుస్తారు. మహిళలకు శిక్షణనిస్తారు.

ఏడిఎం మేనేజ్‌మెంట్ బోర్డు: ధాన్యం, పప్పుదినుసులు, మొక్క జొన్న సేకరిస్తుంది. టెక్నాలజీ, సాంకేతిక, పారదర్శకతతో చెల్లింపులు చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకుంది.

– పెరుమాళ్ళ నాగరాజు
మీడియా లైజన్ అధికారి

బాక్సైట్ తవ్వకాలపై చర్చ జరగాలి

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



విశాఖపట్నంలోని చింతపల్లి బాక్సయిట్ మైనింగ్ డిపాజిట్‌పై వాస్తవ పరిస్థితిని ప్రజల ముందు ఉంచినట్లు అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ అంశంపై శ్వేత పత్రాన్ని విడుదల చేస్తూ, పజలలో చర్చ తర్వాతే ప్రభుత్వం ఏ నిర్ణయమైనా తీసుకుంటుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు సమావేశంలో చెప్పిన ముఖ్య అంశాలు.

బాక్సయిట్ రిజర్వ్ ఎక్కువగా ఒరిస్సాలో వున్నాయి, దాని తర్వాత ఏపీలో ఎక్కువగా వుంది. 2983 మిలియన్ టన్నులు దేశం మొత్తం మీద బాక్సయిట్ నిల్వలు, ఉండగా, నిల్వల్లో ఏపీది రెండోస్థానం. అయితే, మన రాష్ట్రంలో ప్రస్తుతం ఉత్పత్తి మాత్రం నిల్ అని సీయం తెలిపారు. 600 మిలియన్ టన్నులతో ఇండియాలో 21 శాతం నిల్వలు ఏపీలోనే వున్నాయి. అందులోనే, మన రాష్ట్రంలో ఉన్న బాక్సయిట్ ఏ గ్రేడ్, అయినా మనం ఉపయోగించుకోలేకపోతున్నామన్నారు.

వైఎస్ హయాంలో పద్ధతి లేకుండా ఇష్టానుసారం బాక్సయిట్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చారని చెప్పారు. రస్ అల్ ఖైమాతో అప్పటి వైఎస్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా, సుప్రీం తీర్పును ఉల్లంఘిస్తూ ఎంవోయూ కుదుర్చుకుంది. గిరిజన పయోజనాలకోసం కాకుండా ఒక కంపెనీ ప్రయోజనాల కోసం గత ప్రభుత్వం బాక్సయిట్ గనుల్ని కట్టబెట్టింది అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వాస్తవాలు ప్రజల ముందు పెట్టాం, జరిగిన పరిణామాలన్నీ ప్రజలే తెలుసుకుంటారు అని ఆయన అన్నారు.

బాక్సయిట్ తవ్వకాలపై రేపటినుంచి ప్రజలలో చర్చ జరగాలని ముఖ్యమంత్రి కోరారు. వాస్తవాలు ప్రజల దృష్టిలో పెడుతున్నాం, తరువాత నిర్ణయం తీసుకుంటాం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఖనిజాల తవ్వకాల వల్ల ఒనగూడే ప్రయోజనాల గురించి వివరిసస్తూ, ఒరిస్సాలో కేవలం మినరల్ వెల్త్ లేకపోతే అభివృద్ధి ఏది అని ఆయన ప్రశ్నించారు.

పద్ధతి ప్రకారం ఖనిజరాశిని ఉపయోగించుకుంటే అభివృద్ధి జరిగేది అని సిఎం అభిప్రాయపడ్డారు. చర్చ తరువాత నిర్ణయం చేస్తామని గతంలోనే నేను చెప్పాను, ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజా ప్రయోజనాల కోసం, పారదర్శకంగా చేస్తాం, అని చంద్రబాబు పకటించారు. స్థానిక గిరిజనుల్లో, రాష్ట్ర ప్రజలలో చర్చ జరిగి లాభనష్టాలు బేరీజు వేసుకోవాలి అని ఆయన పిలుపునిచ్చారు.

విశాఖ బాక్సైట్ ఖనిజం - వాస్తవాలు

విశాఖపట్నం జిల్లాలోని చింతపల్లిలో బాక్సైట్ ఖనిజం తవ్వకాలకు అనుమతులకు సంబంధించి వాస్తవ పరిస్తితులను వివరించి, దీనిమీద చర్చ జరిగిన తర్వాతే ప్రభుత్వం ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఈమేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాక్సైట్ గనులకు సంబంధించి ఒక శ్వేత పత్రాన్ని విడుదల చేశారు.

జాతీయ బాక్సైట్ పరిశ్రమ

అల్యూమినియం యొక్క అతి ముఖ్యమైన ఖనిజం బాక్సైట్. ఇది ఫెర్రస్ రహిత ఖనిజం కావడంతో ఆధునిక పరిశ్రమల్లో ఎక్కువగా వినియోగిస్తున్నారు. గట్టి పదార్థాలను తయారు చేయడం, రసాయన పరిశ్రమల్లో కూడా బాక్సైట్ ని వాడుతారు. 2012-2013 సంవత్సరంలో భారతదేశం 15.36 మిలియన్ టన్నుల బాక్సైట్ ను ఉత్పత్తి చేసింది. దేశంలో బాక్సైట్ నిల్వలు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు వరుసగా, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, చత్తీసగఢ్, జార్ఖండ్. పైన తెలిపిన మొత్తం రాష్ట్రాలు కలిపి 2012-13 సంవత్సరంలో 92.7 శాతం బాక్సైట్ ని ఉత్పత్తి చేశాయి.

బాక్సైట్ నిల్వ అత్యధికంగా ఉన్న రాష్ట్రం ఒడిషా కాగా, రెండవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉండడం గమనించదగ్గ విషయం. కానీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాక్సైట్ ఉత్పత్తిని నేటికీ మొదలుపెట్టలేదు.

ఆంధ్రప్రదేశ్‌లో విస్తారమైన బాక్సైట్ గనులున్నాయి. భూగర్భ గనుల శాఖ అంచనా ప్రకారం 600 మిలియన్ టన్నుల బాక్సైట్‌లో విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉన్నాయి. భారతదేశంలో గల మొత్తం బాక్సైట్‌లో 21.65 శాతం ఇక్కడే ఉంది. ఈ బాక్సైట్ నిక్షేపాలున్న ప్రాంతాలన్నీ. గిరిజనులు నివసించే ప్రాంతాలలో, దట్టమైన అడవుల్లోనే ఉన్నాయి. భూ మార్పిడి నిబంధనల ప్రకారం, 1959/1970 కాలంలో గిరిజనులు కాని వారు బాక్సైట్ ఉన్న ప్రాంతాల్లో నివసించడాన్ని నిషేధించడం జరిగింది.

రాష్ట్రాల పరిధుల్లో ఉన్న విస్తారమైన ఖనిజ నిక్షేపాలన్నీ అవి ఉన్న ప్రాంతాలకు సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వాలకే సొంతమని భారతదేశ అత్యున్నత న్యాయస్థానం 1997లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంపై సమతా కమిటీ వేసిన పిటిషన్‌లో తీర్పునిచ్చింది. ఖనిజ నిక్షేపాల తవ్వకాలను ఆయా రాష్ట్రాలు పీఎస్‌యూ ద్వారా నిర్వహించాలని తెలిపింది. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి రాష్ట్రంలో ఉన్న బాక్సైట్ మైనింగ్‌ను ఏపీఎండీసి ద్వారా జరిపించి, రాష్ట్రంలో అల్యూమినా/అల్యూమినియం పరిశ్రమలను నెలకొల్పడానికి ముందుకొచ్చే సంస్థలకు సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యుఎఈల మధ్య ఒప్పందం

ఆంధ్రప్రదేశ్‌లోని బాక్సైట్ ఖనిజ నిక్షేపాలు, తవ్వకాలపై చర్చించడానికి అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రులు, సంబంధిత ఉన్నతాధికారులతో 2007 లో సమావేశం నిర్వహించారు. విశాఖపట్నంలో పర్యావరణ హితమైన అంతర్జాతీయ స్థాయి అల్యూమినియం ప్లాంట్‌ను రస్-అల్-ఖైమా ప్రభుత్వం నెలకొల్పుతుందని తెలిపారు. రస్-అల్-ఖైమా ప్రభుత్వంతో ఎంఓయు

మన రాష్ట్రంలో లభ్యమయ్యే ఖనిజాలు, మన ప్రజల అభ్యున్నతికి ఉపయోగపడాలి. బాక్సైట్ నిల్వల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో ఉంది. ఇంత ఖనిజ సంపదను రాష్ట్ర అభివృద్ధికి వినియోగించాలి. అయితే, గతంలో స్వప్రయోజనాల కోసం అధికారంలో ఉన్నవారు తీసుకున్న నిర్ణయాల వల్ల, బాక్సైట్ తవ్వకాల వ్యవహారం వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో వాస్తవాలను ప్రజల ముందుంచి, చర్చ తర్వాతే అందరి ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పించారు. ఈ మేరకు విశాఖ చింతపల్లి బాక్సైట్ పై శ్వేతపత్రం విడుదల చేశారు.

చేసుకోవాలనే అభిప్రాయాన్ని గౌరవ ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు.

రెండు బిలియన్ల అమెరికా డాలర్ల పెట్టుబడితో అల్యూమినా/అల్యూమినియం పరిశ్రమ ఏర్పాటుకు యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్‌కు చెందిన రస్-అల్-ఖైమా ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంఓయు చేసుకుంది. ఈ ఎంఓయు ప్రకారం విశాఖపట్నం జిల్లాలోని జెర్రెల గ్రూప్ నిక్షేపాలలో 224 మిలియన్ మెట్రిక్ టన్నులు, సరఫరా నిమిత్తం ఏపిఎండిసికి కావాల్సి వుంది.

ఒప్పందంలోని ముఖ్యాంశాలు

- ఏపీఎండీసీ / అల్యుమినియం కంపెనీ స్థానిక గిరిజనులకు శిక్షణ ఇచ్చి మైనింగ్ పనులలో, పరిశ్రమలలో వారిని సాధ్యమైనంత వరకు ఉపయోగించుకోవాలి. ప్రాజెక్ట్ ద్వారా వచ్చిన మొత్తంలో 0.5 శాతం రాబడిని గిరిజనుల ఆరోగ్యం, రవాణ, సామాజిక మౌలిక సదుపాయాలకు అల్యుమినియం కంపెనీ వ్యయం చేయాల్సి వుంది.
- బాక్సైట్ తవ్వకాలలో వచ్చే లాభంలో 20 శాతాన్ని గిరిజనుల సంక్షేమానికి ఏపీఎండీసీ కేటాయించాల్సి వుంది.

ఈ విధంగా ఎంవోయు కుదిరిన దరిమిలా రస్-అల్-ఖైమా ప్రభుత్వం పెన్నా గ్రూప్ తో కలిసి అన్‌రాక్ అల్యూమినియం లిమిటేడ్ పేరుతో ఒక భారతీయ కంపెనీని ఏర్పాటు చేసింది.

మైనింగ్ లీజులు ఏపీఎండీసికి మంజూరు

విశాఖపట్నం జిల్లాలో బాక్సైట్ తవ్వకాలకోసం మైన్ లీజుకు ఏపీఎండీసి దరఖాస్తుతో కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపింది. కేంద్ర ప్రభుత్వం ఆమోదాన్ని తెలిపింది.

మైన్ లీజుకు గ్రాంట్

చింతపల్లి రిజర్వ్ ఫారెస్ట్, విశాఖపట్నం జిల్లాలో నాలుగు మైనింగ్ లీజులకు 28.12.2007న ఎంఒఇఎఫ్ నుండి పర్యావరణ అనుమతులు, అటవీ క్లియరెన్సలకు లోబడి 30 సంవత్సరాలకు ఏపీఎండీసీ కి అనుమతులు వచ్చాయి.

వాగులు, వంకలు, జలప్రవాహాలు, డ్రైనేజి, భూగర్భ జలాలపై మైనింగ్ ప్రభావాన్ని అధ్యయనం చేసి జల వనరుల పరిరక్షణకు తీసుకోవలసిన ఉపశమన చర్యలపై ఆంధ్ర విశ్వవిద్యాలయం హైడ్రో జియోలాజికల్ స్టడీస్ నిర్వహించింది.

గ్రామ పంచాయతీ తీర్మానం

జెర్రెల బ్లాకులలో బాక్సైట్ మైనింగ్ ప్రాజెక్ట్‌ను చేపట్టేందుకు ఏపీఎండీసికి అనుకూలంగా 02.10.2008న జెర్రెల గ్రామ పంచాయతీ తీర్మానాన్ని ఆమోదించింది.

పబ్లిక్ హియరింగ్

I, II, III & VI బ్లాక్‌లలో పర్యావరణ అనుమతుల కోసం కేంద్రప్రభుత్వ పర్యావరణ, అటవీ శాఖ మంత్రిత్వ శాఖ, 03.10.2008న బహిరంగ విచారణ జరిపింది. జెర్రెలలో మైనింగ్ కార్యకలాపాలకు కేంద్రప్రభుత్వం పర్యావరణ అనుమతులు ఇచ్చింది.

స్టేజ్ -ఎ ఫారెస్ట్ క్లియరెన్స్

మైనింగ్ ప్రయోజనాల చింతపల్లెలో 1212 హెక్టార్ల రిజర్వ్ అటవీ భూమిని ఇవ్వాలని కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అటవీశాఖ 8.10.2007న ప్రతిపాదనలు చేసింది. దీని ప్రకారం, బాక్సైట్ మైనింగ్ లీజు కోసం చింతపల్లి ప్రాంతంలోని అడవిని 1212 హెక్టార్ల బదలాయింపును స్టేజ్-ఎ క్లియరెన్స్ కింద ఎంఒఇఎఫ్, కేంద్రప్రభుత్వ అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ క్లియరెన్స్‌లను ఏపీఎండీసికి జారీ చేసింది.

కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి లేవనెత్తిన అభ్యంతరాలు

విశాఖపట్నం జిల్లాలోని బాక్సైట్ మైనింగ్ కు ఎటువంటి అనుమతులు ఇవ్వకుండా సూచనలు జారీ చేయాలంటూ అప్పటి కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శ్రీ కిషోర్ చంద్రదేవ్, అప్పటి గౌరవ ప్రధానమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ అనుబంధ సంస్థ, కాబట్టి ఏపీఎండీసీ దాని ఆర్థిక కార్యకలపాల నిర్వహణ కోసం, ఒక ప్రవేట్ కంపెనీతో బాక్సైట్ సరఫరా కోసం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ చర్య ఏ నిబంధనల ఉల్లంఘన కింద రాదని న్యాయవ్యవహారాల శాఖ అభిప్రాయపడింది.

జేసి కలా కమిటీ ఏర్పాటు

రిటైర్డ్ ఐఎఫ్ఎస్ ఆఫీసర్, మాజీ ఎంవోఈఎఫ్ డీజీ శ్రీ జే. సీ కలా ఆధ్వర్యంలో ఎంవోఈఎఫ్ 4 గురు సభ్యులతో అత్యున్నత కమిటీని 03.10.2011 న ఏర్పాటు చేసింది. ఈ కమిటి ప్రతిపాదిత జెర్రెల మైనింగ్ ప్రాంతంలో మానవ, జంతు ఆవాసాలు ఏమీ లేవని తెలిపింది. మొదటి దశలో అక్కడి పరిస్థితులను పరిశీలించిన కమిటీ ఈ ప్రాంతంలో మైనింగ్ జరపడం వల్ల పర్యావరణంపై ఎటువంటి ప్రభావం ఉండదని ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థకు సూచించింది.

సాంఘిక నిర్వహణ, పునరావాస కమిటీ

విశాఖ జిల్లాలో జెర్రెల బాక్సైట్ ప్రాంతంలో సాంఘిక నిర్వహణ, పునరావాసం కోసం ఏపీఐటీసీఓ రూపొందించిన ప్రణాళిక అమలుకు విశాఖ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అధికార, అనధికార సభ్యులతో కూడిన సాంఘిక నిర్వహణ మరియు పునరావాస కమిటీని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది

విశాఖ జిల్లాలోని మాకవారిపాలెంలో 150 మెగావాట్ల పవర్ ప్లాంట్ (దీనిని 225 మెగావాట్లకు పెంచుకునేందుకు ముందస్తు అనుమతులు)తో పాటు అల్యూమినియం రిఫైనరీ ప్లాంట్ నిర్మాణం కూడా అన్ రాక్ పూర్తి చేసింది. అల్యూమినియం రిఫైనరీ కోసం దాదాపు రూ. 5,300 కోట్లు, పవర్ ప్లాంట్ కోసం రూ. 1000 కోట్లు వరకు కంపెనీ వెచ్చించింది.

మానిటరింగ్

ప్రతి రెండు నెలలకొసారి ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీతో పాటు కేబినెట్ సెక్రటేరియట్ ప్రాజెక్టు నిర్వహణ కమిటీ కూడా బాక్సైట్ ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడూ సమీక్షిస్తుంది. ఆ కమిటీ సమావేశాలు జనవరి 2015 నుంచి జరిగాయి. తూర్పు, మధ్య దేశాలనుంచి రూ.1000 కోట్లు మించిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించిన అన్ని పెండింగ్ ప్రాజెక్టులను గౌరవ ప్రధానమంత్రి ముఖ్యకార్యదర్శి సమీక్షిస్తారు. ఇందులో కూడా ఆయన సూచనల మేరకే ప్రాధాన్య క్రమంలో అన్-రాక్ అల్యూమినియం ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అనుమతులను ఇచ్చారు.

జెర్రెల మైనింగ్ ప్రాంతంలో వన్యప్రాణి రక్షణ మరియు నిర్వహణ ప్రణాళికను అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్, సిద్ధం చేసింది.

విశాఖ జిల్లాలోని నర్సీపట్నం డివిజన్ లోని చింతపల్లి, జెర్రెల ప్రాంతంలోని అటవీ భూమిని ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థకు అనుకూలంగా బాక్సైట్ లీజు కోసం రెండవ దశ అటవీ అనుమతుల్లో భాగంగా 1212 హెక్టార్లు బదలాయింపు కోసం కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ 17.08.2015 న మంజూరు చేసింది.

ఇందులో భాగంగానే ఇప్పటికే రెండవ దశ అటవీ అనుమతులు పొందిన, విశాఖ జిల్లాలోని భూమి, షరతులకు లోబడి నర్సీపట్నం డివిజన్ చింతపల్లి మరియు జెర్రెల ప్రాంతంలోని 1212 హెక్టార్ల అటవీ భూమిని ఏపీఎండీసీకి బాక్సైట్ మైనింగ్ లీజు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా బదిలీ చేశారు.

ఏపీకి మరిన్ని వ్యవసాయ పరిశోధన సంస్థలు

వరాలిచ్చిన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి
ఆయిల్ పామ్ రైతులను ఆదుకోవాలన్న ముఖ్యమంత్రి
నేషనల్ మిషన్‌గా 'మైక్రో ఇరిగేషన్'ను పరిశీలిస్తాం: రాధామోహన్‌సింగ్



ఆచార్య ఎన్ జి రంగా విశ్వవిద్యాలయం శంకుస్థాపన సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి రాధామోహన్ సింగ్

ఏపీ వ్యవసాయరంగ ముఖచిత్రాన్ని మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అన్నివిధాలుగా సహకరిస్తామని కేంద్ర మంత్రి రాధామోహన్‌సింగ్ హామీ ఇచ్చారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలలో కీలకమైన పలు పరిశోధనాసంస్థలను రాష్ట్రానికి మంజూరుచేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. గుంటూరు జిల్లాలో వ్యవసాయ విశ్వవిద్యాలయం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని నేరుగా విజయవాడకు చేరుకున్న కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో ఆయన కార్యాలయంలో గంటకు పైగా చర్చలు జరిపారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించిన అనేక అంశాలపై మాట్లాడారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి, కరువురహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని కేంద్ర మంత్రి ప్రశంసించారు. వ్యవసాయ యాంత్రీకరణపై రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న శ్రద్ధా సక్తులు స్ఫూర్తిదాయకంగా వున్నాయన్నారు. 'మైక్రో ఇరిగేషన్‌పై మీ కలను మేము నెరవేరుస్తాం, నాకు దానిపై చాలా ఆసక్తి వుంది' అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. ఆధునిక వ్యవసాయంలో మధ్యప్రదేశ్ రాష్ట్రం ముందుందని, రానున్న సంవత్సరాలలో ఆ రాష్ట్రాన్ని అధిగమించాలన్నదే తన ధ్యేయమని ముఖ్యమంత్రి చెప్పగా, అందుకు అన్నివిధాలుగా సహకరిస్తామని కేంద్ర మంత్రి భరోసా ఇచ్చారు. సాయిల్ హెల్త్ కార్డులను సక్రమంగా వినియోగించుకోవడంలో ఏపీ నెంబర్ వన్ రాష్ట్రంగా నిలించిందని చెప్పారు. సముద్ర ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోందని అన్నారు. దేశం నుంచి జరుపుతున్న రొయ్యల ఎగుమతుల్లో 46 శాతంతో ఏపీ నెంబర్ వన్‌గా నిలిచిందని అభినందించారు.

రోహు (కలకత్తా గండె), కట్లా (బొచ్చ), పంగస్ రకాలకు సంబంధించిన చేపల సంతతి వృద్ధికోసం నేషనల్ బ్రీడ్ బ్యాంక్‌ను వెంటనే మంజూరుచేస్తున్నట్టు కేంద్ర మంత్రి ప్రకటించారు. ఏపీలో వున్న 50 సీడ్ ఫామ్స్‌లో ఎక్కడో ఒకచోట ఈ బ్యాంక్‌ను ఏర్పాటుచేస్తామని అధికారులు ఆయనకు వివరించారు. దీనికి సంబంధించిన ప్రక్రియను పూర్తిచేసేందుకు ఒక సైంటిఫిక్ బృందం రాష్ట్రానికి పంపుతామని కేంద్ర మంత్రి చెప్పారు. అలాగే, ఎల్-వన్నమాయ్ అనే రొయ్య వెరైటీకి సంబంధించిన బ్రీడర్ మల్టిఫికేషన్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు మంజూరుచేస్తున్నట్టు కేంద్ర మంత్రి తెలిపారు. ఈ సెంటర్ వల్ల రొయ్య సీడ్ అధికంగా వస్తుందని, రొయ్యలను సాగుచేసే రైతు మరింత లాభాలను ఆర్జించడంలో ఈ సెంటర్ ప్రోత్సాహకంగా వుంటుందని చెప్పారు.

కాకినాడ బలభద్రపురంలో 'సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్' రీజనల్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తామని కూడా మంత్రి రాధామోహన్‌సింగ్ ప్రకటించారు. ప్రస్తుతం ఇక్కడ ఒక యూనిట్‌గా వున్న సంస్థను రీజనల్ సెంటర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేస్తామని తెలిపారు.

ఇవేగాక, సెంటర్ ఫర్ బ్రాకిష్ వాటర్ ఆక్వాకల్చర్ రీజనల్ సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటుచేయడానికి కేంద్ర మంత్రి అంగీకారాన్ని తెలియజేశారు. ప్రస్తుతం ఇలాంటి సెంటర్ చెన్నయ్ కేంద్రంగా పనిచేస్తూ వుంది. ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘ కోస్తాతీరం వుండటం వల్ల ఈ రాష్ట్రంలో రీజనల్ సెంటర్‌ను ఏర్పాటుచేయడం ఉపయుక్తంగా వుంటుందన్న రాష్ట్ర ప్రభుత్వం చేసిన విన్నపం మేరకు దీన్ని మంజూరుచేస్తున్నట్టు తెలిపారు. నెల్లూరు నుంచి విశాఖ వరకు వున్న కోస్తాతీరంలో ఈ సెంటర్ ఏర్పాటుకు అవసరమయ్యే భూములను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి కేంద్రానికి ఇవ్వాల్సివుంటుంది.

సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వాకల్చర్ (సీఐఎఫ్ఎ) ఏర్పాటుకు కూడా కేంద్ర మంత్రి అంగీకారాన్ని తెలిపారు. ప్రస్తుతం భువనేశ్వర్‌లో సిఫా పనిచేస్తోంది. విజయవాడలోని పెనమలూరులో సిఫా రీజనల్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తామని కేంద్ర మంత్రి చెప్పారు.

వ్యవసాయరంగానికి సంబంధించి కూడా కేంద్ర మంత్రి రాధామోహన్‌సింగ్ రాష్ట్రానికి వరాలు కురిపించారు. సెంట్రల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సబ్ సెంటర్‌ను శ్రీకాకుళం జిల్లాకు కేటాయిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం భువనేశ్వర్ ప్రధాన కేంద్రంగా ఈ ఇనిస్టిట్యూట్ పనిచేస్తోంది. 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్'ను పశ్చిమగోదావరి జిల్లాలో ఏర్పాటుచేయాలన్న రాష్ట్రప్రభుత్వం వినతిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి చెప్పారు.

పరంపరాగత్ కృషి వికాస్ యోజన పథకాన్ని అమలుచేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కొంత వెసులుబాటు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి సూచనపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ పథకం కింద మూడేళ్లకు ఎకరాకు రూ. 30 వేలు చొప్పున కేంద్రం అందిస్తోంది. ఈ పథకం కింద ఎక్కువమంది రైతులు ప్రయోజనం పొందేలా వెసులుబాలు కల్పించాలని రాష్ట్రం కొంతకాలంగా కేంద్రాన్ని కోరుతోంది.

మైక్రో ఇరిగేషన్‌ను నేషనల్ మిషన్‌గా తీసుకుని అమలుచేయాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయ మంత్రిని కోరారు. కరవు ప్రభావిత ప్రాంతాలలో రెయిన్ గన్ కార్యక్రమాన్ని రాష్ట్రంలో విజయవంతంగా అమలుచేస్తున్న వైనాన్ని వివరించారు. దీన్ని జాతీయస్థాయిలో ఒక పాలసీగా అమలుచేసే అంశంపై ప్రధానమంత్రితో మాట్లాడుతానని కేంద్ర వ్యవసాయ మంత్రి చెప్పారు.

రాష్ట్రంలో కరువు పరిస్థితులు వున్నాయని చెబుతూ, వీటిని అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వివిధ ప్రయత్నాలను సీయం కేంద్ర మంత్రికి వివరించారు. నదుల అనుసంధానం, సూక్ష్మ సేద్యం, నీరు-చెట్టు, భూగర్భ జలాల సద్వినియోగం, ఉద్యానపంటల అభివృద్ధి తదితర కార్యక్రమాల గురించి చెప్పారు. మొబైల్ స్ప్రింక్లర్ల ద్వారా సత్ఫలితాలను సాధిస్తున్న వైనాన్ని వివరించారు. ఆహార భద్రత తరహాలో మూగజీవాలకు దాణా భద్రత కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు.

సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్స్ కింద కేంద్రం రెండో విడత కేటాయింపులు త్వరలో చేస్తామని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. సంక్షోభంలో వున్న ఆయిల్ పామ్ రైతులను కేంద్రం తప్పకుండా ఆదుకుంటుందని వ్యవసాయ మంత్రి చెప్పారు. దీనిపై మరో వారం, పది రోజుల్లో అవసరమైన ప్రక్రియ పూర్తిచేసి తుది ప్రకటన చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్రమంత్రికి వివరించిన ముఖ్యమంత్రి, వెంటనే ఈ సంక్షోభాన్ని నివారించేందుకు కేంద్రం ఆలస్యం లేకుండా ఒక స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. ఆయిల్ పామ్ ఉత్పత్తులకు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా కేంద్రం ధర ప్రకటిస్తే, రాష్ట్ర ప్రభుత్వం తరుపున 50 శాతం అందించేందుకు సిద్ధంగా వున్నామని ముఖ్యమంత్రి ప్రకటించారు. దీనిపై సంబంధిత కమిటీ సమావేశమై త్వరలో నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర వ్యవసాయ మంత్రి చెప్పారు. విచ్చలవిడిగా జరుగుతున్న పామాయిల్ దిగుమతులపై నియంత్రణ సాధించడానికి దిగుమతి సుంకం పెంచడమే మార్గమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు.

రాష్ట్రానికి సంబంధించిన వ్యవసాయం, ఉద్యాన వన పంటలు, పశు సంవర్ధకం, మత్స్య పరిశ్రమకు సంబంధించిన అంశాలు, ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చించారు.

ఈ సమావేశంలో మరో కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయకుమార్, పశు సంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మన్మోహన్ సింగ్, హార్టీకల్చర్ కమిషనర్ చిరంజీవి, సీఎంవో కార్యదర్శులు సాయిప్రసాద్, రాజమౌళి పాల్గొన్నారు.

❖

అన్నదాతకు అండగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

ఆరుగాలం శ్రమిస్తూ వ్యవసాయంలో ఎన్నో అటుపోట్లు ఎదుర్కొంటున్న అన్నదాతకు అందుబాటులోకి వస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా రైతులకు అనేక పరిశోధన ఫలాలు అందించడానికి సిద్ధమైంది రాష్ట్ర ప్రభుత్వం. విత్తనాభివృద్ధి, కొత్త వంగడాలు పరిశీలన, సమగ్ర సస్యరక్షణ విధానాలు, సరికొత్త పరిశోధనలు రైతులకు చేరువలో ఉండాలనే నినాదాన్ని ఘనంగా చాటిన ఎన్.జి రంగా విశ్వవిద్యాలయం, గుంటూరు జిల్లా లాం వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఏర్పాటు చేయడం శుభసూచికం. ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు ఆంధ్రప్రదేశ్ రైతులకు ఎంతో ఉపయోగపడనున్నది. జాతీయ స్థాయిలో ఉత్తమ వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండు పురస్కారాలను సాధించిన ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం జిల్లాలో పూర్తి స్థాయిలో రూపుదిద్దుకోనున్నది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా ఉన్న పేరు 1996 నవంబర్ 7న ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంగా మార్చారు. ఆయన జయంతి సందర్భంగా ఆయన పుట్టిన గుంటూరు జిల్లాలో విశ్వవిద్యాలయం భవనాలకు శంకుస్థాపన జరగటం విశేషం. ఈ పరిశోధన స్థానానికి దేశ విదేశాల్లో మంచి గుర్తింపు ఉంది. జాతీయ స్థాయిలో దేశ వ్యాప్తంగా 150 కి పైగా వ్యవసాయ పరిశోధక మండళ్ళ ఉన్నాయి. వాటిలో లాం వ్యవసాయ పరిశోధనా స్థానానిదే అగ్ర స్థానం. పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి అక్కడ 100 ఎకరాలను వివిధ రకాల పంటలను సాగు చేస్తుంటారు. 500 ఎకరాల విశాలమైన ఈ పరిశోధనా స్థానంలో పనిచేయడానికి దేశంలోనే అనేక మంది శాస్త్రవేత్తలు ఆసక్తి చూపుతుంటారు.

గుంటూరు జిల్లా లాం గ్రామంలో ఎన్.జి రంగా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు భూమి పూజ నిర్వహించి శిలాఫలకాన్ని కేంద్ర వ్యవసాయ మంత్రి రాధా మోహన్ సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్ర స్థానంలో ఉందని, తీర ప్రాంతాన్ని ఉపయోగించుకొని ప్రపంచంలోనే మొదటి స్థానానికి చేరుకోనేలా ప్రణాళికలు అమలు చేస్తామని, రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి విజయవాడలో ప్రాంతీయ కార్యాలయం తల్లి, పిల్ల రొయ్యల ఉత్పత్తి కేంద్రం మంజూరు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రి ప్రకటించారు. అట్లాగే వ్యవసాయ ఉత్పత్తులు మార్కెటింగ్ కోసం దేశంలో మొత్తానికి ఒకే విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని వ్యవసాయ ఉత్పత్తులు మార్కెటింగ్ యార్డులను అనుసంధానించి . ఎక్కడ ఎక్కువ ధరలు ఉంటే ఆ ధర దేశ వ్యాప్తంగా రైతులకు అందేలా చూస్తామని, రైతులందరికి వారి భూమి ఆరోగ్యానికి సంబంధించిన హెల్త్



గుంటూరు జిల్లా లాం వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్మాణానికి శంకుస్థాపన సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

వ్యవసాయ విశ్వవిద్యాలయం శంకుస్థాపన సందర్భంగా కేంద్ర వ్యవసాయ మంత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సమస్యలు విన్నవించి నిధులు మంజూరు చేయాలని కోరగా కేంద్ర మంత్రి పలు హామీలు ఇచ్చారు.

కార్డు జేబులో ఉండేలా రాబోయే రెండేళ్లలో చర్యలు చేపడతామన్నారు వ్యవసాయ మంత్రి రాధామోహన్ సింగ్.

ఈ సందర్భంగానే ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ఐదేళ్లలో రూ. 1,505 కోట్లు వెచ్చించి అంతర్జాతీయ ప్రమాణాలు కల్పించి అగ్రశ్రేణి విశ్వవిద్యాలయంగా తీర్చిదిద్దుతామన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అను నిత్యం... పరిశోధన, విస్తరణ, క్షేత్రస్థాయి అనుసంధానం, ప్రపంచంలో పేరు పొందిన విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకొని ఒక అగ్రగామి యూనివర్సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. కృష్ణా డెల్టాలో సాగునీరు అందక పంటలు సాగు చేయని రైతులకు రబీలో అవసరమైన విత్తనాలను, 80 % రాయితీపై అందిస్తామన్నారు. మినుము, పెసర, మద్దతు ధరకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం క్వింటా రూ. 1000 చొప్పున అందించి రైతులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం శంకుస్థాపన సందర్భంగా కేంద్ర వ్యవసాయ మంత్రికి ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సమస్యలు విన్నవించి నిధులు మంజూరు చేయాలని కోరగా కేంద్ర మంత్రి ఇచ్చిన హామీలు:

- ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర వ్యవసాయ విద్యాలయంగా గుర్తించి నిధులు ఇవ్వాలి. మౌలిక వసతులు కల్పించి పరిశోధన సంస్థలు, పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు, ప్రయోగశాలలు, కేంద్ర గ్రంథాలయం, ఆహార శుద్ధి, విత్తనాభివృద్ధి సంస్థ, ప్రీమియర్ అగ్రికల్చర్ సంస్థలు, చిరుధాన్యాల పరిశోధన సంస్థల ఏర్పాటుకు ఐదేళ్లలో రూ. 1,505 కోట్లు విడుదల చేయాలి.
- ఆధునిక వ్యవసాయంలో ముందున్న మధ్య ప్రదేశ్‌ను అధిగమించడమే తమ లక్ష్యమని చంద్రబాబు చెప్పగా అందుకు సహకరిస్తామని కేంద్ర మంత్రి భరోసా ఇచ్చారు..
- రోహు, కట్లా, ఫంగస్ రకాల చేపల సంతతి వృద్ధికి నేషనల్ బ్రీడ్ బ్యాంక్ తక్షణం ఏపీకి మంజూరు. కాకినాడలోని బలభద్రపురంలో జాతీయ మత్స్య విద్యాకేంద్రం (సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరిస్ ఎడ్యుకేషన్) ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు.
- విజయవాడ , పెనమలూరు కేంద్ర మంచి నీటి చేపల సంస్థ (సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వకల్చర్–సిఫా ఏర్పాటుకు అంగీకారం. శ్రీకాకుళం జిల్లా కేంద్ర వరి అధ్యయన సంస్థ (సెంట్రల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్) ఉపకేంద్రం కేటాయింపు.
- పశ్చిమ గోదావరి జిల్లాలో భారత వరి అధ్యయన సంస్థ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్) ఏర్పాటుకు పరిశీలన.
- కరవు ప్రభావిత ప్రాంతాల్లో రెయిన్‌గన్ వినియోగంపై జాతీయ స్థాయి విధానంగా చేపట్టే అంశంపై ప్రధానితో మాట్లాడతానని హామీ. కేంద్ర ప్రాయోజిత పథకాలకు త్వరలో రెండో విడత నిధుల కేటాయింపునకు హామీ.

మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా అయిల్ పామ్ ఉత్పత్తులకు కేంద్రం ధర ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం తరుపున 50 % మొత్తం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పగా అందుకు రాధా మోహన్ సింగ్ దీనిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

❖

కృష్ణపట్నంలో రీ గ్యాసిఫికేషన్ టెర్మినల్

- ఐసోమెరిక్, ఎల్ఈపీఎల్, పెట్రోనాస్ సంయుక్త నిర్మాణం
- రూ.3 వేల కోట్ల వ్యయంతో బీవోవో పద్దతిలో 24 నెలల్లో పూర్తి



రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్ని మార్చివేసే ప్రయత్నానికి మరో అడుగుపడింది. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ప్రతిపాదిత రీగ్యాసిఫికేషన్ టెర్మినల్, స్టోరేజీ టెర్మినల్ నిర్మాణానికి మలేషియా ముందుకువచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మలేషియన్ ప్రభుత్వ ప్రత్యేక దూత ఎస్ సామివేలు మధ్య ఇటీవల దీనికి సంబంధించిన ప్రతిపాదనలపై ప్రాథమిక చర్చలు జరిగాయి. విజయవాడ విమానాశ్రయంలో జరిగిన ఈ చర్చల్లో మలేసియన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో వరద ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి మలేషియన్ ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు.

ఏడాదికి 5 మిలియన్ టన్నుల సామర్థ్యం గల గ్యాస్ టెర్మినల్ నిర్మాణానికి ఐసోమెరిక్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 74%, ఎల్ఈపిఎల్ (ఎయిర్ కోస్ట్) కంపెనీకి 26% ఈక్విటీతో సంయుక్తంగా ప్లాంటును నిర్మిస్తారు. మరో మలేషియన్ కంపెనీ పెట్రోనాస్ వీటితో జత కలుస్తుంది. గ్యాస్ సరఫరాలో లీడర్‌గా వున్న పెట్రోనాస్ ఫార్చ్యూన్-500 కంపెనీ. ప్రపంచంలోని 35 చోట్ల కార్యాలయాలను నెలకొల్పింది. రూ 3 వేల కోట్ల పెట్టుబడితో 24 నెలల కాలవ్యవధిలో బిఓఓ (బిల్డ్, ఓన్, ఆపరేట్) పద్ధతిలో టెర్మినల్ నిర్మిస్తారు. దీని వల్ల 3 వేల మందికి ఉపాధి దొరుకుతుంది. రాయలసీమతో పాటు, పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకలకు కూడా గ్యాస్ సరఫరా చేస్తారు.

ప్రతిపాదిత కృష్ణపట్నం టెర్మినల్ ఏర్పాటుతో రాయలసీమలో పారిశ్రామిక ప్రగతి వేగం పుంజుకుంటుంది. పరిశ్రమలకు, ఫెర్టిలైజర్ సెక్టారుకు, విద్యుత్ రంగం, గృహావసరాలకు, రవాణా రంగానికి ఈ టెర్మినల్ ఎంతో ఉపయుక్తంగా వుంటుంది. ఈ ప్రాజెక్టు నిర్ణీత వ్యవధిలో పూర్తయితే రాయలసీమలో పరిశ్రమలకు అవసరమయ్యే గ్యాస్ తేలిగ్గా లభ్యం అవుతుంది. ఇప్పటికే నిర్మించిన పైప్ లైన్ల ద్వారా గృహావసరాలకు గ్యాస్ సరఫరా జరుగుతుంది.

మలేషియా బృందంలో ఈ. శివబాలన్, పెట్రోనాస్ అధిపతి యొహానిస్ ఇస్మాయిల్, మలేషియా ప్రభుత్వ ఇంధన శాఖ కార్యదర్శి సోమసుందరం, ఐసోమెరిక్ కంపెనీ ప్రతినిధి సదాచర్మని పాల్గొన్నారు. రాష్ట్ర ఇంధన శాఖ కార్యదర్శి అజయ్ జైన్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.ఎస్ రావత్, ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ డా. పి.వి. రమేశ్, సీఎంఓ సంయుక్త కార్యదర్శి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

మలేషియాకు మళ్లీ వస్తా: ప్రత్యేక దూతతో చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ నవ నిర్మాణంలో భాగస్వాములవుతామని మలేసియా దేశ ప్రత్యేక దూత డాక్టర్ ఎస్. సామివేలు చెప్పారు. కృష్ణపట్నంలో ప్రతిపాదిత గ్యాస్ టెర్మినల్ ఏర్పాటుపై చర్చించేందుకు వచ్చిన మలేషియన్ బృందానికి సామివేలు నాయకత్వం వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును గన్నవరం విమానాశ్రయంలో కలిసిన సామివేలు ఆయనతో అరగంటకు పైగా భేటీ అయ్యారు. తమ మధ్య వున్న పాత స్నేహ సంబంధాలను ఇరువురూ నెమర-వేసుకున్నారు. సామివేలు తనకు మంచి మిత్రుడని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు. గతంలో తను ముఖ్యమంత్రిగా వున్నప్పుడు మలేసియా పర్యటనకు వెళ్లి అక్కడ ప్రభుత్వం చేస్తున్న కృషిని చూసి స్ఫూర్తి పొందానని చెప్పారు. అక్కడ సముద్ర తీరం వెంబడి నిర్మించిన రహదారిని చూసి ఇక్కడ కూడా అలాంటి మౌలిక వసతులు కల్పించాలని అప్పుడు మన ప్రధానిగా వున్న వాజ్‌పేయిపై వత్తిడి చేశానని గుర్తుచేశారు. ఇచ్ఛాపురం నుంచి తడ వరకు తమ రాష్ట్రంలో తీరం వెంబడి రోడ్డును నిర్మించాలన్న ఆలోచనకు ఆనాడే బీజం పడిందన్నారు. మలేసియా మోడల్‌గా హైదరాబాద్ కూకట్‌పల్లిలో టౌన్‌షిప్ కూడా నిర్మించామన్నారు. మలేసియాకు, ఏపీకి దగ్గర పోలికలు వున్నాయని, పాత సంబంధాలను కొనసాగిస్తూ పరస్పర సహకారంతో ముందుకు సాగుతామని చెప్పారు. త్వరలో ఆ దేశ పర్యటనకు వెళ్తామన్నారు.

ఏపీకి సహజ వనరులు దేవుడిచ్చిన వరమైతే, వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకునే నాయకత్వం అందిస్తున్నారని మలేసియా ప్రత్యేక దూత సామివేలు ముఖ్యమంత్రిని అభినందించారు. గతంలో ముఖ్యమంత్రిగా వున్నప్పుడు హైదరాబాద్ ట్రాఫిక్‌కు అవరోధం లేకుండా చకచకా 4 ఫ్లయ్ ఓవర్లను నిర్మించారని, రోడ్లను వెడల్పు చేసి విశాలమైన రహదారి వ్యవస్థను ఏర్పాటుచేశారని అన్నారు. తన డైనమిజం, విజన్‌లతో ఈసారి కూడా చంద్రబాబు తప్పకుండా ఈ రాష్ట్రాన్ని అగ్రగామిగా మార్చుతారన్న విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. సముద్ర తీరం వున్న ప్రాంతాలలోనే అభివృద్ధి సాధ్యమయ్యిందని అంటూ, ఆంధ్రప్రదేశ్‌కు సుదీర్ఘ కోస్తా తీరమే వరంగా మారనున్నదని చెప్పారు.

❖



కర్నూలుకు పూర్వ వైభవం

* అభివృద్ధిని అడ్డుకుంటే ఊరుకోను.
* ఉనికి కోసమే 'ఉద్యమం'
* 'ముచ్చుమర్రి' మార్చిలోపు పూర్తి చేస్తాం
* జూన్ నాటికి గోరుకల్లులో 12.5 టీఎంసీల నిల్వ
* వేదవతి, గుండ్రేవుల నిర్మాణానికి చర్యలు
* కర్నూలులో ముస్లింల కోసం స్టడీ సర్కిల్
* ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా
* ఓర్వకల్లు వద్ద ఉర్దూ యూనివర్సిటీకి శంకుస్థాపన
* గోరుకల్లు రిజర్వాయర్ పెండింగ్ పనుల పరిశీలన
* జూన్ నాటికి హంద్రీనీవా కింద 80 వేల ఎకరాలకు నీరు

మూడు మహానగరాల మధ్యనున్న కర్నూలుకు పూర్వ వైభవం తెస్తానని సీఎం నారా చంద్రబాబునాయుడు అన్నారు. హైదరాబాద్, బెంగళూరు, అమరావతికి మధ్యలో కర్నూలు ఉందన్నారు. నాలుగు గంటల్లో అమరావతికి చేరుకునేలా రహదారులు అభివృద్ధి చేస్తామన్నారు. తన కర్నూలు పర్యటనలో ఓర్వకల్లు వద్ద ఉర్దు యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారు. అనంతరం గోరుకల్లు రిజర్వాయర్ పనులను పరిశీలించారు. రెండు చోట్లా బహిరంగ సభల్లో ప్రసంగించారు. అమరావతి నగర నిర్మాణం చాటున కర్నూలు జిల్లా అభివృద్ధిని నిరక్ష్యం చేయబోనన్నారు. జిల్లాకు తానిచ్చిన వరాలను సమీక్షించారు. ట్రిపుల్ ఐటీ, పరిశ్రమల హబ్, మిడ్ లైఫ్ కోచ్ ఫ్యాక్టరీ, టెక్స్‌టైల్ పార్క్, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి, ఉర్దు యూనివర్సిటీ వంటివి ప్రధానంగా అమలు చేశామన్నారు. ఇంకా నంద్యాలలో సీడ్ క్యాపిటల్, డోన్‌లో మైనింగ్ కళాశాల, టూరిజం సర్క్యూట్, ఆలూరులో జింకల పార్కు, కర్నూలు పెద్దాస్పత్రిని సూపర్ స్పెషాలిటీ స్థాయికి మార్పు, స్మార్ట్ సిటీగా కర్నూలు వంటివి వీలైనంత త్వరగా అమలు చేస్తామన్నారు. పారిశ్రామికవాడ ఓర్వకల్లును కర్నూలులో కలుపుతూ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తామన్నారు. హంద్రీ నీవా ద్వారా వచ్చే జూన్ నాటికి జిల్లాలోని 80 వేల క్యూసెక్కుల నీరు తీసుకెళ్లేందుకు పనులు, చిలకలడోన, పులకుర్తి ఎత్తిపోతల పూర్తి, సిద్దాపురం ఎత్తిపోతల వంటివి పూర్తి చేస్తామన్నారు.

"రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్రకు కర్నూలు రాజధాని చేయాలన్న డిమాండ్ వినిపించింది. నేనూ రాయలసీమ వాడినే. సీమకు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగదు. కర్నూలుకు పూర్వవైభవం తీసుకుని వస్తాం. ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతా. ఉర్దూ యూనివర్సిటీకి రూ. 20 కోట్లు మంజూరు చేస్తున్నా. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాం. ఓర్వకల్లు కర్నూలులో కలిసేలా స్మార్ట్ సిటీ రూపొందిస్తాం" అని అన్నారు.

ఉర్దూ యూనివర్సిటీకి రూ. 20 కోట్లు

ఉర్దూ యూనివర్సిటీ కోసం 125 ఎకరాలు కేటాయిస్తున్నట్టు సీఎం తెలిపారు. వర్సిటీ కోసం రూ. 20 కోట్లు మంజూరు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల స్టడీ సర్కిళ్ల మాదిరే కర్నూలులో ముస్లింలకు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నవంబర్ నెల నుంచి ఇమామ్‌లకు రూ. 5 వేలు, మౌజుమ్‌లకు రూ. 3 వేల గౌరవ వేతనం అందిస్తామని ప్రకటించారు. వచ్చే సంవత్సరంలో ఉర్దూ డీఎస్సీని నిర్వహిస్తామన్నారు. ఓర్వకల్లులో షాదీఖానా నిర్మిస్తామన్నారు. కర్నూలులో హజ్‌హౌజ్‌ను పూర్తిచేసి జిల్లాలోని 28 వేల ఎకరాల హజ్ ఆస్తులను కాపాడతామన్నారు.

'గుండ్రేవుల నా దృష్టిలో ఉంది'

తుంగభద్రపై 20 టీఎంసీల సామర్థ్యంతో మంజూరైన గుండ్రేవుల ప్రాజెక్టు తన దృష్టిలో ఉందన్నారు. ఇది రెండు రాష్ట్రాల సమస్య కావడంతో ముంపు ప్రాంతాల విషయం ఆలోచిస్తున్నామన్నారు. మచ్చుమర్రి రాయలసీమకు వరంలాంటిదన్నారు. శ్రీశైలంలో 830 అడుగుల నీటిమట్టం సమయంలోనూ రాయల సీమకు నీటిని తోడుకునేలా

రాయలసీమ ప్రాజెక్టుల పూర్తి నా బాధ్యత.. పరిశ్రమల అడ్డగింత నా వద్ద కుదరదు, అని ముఖ్యమంత్రి తన కర్నూలు జిల్లా పర్యటనలో స్పష్టం చేశారు. "నేనూ రాయలసీమ బిడ్డనే. నా చివరి రక్తపుబొట్టు ఉన్నంతవరకూ రాయలసీమకు అన్యాయం జరక్కుండా చూస్తా. అభివృద్ధికి అడ్డుపడితే... బుల్లెట్‌లా దూసుకెళతా!" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు.

రూపొందించిన మచ్చుమర్రి పథకాన్ని వచ్చే ఏప్రిల్ నాటికి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కర్నూలు జిల్లా దుస్థితికి నాటి పాలకులే కారణమన్నారు. వారి పెత్తందారీ విధానమే తిరోగమనానికి దారి తీసిందని విమర్శించారు. జిల్లాలో ప్రాజెక్టులు పూర్తవుతుంటే పెత్తందార్లకు బాధగా ఉందన్నారు. అందుకే వారి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

ముస్లిముల ఘన సత్కారం

జిల్లాకు ఉర్దూ యూనివర్సిటీని మంజూరు చేసిన సీఎం చంద్రబాబు నాయుడిని ముస్లిం మైనారిటీ రాష్ట్ర నేతలు ఎమ్మెల్సీ ఎంఏ షరీఫ్, ఎన్ఎండీ ఫరూక్, సయ్యద్ ఉసేన్, అల్లాబాకాష్, షంషుద్దీన్ తదితరులు గజమాలతోను ముస్లిం సాంప్రదాయ దుస్తులతోనూ ఘనంగా సత్కరించారు. 150 కిలోల కేక్‌ను సీఎం చేత కట్ చేయించి అభిమానాన్ని చాటుకున్నారు.

వచ్చే జూన్ నాటికి గోరుకల్లులో 12.5 టీఎంసీల నిల్వ

గోరుకల్లు రిజర్వాయర్‌లో వచ్చే ఏడాది జూన్‌కు 12.5 టీఎంసీలు నిల్వ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లను ఆదేశించామన్నారు. పాణ్యం మండలం గోరుకల్లు గ్రామంలో మీ ఇంటికి-మీ భూమి రెండో విడత కార్యక్రమానికి ముఖమంత్రి హాజరయ్యారు. పెండింగ్‌లో ఉన్న రిజర్వాయర్ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ సభలో ప్రసంగించారు. ప్రస్తుతం గోరుకల్లుల్లో ఉన్న 0.3 టీఎంసీల నీటితోనే పరిసర పొలాలు పచ్చని పైర్లతో కళకళలాడుతున్నాయన్నారు. శ్రీశైలం ద్వారా కృష్ణా జలాలను గోరుకల్లు మీదుగా కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు చేరేలా అవసరమైన పనులకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. గోరుకల్లు భూ నిర్వాసితులకు రూ. 30 కోట్లు మంజూరు చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు.

వేదవతి, గుండ్రేవుల రిజర్వాయర్లు

వేదవతి, గుండ్రేవుల రిజర్వాయర్ల నిర్మాణానికి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతో మాట్లాడుతామన్నారు. ఆర్‌డీఎస్ రైట్ కెనాల్ విషయంపై కూడా సమీక్షించాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కేసీ కెనాల్‌కు, హంద్రీ నీవా ప్రాజెక్టులకు నీటిని లిఫ్ట్ చేయడం ద్వారా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా అధ్యయనం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

కర్నూలులో ఎడ్యుకేషనల్ హబ్..

"నేనూ రాయలసీమ బిడ్డనే. నా చివరి రక్తపుబొట్టు ఉన్నంతవరకూ రాయలసీమకు అన్యాయం జరక్కుండా చూస్తా. అభివృద్ధికి అడ్డుపడితే... బుల్లెట్‌లా దూసుకెళతా!" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. రాయలసీమను సమాంతరంగా అభివృద్ధి చేస్తానని, సీమ ప్రాజెక్టులను పూర్తి చేయడం తమ బాధ్యత అని ప్రకటించారు.

"రాయలసీమలోని ప్రతి ఎకరాకు సాగునీరిచ్చి సీమను సస్యశ్యామలం చేయడంతోపాటు హార్టికల్చర్ హబ్‌గా మారుస్తాం" అని చంద్రబాబు పేర్కొన్నారు. రాజధానిని కోల్పోయిన కర్నూలు జిల్లాకు పూర్వ వైభవం తెస్తానని హామీ ఇచ్చారు. ఓర్వకల్లు, ముద్దనూరులో జరిగిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. విపక్షాలపై విరుచుకుపడ్డారు. "మీరు అధికారంలో లేకపోతే సీమకు అన్యాయం చేసినట్టేనా? నా దగ్గర మీ పప్పులుడకవు.

సీమకు మీరేం చేశారో చెబితే... నేనేం చేశానో వివరించడానికి సిద్ధంగా ఉన్నా" అన్నారు. తాను చేస్తున్న అభివృద్ధిని అభినందించాల్సిందిపోయి ఆక్షేపిస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరిశ్రమలను అడ్డుకోవడం, బ్లాక్‌మెయిల్ చేయడం వంటివి తనవద్ద కుదరవన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటే... బుల్లెట్‌లాగా దూసుకెళ్తానన్నారు. కొందరు స్వార్థపరులు రాయలసీమ ఉద్యమం ద్వారా ఉనికిని చాటుకోడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. "ఒకాయన ఒక పార్టీలో ఉంటూ రాజీనామా చేసి సీమ ఉద్యమం చేస్తానంటున్నారు. ఉద్యమాల పేరుతో దగా చేసేందుకు అన్ని పార్టీలను మారిన నేత వస్తున్నారు. రాజకీయ నిరుద్యోగులే ఉద్యమాల పేరుతో మోసం చేయడానికి వస్తున్నారు" అని అన్నారు. గతంలో నాయకులు రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించి అవినీతి జూదమాడారని, ప్రత్యేక చట్టం ద్వారా అవినీతిసొమ్మును రికవరీ చేస్తామని సీఎం ప్రకటించారు. తొలుత ఎన్టీఆర్ హయాంలో, తర్వాత తన హయాంలోనే రాయలసీమ అభివృద్ధితోపాటు తెలుగుగంగ, హంద్రీనీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులు రూపుదిద్దుకున్నాయన్నారు. "పట్టిసీమ ద్వారా సీమకు నీరిచ్చేందుకు ప్రయత్నిస్తుంటే.... మీ జిల్లా నాయకుడు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు వెళ్లి మీ ప్రాంత నీటిని సీమకు తీసుకెళ్తున్నారని రెచ్చగొట్టే ప్రయత్నం చేశాడు. అమరావతి రాజధాని నిర్మాణాన్ని అడ్డుకునేందుకు చాలా ప్రయత్నాలు చేశాడు" అంటూ మండిపడ్డారు. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులు టీడీపీ హయాంలోనే ప్రారంభమయ్యాయని, వాటన్నింటినీ పూర్తి చేస్తామని తెలిపారు. రాయలసీమ అభివృద్ధికి కారకులుగా చెప్పుకోవాల్సిన వారిలో నాడు ఎన్టీఆర్ అని, నేడు తానేనని చంద్రబాబు తెలిపారు. గత పాలకులు ఏం చేశారో తాను చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

కర్నూలుకు వరాలు...

తొలుత కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలో ఉర్దూ యూనివర్సిటీకి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ముస్లింల సంక్షేమం కోసం పాటుపడిన అబ్దుల్‌హక్ పేరుతో ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేశామన్నారు. విద్యాపరంగా కర్నూలు జిల్లాను అభివృద్ధి చెస్తామని, 900 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అమరావతిలో, విశాఖతోపాటు రాయలసీమలోని కర్నూలులో ఎడ్యుకేషన్ హబ్ ఉంటుందని... పక్కనే విమానాశ్రయం కూడా వస్తుందని చెప్పారు. తాను సీఎం అయిన తరువాత తొలి స్వాతంత్ర్య వేడుకలను కర్నూలులో నిర్వహించినప్పుడు చేసిన వాగ్దానాల్లో ఉర్దు యూనివర్సిటీ ఏర్పాటు ముఖ్యమైందన్నారు. . కర్నూలుకు పూర్వ వైభవం తెచ్చేందుకు అవసరమైతే జిల్లాకు 20 సార్లు వస్తానని చెప్పారు.

"హైదరాబాద్, బెంగళూరు, అమరావతి నగరాల మధ్యన కర్నూలు ఉంది. ప్రపంచంలోని పెట్టుబడిదారులు కర్నూలు వైపు చూస్తున్నారు. వారి రాకతో జిల్లాకు రూ.40వేల కోట్ల పెట్టుబడులు, 30 వేలకు పైగా ఉద్యోగాలు వస్తాయి. అమరావతికి కూడా నాలుగు గంటల్లో చేరుకునేలా ఆరు, ఎనిమిది లేన్ల రహదారులను నిర్మిస్తాం" అని చంద్రబాబు ప్రకటించారు.

❖

డా॥అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీకి శంకుస్థాపన

విద్యావేత్త – సంస్కరణశీలి – డాక్టర్ అబ్దుల్ హక్



ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో ఎక్కువ శాతం ముస్లింలు హైదరాబాద్‌లోనూ, తెలంగాణాలోని కొన్ని జిల్లాల్లో వున్నారు. అలాగే కోస్తా, రాయలసీమ విషయానికి వస్తే, ముస్లిం జనాభా ఎక్కువగా కర్నూలు, కడప జిల్లా ప్రాంతంలో ఎక్కువగా వున్నారు.

ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విడిపోయాక, ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువ శాతం ముస్లిం జనాభా కర్నూలు జిల్లాలోనే వుంది. స్థానికంగా కర్నూలులో వీరి జనాభా 40శాతం దాకా వుంది. హైదరాబాద్ తర్వాత, ఉర్దూ, ప్రాథమిక బాషగా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో, కాలేజీల్లో బోధించబడుతున్నది ఎక్కువగా కర్నూలు జిల్లాలోనే!

15వ శతాబ్దంలో ఇక్కడ ముస్లింల పాలన మొదలయ్యింది. జిల్లాలో మొదటి ముస్లిం పాలకుడు అబ్దుల్ వహాబ్. అతని పాలన మొదలు ఇక్కడి ప్రజలకు ఉర్దూ బాష పరిచయం అయ్యింది. కర్నూలు చివరి నవాబు గులాం రసూల్‌ఖాన్ (1815–1840) వరకూ ఉర్దూ పాలనా బాషగా, అధికార బాషగా వుండేది. చివరి కర్నూలు నవాబు గులాం రసూల్‌ఖాన్. క్రీ.శ 1839లో కర్నూలుకు సమీపంలో జోహరాపురం వద్ద బ్రిటీష్ వారితో జరిగిన పోరాటంలో బందీ అయి, తమిళనాడులోని తిరుచునాపల్లి కారాగారానికి పంపబడి, అక్కడ కుట్ర చేత 1840 జూలై 12వ తేదీన చంపబడ్డాక, ఈ ప్రాంతం ఆంగ్లేయుల స్వాధీనంలోకి వెళ్ళింది.

వారు ఆంగ్ల విద్యను ప్రాథమిక మాధ్యమంగా విద్యాలయాలు నెలకొల్పారు. అధికార బాష కూడా ఆంగ్లమే! అయినా ఉర్దూ, తెలుగు భాషలు కూడా బోధించబడేవి.

ఇక డా॥. అబ్దుల్ హక్ గురించి చెప్పుకోవలసివస్తే, జిల్లాలో విద్యావ్యాప్తికి సంబంధించి కృషి సల్పిన వారిలో ప్రథముడు డా.అబ్దుల్‌హక్‌నే చెప్పాలి. వీరు క్రీ.శ 1901లో కర్నూలులో జన్మించారు. వీరి తండ్రిగారు ఉలేమా మౌలానా మహమ్మద్ ఉమర్. అబ్దుల్‌హక్ ప్రాథమిక విద్యాభ్యాసం స్థానిక మునిసిపల్ హైస్కూల్‌లో జరిగింది.
ఎస్.ఎస్.ఎల్.సి. వరకూ కర్నూలులోనే చదివిన హక్, 1917లో మద్రాసుకు వెళ్ళి అక్కడి, ప్రభుత్వ మహమ్మదన్ కాలేజీలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశాక, అక్కడే "మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీ"లో ఎం.ఏ (అరబిక్) పూర్తి చేశారు. తరువాత 1936లో ఇంగ్లండు వెళ్ళి, ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో అరబిక్ భాషపై పరిశోధన చేసి, డాక్టరేట్ సాధించారు. వీరికి 1921లో వివాహమయ్యింది. మద్రాసులోనే తాను చదివిన మహమ్మదన్ కాలేజీలో అరబిక్ ప్రొఫెసర్‌గా చేరారు. కాలేజీని ఉన్నత ప్రమాణాల స్థాయికి పెంచారు. నాటికాలంలోనే కాలేజీలో అమ్మాయిలకు చదువుకోవడానికి అవకాశం ఇచ్చిన తొలి వ్యక్తి వీరే! అలాగే మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా కూడా సేవలు అందించి, ఆ కాలేజీకి సంబంధించి, డిప్యూటీ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. వీరు విద్యావేత్తే కాక, సంస్కరణ వాది కూడా! తమ కాలేజీ విద్యార్థులను సమాజంలోని మూఢాచారాలను రూపు మాపేదిశగా,

ఉత్తేజ పరిచేవారు.

నాటి కాలంలో కర్నూలు జిల్లాలో ఎస్.ఎస్.ఎల్.సి (పదవతరగతి) వరకే చదువుకోవడానికి వీలుండేది. పై చదువులు చదవాలంటే, మద్రాసుకు తప్పక వెళ్ళ వలసిన పరిస్థితి. అలా వెళ్ళడానికి స్థితిమంతుల పిల్లలకే సాధ్యపడేది కాని, మధ్యతరగతి, పేద విద్యార్థులకు పై విద్య అందని ద్రాక్షపండే అయ్యింది. ఈ పరిస్థితి గమనించిన డా. అబ్దుల్ హక్, 1947లో కర్నూలులో 'ఉస్మానియా కాలేజీ'ని స్థాపించారు. అలాగే 'ఉమర్ అరబిక్ హైస్కూల్'ను కూడా కర్నూలులో స్థాపించారు.

ఉస్మానియా కాలేజీలో ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ, అరబిక్ భాషల్లో కూడా విద్యను అభ్యసించడానికి అవకాశం కలిగించారు. ఈ కాలేజీలో చదువుకున్న జిల్లా వారిలో ఎందరో దేశం గర్వించే స్థాయిలో ఎదిగారు. నేటి డిప్యూటీ సి.యం. కె.ఇ. క్రిష్ణమూర్తి కూడా ఈ కాలేజీ విద్యార్థే! కేవలం కర్నూలులోనే కాక, మద్రాసులో, తిరుచునాపల్లి, కాలికట్‌లో కూడా పలు విద్యాసంస్థలు స్థాపించి, అక్కడ ప్రజల మన్ననలు కూడా పొందారు. 1953లో వీరు ఆలీఘర్‌లోని ముస్లిం యూనివర్శిటీకి, ప్రో–వైస్ ఛాన్స్‌లర్‌గా కూడా వ్యవహరించారు. అలాగే మద్రాసు యూనివర్శిటీ సిండికేట్ సభ్యునిగానూ, ఆంధ్రా యూనివర్శిటీ మెంబర్‌గానూ, శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీకి కూడా సెనెట్ సభ్యునిగా వ్యవహరించారు.

దేశ ప్రజలందరూ విద్యావంతులు కావాలన్న తపన వున్న వ్యక్తి వీరు. ఎక్కడ, ఏ విద్యాలయ స్థాపనకు తన సహాయ సహకారాలు అవసరం అనుకున్నా వెంటనే చేసేవారు. వీరి కృషివల్లే కర్నూలులో గవర్నమెంట్ బి.ఇ.డి. కాలేజీ మంజూరు అయ్యింది. కాలేజీని సాధించటమే కాక, కాలేజీ కోసం కూడా భవన నిర్మాణం గావించి, ప్రభుత్వానికి అందజేసిన ఘనత వీరికే దక్కుతుంది.

చరమదశ వరకూ విద్యావ్యాప్తికే తన జీవితాన్ని అంకితం చేసిన డా. అబ్దుల్ హక్ 14.04.1958 సంవత్సరం పరమ పదించారు.

కర్నూలు జిల్లా ముస్లిం జనాభా ఎక్కువ వున్నందున, ఇక్కడ కూడా 'వుర్దూ యూనివర్శిటీ' వుండాలన్న కోరిక జిల్లా ప్రజానీకంలో బలంగా వుండేది. అందుకు తగ్గట్లుగా గతంలో ఇక్కడి ప్రజలు, స్థానిక నాయకులు గత ప్రభుత్వాలకు ఎన్నో మహజర్లు సమర్పించారు. అయినా కదలిక రాలేదు. నిరసనలు కూడా చేపట్టారు.

ఎలాగయితేనేం ఎట్టకేలకు, కర్నూలు జిల్లా ప్రజానీకం చిరకాల స్వప్నం చిగురించింది. నవంబర్ 9న కర్నూలుకు సమీపంలో ఓర్వకల్లు వద్ద ఉర్దూ యూనివర్శిటీకి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఆ ఉర్దూ యూనివర్శిటీకి డా. అబ్దుల్‌హక్ పేరుపెట్టడం – ఎంతో ఔచిత్యంగా వుంది. ఈ ఉర్దూ యూనివర్శిటీ నిర్మాణం త్వరగా పూర్తయి రాష్ట్రంలో యూనివర్శిటీ స్థాయిలో కూడా వుర్దూకు మంచి ఆదరణ లభిస్తుందని ఆశిద్దాం.

– ఎస్ అబ్దుల్ అజీజ్

అందరికీ ఇళ్లు - సింహభాగం ఏపీకే

కేంద్ర పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కి 1,93,147 ఇళ్లు మంజూరు



ఆంధ్రప్రదేశ్‌లోని 37 నగరాల్లో పేదలకోసం 1,93,147 కొత్త గృహాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. తెలంగాణా రాష్ట్రంలో 10 పట్టణాల్లో 10,290, గుజరాత్‌లో 10 పట్టణాల్లో 15,500, రాజస్థాన్‌లో 10 పట్టణాల్లో 6,255, తమిళనాడులో 2,932 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా ఇళ్లు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 3,231 కోట్ల ఆర్థిక సహాయం అందించనున్నది. 131 గృహనిర్మాణ పథకాల క్రింద ఆయా రాష్ట్రాల్లో ఇళ్ల నిర్మాణాలు జరగనున్నాయి. కేంద్రం ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిన మొత్తం 2,28,204 ఇళ్ల నిర్మాణంలో 2,17,745 ఇళ్లను ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఇడబ్ల్యుఎస్)కు మిగిలిన ఇళ్లను అల్పదాయ వర్గాలకు (ఎల్‌ఐజి)కు కేటాయిస్తామని కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ గృహనిర్మాణం, దారిద్ర్య నిర్మూలన మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ నందితా చటర్జీ వెల్లడించారు. ఈ పథకాలకు అవసరమైన భూమిని ముందుగానే రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన తరువాతనే కేంద్రం అనుమతి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వమే ఎక్కువ గృహనిర్మాణ పథకాల కోసం అవసరమైన భూమిని కేటాయించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని అధికార ప్రతినిధి వెల్లడించారు. ప్రస్తుతం ఆమోదించిన ఇళ్ళలో అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లోనే 37 నగరాల్లో 1,93,147 ఇళ్ళను నిర్మించనున్నారు. దీనిలో భాగంగా నమూన ఆధారంగా ఒక్కో ఇంటికి రూ. లక్ష నుంచి రూ. 2.33 లక్షల ఆర్థిక సాయాన్ని కేంద్రం అందించనున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాకంగా ప్రవేశపెట్టిన అందరికి ఇళ్ళ పథకం రాష్ట్ర వ్యాప్తంగా 37 నగరాల్లో పేదలకు లబ్ధిచేకూర్చనున్నది.

అందరికీ ఇళ్లు ఏపీకి ఒక వరం

ఒక రాష్ట్రానికి ఒక్క ఏడాదిలో కేంద్ర ప్రభుత్వం నగర, పట్టణ ప్రాంతాలకు 1.93 లక్షల పక్కా ఇళ్ళు మంజూరు చేసి ఒక్కో ఇంటికి రూ. 1.5 లక్షల చొప్పున రూ. 2,897 కోట్లు కేటాయించడం అంటే చరిత్రలో ఇది ఒక రికార్డుగా చెప్పుకోవాలి. 2022 నాటికి అందరికీ ఇళ్ళ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్‌కి ఒక వరంగా మారనుంది. అందరికి ఇళ్ళ కార్యక్రమం అమలు కోసం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ పేదరిక నిర్మూలన మంత్రిత్వశాఖ మార్గదర్శకాల్ని ప్రకటించిన వెంటనే ప్రాజెక్టులకు సవివర నివేదికలను రూపొందించడం ప్రారంభించింది రాష్ట్ర ప్రభుత్వం. సకాలంలో పక్కాగా సవివర నివేదికలను రూపొందించి కేంద్రాన్ని ఒప్పించడంతోనే ఇది సాధ్యమైంది. అందరికి ఇళ్ల కార్యక్రమం క్రింద పట్టణ ప్రాంతాల్లో ఇళ్లనిర్మాణానికి కేంద్రం ఈ ఏడాది నిర్దేశించుకున్న మొత్తం రూ. 4,400 కోట్లు ఇందులో అధిక భాగం ఆంధ్రప్రదేశ్‌కే దక్కింది. కేంద్రం అందిస్తున్న సాయానికి రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ కొంత, బ్యాంకు రుణం కొంత లబ్దిదారుడు ఇంకొంత భరించాల్సి ఉంటుంది. ❖

ఏ.పి.లో ఇళ్ళు మంజూరైన నగరాలు, పట్టణాలు

శ్రీకాకుళం	1,472
పలాస	512
ఆముదాలవలస	192
విజయనగరం	9,222
సాలూరు	588
బొబ్బిలి	382
పార్వతీపురం	836
నెల్లిమర్ల	325
విశాఖపట్నం	20,030
కాకినాడ	4,608
రాజమండ్రి	4,200
పెద్దాపురం	1,724
సామర్లకోట	1,048
రామచంద్రపురం	1,088
మండపేట	4,064
తుని	5,098
పిఠాపురం	874
అమలాపురం	1,636
ఏలూరు	1,550
భీమవరం	9,500
తాడేపల్లిగూడెం	5,786
పాలకొల్లు	7,469
విజయవాడ	10,000
మచిలీపట్నం	1,850
గుడివాడ	3,312
గుంటూరు	11,808
నర్సరావుపేట	1,504
తెనాలి	1,152
చిలకలూరిపేట	4,512
మంగళగిరి	2,592
పొన్నూరు	2,368
సత్తెనపల్లి	640
ఒంగోలు	2000
చీరాల	612
కందుకూరు	1,437
మర్కాపురం	1,020
నెల్లూరు	10,040
కావలి	4,510

మత్స్య వాణిజ్యంలో దూసుకుపోనున్న నవ్యాంధ్రప్రదేశ్

రొయ్యల ఎగుమతిలో దేశంలో నంబర్‌వన్
ఔత్సాహికులకోసం ప్రత్యేక మత్స్యవిధానం



నవ్యాంధ్రప్రదేశ్ వాణిజ్యరంగంలో దూసుకుపోతున్న మత్స్య పరిశ్రమకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల పరిధిలో ఉన్న 974కి.మీ పొడవున గల తీర ప్రాంతంలో మత్స్య పరిశ్రమ రూపురేఖలను సమూలంగా మార్చాలని నిర్ణయించారు. మత్స్యరంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి, మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగు పరచేందుకు ప్రభుత్వం ముందడుగు వేస్తున్నది. మత్స్యసంపద వాణిజ్యానికి మంచి గిరాకీ సృష్టించి, తద్వారా తీరప్రాంత మత్స్యకారుల తలరాతలు మార్చేందుకు ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న శ్రమకు తగ్గ ఫలితం దక్కితే కచ్చితంగా మత్స్యరంగానికి మహర్దశ పట్టినట్టే. మత్స్యపరిశ్రమ అభివృద్ధిలో తన లక్ష్య సాధనకోసం ముఖ్యమంత్రి అనేక నూతన పథకాలు, ప్రాజెక్టులను రూపకల్పనచేసి, కేంద్ర ప్రభుత్వం నుంచి చకచకా అనుమతులు కూడ తీసుకోవడం అభినందనీయం.

ఇటీవల రాష్ట్రాన్ని సందర్శించిన కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి రాధామోహన్‌సింగ్ మత్స్య పరిశ్రమ అభివృద్ధికి అనేక ప్రాజెక్టులు, పథకాలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం హర్షనీయం. రాష్ట్రంలో హైబ్రీడ్ చేపల సంతతి ఉత్పత్తికోసం ప్రత్యేకంగా నేషనల్ బ్రీడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి రాధామోహన్‌సింగ్ ప్రకటించారు. ప్రధానంగా రోహు (కలకత్తా గండె), కట్లా(బొచ్చ), పంగస్ తదితర చేపల సంతతిని ఈ కేంద్రంలో వృద్ధి చేయనున్నారు. రాష్ట్రంలో ఉండే యాభై సీడ్ ఫామ్స్ లో ఏదో ఒకచోట ఈ బ్యాంకును ఏర్పాటు చేయడానికి కేంద్ర సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తనదైన శైలిలో తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ నేషనల్ బ్రీడ్ బ్యాంకు ఏర్పాటుకు సంబంధించి కేంద్రం నుంచి ఒక సైంటిఫిక్ ప్రతినిధి బృందాన్ని కూడ రాష్ట్రానికి పంపించనున్నట్లు కేంద్రమంత్రి రాధామోహన్‌ససింగ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు హామీ ఇచ్చారు. అలాగే ఎల్-వన్నమాయ్ అనే రొయ్య జాతికి చెందిన బ్రీడర్ మల్టిఫికేషన్ కేంద్రాన్ని కూడ రాష్ట్రానికి మంజూరు చేస్తున్నట్లు కేంద్రమంత్రి ప్రకటించారు. దీనివల్ల రొయ్య సీడ్ ఉత్పత్తి అధికమవుతుంది. అలాగే రొయ్యల సాగుకు ఈ కేంద్రం మరింత దోహదపడనున్నది. అంతేగాక రాష్ట్రంలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆక్వాకల్చర్ (సిఐఎఫ్ఏ) ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం సమ్మతించింది. ఇప్పటికే దేశంలో జరుగుతున్న రొయ్యల ఉత్పత్తిలో నవ్యాంధ్రప్రదేశ్ 46శాతం పురోగతితో ప్రథమ స్థానాన్ని ఆక్రమించుకున్నది.

ఇదిలావుండగా, రాష్ట్రంలో మత్స్య పరిశ్రమను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన నూతన మత్స్య విధానంతో పెట్టుబడులు పెట్టే ఔత్సాహికులను మరింత ప్రోత్సహించేందుకు అనేక రాయితీలు సమకూర్చుతున్నారు.

తీరంలో లభించే ఈ మత్స్యసంపదను ప్రాసెసింగ్ యూనిట్లలో శుద్ధిచేసి దేశ,విదేశాలకు పెద్ద ఎత్తున ఎగుమతి చేయడం ద్వారా మత్స వాణిజ్యంలో దేశంలోనే ప్రథమస్థానం దక్కించుకోవాలని చంద్రబాబు పట్టుదలతో ఉన్నారు.

సామాజిక, ఆర్థికరంగాల పురోగతిలో మత్స్య వాణిజ్యం కీలకమైనదిగా గుర్తించారు. అందుకే మత్స్య సంపద ఎగుమతులతో ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసి ముందడుగు వేస్తున్నారు.

ఇందుకోసం వచ్చే ఐదేళ్ల కాలపరిమితి (2015-20)తో మత్స్యవాణిజ్యంపై ప్రత్యేక 'విధానం' అమలుకు అంకురార్పణ చేశారు. ఈ విధానం దేశంలోనే ప్రప్రథమం కావడం విశేషం.పారిశ్రామిక, వాణిజ్య రంగాలలో మత్స్య పరిశ్రమకు ప్రత్యేక గుర్తింపు వచ్చేలా నూతన విధానం, కార్యాచరణ ప్రణాళికల అమలుతో ముందడుగు పడుతోంది.

చేపల ఓడరేవుల నిర్మాణం మత్స్య వాణిజ్యం అభివృద్ధికి దోహదపడుతుంది. అందుకే మత్స్య సంపద ఎగుమతులు, వాణిజ్య వ్యవహారాల్లో నవ్యాంధ్రకు ఒక ప్రత్యేక స్థానం ఉండేది. అయితే గత పాలకుల అలసత్వం, నీతిమాలిన చర్యలవల్ల మత్స్య వాణిజ్యం పతనమైంది. ఎగుమతులు తగ్గి, ప్రభుత్వ ఖజానాకు రాబడులు తగ్గాయి. ఈ పరిస్థితుల నుంచి మత్స్య పరిశ్రమను కాపాడేందుకు చంద్రబాబు తనదైన శైలిలో కృషి చేస్తున్నారు. మత్స్య సంపదతోపాటు రొయ్యల వాణిజ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది. చేపలు, రొయ్యల సాగుపై 14.5లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయి.

రూ. 6,517కోట్ల రాబడే లక్ష్యంగా...

నవ్యాంధ్రలో 2015-16 ఆర్థిక సంవత్సరంలో ఒక్క మత్స్య పరిశ్రమ ద్వారానే ప్రభుత్వ ఖజానాకు రూ. 6,517కోట్ల మేరకు రాబడి రావాలని చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు.

నవ్యాంధ్రలో ఈ కొత్త విధానం ద్వారా రాబోయే ఐదేళ్లలో 42 లక్షల టన్నుల వరకు మత్స్య సంపదను ఉత్పత్తి చేయవచ్చు. ఇప్పటివరకు 19.64 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. అలాగే ప్రస్తుతం రూ.16,000 కోట్ల విలువైన మత్స్య సంపదను ఎగుమతి చేస్తుండగా, దీన్ని రెండింతలకు పెరిగేలా వృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

గత ఏడాది మత్స్య సంపద ఎగుమతుల వల్ల ప్రభుత్వానికి కేవలం రూ.1600కోట్లే సమకూరింది. ఈ ఏడాది ప్రధానంగా రొయ్యల ఎగుమతికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.

ఆక్వా, మత్స్య వాణిజ్యాన్ని ప్రోత్సహించడంకోసం దేశంలోనే ప్రప్రథమంగా ఐదు సంవత్సరాల కాలపరిమితితో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన 'విధానం'వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి.

మత్స్య పరిశ్రమను ఆధునీకరించి సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడులను పెద్దఎత్తున ఆకర్షించాలని నిర్ణయించారు. మత్స్య పరిశ్రమ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పరిశోధనల ద్వారా మెరుగు పరచుకోవాలి. ఈ నూతన విధానంలో మానవ వనరులను గణనీయంగా అభివృద్ధి చేసుకోవాలని నిర్ణయించారు.

చిన్నచిన్న మత్స్యకారుల హక్కులను కాపాడేందుకు వీలుంటుంది. అలాగే మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని, మత్స్యకారుల ప్రయోజనాలను కాపాడాలని చంద్రబాబు నిర్ణయించారు.

ఐదేళ్లలో 42లక్షల టన్నుల ఉత్పత్తి

నవ్యాంధ్రలో ఈ కొత్త విధానం ద్వారా రాబోయే ఐదేళ్లలో 42 లక్షల టన్నుల వరకు మత్స్య సంపదను ఉత్పత్తి చేయవచ్చు. ఇప్పటివరకు 19.64 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతోంది. అలాగే ప్రస్తుతం రూ.16,000 కోట్ల విలువైన మత్స్య సంపదను ఎగుమతి చేస్తుండగా, దీన్ని రెండింతలకు పెరిగేలా వృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

మత్స్య,ఆక్వా రంగాలలో ఆర్థికంగా మరింత పురోగతి సాధించేందుకు సరైన పద్ధతుల్లో చేపలను వేటాడటం, మానవ వనరుల అభివృద్ధి, రుణ సదుపాయం, సాంకేతిక పరిజ్ఞానం మెరుగుపరచడం, మౌలిక సదుపాయాలను పటిష్టం చేయడం, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యం(పిపిపి) తదితర అవకాశాలన్నీ కల్పించడం ద్వారా రాష్ట్రంలో మత్స్య పరిశ్రమను సమగ్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం తన కొత్త విధానంలో స్పష్టీకరించింది.

ఔత్సాహికులకు భారీ ప్రోత్సాహకాలు

నవ్యాంధ్రలోని తొమ్మిది జిల్లాలను ఆనుకుని ఉన్న సముద్రతీరంలో అపారంగా ఉన్న మత్స్య సంపదతో వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త విధానంలో ఔత్సాహికులు, పెట్టుబడి దారులకు భారీ ఎత్తున రాయితీలు ప్రకటించింది. మత్స్య లేదా రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి ఒక్కో యూనిట్‌కు రూ.10 కోట్లు మంజూరు చేస్తారు.

ఒక్కో యూనిట్‌లో కోల్డ్ స్టోరేజీలు, ఐస్ ప్లాంటులు, ఇతర మత్స్య అనుబంధ యూనిట్లు కూడ ఉంటాయి. చేపలు, రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా పేదలకు, మహిళలకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. మత్స్య సంపద ఎగుమతుల వల్ల పెద్ద ఎత్తున విదేశీ మారక ద్రవ్యం సమకూరుతుంది.

ఈ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు అయ్యే పెట్టుబడి మొత్తంలో భూమి కొనుగోలుకు 15 శాతానికి మించి వ్యయం ఉండదు. ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పే పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం ప్రభుత్వం మరో వెసులుబాటు కూడ కల్పించింది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటవ తేదీ నాటికి ఈ యూనిట్ నిర్మాణ దశలో ఉండి, వాణిజ్య ప్రక్రియ ఆరంభించకుండా ఉండే యూనిట్లకు కూడ కొత్త విధానం ద్వారా అన్ని రకాల ప్రోత్సాహకాలు అందుతాయి. మత్స్య వాణిజ్యానికి వినియోగించే రీఫర్ వ్యాన్ల కొనుగోలుకు గరిష్ఠంగా 50శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తుంది. ఒక్కో వాహనానికి పదిలక్షల రూపాయలు ప్రభుత్వం ఇస్తుంది.

ఫిషింగ్ హార్బర్లు, కోల్డు స్టోరేజీలకు 50శాతం సబ్సిడీతో గరిష్ఠంగా రూ.2.25 కోట్లకు అనుమితిస్తారు.

ప్రాసెసింగ్ యూనిట్లకు సమకూర్చు కోవలసిన విద్యుత్, నీరు, రహదారులకోసం అయ్యే పెట్టుబడిలో 50శాతం ప్రభుత్వమే భరిస్తుంది. అయితే ఈ రాయితీ రూ.2కోట్లకు పరిమితం చేశారు. ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లకు అవసరమైన భూముల లీజు, తనఖా లేదా రిజిస్ట్రేషన్ సమయంలో స్టాంపు డ్యూటీ చెల్లింపులో 100శాతం రాయితీ కల్పించారు.

అలాగే చేపలు, రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ల విద్యుత్ సరఫరాకు సంబంధించి ఒక్కో యూనిట్‌కు మూడు రూపాయల వంతున సబ్సిడీ మంజూరు చేస్తారు. ఐస్ ప్లాంట్లకు 2016-17 నుంచి ఐదేళ్ల వరకు ఈ రాయితీ అమలులో ఉంటుంది. వాణిజ్యపరంగా ఉత్పత్తులను ఆరంభించిన తేదీ నుంచి ఈ వెసులుబాటు వర్తిస్తుంది. ప్రస్తుతం ఇస్తున్న సబ్సిడీ ధర ఒక్కో యూనిట్‌కు రూ.1.25లు ఉండగా, అదనంగా రూ.1.75లు ఇవ్వాలని ప్రతిపాదించారు.

వాణిజ్యపరమైన ఉత్పత్తి ఆరంభించినప్పటి నుంచి రాబోయే ఐదేళ్ల వరకు విద్యుత్ సుంకం చెల్లింపులో కూడ 2016-17 నుంచి వెసులుబాటు కల్పించారు.

ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్లు, ఐస్ ప్లాంట్ల, కోల్డు స్టోరేజీలకు మంజూరయ్యే బ్యాంకు రుణాల వడ్డీ రేట్లలో ఆరుశాతం వడ్డీని రాయితీగా ఇస్తారు. గరిష్ఠంగా రూ.2.5కోట్ల మేరకు ఐదేళ్ల కాలపరిమితితో ఇస్తారు.

ఆక్వాకల్చర్ పాండ్ల విస్తరణకు యాంత్రిక సహాయం అందించేందుకు సౌరవిద్యుత్ ఆధారిత ఏరోటర్స్ కొనుగోలు సందర్భంలో 50శాతం రాయితీ ఇస్తారు. సోలార్ పంపులు, సోలార్ లైట్లు . సోలార్ ఆధారిత ఆధారంగా ఏర్పాటు చేసే ఏరాటర్స్‌కు 60శాతం సబ్సిడీ ఇస్తారు. రొయ్యల ఫారాలకు సంబంధించి ఒక్కో రైతుకు గరిష్ఠంగా రెండు హెక్టార్లకు ఏటా ఈ రాయితీ మంజూరు చేస్తారు. మత్స్య, రొయ్యల పరిశ్రమలకు సంబంధించి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాల రాయితీలన్నీ ఎన్ఎఫ్‌డిబి లేదా ఎంపిఇడిఏ ద్వారా అమలు చేస్తారు. రొయ్యల పెంపకానికి సంబంధించి రెండు హెక్టార్ల వరకు మూడు రూపాయల వంతున ఒక్కో విద్యుత్ యూనిట్‌కు సబ్సిడీగా ఇస్తారు.

మెరైన్‌లకు 'డీజిల్' రాయితీ

మెకనైజ్డు, మోటరైజ్డు మెరైన్స్‌ను ఒక్కో లీటర్ డీజిల్‌కు రూ.9.50లు సబ్సిడీగా ఇస్తారు. ఈ ఏడాది మార్చి 31వ, తేదీ నుంచి రిజిస్టర్ అయిన మెరైన్లకు మాత్రమే ఈ సబ్సిడీ 2016-17నుంచి వర్తిస్తుంది.ఆహార తయారీ యూనిట్లు, చేపల ఉత్పత్తికి సంబంధించిన ఇతర యాంత్రిక పరికరాలకు పెట్టుబడిలో 50శాతం రాయితీ ఇస్తారు. గరిష్ఠంగా రూ.5 కోట్లు ఇస్తారు. అలాగే ఈ యూనిట్లకు బ్యాంకులు ఇచ్చే రుణాల వడ్డీలో ఆరు శాతం రాయితీ ఇస్తారు. గరిష్ఠంగా రూ.2.5కోట్లు ఐదేళ్ల కాలపరిమితి వరకు ఇస్తారు.

– దబ్బీరు రామకృష్ణ పట్నాయక్

త్వరలో ఎయిమ్స్ శంకుస్థాపన

- చిన కాకానిలో క్యాన్సర్ ఆసుపత్రికి రూ. 120 కోట్ల నిధులకు విజ్ఞప్తి
- గుంటూరులో రిజనల్ వైరాలాజీ ల్యాబ్
- నెల్లూరులో ట్రామా సెంటర్
- అరకులో నేచర్ క్యూర్ ఆసుపత్రి
- అనంతపురం, కడప, కర్నూల్, శ్రీకాకుళం, ప్రకాశం, కాకినాడ ఆసుపత్రులలో రాష్ట్ర వైరాలాజీ ల్యాబ్‌లు : మంత్రి కామినేని



కేంద్ర ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి జేపీ నడ్డాని కలిసిన రాష్ట్ర మంత్రి కామినేని శ్రీనివాస్

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిష్టాత్మక ఎయిమ్స్‌కు శంకుస్థాపన త్వరలో జరగనుంది. కేంద్ర ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి జేపీ నడ్డా, రాష్ట్ర మంత్రి కామినేని శ్రీనివాస్‌కు ఈ మేరకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుతో మాట్లాడిన తరువాత శంకుస్థాపన తేదీని ఖరారు చేయనున్నట్లు మంత్రి నడ్డా చెప్పినట్లు మంత్రి కామినేని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్, కేంద్ర వైద్య అరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా, కేంద్ర ఆయూష్ శాఖ మంత్రి శ్రీపాద యశో నాయక్‌లను ఢిల్లీలో కలిసి ఎయిమ్స్ శంకుస్థాపన విషయంతో పాటు ఇతర కీలక ఆంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆంధ్రపదేశ్ ప్రజలు ఎయిమ్స్ కోసం చాలా కాలంగా వేచిచూస్తున్నారని మంత్రి కామినేని శ్రీనివాస్ ఈ సందర్భంగా నడ్డాకు తెలిపారు. ఏ.పి లో మెడికల్ కాలేజీల్లో పీజీ సీట్లను పెంచాలని ప్రత్యేకంగా కోరారు. ప్రధాన మంత్రి స్వాస్థ్య సురక్ష యోజన (పిఎమ్ ఎస్ ఎస్ వై) పథకం క్రింద ఆంధ్ర మెడికల్ కాలేజ్, రంగరాయ మెడికల్ కాలేజ్, గుంటూరు మెడికల్ కాలేజ్, కర్నూల్ మెడికల్ కాలేజ్, శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజ్‌లను అప్ గ్రేడ్ చేయాలని కోరారు. గుంటూరులో రీజనల్ వైరాలజీ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడానికి కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏ.పిని మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం చేస్తున్న కృషిని మంత్రి నడ్డాకు కామినేని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా మార్చేందుకు కేంద్రం తగు సహాయ సహకారాలు అందించనుందని మంత్రి నడ్డా హామీ ఇచ్చినట్లు మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. గుంటూరు జిల్లా చినకాకానిలో ప్రతిపాదిత రాష్ట్ర క్యాన్సర్ సంస్థ (ఎస్.సి.ఐ) ఏర్పాటుకు 120 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయవలసిందిగా మంత్రి కామినేని విజ్ఞప్తి చేశారు. నెల్లూరులో లెవల్ 1 ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుకు అనుమతించాలని కామినేని కోరారు.

అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో ఆంధ్రప్రదేశ్‌ను వైద్య, ఆరోగ్య ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నట్లు ఏపి మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. మంత్రి కామినేని శ్రీనివాస్ కేంద్రమంత్రి నాయక్‌తో విడిగా భేటి అయ్యారు. ఏపీలోని విజయవాడ సమీపంలో వీరపనేనిగూడెంలో 20 ఎకరాల భూమిని యోగ, ఆయుర్వేద మరియు నేచురోపతి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు కేటాయించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆయూష్ డిజి డాక్టర్ ఈశ్వరచారి గత సెప్టెంబర్‌లో న్యూఢిల్లీ నుండి వచ్చి స్థల పరిశీలన పూర్తిచేసి వెళ్ళినట్లు తెలిపారు. కేంద్రం యోగాకు ఇస్తున్న ప్రాధాన్యత దృష్ట్యా శంకుస్థాపన, ఇతర పనులకు తగుచొరవ తీసుకోవాలని మంత్రి కామినేని విజ్ఞప్తి చేశారు. అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాలలో ఆయూష్ ఓపిలను ప్రారంభించడానికి అనుమతి ఇవ్వాలన్నారు.

విశాఖపట్టణం జిల్లా అరకులో ప్రకృతి చికిత్స ఆసుపత్రిని (నేచర్ క్యూర్ ఆసుపత్రి) ఏర్పాటు చేయడానికి కావలసిన నిధులను ఇచ్చి కేంద్రం చొరవ తీసుకోవాలన్న మంత్రి కామినేని చేసిన విజ్ఞప్తికి కేంద్రమంత్రి నాయక్ సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో అతిపెద్ద ప్రకృతి చికిత్స ఆసుపత్రి ఉందని అదే తరహాలో అరకులోను నేచర్‌క్యూర్ ఆసుపత్రి ఏర్పాటు అవసరం ఉందని మంత్రి కామినేని తెలిపారు.

– సునీల్ కుమార్ (ఎమ్ ఎల్ వో)

ఏపికి ప్రపంచ ఆర్థిక వేదిక చేయూత

ఒప్పందంతో ముందుకొచ్చిన డబ్ల్యూఈఎఫ్

ప్రపంచ ఆర్థిక వ్యవస్థని శాసించే వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) కరచాలనం చేసిన తొలి రాష్ట్రం నవ్యాంధ్ర. ఇప్పటి వరకూ దేశాలతో మాత్రమే ఒప్పందాలు కుదుర్చుకునే ఈ అగ్రగామి ఆర్థిక శక్తిని రాష్ట్రం ముంగిటకు తెచ్చిన ఘనత రాష్ట్ర సారథి– ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిదే. న్యూఢిల్లీ తాజ్ ప్యాలెస్ లో జరిగిన సదస్సులో ప్రపంచ ఆర్థిక వేదిక ప్రతినిధులతో చంద్రబాబు విస్తృత స్థాయి చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్ పోటీ సామర్థ్యాన్నిఅంచనా వేసేందుకు సహకరించడానికి డబ్ల్యూఈఎఫ్ అంగీకరించింది. ఈ మేరకు డబ్ల్యూఈఎఫ్, ఆంధ్రప్రదేశ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. సాధారణంగా డబ్ల్యూఈఎఫ్ వివిధ దేశాలతోనే ఇలాంటి ఒప్పందం కుదుర్చుకుంటుంది. కానీ ఒక రాష్ట్రంతో ఒప్పందం కుదుర్చుకోవడం ఇదే మొదటిసారి.

పోటీ సామర్థ్యం అంచనాకు కుదిరిన ఒప్పందంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో డబ్ల్యూఈఎఫ్ నిర్వహణ మండలి సభ్యుడు, ప్రాంతీయ వ్యూహాల కేంద్రం అధిపతి ఫిలిఫ్ రోజ్లర్, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ గుప్తా సంతకాలు చేశారు. ఈ ఒప్పందం కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దాని భాగస్వాముల పోటీ సామర్థ్యానికి సంబంధించి విజ్ఞాన పంపిణీ ,సాంకేతిక సహకార కార్యక్రమాన్ని డబ్ల్యూఈఎఫ్ నిర్వహిస్తుంది. "ఆంధ్రప్రదేశ్ తన లక్ష్యాలను సాధించేందుకు అవరోధాలను గుర్తించడం, వాటి స్థాయిని నిర్ధారించడం ముఖ్యం" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 12 అంశాల పనితీరు ఆధారంగా ఈ మదింపు వుంటుంది. ఈ 12 అంశాలు: సంస్థలు,మౌలిక సదుపాయాలు, స్థూల ఆర్థిక సుస్థిరత, ఆరోగ్యం-ప్రాథమిక విద్య,ఉన్నత విద్య–శిక్షణ, సరుకు మార్కెట్ సామర్థ్యం, కార్మిక మార్కెట్ సామర్థ్యం, ఆర్థికరంగ అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన సంసిద్ధత, మార్కెట్ పరిమాణం, వ్యాపార సరళీకరణ, నవ్య ఆలోచన పథం. ఆంధ్రప్రదేశ్‌ను ఏరోస్పేస్, రక్షణ పరిశ్రమల కూడలిగా తీర్చిదిద్దే విషయమై డబ్ల్యూఈఎఫ్ సలహా సంఘం చంద్రబాబుకు ఒక ప్రెజెంటేషన్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లో వనరులు నైపుణ్యాన్ని దృష్టిలో వుంచుకొని, వ్యాపారాన్ని సులువుగా చేసుకునే అంశంలో ప్రపంచబ్యాంకు రూపొందించిన జాబితాలో రాష్ట్రానికి రెండో స్థానం లభించడాన్ని, వచ్చే రెండు, మూడేళ్లలో తొలి స్థానానికి ఎగబాకే సామర్థ్యాన్ని పరిగణలోకి తీసుకొని రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఏరోస్పేస్, రక్షణ రంగంలోకి జిఈ,బోయింగ్, ఎయిర్ బస్, తదితర 13 ప్రముఖ సంస్థలు ఆసక్తి కనబరుస్తున్నాయని డబ్ల్యూఈఎఫ్ సభ్యులు చంద్రబాబుకి చెప్పారు. పెరుగుతున్న నగరాలు–సవాళ్లు అంశంపై జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొని, ప్రసంగించారు. రాష్ట్రంలో నగరీకరణ మార్పు గురించి, రాజధాని అమరావతి నిర్మాణం గురించి వివరించారు. అట్లాగే 'పని చేసే చోటుకు నడిచి వెళ్లడం, సైకిల్‌పై వెళ్లడం, నీటి ట్యాక్సీల్లో వెళ్లడం వంటి భావనలపై ప్రతినిధులు ఆసక్తి చూపారు. ప్రపంచంలోని రాజధాని నగరాలకు అమరావతి ఒక ప్రమాణాన్ని నిర్ధారిస్తుందని ప్రతినిధులు విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్ర జీవ సాంకేతిక పరిజ్ఞాన విభాగం రాష్ట్రంలో చేపడుతున్న కార్యక్రమాల గురించి చంద్రబాబుకి ఆ విభాగం కార్యదర్శి డాక్టర్ విజయ రాఘవన్ ప్రజెంటేషన్ ఇచ్చారు.



పర్యాటకం, ఔషధ రంగం, వ్యవసాయం ప్రత్యేక యంత్ర సామాగ్రి తదితర రంగాల్లో సహకారానికి సహోదర రాష్ట్ర ఒప్పందం కుదుర్చుకునే విషయమై ముఖ్యమంత్రితో జపాన్‌కి చెందిన టోయామా ప్రతినిధుల బృందం చర్చలు జరిపింది.

విశాఖలో భారీ కన్వెన్షన్ కేంద్రాన్ని నిర్మించే విషయమై లల్లూ గ్రూప్ ఇంటర్నేషనల్‌కు చెందిన యూసుఫ్ ఆలీ చంద్రబాబుతో చర్చించారు. పదివేల మంది ప్రజలు ఆసీనులయ్యే అతి పెద్ద సామర్థ్యంతో కన్వెన్షన్ కేంద్రం నిర్మాణానికి తాను రూ.1500 కోట్ల పెట్టుబడిపెడతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఆలీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు 'డైరెక్ట్ సెల్లింగ్ : ఆంధ్రప్రదేశ్ అండ్ తెలంగాణ, గ్లోబల్ ఇండస్ట్రీ, ఎంపవరింగ్ మిలియన్స్ ఇన్ ఇండియా' అనే పుస్తకాన్ని విడుదల చేశారు.

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలహీనతలు, బలాలను ప్రపంచ పోటీ సామర్థ్య సూచీ (జీసిఐ) విధానాన్ని ఉపయోగించుకొని ఆంధ్రప్రదేశ్ మదింపు వేసుకోగలుగుతుంది. విధానాల రూపకల్పనకు, సంస్కరణలకు, ఇదే అభివృద్ధి పరిమాణంలో ఉన్న ఇతర ఆర్థిక వ్యవస్థలతో పోల్చుకోవడానికి అవసరమైన ముఖ్య గణాంక సమాచారాన్ని ఈ కార్యక్రమం అందజేస్తుంది.

❖

చిత్తూరు జిల్లా



కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ... తెట్టలాయ మహిమలే తిరుమల కొండ-అని తొలి తెలుగు వాగ్గేయకారుడు కీర్తించిన ఆ ఏడుకొండలవాడి ఆవాసం ఉన్న జిల్లా చిత్తూరు. కోట్లాదిమంది భక్తుల కొంగుబంగారమైన తిరుమల క్షేత్రంతో పాటు, పరమశివుడు వాయులింగేశ్వరునిగా అవతరించిన శ్రీకాళహస్తి శివక్షేత్రం, గణనాధుని మహిమలతో ప్రసిద్ధికెక్కిన కాణిపాక వినాయకక్షేత్రం, దేశంలోనే తొలి దేవాలయంగా భావిస్తున్న గుడిమల్లం, శౌర్యానికి గీసిన గిరి చంద్రగిరి కోట... వంటి ఆధ్యాత్మిక, చారిత్రక కేంద్రం చిత్తూరు జిల్లా. రాష్ట్రంలో దక్షిణాన రాయలసీమ ప్రాంతంలో ఉంది చిత్తూరు జిల్లా. ఈ జిల్లా ప్రధాన కేంద్రం పేరు కూడా చిత్తూరే. రాయలసీమలో పట్టణ పరిధి ఎక్కువగా ఉన్న జిల్లా చిత్తూరు. రాష్ట్ర రాజధాని విజయవాడకు 474 కిలోమీటర్ల దూరంలో ఉంది. మద్రాసుకు 154 కిలోమీటర్ల దూరంలోను బెంగుళూరుకు 183 కిలోమీటర్ల దూరంలోను ఉంది. మద్రాస్-ముంబయి ట్రంక్‌రోడ్డు, మద్రాసు-బెంగుళూరు జాతీయ రహదారి ఇక్కడి నుంచే వెళతాయి. దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులు ఇచ్చే కానుకలతో ప్రపంచంలోనే అత్యంత ధనవంత దేవుళ్ళలో తిరుమలేశుడు ఒకరు. అత్యధికంగా తిరుమలకు వచ్చే భక్తులు, యాత్రికులతో వాణిజ్యపరంగా, సాంస్కృతికంగా దేశంలోనే తిరుపతి ఓ ముఖ్యపట్టణంగా గుర్తింపు పొందింది. ఈ ప్రాంతాన్ని తమిళవాఙ్మయాల్లో తొండై మండలంగా కీర్తించారు. రాష్ట్రంలో అత్యధికంగా మామిడి పండించే జిల్లాగా చిత్తూరు ప్రసిద్ధికెక్కింది.

జిల్లా సరిహద్దులు

ఉత్తరాన అనంతపురం, కడప జిల్లాలు, తూర్పున నెల్లూరు, తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లాలు, దక్షిణాన తమిళనాడులోని నార్త్ ఆర్కాడు జిల్లా, పశ్చిమాన తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఉన్నాయి. చిత్తూరు జిల్లా 15,152 చ. కి.మీ. విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. జిల్లా ఉష్ణమండలం వాతావరణంలో ఉంది. భౌగోళికంగా ఉత్తరార్ధగోళంలో 12.37 డిగ్రీలు ఉత్తరక్షాంశం నుంచి 14.8 డిగ్రీల అక్షాంశాల మధ్య ఉంది. 78.33 డిగ్రీల నుంచి 79.55 డిగ్రీల నడుమ తూర్పు రేఖాంశంలో వ్యాపించి ఉంది. నైరుతీ, ఈశాన్య రుతుపవనాల వల్ల జిల్లాలో వర్షం పడుతుంటుంది.

చిత్తూరుజిల్లా జనాభా

2011లో నిర్వహించిన జనాభా లెక్కల ప్రాథమిక సమాచారం కింది విధంగా ఉంది.

జిల్లా జనాభా	పురుషులు	మహిళలు
4174064	**2090559**	**2083505**
అక్షరాస్యులు	పురుషులు	మహిళలు
2711432	**1512958**	**1198474**
అక్షరాస్యత శాతం	పురుషులు	మహిళలు
72.36	**81.15**	**63.65**

ప్రతి వెయ్యిమంది పురుషులకు 997 మంది మహిళలు ఉన్నారు. రాష్ట్ర జనాభాలో జిల్లా జనాభా 4.94 శాతం ఉంది. జిల్లా జనసాంద్రత ప్రతి చదరపు కిలోమీటర్‌కు 275గా ఉంది. 2001లో జిల్లా సగటు జనసాంద్రత 247 మాత్రమే కావడం గమనార్హం. జిల్లాలో పట్టణప్రాంతంలో అక్షరాస్యత 82.26 శాతం. ఇది జాతీయ సగటుకన్నా ఎక్కువ. 2001-2011 మధ్య గ్రామీణప్రాంతంలో అక్షరాస్యత 66.77 శాతం నుంచి 71.53 శాతానికి పెరిగింది.

పరిపాలనా వికేంద్రీకరణ

జిల్లాను చిత్తూరు, మదనపల్లి, తిరుపతిలుగా మూడు రెవిన్యూ డివిజన్లుగా విభజించారు. జిల్లాలో మొత్తం 66 మండలాలున్నాయి. జిల్లాలో జాతీయ రహదారులు సుమారు 609 కిలోమీటర్లుండగా, పంచాయతీ రోడ్లు 7782 కిలోమీటర్లు, పీడబ్ల్యూడీ రోడ్లు 4366 కిలోమీటర్లున్నాయి. 18, 42, 69 నెంబర్లు గల ప్రధాన జాతీయ రహదారులు జిల్లా నుండి వెళ్తున్నాయి. చిత్తూరు, తిరుపతి రైల్వే స్టేషన్లు జిల్లాలో ముఖ్యమైనవి. జిల్లా ప్రధాన కేంద్రం చిత్తూరుకు 83 కిలోమీటర్ల దూరంలో తిరుపతిలో విమానాశ్రయం ఉంది.జిల్లాకు 160 కిలోమీటర్ల దూరంలో చెన్నై ఎన్నోర్ ఓడరేవు ఉంది.

జిల్లాలో ఏడు వర్సిటీలు

ఏ జిల్లాలో లేని విధంగా చిత్తూరు జిల్లాలో ఏడు వర్సిటీలు ఉండటం ఉన్నత విద్యకు ఉన్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తోంది. ఇవి విద్య, పరిశోధన రంగంలో ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్ది దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం చేశాయి. ఇక్కడ ఉన్నత విద్య చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో రాణిస్తూ జిల్లాకు ఘనమైన కీర్తిని తెచ్చిపెడుతున్నారు. గత కొన్ని ఏళ్లుగా. సమాజ అవసరాలను గుర్తించి వాటిని తీర్చడానికి అవసరమైన సూచనలు ఇస్తూ సేవలోనూ

చిత్తూరు జిల్లా ముఖచిత్రం

అంశం	యూనిట్లు	సంఖ్యలు
ప్రాంతం	చదరపు కి.మీ.	15,359
జనాభా	వ్యక్తులు	41,74,064
జనాభా పెరుగుదల (దశాబ్దంలో)	%	11.43
జన సాంద్రత	కి.మీ.కి వ్యక్తులు	275
పట్టణీకరణ	%	29.50
అక్షరాస్యత	%	71.53

విద్యా సదుపాయాలు, మానవ వనరులు

వివరాలు	సంస్థల సంఖ్య 2014 - 2015	విద్యార్థుల సంఖ్య 2014 - 2015
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు	16	11348
ప్రైవేట్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలు	6	7296
రాష్ట్రంలో జూనియర్ కళాశాలలు 2013-14	312 (సంస్థల సంఖ్య)	

పరిశ్రమల వివరాలు

వివరాలు	పెట్టుబడి (కోట్లలో)	ఉద్యోగుల సంఖ్య
స్థాపించబడ్డ భారీ, మెగా ప్రాజెక్టులు	3917	36198
చిన్న, మధ్యతరగతి పరిశ్రమలు	950	88139

తిరుపతి పట్టణం వివరాలు

అంశం	సంఖ్య
జనాభా	4,59,985
రోజువారీ వచ్చే యాత్రీకుల సంఖ్య	68,500
అక్షరాస్యత సరాసరి (%)	85.22
స్త్రీ, పురుష నిష్పత్తి	987

తమ భాగస్వామ్యాన్ని నిర్వహిస్తున్నాయి. దేవదేవుని కొలువైన తిరుపతిలో అనేక విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేశారు. తెలుగు, తమిళ, కన్నడ సంగమం కుప్పంలో ద్రవిడ విశ్వవిద్యాలయం నెలకొల్పారు. తిరుపతిలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, మహిళలకు రాష్ట్రంలోనే ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర వెటర్నరీ విశ్వవిద్యాలయం, స్విమ్స్ విశ్వవిద్యాలయాలున్నాయి.

హోంరూల్ వ్యవస్థాపకురాలు అనిబిసెంట్ మదనపల్లిలో బీసెంట్‌థియోసాఫికల్ కళాశాల ఏర్పాటు చేశారు. ఇక్కడే గురుదేవుడు రవీంద్రుడు జాతీయగీతాన్ని ఆంగ్లంలోకి అనువాదం చేశారు. రిషివ్యాలీలో జిడ్డు కృష్ణమూర్తి ఏర్పాటుచేసిన పాఠశాలకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపువుంది.

చిత్తూరు జిల్లాలో 14 శాసనసభ స్థానాలు, రెండు లోక్‌సభ నియోజకవర్గాలు ఉన్నాయి. తిరుపతి లోక్‌సభ స్థానం పరిధిలోకి జిల్లాలోని తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు (ఎస్సీ) నియోజకవర్గాలతో పాటు నెల్లూరు జిల్లాలోని సర్వేపల్లి, గూడూరు (ఎస్సీ), సూళ్లూరుపేట (ఎస్సీ) నియోజకవర్గాలు వస్తాయి. చిత్తూరు(ఎస్సీ) లోక్‌సభ స్థానం పరిధిలో చంద్రగిరి, నగరి, గంగాధర నెల్లూరు (ఎస్సీ), చిత్తూరు, పూతలపట్టు (ఎస్సీ) పలమనేరు, కుప్పం నియోజకవర్గాలు ఉన్నాయి. తంబళ్లపల్లి, పీలేరు, మదనపల్లి, పుంగనూరు నియోజకవర్గాలు కడప జిల్లా రాజంపేట లోక్‌సభ స్థానం పరిధిలోకి వెళ్లాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ జిల్లాలోని కుప్పంనియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు.

తాగునీటి ప్రాజెక్టులు

తమిళనాడుకు తాగునీటి ఎద్దడి తీర్చేందుకు వీలుగా తెలుగుగంగ పథకాన్ని 1983-84లోప్రారంభించి, అమల్లోకి తెచ్చారు. స్వర్ణముఖి ప్రాజెక్టు ద్వారా నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలోని 39 చెరువులు.. వాటికి అనుసంధానంగా ఉన్న 10,200 ఎకరాలకు సాగుజలాలు అందించాలన్నది లక్ష్యం. సదాశివకోన ప్రాజెక్టును ఏర్పేడు మండల పరిధిలోని రైతులకు సాగు జలాలు అందించాలన్న సంకల్పంతో 1979లో రెండుకొండల మధ్య దీన్ని నిర్మించారు. మల్లిమడుగు ప్రాజెక్టును రేణిగుంట పరిధిలోని రైతులకు సాగు జలాలు అందించేందుకు ప్రభుత్వం 50 సంవత్సరాల క్రితం మల్లిమడుగు ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

నాగలాపురం, పిచ్చాటూరు మండలాల్లో పదివేలకు పైగా ఆయకట్టుకు ప్రధాన నీటి వనరు అరణియార్. గాలేరు-నగరి సుజల స్రవంతి పథకానికి 1988లో రేణిగుంట మండలం కరకంబాడి వద్ద శంకుస్థాపన చేశారు. పోతిరెడ్డిపాడు నుంచి ప్రధాన కాలువల ద్వారా జిల్లాకు సాగునీటిని అందించేలా ప్రాజెక్టు రూపకల్పన చేశారు.

ఇంకా ఎన్టీఆర్ జలాశయం, బుగ్గ-సత్రవాడ ప్రాజెక్టు, మూలకోన ప్రాజెక్టు, హంద్రీ-నీవా ప్రాజెక్టు, బాహుదా ప్రాజెక్టు, పింఛా ప్రాజెక్టు, నుంజార్ల ప్రాజెక్టు, పెద్దేరు ప్రాజెక్టు, చిన్నేరు ప్రాజెక్టు, ఆకుమానుగుట్ట ప్రాజెక్టు, దబ్బలగుట్టవంక ప్రాజెక్టు, కనికల ఒడ్డు ప్రాజెక్టు, గెల్లంవారిపల్లె ప్రాజెక్టు, మిట్టసానిపల్లె ప్రాజెక్టుల్లో కొన్ని పూర్తి చేయాల్సి ఉండగా, పూర్తయిన ప్రాజెక్టుల పరిధిలో వేల ఎకరాలు సాగులోకి వస్తుండగా, ఆయా ప్రాంతాల్లో తాగునీటి అవసరాలు తీరుతున్నాయి. ❖

ఐకానిక్ కట్టడాలుగా అసెంబ్లీ, హైకోర్టు



- అంతర్జాతీయ రూపశిల్పులకు అప్పగిద్దాం..
- ప్రతిపాదించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు
- స్వదేశీ నిపుణులతో సచివాలయం, రాజ్‌భవన్ డిజైన్
- అమరావతి నిర్మాణ వ్యూహాలను త్వరితగతిన పూర్తిచేయాలని నిర్దేశం కొండవీటివాగు వరద సంరక్షణచర్యలపై చర్చ
- మలుపులు లేకుండా గవర్నమెంటు కాంప్లెక్స్ యాక్సెస్ రోడ్

ప్రజారాజధాని అమరావతిలో శాసనసభ, హైకోర్టు భవనాలను అంతర్జాతీయ నిర్మాణశిల్పులకు అప్పగించి ఐకానిక్ నిర్మాణాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్దేశించారు. సచివాలయం, రాజ్‌భవన్, ఇతర ప్రభుత్వ భవన సముదాయాలను స్వదేశీ నిర్మాణదారులకు అప్పగించి సాధ్యమైనంత వేగంగా వాటి నిర్మాణాలు పూర్తిచేయాలని చెప్పారు. రాజధాని నగర నిర్మాణ వ్యూహాలపై సహచర మంత్రులు, సీఆర్‌డీఏ, ప్రభుత్వ ఉన్నతాధికారులు, కన్సల్టెంటులతో ముఖ్యమంత్రి తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో సుదీ-ర్ఘంగా చర్చించారు.

రాజధాని నిర్మాణ అధ్యాయంలో ప్రతి దినం అమూల్యమైనదని, ఒక్కరోజు కూడా వృధా చేయకుండా నగర నిర్మాణ ప్రణాళికల ప్రక్రియను పూర్తిచేసి త్వరితగతిన పనులు ఆరంభించాలని భావిస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సచివాలయంలో ఒకే సముదాయంలో ఇటు సీయంవోతో పాటు సచివుల కార్యాలయాలు, కార్యదర్శులు, వివిధ విభాగాల అధిపతుల కార్యస్థానాలు వుండేలా చూడాలని చెప్పారు.

ముఖ్యంగా రాజధానిలోని ప్రభుత్వ భవన సముదాయాలు నిర్మించే ప్రాంతానికి చేరుకునే రహదారిని ఆకర్షణీయంగా వుండేలా చూడాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ మార్గంలో ఎక్కడా మలుపులు లేకుండా నేరుగా రహదారి వుండేలా డిజైన్‌లో మార్పులు చేయాలని సూచించారు. మధ్యలో అడ్డుగా వచ్చే చిన్న పర్వతాన్ని అవసరమైతే తొలిచి అండర్‌టన్నెల్ నిర్మించాలన్నారు. అలాగే, మధ్యలో వచ్చే కొండవీటి వాగు మీదగా ఫ్లయ్ వోవర్ నిర్మించాలని చెప్పారు. 16.5 కిలోమీటర్ల పొడవుతో వుండే గవర్నమెంటు కాంప్లెక్స్ యాక్సెస్ రోడ్డును ఇరుపక్కలా అత్యంత సుందరంగా, ఆకర్షణీయంగా వుండేలా నిర్మాణం చేయాలన్నారు. రాజధానిలో చేపట్టే తొలి నిర్మాణం అయినందున అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని కోరారు.

కొండవీటి వాగు వరద సంరక్షణ వ్యూహంపై ఈ సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. 421 చదరపు కిలోమీటర్ల మేర వుండే కొండవీటి వాగు క్యాచ్‌మెంట్ ఏరియాలో వంద సంవత్సరాల వర్షపాతం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని వరద సంరక్షణ చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వివరించగా, మరో 20 ఏళ్లను కూడా లెక్కించి పటిష్టమైన సంరక్షణ చర్యలను చేపట్టాలని సీయం చెప్పారు. కొండవీటివాగు ఫ్లడ్ ప్రొటెక్షన్ పనులు నగర సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేసేలా వుండాలని సూచించారు. కొండవీటి వాగును 24 వేల క్యూసెక్కుల సామర్ధ్యంతో వుండేలా వెడల్పు చేయాల్సివుంటుందని అధికారులు చెప్పగా, ఈ వాగు ద్వారా రాజధాని నీటి అవసరాలు తీర్చేలా కొత్త నగరంలో వేర్వేరు చోట్ల రిజర్వాయర్ల నిర్మాణం చేయాలని సీయం సూచించారు. కొత్త నగరంలో విద్యుత్ లైన్లను అధునాతన శైలిలో భూగర్భంలో వుండేలా కేబులింగ్ చేయాలని సీయం చెప్పారు. టెలికమ్యూనికేషన్ కేబుల్స్, ఇతర కేబుళ్లన్నీ భూగర్భ మార్గంలోనే అనుసంధానం చేయాలని చెప్పారు.

ల్యాండ్ పూలింగ్ స్ట్రాటజీపై సమావేశంలో చర్చ జరిగింది. భూములిచ్చిన రైతులకు అందించే ప్లాట్ల సైజుపై ముఖ్యమంత్రి ముందు కొన్ని ప్రతిపాదనలు వుంచారు. ఇది రాజధాని ప్రాంతంలోని అన్ని గ్రామాల ప్రజలకు తెలియజేసి వారి అభిప్రాయాలకు అనుగుణంగా మరో పది రోజులలో తుది నిర్ణయం తీసుకుందామని మంత్రి నారాయణ ప్రతిపాదించారు. అర్బన్ డెన్సిటీ ఎంత వుండాలి, నగర లేఔట్ ఎలా వుండాలన్న అంశాలపై సమావేశంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. మరో రెండు నెలలలో సిటీ లే ఔట్ ప్రణాళికలను సిద్ధంచేయాలని సీయం గడువు నిర్దేశించారు. అధికారులందరూ సమన్వయంతో వ్యవహరించి నగర నిర్మాణ వ్యూహాలు, ప్రణాళికలకు తుది రూపం తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మాస్టర్ కన్సల్టెంట్ ఎంపిక, మౌలిక సదుపాయాల కల్పన, వరద సంరక్షణచర్యలు, భూ సమీకరణ తదితర ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు.

ఈ సమావేశంలో ఆర్థికమంత్రి శ్రీ యనమల రామకృష్ణుడు, పురపాలక మంత్రి శ్రీ పీ నారాయణ, వ్యవసాయ మంత్రి శ్రీ పత్తిపాటి పుల్లారావు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, తాడికొండ శాసనసభ్యుడు శ్రీ శ్రావణ్ కుమార్, జిల్లాల కలెక్టర్లు శ్రీ బాబు, కాంతిలాల్ దండే, సీఆర్ డీఏ ముఖ్యకార్యదర్శి శ్రీ అజయ్ జైన్, కమిషనర్ శ్రీ నాగులాపల్లి శ్రీకాంత్, సిటీ పోలీస్ కమిషనర్ శ్రీ గౌతమ్ సవాంగ్, కమిషనర్ శ్రీ వీరపాండ్యన్, తదితర అధికారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో గండికోట అభివృద్ధి

– బౌద్ధ పర్యాటక కేంద్రంగా నాగార్జున సాగర్



కడప జిల్లా లోని గండికోటను అంతర్జాతీయ పర్యాటక స్థలంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. 6 నెలల్లోపు గండికోట ప్రాజెక్టు తొలిదశ నిర్మాణాలు పూర్తికావాలన్నారు. పర్యాటక శాఖ అధికారులతో సీఎం తన కార్యాలయంలో సమీక్షించారు. కడప జిల్లా పర్యటన పూర్తిచేసుకొని వచ్చిన నాలుగురోజుల్లోనే ప్రణాళిక అమలు కోసం శ్రీకారం చుట్టారు. భారతదేశంలో చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదలు కలిగి వున్న ప్రధాన ప్రాజెక్టు గండికోట అని సీఎం చెప్పారు. రాతి శిలలు, పెన్నానది, రిజర్వాయర్లు తదితరాలపై జియోలాజికల్ సర్వే జరిపాలన్నారు. మేజర్ ఎంటర్‌టైన్‌మెంట్, ఎడ్వెంచెర్ టూరిజం డెస్టినేషన్‌గా అభివృద్ధి చేసేందుకు మెరుగైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. అమెరికాలో ఉన్న గ్రాండ్ కెన్యాన్ ప్రాజెక్టు తరహాలో గాజు బాల్కనీ కట్టాలని నిర్ణయించారు. రోప్ వే, రాక్ క్లైంబింగ్, బోటింగ్ పార్క్ , అమ్యూజ్ మెంట్ పార్క్, షాపింగ్ ఏరియా, రిసార్ట్, తదితరాల నిర్మాణాలన్నీ భవిష్యత్తులో గండికోటకు రావాలని, అందుకు సరైన కన్సల్‌టెంట్‌ను ఏర్పాటు చేసుకొని సమగ్ర ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇప్పటికే 17 కోట్లతో అప్రోచ్ రోడ్డు, మరో కోటి రూపాయలతో మైలవరం నుండి రోప్ వే పాయింట్ వరకు రోడ్డు నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ల్యాండ్ స్కేపింగ్, బోటింగ్, గండికోట బస ఏర్పాట్లు కూడా పూర్తి చేయాలన్నారు. తిరుపతి, గండికోట, కడప దర్గా, ఒంటిమిట్ట ఆలయాలను కలుపుతూ తిరుపతి కేంద్రంగా ప్యాకేజ్ టూర్లను నిర్వహించాలన్నారు.

ఒంటిమిట్ట ఆలయ అభివృద్ధి

ఒంటిమిట్ట ఆలయాన్ని 20 కోట్ల రూపాయలతో తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధి చేస్తోందని, మరో 70 కోట్ల రూపాయలు కూడా ఖర్చు పెట్టేందుకు ముందుకొచ్చిందన్నారు. వచ్చే శ్రీరామ నవమి నాటికి నిర్మాణాలన్నీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కళ్యాణ వేదిక, హోటళ్లు, చౌల్ట్రీ నిర్మాణాల కోసం మాస్టర్ ప్లాన్ రూపొందించాలన్నారు. అందమైన పార్కులు రావాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమైన ఆలయంగా అభివృద్ధి అవకాశాలన్నీ ఒంటిమిట్ట ఆలయానికి ఉన్నాయన్నారు. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా వారి సహకారంతో ఆలయం అభివృద్ధి జరగాలని సీఎం అధికారులతో చెప్పారు.

బౌద్ధ కేంద్రంగా సాగర్

నాగార్జున సాగర్ బౌద్ధ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దే అవకాశాలను సీఎం పరిశీలించారు. మెగా, ఎంటర్‌టైన్‌మెంట్ థీమ్ పార్క్ రావాలని సీఎం ఆకాంక్షించారు. రాజమండ్రిలోని 6 ఎకరాలలో కన్వెన్షన్ సెంటర్ కూడా త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఇందులో హోటల్, మల్టీఫ్లెక్స్ ఎగ్జిబిషన్, షాపింగ్ మాల్ రావాలన్నారు. కోటప్పకొండ అభివృద్ధికి కూడా ప్రణాళిక సిద్ధం చేశామని అధికారులు చెప్పారు. ఈ ప్రాజెక్టులోని నిర్మాణాలన్ని పిపిపి పద్ధతిన అభివృద్ధిలోకి తెస్తామని పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నీరభ్ కుమార్ ప్రసాద్ సీఎంతో చెప్పారు. శ్రీకాకుళంలోని పండా, విశాఖపట్నంలోని సాగర్ నగర్‌ల్లో వేసైడ్ అమినిటీస్, తిరుపతిలో స్నోపార్క్, మధురవాడలో ఎంటర్‌టైన్‌మెంట్ జోన్, వైజాగ్, విజయవాడ, తిరుపతిలో ఐమాక్స్ థియోటర్స్ ప్రాజెక్టులు కొలిక్కి వచ్చాయని, త్వరలో పనులుకూడా ప్రారంభిస్తామని నివేదించారు.

తిరుపతిలో హాస్పిటాలిటి యూనివర్సిటి, కలినరి (పాకశాస్త్ర) ఇన్‌స్టిట్యూట్ ఒకే ప్రాంగణంలో వచ్చేలా పనులు వేగవంతం చేయాలని సీఎం కోరారు. గండికోట పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దడంపై సీఎం కృత నిశ్చయంతో వున్నారు. జిల్లాలో ఆహార, షాపింగ్ వంటి పండుగలు నిరంతరం నిర్వహిస్తూ వుండాలని సీఎం అధికారులను ఆదేశించారు. తిరుపతిలో 100 చెరువులను అభివృద్ధిలోకి తీసుకొచ్చి లేక్ సిటీగా, విజయవాడను కెనాల్ సిటీగా, విశాఖను బీచ్ సిటీగా అభివృద్ధిచేయాలని చెప్పారు. ఇప్పటికే పలు కంపెనీలు ఎంవోయులు కుదుర్చుకున్నాయని, వారికి ఇవ్వాల్సిన భూములను 21 రోజులలో ఇచ్చేయాలన సీఎం ఆదేశించారు. లక్ష్యాలను నిర్దేశించుకొని,ఆ ప్రాజెక్టుల ప్రగతి ఎంతవరకు వచ్చిందో ఎప్పటికప్పుడు తన డాష్ బోర్డులో పెట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్షలో అటవీశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎకె. ఫరిడా, పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, కమ్యూనికేషన్స్ సలహాదారు పరకాల ప్రభాకర్, ముఖ్యమంత్రి ముఖ్యకార్యదర్శి సతీష్ చంద్ర, కార్యదర్శి సాయిప్రసాద్, కడప జిల్లా కలెక్టర్ రమణ, సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ ఎన్. తాహిర్ తదితరులు పాల్గొన్నారు.

❖

రాష్ట్రంలో రానున్నది ఒక సాంకేతిక విప్లవం

– మంత్రి పల్లె రఘునాథరెడ్డి



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి లక్ష్యాలన్నీ నెరవేరితే, ఐటి రంగంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలవడానికి ఎంతోకాలం పట్టదు. ఈ ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యల వల్ల, రాష్ట్రంలో ఒక సాంకేతిక విప్లవం రానుంది. దీనివల్ల పాలనలో పారదర్శకత వస్తుంది, జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

కెమిస్ట్రీ లెక్చరర్‌గా జీవితాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా ఎదిగి, అనంతపురము జిల్లాలో 52 విద్యాసంస్థలను ఏర్పాటు చేసి, విద్యా రంగంలో తనకంటూ ఓ స్థానాన్ని కల్పించుకున్న డాక్టర్ పల్లె రఘునాథరెడ్డి సౌమ్యుడు, మృదు స్వభావిగా పేరు పొందారు. రాజకీయాల్లోకి వచ్చి, పుట్టపర్తి నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారిఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడి ప్రభుత్వంలో అయిదు కీలకమంత్రిత్వ శాఖలను నిర్వహిస్తున్నారు. ఐటి, సమాచార, భాషా సాంస్కృతిక, ఎన్నారై సంబంధాలు, మైనారిటి వ్యవహారాల శాఖల మంత్రి పల్లె రఘునాథరెడ్డి తన కార్యాలయంలో 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కొన్ని భాగాలు.

ఇటీవలి మీ అమెరికా పర్యటన ఉద్దేశం ఏమిటి? ఏమేరకు ఈ పర్యటన ఫలితాన్ని ఇచ్చింది?

ముఖ్యమంత్రిచంద్రబాబు నాయుడు గతంలో చేసిన కృషి ఫలితంగా, అమెరికాలో మన తెలుగువాళ్ళు చాలామంది ఐటి రంగంలో స్థిరపడ్డారు. ఈ రంగంలో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. సొంతంగా కంపెనీలు నడుపుతున్నారు. వీళ్ళను మన రాష్ట్రానికి ఆహ్వానించి, ఇక్కడ ఐటి పరిశ్రమను బలోపేతం చెయ్యాలని, మన యువకులకు ఈ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించాలని అమెరికాకు వెళ్ళాము. అంతేకాదు. ఐటి పరిశ్రమలను ప్రోత్సహించేందుకు మన ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విధానాలని, మనం అందిస్తున్న సహాయ సహకారాలని తెలియజెప్పేందుకు ఈ పర్యటన చేపట్టాం. మనం ఇస్తున్న రాయితీలు ఉపయోగించుకొని, పెద్ద ఎత్తున పరిశ్రమలని పెట్టమని కోరాం. మేము శాన్‌ఫ్రాన్సిస్కో, ఆస్టిన్, డాలాస్, చికాగో, న్యూజెర్సీ, న్యూయార్క్, బోస్టన్ వంటి సిటీలు పర్యటించాము. మేం ఎక్కడకు వెళ్ళినా, చంద్రబాబుగారి నాయకత్వం మీద అపార నమ్మకం వ్యక్తమైంది. అక్కడకక్కడే 48 మంది ఐటి, ఎలక్ట్రానిక్ రంగాల్లో పరిశ్రమల స్థాపనకు ఆసక్తి చూపారు. అమరావతి నిర్మాణం మీద ఆసక్తితో 17 లక్షల ఈ–ఇటుకలను కొన్నారు. నా దగ్గర చదువుకున్న చాలామంది విద్యార్థులు కూడా వీరిలో ఉన్నారు. వీరంతా, మాకు మంచి స్వాగత సత్కారాలు చేశారు. ఈ పర్యటనలో ఆస్టిన్, హార్వర్డ్, ఎంఐటి విశ్వవిద్యాలయాలతో కొన్ని కోర్సుల కోసం ఒప్పందాలు కూడా కుదిరాయి. మొత్తంగా, ఈ పర్యటన ఫలప్రదమైందని భావిస్తున్నాము.

ఆంధ్రప్రదేశ్‌లో ఐటి పరిశ్రమ చంద్రబాబు గారి నాయకత్వంలో బాగా వృద్ధి చెందిన విషయం తెలిసిందే. అప్పుడు ఏడాదికి 65 వేల కోట్ల రూపాయల ఎగుమతులు, 3.5 లక్షల ఉద్యోగాలు ఈ రంగంలో ఉండేవి. విభజన తర్వాత, ఎగుమతులు రూ.1500 కోట్లు, ఉద్యోగాలు 25 వేలకి పడిపోయాయి. మన ప్రభుత్వం ఈ రంగం మీద దృష్టి పెట్టాక, కొత్తగా 37 కంపెనీలు ముందుకువచ్చాయి. రూ.3, 4 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. 40 వేల నుంచి 50 వేల వరకు ఉద్యోగాల కల్పన జరుగుతుంది. విశాఖపట్నం, చిత్తూరు, అనంతపురాలని ఐటి కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ఈ ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. మధురవాడలో హిల్1, హిల్ 2, హిల్ 3 లలో ఐటి మౌలిక సదుపాయాలు కల్పించాము. 50 వేలచదరపు అడుగులలో ఒక ఇంక్యుబేషన్ సెంటర్‌ను నిర్మించాము. ఇక్కడ దాదాపు 150 స్టార్టప్పులు పనిచేస్తున్నాయి. దక్షిణ ఆసియాలోనే పెద్దదిగా 20 లక్షల చదరపు అడుగుల సిగ్నేచర్ టవర్‌ను కట్టబోతున్నాం. త్వరలోనే, ముఖ్యమంత్రి దీనికి శంకుస్థాపన చేయబోతున్నారు. విశాఖలోనే 1400 ఎకరాల్లో ఐటి ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌ని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. అదే విధంగా, కాకినాడలో ఒక ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశాము. మంగళగిరిలో వెయ్యి ఎకరాల్లో బిగ్ డేటా సెంటర్‌ను నెలకొల్పాలని నిర్ణయించాం.

రాయలసీమలో ఐటీ, ఎలక్ట్రానిక్ రంగాలలో ఎలాంటి ప్రగతి ఉంది?

తిరుపతిలో ప్రైవేటు రంగంలో ఒకటి, ప్రభుత్వ

మైనారిటీలకు అటు సంక్షేమం, ఇటు ఆర్థిక పరిపుష్టి కల్పించాలని సంకల్పించాం. అందుకే, మైనారిటీల్లో అక్షరాస్యత శాతం పెంచడం మీద దృష్టి పెట్టాం. వారికోసం రెసిడెన్షియల్ స్కూళ్లు, స్టడీ సెంటర్లు ప్రారంభించాం. తాజాగా, ఉర్దు విశ్వ విద్యాలయానికి శంకుస్థాపన చేశాం. వక్ఫ్ ఆస్తులను కాపాడి, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని, ముస్లిముల ఆర్థికాభివృద్ధికి వినియోగించాలని ఈ ప్రభుత్వం కృషి చేస్తోంది.

రంగంలో ఒకటి ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి, స్టార్టప్‌లకు ఇచ్చాం. అక్కడే, కార్బన్, సెల్‌కాన్ వంటి కంపెనీలు వచ్చాయి. ఇక, శ్రీసిటి ఇప్పటికే అమెరికాలోని సిలికాన్ వ్యాలీ మాదిరిగా తయారైంది. ఫాక్స్‌కాన్ వంటి ప్రపంచ దిగ్గజాలు ఇప్పటకే శ్రీసిటిలో కార్యకలాపాలు మొదలు పెట్టాయి. ఇంకా, చాల అంతర్జాతీయ కంపెనీలువచ్చే అవకాశం ఉంది. అనంతపురములో ఇప్పుడిప్పుడే ఐటి కంపెనీలు వస్తున్నాయి. ఇక 210 ఎకరాల్లో ఐటి పార్క్ పెట్టే ప్రతిపాదన ఉంది. ఒక ఎలక్ట్రానిక్ మానుఫాక్చరింగ్ క్లస్టర్ వచ్చింది. అనంతపురములో రెండు, చిత్తూరులో రెండు, విశాఖలో ఒకటి, కాకినాడలో ఒకటి ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ల ఏర్పాటుకు ప్రాథమిక అనుమతులు వచ్చాయి. రాగ మయూరి పేరుతో అనంతపురములో క్లస్టర్‌కు ఇప్పటికే తుది అనుమతులు కూడా వచ్చాయి. ఇవన్నీ ఒక కొలిక్కి వస్తే, రాష్ట్రంలో ఐటి, ఎలక్ట్రానిక్ రంగం వేళ్ళూనుకుంటుంది.

ఈ నాలుగేళ్ళలో ఐటి రంగంలో లక్ష ఉద్యోగాలు ఇవ్వాలి. రూ.12 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలి అనేది లక్ష్యం. ఎలక్ట్రానిక్ రంగంలో 4 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలి. రూ.30 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రావాలి. ప్రతి ఇంటిలో ఒక ఈ లిటరేట్‌ను తయారు చేయాలి. ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ అనుసంధానం ఉండాలి. ఈ సర్వీసుల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉండాలి. సిలికాన్ కారిడార్ ఆఫ్ ఇండియాగా మన రాష్ట్రాన్ని మలచాలని సంకల్పిస్తున్నాం.

ప్రభుత్వ పాలనలో ఐటీని ఎలా సద్వినియోగం చేస్తున్నారు?

కోటి 20 లక్షల రేషన్ కార్డులని ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చాం. 84 లక్షల మంది రైతుల ఎకౌంట్ల వివరాలను పొందుపరిచాం. 80 లక్షల మంది డ్వాక్రా మహిళల బ్యాంకు ఖాతాల వివరాలను కంప్యూటరీకరణ చేశాం. 43 లక్షల మంది పింఛనుదారుల వివరాలు ఆన్‌లైన్‌లోకి తీసుకు వచ్చాం. ఆధార్‌తో 98 శాతం మంది, అంటే 4 కోట్ల 85 లక్షల మందిని, అనుసంధానం చేశాం. దేశంలో ఇంతపెద్ద ఎత్తున ఆధార్ అనుసంధానం మన రాష్ట్రంలోనే జరిగింది. అదే విధంగా, 33 శాఖల కార్యకలాపాలు ఆన్‌లైన్‌లోనే జరిగే ఏర్పాటు చేశాం. క్యాబినెట్ సమావేశాలు ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయి. కృష్ణా జిల్లాలో అన్ని ఆఫీసు వ్యవహారాలూ ఆన్‌లైన్‌లోనే. త్వరలోనే మిగతా జిల్లాలు ఇదే బాట పట్టేలా చర్యలు తీసుకుంటున్నాం. కాగిత రహితంగా, తద్వారా పారదర్శకంగా ప్రభుత్వ కార్యకలాపాలు జరగాలని మా ఉద్దేశం. ఈప్రగతి పేరుతో అన్ని సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చేందుకు ప్రారంభించిన ప్రాజెక్టు దేశంలోనే మొట్టమొదటిది. మెరుగైన, నాణ్యమయిన, సత్వర, పారదర్శక సేవలు అందించడానికి ఈప్రగతి దోహదం చేస్తుంది. ఈ ప్రాజెక్టుని 2,500 కోట్ల రూపాయల ఖర్చుతో చేపట్టాం. ఈ ప్రభుత్వ చొరవ వల్ల మన రాష్ట్రంలో రెండు, మూడేళ్ళలోనే సాంకేతిక విప్లవం వస్తుంది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఈ సాంకేతికత ఎంతో దోహదం చేస్తుంది.

మైనారిటీలకు సంబంధించి ప్రభుత్వ లక్ష్యాలేమిటి?

మైనారిటీల్లో అక్షరాస్యత శాతం తక్కువగా ఉంది. దీనిని పెంచేందుకు హాస్టళ్ళు, శిక్షణ సంస్థలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఉర్దు మీడియం స్కూళ్ళు ఏర్పాటు చేస్తున్నాం. ఉర్దును రెండో అధికార భాషగా ప్రకటించింది కూడా మా ప్రభుత్వమే. హైదరాబాద్‌లో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ యునివర్సిటి స్థాపనకు కృషి చేసింది కూడా మేమే. ఈ ప్రయత్నాల్లో భాగంగానే ఇప్పుడు ముస్లిం జనాభా ఎక్కువ ఉన్న కర్నూలు జిల్లాలో ఉర్దు యునివర్సిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. దక్షిణ భారత దేశంలోనే తొట్ట తొలిదైన ఈ యూనివర్సిటీ వల్ల ఉర్దులో ఉన్నత విద్య అభ్యసించడానికి వీలవుతుంది. అలాగే, మైనారిటి స్టడీ సర్కిళ్ళను అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటకే ఏర్పాటుచేశాం. త్వరలో విజయవాడలో ఏర్పాటు చేయబోతున్నాం. వీటి వల్ల పోటి పరీక్షల్లో మంచి తర్ఫీదు పొందడానికి వీలవుతుంది. మైనారిటిలకు సంక్షేమ కార్యక్రమాలను కూడా ఇదే స్థాయిలో చేస్తున్నాం. షాదీఖానాలు, అషర్ ఖానాలు, ఈద్గాలు, స్మశానాలు తదితర మౌలిక సదుపాయాలతో పాటు, పేద ముస్లిం యువతుల పెళ్ళికి దుల్హన్ పథకం కింద 50 వేల రూపాయలు అందిస్తున్నాం. ముస్లింలలో స్వయం ఉపాధి కల్పించడానికి, దుకాన్-మకాన్, రోష్ని వంటి పథకాలను పునరుద్ధరించాం. హజ్ యాత్ర కోసం 2300 మందికి పోయినేడాది సాయం చేశాం. పండగనాడు అందరు సంతోషంతో ఉండాలనే ఉద్దేశంతో చంద్రన్న రంజాన్ తోఫా పేరుతో నిత్యావసరాలు అందించాం. మరో ముఖ్యమైన అంశం వక్ఫ్ ఆస్తుల రక్షణ. రాష్ట్రంలో దాదాపు 40 వేల ఎకరాల వక్ఫ్ భూములు ఆక్రమణకు గురయ్యాయి. వీటిని కాపాడేందుకు జివో నెంబరు18 ఇచ్చాం. ఈ వక్ఫ్ భూములను సంరక్షించి, తద్వారా గడించే ఆదాయాన్ని, ముస్లింల అభ్యున్నతికి వినియోగించాలని నిర్ణయించాం. ఇవి కాక, హజ్ హౌస్ ఒకటి కడపలో కడుతున్నాము. ఒకటి విజయవాడలో కడుతున్నాము.

సాంస్కృతిక రంగంలో చేస్తున్న కృషి ఏమిటి?

తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలను కాపాడటం, పటిష్టం చేయడం ఈ ప్రభుత్వ ధ్యేయం. అల్లూరి సీతారామరాజు, నందమూరి తారక రామారావు, టంగుటూరి ప్రకాశం పంతులు, విశ్వనాథ సత్యనారాయణ, గురజాడ అప్పారావు, బాపువంటి ప్రముఖుల జయంతిని రాష్ట్ర పండుగలగా జరుపుతున్నాం. నాట్యం, నాటకాలు వంటి కళలకు ప్రోత్సాహం కల్పించేందుకు పురస్కారాలు అందజేస్తున్నాం. కూచిపూడి నాట్యారామానికి వంద కోట్ల రూపాయలు అందజేయడం జరిగింది. అలాగే, తెలుగు పురాతన సంస్కృతిని కాపాడాలనే లక్ష్యంతో చంద్రబాబు నాయుడి ప్రభుత్వం పనిచేస్తోంది.

❖

బ్రహ్మ మురారి సురార్చిత లింగం!

భూమండలంపై తొలి శివలింగం- గుడిమల్లం రుద్రుడు



చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలంలోని గుడిమల్లం అనే కుగ్రామంలో శివలింగం క్రీస్తుపూర్వం ఒకటో శతాబ్దపు కాలం నాటిదని పురావస్తు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. శ్రీకాళహస్తికి దగ్గరలో ఉండే ఈ ఆలయం భారతదేశంలో శివారాధన ప్రాచీనత తెలిపే వొక అపురూప సాక్ష్యం.

ప్రపంచంలోని అత్యంత పురాతన శివలింగం కాశిలో లేదు, రామేశ్వరంలోనూ లేదు, ఆసియాఖండంలో వేరెక్కడో లేదు- అది మన రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా ఏర్పేడు మండలంలోని గుడిమల్లం అనే కుగ్రామంలో వుంది! యిది ప్రముఖ భారతీయ, అంతర్జాతీయ పురావస్తు శాస్త్రవేతలు నిగ్గుదేల్చిన సత్యం. ఈ శివలింగం క్రీస్తుపూర్వం ఒకటో శతాబ్దపు కాలం నాటిదని వారు తమ అవగాహన మేరకు వేసిన అంచనా యిది.

1911లో గోపీనాథరావు అనే పురావస్తు శా- స్త్రవేత్త సంవత్సరం పాటు పరిశోధించి, ఈ ఆలయంలోని శాసనాలను పరిష్కరించి అద్భుతమైన ఈ లింగం వునికి తన పరిశోధనా పత్రంలో ప్రపంచానికి చాటాడు. ప్రారంభంలో ఆరుబయట ప్రతిష్టించిన ఈ లింగంపై క్రీస్తు.శకం 9వ శతాబ్దినుంచీ వివిధ రాజవంశాలు ఆయా కాలాలలో గుడి నిర్మించి పూజలు పునస్కారాలు నిర్వహించారని శాసనాధారాలు తెలియజేస్తున్నాయి. పురావస్తు శాస్త్రవేత్తలు ఈ లింగం చుట్టూ జరిపిన తవ్వకాలలో దొరికిన ఎముకల్ని బట్టి ఈ లింగానికి ప్రాచీన కాలంలో బలులు సైతం సమర్పించేవారనే అంచనాకు వచ్చారు.

సువిశాలమైన ఈ ఆలయ ప్రాంగణం చుట్టూ

క్రీస్తుశకం 8వ శతాబ్ది నుంచీ వరుసగా బాణ, చోళ, పల్లవ, విజయనగర రాజులు సూర్య, పార్వతీ, సుబ్రమహేశ్వరస్వామి గుళ్ళు, బావులూ నిర్మించారని శాసనాధారం. 1973లో భారతీయ పురావస్తుశాఖ నిర్వించిన తవ్వకాలలో క్రీస్తుపూర్వం 1–2 మట్టిపాత్రలు 42x21x6 సెంటీమీటర్ల సైజు ఇటుకలు లభించాయి. అంతే తప్ప ఈ లింగం గురించి, దానిని ప్రతిష్ఠించిన వారు గురించీ ఎటువంటి వివరాలూ లభ్యం కావడం లేదు.

ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా పురుషాంగాన్ని పోలివుండే ఈ 7 అడుగుల శివలింగంపై పురుషాంగంపై వుండే సన్నని ఈనెలను సైతం అద్భుతంగా స్పష్టంగా ప్రతిఫలించేలా మలచారు. ఈ లింగంపై ఒక చేత్తో పరశువునూ మరో చేత్తో గొర్రెను పట్టుకొని ఒక యక్షుడి భుజాలపై నిలబడిన రుద్రుడిని 'ధ్యానప్రతిమ'గా చూపడం ఈ శిల్ప విశేషం. అలాగే తలపాగా ధోవతి ధరించిన ఈ రుద్రుడి వస్త్రధారణ ఋగ్వేద కాలం నాటిదని చరిత్రకారుల అంచనా.

ప్రాచీనశైవ జీవన విధానాన్ని సవివరంగా తెలిపే ఈ అద్భుతాన్ని చెక్కేందుకు వాడినరాయి గురించి ఎటువంటి సమాచారము లేదు. ఆలయంలో దొరికిన శాసనాల్లో దీన్ని పరమేశ్వర ఆలయంగా దీని యజమాని/అధికారి రుద్రుడిగా పేర్కొన్నారు (రుద్ర:యజమాన:) శివుని అనేక రూపాలను ఏకలింగంపై నాటి శిల్పకారులు నైపుణ్యతతో మలచడం విశేషం. ఈ లింగం కింద 350 అడుగుల లోతులోని వాటర్ టెబుల్‌పై నీటి ఒత్తిడి పెరిగితే ఆ నీరు లింగాన్ని అభిషేకించేలా ఇంజనీరింగ్ పనితనంతో, నిపుణతతో నిర్మాణ చాతుర్యం చూపారు. అలాగే ఈ లింగం తాళం ఆకారంలో ప్రతిష్టించినందువల్ల దీన్ని ఏ మాత్రం కదిలించినా గజపృష్ఠ(ఏనుగు వెనుకవైపు) అకారంలో వుండే గుడి మొత్తం కూలిపోతుందని కొందరంటారు. అనందకుమార స్వామి, జితేంద్ర నాథ్ బెనర్జీ వంటి ఎందరో పురాతత్త్వవేత్తలు, చరిత్రకారులూ, శాస్త్రవేత్తలూ శిల్పచరిత్రలోనే అపురూపమైన ఈ శివలింగాన్ని తమ రచనల్లో అభిమానించి, ఆరాధించి, ప్రేమించారు.

పురావస్తుశాస్త్రవేత్తలు తమకు అందుబాటులోని పరిజ్ఞానంతో ఈ శివలింగం క్రీస్తుపూర్వం 1,2 శతాబ్దాల నాటివని తేల్చినా తదనంతరం దానిపై నిర్మాణమైన ఆలయం ఇతర కట్టడాల వాస్తుశైలి అమరావతి, మధుర వాస్తుశైలిని పోలివుందని తేల్చారు. కొన్ని దశాబ్దాల క్రితం ఉజ్జయినిలో పురావస్తు తవ్వకాలలో లభించిన క్రీస్తుపూర్వ 2,3 శతాబ్దాలకు చెందిన రాగినాణాలపై ఈ శివలింగాన్ని పోలిన చిత్రాలు వున్నాయి. అలాగే నెల్లూరు చెరువులో ఇటువంటి లింగం కూడా ఆరుబయటే వుంది. యింకా మధురై మ్యూజియంలో ఇటువంటి లింగాన్ని పోలిన ఆకృతి వుంది. శ్రీకాళహస్తికి దగ్గరలో ఉండే ఈ ఆలయం భారతదేశంలో శివారాధన ప్రాచీనత తెలిపే వొక అపురూప సాక్ష్యం. ప్రముఖ పురాతత్త్వవేత్త ఇంగువ కార్తికేయ శర్మ తన రచనల్లో అనేక ఆధారాలతో సహా మొత్తం భారతదేశంలోనే ఇది ప్రాచీన రుద్రలింగంగా తగిన ఆధారాలతో నిరూపించాడు.

ఈ ఆలయాన్ని 1954 లో ఆర్కియాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఆశీ) స్వాధీనం చేసుకొని రక్షితకట్టడంగా ప్రకటించి సంరక్షిస్తుంది. అయితే 1968 నుంచీ 1972 వరకూ వరసగా ఈ ఆలయంలో గణేశ, శివకామసుందరి, అనందవల్లి, నటరాజు, లక్ష్మి విగ్రహాలు ఒక తోరణం మొత్తం 9 పంచలోహ విగ్రహాలు చోరీకి గురయ్యి తిరిగి దొరకలేదు. ఇంగువకార్తికేయ శర్మ రాసిన పరమేశ్వర టెంపుల్ ఎట్ గుడిమల్లం, ద డెవలప్ మెంట్ ఆఫ్ ఎర్లీ శైవ ఆర్ట్ అండ్ ఆర్కిటెక్చర్, ఆర్కియాలజీ వారి తవ్వకాల నివేదికలు, కొన్ని పరిశోధన పత్రాలు తప్ప 1980 తర్వాత ఈ ఆలయంపై పరిశోధనలు దాదాపు శూన్యం. ఈ అంశంపై మరింత పరిశోధన జరిగితే అత్యంత ప్రాచీన శైవ పూజా విధానానికి మన రాష్ట్రం ప్రధాన కేంద్రమనే విషయం నిర్ధారణ అవుతుంది.

ప్రపంచంలోని ఏడు వింతలకు పదిమెట్లు పైనే వుండే ఈ శివలింగం, కాల ప్రభావాన్ని సవాలు చేస్తూ అనంత వత్సరాలుగా చెక్కు చెదరకుండా అలా నిలిచే వుంది ఇప్పటికీ. ఎప్పుడో భూమి మీద వశించి, గతించి పోయిన వొకనొక మానవ సమాజ సామూహిక, ధార్మిక, అలౌకిక విశ్వరూపం యిది. వారి మస్తిష్కపు మధుర స్మృతుల సాక్ష్యమిది.

– డా. లెనిన్ ధనిశెట్టి

విశాఖ మీదుగా చైనా 'పట్టు' మార్గం

చైనా ప్రతిపాదిత సిల్క్ రూటును రాష్ట్రంలోని విశాఖపట్నం మీదుగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కోరారు. కోల్‌కతా, చెన్నయ్‌లతో పోల్చితే ఏపీ తూర్పుతీరానికి సరిగ్గా మధ్యభాగంలో వున్నదని, మేరీటైమ్ సిల్క్ రోడ్డుకు ఈ రాష్ట్రం అన్నివిధాలుగా ఆకర్షణీయమైనదని ముఖ్యమంత్రి చైనా బృందానికి వివరించారు. పెట్టుబడులకు షాంగై తరువాత అమరావతిని సెకండ్ హోమ్‌గా భావించాలని కూడా ముఖ్యమంత్రి ఆ బృందానికి సూచించారు.

విజయవాడకు విచ్చేసిన చైనా ప్రభుత్వ ఇంటర్నేషనల్ డిపార్టుమెంటు ఉపమంత్రి చెన్ పెంగ్జిన్, మరో ఆరుగురు ప్రతినిధుల బృందానికి క్యాంప్ కార్యాలయంలో సాదరంగా స్వాగతం పలికిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తరువాత వారితో వివిధ అంశాలపై చర్చలు జరిపారు. పెట్టుబడులు పెట్టడానికి ఎవరికైనా అవకాశాలు దొరుకుతాయి కానీ, ఒక రాజధాని నగర నిర్మాణంలో పాలుపంచుకునే అవకాశం మాత్రం అరుదుగా దొరుకుతుందని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా చెప్పారు.

భారత్ పర్యటనలో మొట్టమొదట ఆంధ్రప్రదేశ్‌కే రావాలని అనుకున్నానని, ఇక్కడ తమ తొలి ప్రాధాన్యం ఏపీయేనని చైనా ప్రభుత్వ ఇంటర్నేషనల్ డిపార్టుమెంటు ఉపమంత్రి చెన్ పెంగ్జిన్ ముఖ్యమంత్రితో మాట్లాడుతూ చెప్పారు. రాజధాని నిర్మాణం అతిపెద్ద ప్రాజెక్టుగా చెన్ అభివర్ణించారు. తెల్లకాగితంపై అద్భుతమైన చిత్రాన్ని గీసే అవకాశం వున్నట్టే రాజధాని కట్టుకునే అరుదైన అవకాశాన్ని ఉపయోగించుకుని అద్భుతమైన నగరాన్ని నిర్మించవచ్చునని వ్యాఖ్యానించారు. చైనా–భారత్ మధ్య సహకార సంబంధాలు మరింత బలపడాలని ప్రగాఢంగా కోరుకుంటున్నామని అన్నారు.

'మీ దార్శనికత, దృఢ సంకల్పం, సమర్థమైన నాయకత్వం ముగ్ధుల్ని చేస్తున్నా'యని చైనా ఉపమంత్రి ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని ప్రశంసించారు. ఇదే చొరవతో రాజధాని నిర్మాణాన్ని శీఘ్రగతిన పూర్తిచేయగలరన్న విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. అనేక రాజధాని నగరాల్ని చూశామని, అమరావతి వాటన్నింటికంటే విలక్షణమైనదిగా రూపుదిద్దుకుంటుందని భావిస్తున్నట్టు చెప్పారు.

❖

అవార్డులు - రివార్డులు

- అప్పాజోస్యుల విష్ణుభట్ల కందాళం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2016 సంవత్సరానికి గాను పలువురికి పురస్కారాలను ప్రకటించారు. ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారాన్ని ఓల్గాగా ప్రసిద్ధి చెందిన పోపూరి లలితకుమారికి, సరిలేరు నీకెవ్వరు విశిష్ట సాహిత్య పురస్కారాన్ని మహ్మద్ ఖదీర్‌బాబుకు, సరిలేరునీకెవ్వరు విశిష్ట రంగస్థల పురస్కారాన్ని కె.విజయలక్ష్మికి ప్రకటించారు.
- ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్ ఉత్తమ బ్యూరోక్రాట్ అవార్డు అందుకున్నారు. అత్యుత్తమ సామర్థ్యం గల సంస్థలుగా ఏపీ జెన్‌కో, ట్రాన్స్‌కోలకూ అవార్డులు దక్కాయి.
- విద్యుత్ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ఏటా ఇచ్చే ప్రతిభా పురస్కారం ఈ ఏడాది విజయవాడ ఎన్టీటీపీఎస్ ట్రయినింగ్ ఇనిస్టిట్యూట్ చీఫ్ ఇంజనీరు ఎం.పద్మాసుజాతకు దక్కింది. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీలలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి కేంద్ర విద్యుత్ శాఖ ఏటా ఈ అవార్డులు ఇస్తుంది.
- ఢిల్లీకి చెందిన పవర్ ఇండియా ఈ ఏడాది ఉత్తమ విద్యుత్ ఉత్పత్తి సంస్థగా ఏపీ జెన్‌కోను ఎంపిక చేసింది.
- సాహితీవేత్త డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు స్మారక అవార్డును 2015 సంవత్సరానికి నటుడు, రచయిత గొల్లపూడి మారుతీరావుకు ప్రకటించారు.

జాతీయం

- హిందూ వితంతువు జీవనానికి అవసరమయ్యే డబ్బు, ఆస్తి కేవలం లాంఛనంగా ఇచ్చేదికాదని, అది ఆమెకు నైతికంగా లభించే హక్కని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆమె జీవనం కోసం భర్త నుంచి లభించే ఆస్తిపై పూర్తి హక్కు ఉంటుందని, దీనికి చట్టపరమైన రక్షణ కూడా ఉంటుందని పేర్కొంది.
- టికెట్ రద్దు చేసుకొనే ప్రయాణీకులపై రైల్వే శాఖ భారాన్ని పెంచింది. ఇప్పటి వరకు ఉన్న చార్జీలను రెట్టింపు చేసింది.
- ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో ప్రపంచంలోని అత్యుత్తమ 100 విశ్వ విద్యాలయాల్లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ , బెంగళూరు 99వ స్థానం సంపాదించింది.
- ఆధునిక టార్పెడో రక్షణ వ్యవస్థ 'మారిచ్' భారత నావికా దళంలో చేరింది.
- దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షల ప్రక్రియలో భారీ మార్పులు చేయాలని ఉన్నత స్థాయి కమిటీ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. నాలుగు లక్షల మంది విద్యార్థులను షార్టు లిస్ట్ చేసే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ పరీక్ష కోసం ఆప్టిట్యూడ్ టెస్టులు నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని సూచించింది.
- డిజిటల్ ఇండియాలో భాగంగా కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ కొన్ని యాప్‌లను ప్రారంభించింది. స్టడీ మెటీరియల్ కోసం ఈపాఠశాల, సీబీఎస్ఈ పాఠశాలల కోసం 'సారాంశ్' యాప్‌లను ప్రారంభించింది.
- లీటర్ పెట్రోల్ పై రూ.1.60, లీటర్ డీజిల్ పై 40 పైసలు ఎక్సైజ్ సుంకాన్ని కేంద్రం పెంచింది.
- సైనికులు 40 ఏళ్ళుగా ఎదురు చూస్తున్న ఒకర్యాంకు ఒక పెన్షన్ పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం ఒకే ర్యాంకులో పనిచేసి గతంలో రిటైరైన ఉద్యోగులకు అదే ర్యాంకులో పనిచేసి 2013 తర్వాత రిటైరైన ఉద్యోగులతో సమానంగా పెన్షన్ అందనుంది.
- ఒంటరి తండ్రికి కూడా పిల్లల సంరక్షణకు సంబందించిన సెలవును వర్తింప చేయాలని ఏడో వేతన సంఘం సిఫారసు చేసింది.
- పట్టణ పేదరిక నిర్మూలనలో భాగంగా ఆర్థికంగా వెనక బడిన వర్గాల కోసం ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్, రాజస్తాన్ రాష్ట్రాలకు కేంద్రం 2,28,204 ఇళ్ళను మంజూరు చేసింది. అందరికీ ఇళ్ళు పథకం కింద ఆంధ్ర ప్రదేశ్‌లోని 37 పట్టణాలకు 1,93,147, తెలంగాణలోని పది పట్టణాలకు 10,290 ఇళ్ళు మంజూరయ్యాయి.
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాన్ని 23.55 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు.
- కొత్తవలస, కోరాపుట్ రైల్వే లైన్ డబ్లింగ్ పనుల ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.
- కశ్మీరీ శరణార్థుల కోసం కశ్మీర్ లోయలో అదనంగా మూడు వేల ప్రభుత్వ ఉద్యోగాలను, ఆరు వేల తాత్కాలిక నివాసాలను ఏర్పాటు చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. అలాగే జమ్మూ పర్వత ప్రాంతాల నుంచి నిర్వాసితులయిన వారికి అందించే ఆర్థిక సాయాన్ని కూడా పెంచాలని నిర్ణయించింది.
- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన జీశాట్15 ప్రయోగం విజయ వంతమయ్యింది. 3,164 కిలోల జీశాట్15 ప్రస్తుతం సేవలందిస్తున్న ఇన్‌శాట్ 3డీ, 4బీల స్థానంలో సేవలందిస్తుంది.
- పీ8 నిఘా విమానాన్ని జాతికి అంకితం చేశారు. ఈ దీర్ఘ శ్రేణి సముద్ర గస్తీ విమానం ప్రపంచంలోనే అత్యుత్తమ నిఘా విమానాల్లో ఒకటిగా పేర్గాంచింది.

రాష్ట్రీయం

- ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి చుట్టూ నాలుగు ఎక్స్‌ప్రెస్ వేలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. వీటిలో గుంటూరు జిల్లా పరిధిలో మంగళగిరి వైజంక్షన్ ఎన్ఆర్ఐ ఆస్పత్రి నుంచి అనంతవరం వరకు, వెంకటపాలెం నుంచి ఎన్ఆర్ఐ ఆస్పత్రి వరకు, కృష్ణా జిల్లాలో జూపూడి నుంచి బోరుపాలెం మీదుగా అనంతవరం వరకు ఎక్స్‌ప్రెస్ వేలు నిర్మించనున్నారు. మణిపాల్ ఆస్పత్రి నుంచి లోటస్ ఫుడ్ సిటీ మీదుగా ఉండవల్లి ఇస్కాన్ టెంపుల్, హరిశ్చంద్ర పురం వరకు నిర్మించే ఎక్స్‌ప్రెస్ వే ఇస్కాన్ టెంపుల్ వద్ద ఆర్టీరియల్ రోడ్డుగానూ, ఎక్స్‌ప్రెస్ వేగా రెండుగా చీలుతుంది.
- ఆర్టీసీలో విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగి భార్య , భర్తకు జీవితాంతం ఆర్టీసీ బస్సుల్లో సగం చార్జీతో ప్రయాణించే సౌకర్యం కల్పిస్తూ ఆర్టీసీ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది.
- పదో తరగతి పబ్లిక్ పరీక్షలను మార్చి 26వ తేదీ నుంచి నిర్వహించాలని నిర్ణయించారు.
- ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు వచ్చే ఏడాది మార్చి నెల 11 నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు.
- ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా కనీస మద్దతు ధరను ఏగ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.1450, సాధారణ రకానికి రూ.1410గా నిర్ణయించింది.
- సాగునీటి వినియోగదారుల సంఘాలకు విధానపరమైన మార్గదర్శకం చేయడానికి వీలుగా నీటిపారుదల శాఖ మంత్రి అధ్యక్షతన అపెక్స్ కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- కర్నూలులో ఉర్దూ వర్శిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.
- పదవీ విరమణ చేసిన తరువాత ఉద్యోగులకు ఇచ్చే గ్రాట్యుటీని పది లక్షల రూపాయలకు పరిమితం చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.
- రిజిస్ట్రేషన్ల శాఖలో ఈస్టాంపింగ్ విధానం ప్రవేశ పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.
- అనంతపురం జిల్లాలో ప్రముఖ పుణ్య క్షేత్రం లేపాక్షి ఉత్సవాలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 27,28 తేదీల్లో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.
- ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు పొందిన రోగులకు ఇక నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోనే మందులను అందజేయాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది.
- రాష్ట్రంలో 11 ప్రధాన ఆలయాల్లో పనిచేసే ఉద్యోగులకు కొత్త పిఆర్సీ అమలు చేయాలని దేవాదాయ శాఖ నిర్ణయించింది. ఈ నిర్ణయంతో సింహాచలం, అన్నవరం, ద్వారకాతిరుమల, విజయవాడ కనక దుర్గ, శ్రీశైలం, శ్రీకాళహస్తి, కాణిపాకం, పెనుగంచిప్రోలు, మహానంది, విశాఖపట్నం కనకమహాలక్ష్మి, కసాపురం ఆంజనేయ స్వామి ఆలయాల పరిధిలో పని చేస్తున్న దాదాపు 3000 మంది ఉద్యోగులు ప్రయోజనం పొందనున్నారు.

నియామకాలు

- సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ టీఎస్ ఠాకూర్ నియమితులయ్యారు.
- విశాఖ జిల్లా అటవీ అధికారిగా పని చేస్తున్న పి.రామ్మోహనరావును గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో ఇసుక వ్యవహారాలకు ప్రత్యేక అధికారిగా నియమించారు.

వార్తలు.. విశేషాలు

- దేశంలోనే తొలిసారిగా కేవలం లింగ సంబంధిత పరిశోధన లక్ష్యంగా కేరళలో జెండర్ యూనివర్శిటీ ఏర్పాటుకానుంది. కోజీకోడ్ జిల్లాలోని జెండర్‌పార్క్ క్యాంపస్‌లో దీనిని ఏర్పాటు చేయనున్నారు.
- ప్రముఖ హాస్యనటుడు కొండవలస లక్ష్మణరావు(69) కన్నుమూశారు. ఔనువాళ్లిద్దరూ ఇష్టపడ్డారు సినిమాతో తెలుగు తెరకు పరిచయమయిన ఆయన 250కు పైగా సినిమాల్లో నటించి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు.
- అధికారిక పర్యటనలో భాగంగా యూకే వచ్చిన భారత ప్రధాని మోదీకి బ్రిటన్ మహారాణి క్వీన్ ఎలిజబెత్2 భోజన విందు ఇచ్చారు.
- భారత్, బ్రిటన్ ప్రామోటర్లకు చెందిన ఇండో, యూకే హెల్త్‌కేర్ కన్సార్షియం భారత్‌లో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సమ్మతించింది.
- హైద్రాబాద్ కూకట్‌పల్లిలోని ఓ బిల్డింగ్ పై నుంచి పడి సినీ నటుడు బాలప్రశాంత్ కన్నుమూశారు.
- తెలంగాణ హెల్త్ వర్శిటీ వీసీగా బందె కరుణాకర్‌రెడ్డిని నియమించాలని నిర్ణయించారు.
- జైలు అంటే దోషులకు కాపాలాగా రక్షక భటులు ఉంటారు. కానీ ఇండోనేషియాలోని 'క్రోకడైల్ గార్డ్సు' జైలుకు మొసళ్లే కాపాలాదారులు. ఇకపై వీటికి తోడుగా పులులు, పిరానా చేపలు కూడా చేర్చుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.
- మెరుగైన సేవలు,ఆరోగ్య సంరక్షణ విధానాల ద్వారా భారత్‌లో మాతా, శిశు మరణాలను తగించే దిశగా బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్, ఎంఎస్‌డీ ఇండియా, రిలయన్స్ ఫౌండేషన్, టాటా ట్రస్టు , యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ సంయుక్తంగా 'ప్రాజెక్ట్ ఆస్మాన్' రూపొందించాయి.
- ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఆరంభం నుంచి దాని ముఖ్య కార్యనిర్వాహణాధికారిగా పనిచేసిన సుందర్ రామన్ తన పదవికి రాజీనామా చేశారు.
- బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుక్ ఖాన్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య 1.6 కోట్లు దాటింది. ఇటీవలే 50వ పుట్టిన రోజు జరుపుకున్న షారూక్ దేశంలో అత్యధిక ట్విటర్ ఫాలోవర్ల జాబితాలో ప్రధానమంత్రి మోదీని దాటి రెండో స్థానంలో నిలిచారు. బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ మొదటి స్థానంలో కొనసాగుతున్నారు.
- అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయ చైర్మన్ ఐ.వి.రామకుమార్(59) చెన్నైలో కన్నుమూశారు. వంశపారంపర్య చైర్మన్‌గా ఆయన 1978 నుంచి సేవలందిస్తున్నారు.
- ఐదోసారి బీహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ ప్రమాణం చేశారు.
- తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి అనురాగ్ శర్మను తెలంగాణ ప్రభుత్వం నియమించింది.
- బిజినెస్ మ్యాగజిన్ ఫార్చ్యూన్ రూపొందించిన ప్రపంచ టాప్ 50 బిజినెస్ లీడర్ల జాబితాలో భారత సంతతికి చెందిన అజయ్ బంగా, ఫ్రాన్సిస్ డిసౌజా, సత్యనాదెళ్ల వరుసగా ఐదు, 16, 47 స్థానాలు దక్కించుకున్నారు.

డిసెంబరు నెలలో ముఖ్యమైన రోజులు

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం, నార్ల వెంకటేశ్వర రావు జయంతి	1
డా.రాజేంద్ర ప్రసాద్ జయంతి	3
భారత నౌకాదళ దినోత్సవం, ఉన్నవ లక్ష్మీనారాయణ జయంతి	4
రాజ్యాంగ దినోత్సవం	5
మానవ హక్కుల దినోత్సవం	10
గీతా జయంతి, యునిసెఫ్ దినోత్సవం	11
ధన్వంతరి జయంతి	13
పొట్టి శ్రీరాములు వర్ధంతి, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి	15
కిసాన్ దివస్, రైతుల దినోత్సవం, చరణ్‌సింగ్ జయంతి	23

- విజయనగరం జిల్లా గరివిడిలో ప్రభుత్వ వెటర్నరీ కళాశాల ఏర్పాటు కానుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతి వెటర్నరీ యూనివర్శిటీ రూ.208 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు పంపింది.

అంతర్జాతీయం

- మయన్మార్‌లోని కచిన్ జిల్లా పచ్చరాతి గనుల్లో కొండ చరియలు విరిగిన పడిన ఘటనలో 60 మంది మృత్యువాత పడ్డారు. మరో 100 మంది గల్లంతయ్యారు.
- ఈజిప్టులో రష్యా విమానం కూలి 224 మంది మృత్యువాత పడ్డారు.
- ఆఫ్రికాలోని మాలిలో ఉగ్రవాదులు రెచ్చిపోయారు. రాజధాని బమాకోలోని ఓ హోటల్ పై దాడి చేసిన సంఘటనలో 27 మంది మరణించారు.
- ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడులలో 128 మంది పౌరులు మరణించగా, మరో మూడు వందల మంది గాయపడ్డారు.
- భారత్, బ్రిటన్ దేశాలు పౌర అణు సహకార ఒప్పందం పై సంతకాలు చేశాయి. రక్షణ, సైబర్ సెక్యూరిటీలలో పరస్పరం సహకరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.
- మయన్మార్‌లో తొలిసారి ప్రజాస్వామ్యయుతంగా జరిగిన ఎన్నికల్లో ఆంగ్‌సాన్ సూకీ ఘన విజయం సాధించారు.
- అంతర్జాతీయ స్థాయిలో జరిగే అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో పాల్గనకుండా రష్యాపై వేటు పడింది. ప్రపంచ డోపింగ్ నిరోధక ఏజెన్సీ నివేదిక ఆధారంగా అంతర్జాతీయ అథ్లెటిక్స్ సమాఖ్య ఏకగ్రీవంగా ఈమేరకు నిర్ణయం తీసుకుంది.

క్రీడలు

- మ్యాచ్ ఆడుతూ గుండెపోటుకు గురైన నమీబియా యువ క్రికెటర్ రేమండ్ వాన్‌స్కూర్ చికిత్స పొందుతూ కన్ను మూశాడు.
- పాకిస్థాన్‌తో జరిగిన నాలుగు వన్డేల సిరీస్‌ను ఇంగ్లాండ్ కైవసం చేసుకుంది.
- జాతీయ మాజీ చాంపియన్, 2014 జర్మన్ ఓపెన్ విజేత అరవింద్ భట్ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు.
- స్విట్జర్లాండ్ దిగ్గజం మార్టినా హింగిస్‌తో కలిసి భారత్ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా డబ్ల్యూటీఏ చాంపియన్ షిప్‌లో డబుల్స్ టైటిల్ సాధించింది. తద్వారా సీజన్ ముగింపు టోర్నమెంటును వరుసగా రెండోసారి నెగ్గిన తొలి భారతీయ ప్లేయర్‌గా సానియా కొత్త చరిత్ర సృష్టించింది.
- టీ20 ఆల్‌స్టార్ సిరీస్‌ను వారియర్స్ జట్టు గెలుచుకుంది.
- జాతీయ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారిణి నిఖత్ జరీన్ చాంపియన్‌షిప్ ఫ్లయ్ వెయిట్ విభాగంలో విజేతగా నిలిచింది.
- ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి సిరిల్ వర్మ రజిత పతకం సాధించాడు.
- ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో కాంపౌండ్ ఈవెంట్ వ్యక్తిగత మహిళల విభాగంలో వెన్నం జ్యోతి సురేఖ, పురుషుల విభాగంలో రజత్ చౌహాన్ విజేతలుగా నిలిచారు. పురుషుల టీమ్ విభాగంలో భారత్‌కు స్వర్ణం లభించగా, మహిళల జట్టుకు రజతం లభించింది. ఈ సీజన్ ముగియగానే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకబోతున్నట్లు న్యూజిలాండ్ స్పిన్నర్ నాథన్ మెకల్లమ్ ప్రకటించాడు.
- భారత యువ టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రి ఈ సీజన్‌లో రెండో టైటిల్ సాధించాడు. కేపీఐటీ, ఎంఎస్‌ఎల్‌టీఏ చాలెంజర్ ఈవెంట్‌లో గెలుపొంది టైటిల్ సాధించాడు.

దాసరి దుర్గాప్రసాద్

ఉపాధికి కొదవ లేదు ,
యువతను సిద్ధం చేయాలి

పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో సిఎం

దుస్తుల తయారీ, ఎలక్ట్రానిక్, హార్డువేర్ పరిశ్రమలలో శ్రామికులకు ఇతోధిక ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్.ఐ.పి.బి) సమావేశంలో మాట్లాడుతూ దుస్తుల తయారీ పరిశ్రమకు గుంటూరు, విశాఖ, కర్నూలు, అనంతపురం కేంద్రాలుగా పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. చిత్తూరు జిల్లా లోని శ్రీసిటీలో పలు పరిశ్రమలు వచ్చాయని, అనుభవజ్ఞులైన కార్మికుల కోసం పొరుగున వున్న తమిళనాడు రాష్ట్రం నుంచి రప్పించుకుంటున్నారని చెప్పారు. పరిశ్రమలు తీసుకొస్తే కార్మికుల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన దుస్థితి వుందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా రాష్ట్రంలోని యువతకు శిక్షణ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. ప్రత్యేక హాస్టళ్లను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఆ పరిశ్రమలకు అవసరమయ్యే రంగంలో వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఆ తర్వాత పారిశ్రామికవేత్తలు వచ్చి శిక్షణ పొందిన వారిలో మరింత మెరుగైన నైపుణ్యం పొందిన వారిని ఎంపిక చేసుకుంటారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో యువతను, విద్యార్థులను ఎంపిక చేయాలని, 4 నెలల పాటు శిక్షణ కూడా ఇవ్వాలని సీఎం చెప్పారు. అక్కడే నివాసం వుండటానికి భవిష్యత్తులో వారికి టౌన్‌షిప్‌లు నిర్మిస్తామని అన్నారు.

పలు పరిశ్రమలకు అనుమతులు

ఇదిలావుంటే, కొత్తగా రూ.2,800 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటయ్యే పరిశ్రమలలో 22 వేల 300 మందికి ప్రత్యక్షంగా, పరక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

వసంత ఇండస్ట్రీస్ పేరుతో గుంటూరులోని తిమ్మాపురంలో రూ.159 కోట్లతో నిర్మిస్తున్న కాటన్ స్పిన్నింగ్ మిల్లు విస్తరణకు అనుమతులు మంజూరు చేశారు. తారకేశ్వర టెక్స్‌టైల్ పార్కు, నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేటలో రూ.337 కోట్లతో ప్లాంట్ నిర్మిస్తోంది. 2017 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తుంది. అలాగే టెక్సపోర్టు ఇండస్ట్రీస్ ప్రాజెక్ట్ లిమిటెడ్ నిట్టింగ్

మెగా కన్వెన్షన్ సెంటర్లు, హైపర్ మార్కెట్లు

విజయవాడ, విశాఖ, తిరుపతి నగరాలలో మెగా కన్వెన్షన్ సెంటర్లు, హైపర్ మార్కెట్లు, హోటళ్లను ఏర్పాటుచేసేందుకు లులూగ్రూపు ఇంటర్నేషనల్ సంసిద్ధత వ్యక్తంచేసింది. ఎగుమతి, దిగుమతులు, షిప్పింగ్, ట్రేడింగ్, ఐటీ, ట్రావెల్ అండ్ టూరిజంలలో అగ్రగామిగా వున్న దుబాయ్ బేస్డ్ కంపెనీ లులూ ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించేందుకు ముందుకొచ్చింది. లులూ ప్రతినిధులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిసి పెట్టుబడులకు గల అవకాశాలపై చర్చించారు. మెగా కన్వెన్షన్ సెంటర్లు, మాల్స్, హోటళ్ల ఏర్పాటుపై అధ్యయనం చేసి త్వరలో డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు అందిస్తామని గ్రూపు ప్రతినిధులు ముఖ్యమంత్రితో చెప్పారు. మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి అజయ్ జైన్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్ ఎస్ రావత్, సీఎంవో ముఖ్య కార్యదర్శి సతీష్ చంద్ర ఈ సమావేశంలో పాల్గొన్నారు.

గృహనిర్మాణశాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాలి

– సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

విద్యుత్ శాఖను ఏ విధంగానైతే సమూలంగా మార్పులు చేసి గాడిలో పెట్టామో అదేవిధంగా గృహ నిర్మాణశాఖను ప్రక్షాళన చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. గృహల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని అన్నారు. మెగాపార్క్ ఫర్ కన్‌స్ట్రక్షన్, మానుఫాక్చరింగ్ ఎక్విప్‌మెంట్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ ను రూపొందించే ప్రణాళికలను పరశీలించారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలలోని సుమారు 6 వేల ఎకరాలలో ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తారు. సిరామిక్స్, శానిటరీవేర్, కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్, ఫర్నిచర్, ఆర్కిటెక్చర్ నిర్మాణం, ఎడ్యుకేషన్ హబ్‌లు వంటి 7 జోన్‌ల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

రాష్ట్రంలో మూడు కేటగిరీలలో గృహ నిర్మాణం చేపట్టాలని, అందులో ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు, అసంఘటిత కార్మికులుగా విభజించాలన్నారు. ఈ కేటగిరీలుగా ఒకే ప్రాంతంలో గృహాలనిర్మాణం జరగాలన్నారు. గత ప్రభుత్వం గృహ నిర్మాణం చేసిన తరహాలో గృహాలు నిర్మిస్తే నిర్మాణం పూర్తికాక అవి పట్టణ ప్రాంతంలో మురికివాడలుగా మారతాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యత, సాంకేతికతతో పాటు లబ్ధిదారునికి అనువైన, అందమైన గృహం కల్పించాలన్నదే తన ఆశయం అన్నారు. గృహనిర్మాణ శాఖ కేవలం ఒక కాంట్రాక్టర్ గానే బాధ్యతలు నిర్వహిస్తోందని అలా కాకుండా దీనిని సమూలంగా మార్పుచేయాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. వర్క్‌షాప్ ను నిర్వహించి నాణ్యత, టెక్నాలజీ, హౌసింగ్ మోడళ్లపై ప్రత్యేకంగా చర్చించాలన్నారు. అందులో వచ్చిన విషయాలను క్రోడీకరించి ఒక సమగ్ర ప్రణాళిక రూపొందిచాలన్నారు. లేఅవుట్‌ల తయారీలో ప్రైవేటు కన్సల్టెంట్లను పెట్టుకోవాలని సీఎం అధికారులకు ఆదేశించారు. 13 జిల్లా కేంద్రాలలో 50 గృహల చొప్పున నిర్మాణం చేపట్టాలని గతంలో ఆదేశించిన విషయం గుర్తుచేశారు. మల్టిపుల్ టెక్నాలజీని వినియోగిస్తూ గృహాలను నిర్మించాలన్నారు.

❖

- కొత్తగా రూ. 2,800 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు
- 22,300 మందికి ఉపాధి అవకాశాలు
- గణనీయంగా పెరిగిన వృద్ధి రేటు
- రెండో త్రైమాసికం వృద్ధి రేటు10.82%

మిల్లు, గార్మెంటింగ్ ప్రాజెక్టును విశాఖలో రూ.101 కోట్లతో నిర్మించనుంది. సర్వేపల్లి, కృష్ణపట్నం సమీపాన రూ.1500 కోట్లతో రానున్న క్రిబ్‌కో ప్రాజెక్టు రానుంది. ఈ ప్రాజెక్టు 2019లో ఉత్పత్తి ప్రారంభించబోతోంది. చిత్తూరు జిల్లాలోని కుప్పంలో రూ. 145 కోట్లతో బ్రిటానియా బిస్కెట్ల తయారీ పరిశ్రమ రానున్నది. 2016-17లో ఉత్పత్తి ప్రారంభిస్తుందని అంచనా. చిత్తూరు జిల్లా లోని శ్రీసిటీలో రూ.588 కోట్ల పెట్టుబడితో సాఫ్ట్ డ్రింక్ క్యాన్ల పరిశ్రమ రెగ్జామ్ హెచ్‌టిడబ్ల్యు క్యాన్ల పరిశ్రమ రాబోతోంది. పై పరిశ్రమలకు విద్యుత్తు, రోడ్లు, భూమి, నీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు అనుమతులు మంజూరు చేశారు. ఇటీవల ప్రధాని తిరుపతిలో శంకుస్థాపన చేసిన సెల్‌కాన్, మైక్రోమ్యాక్స్, కార్బన్, లావా ఇంటర్నేషనల్ కంపెనీలకు ఇచ్చిన ప్రోత్సాహకాలను ర్యాటిఫై చేసింది. సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ పరిశ్రమలైన లాంగీ సోలార్,ట్రైనా సోలార్, జే సోలార్ పరిశ్రమలకు కూడా అనుమతులు ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రానున్న ఏరోస్పేస్ డిఫెన్స్ మ్యాన్యుఫాక్చరింగ్ కంపెనీ అయిన విఇఎం (వెమ్) టెక్నాలజీస్ కు కూడా అనుమతినిచ్చారు. హెచ్.పి.సి.ఎల్, రైజింగ్ స్టార్, బర్గర్ పెయింట్స్, కెపిఆర్ ఇండస్ట్రీస్ ప్రతిపాదనలు కూడా పరిశీలనకు వచ్చాయి. గుజరాత్ అంబుజా ఎక్స్ పోర్టు లిమిటెడ్, ఫ్లోరా సెరామిక్ పరిశ్రమలకు భూములు కేటాయించే అంశాలను కూడా పరిశీలించారు.

వృద్ధి రేటు

రెండవ త్రైమాసికంలో రాష్ట్రంలో వృద్ధి రేటు 10.82% గా వుందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో వృద్ధి రేటు 14.34% గా వుందని ఆయన అన్నారు. పారిశ్రామిక అనుబంధ రంగాలలో వృద్ధిరేటు 7.61% మాత్రమే వుందని చెప్పారు.పారిశ్రామిక రంగంలో వృద్ధిరేటు పెంచటానికి కృషి చేయాలని కోరారు. సేవా రంగంలో మాత్రం 11.19% వృద్ధి రేటు కనపరుస్తోందన్నారు.

❖

కందకం, ముళ్లకంచె పనులను వేగిరమే పూర్తిచేయాలి

– అటవీ, పోలీసు శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు

ఎర్ర చందనం అడవుల చుట్టూ 1523 కి.మీ ల మేర కందకం త్రవ్వి ముళ్లకంచెను ఏర్పాటుచేసే పనిని వేగవంతంగా పూర్తిచేయాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో అటవీ, టాస్క్‌ఫోర్స్, పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్షించారు.

ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టడంలో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, అడవి నుండి ఒక్క దుంగకూడా అనధికారికంగా తరలివెళ్లడానికి వీలులేదని ముఖ్యమంత్రి అన్నారు. కడప, పొద్దుటూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు తూర్పు, పశ్చిమ, నెల్లూరు ప్రాంతాలలో సుమారు 912 కి.మీ కంచె ఏర్పాటు పనులు పూర్తిఅయ్యాయంటూ మిగతా ప్రాంతంలో కూడా వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. కెమేరాల ఏర్పాటు, డాగ్ స్క్వాడ్, సిసిటివిలు, అవసరమైన బలగాలు ఏర్పాటుకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని సాధ్యమైనంత త్వరగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. ప్రతి నెల సంబంధిత శాఖలు జాయింట్ ఇన్స్‌పెక్షన్ నిర్వహించి కంచె, కెమెరాలు పనితీరు, నిర్వహణ వంటివాటిపై క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ స్టేషన్స్, ముఖ్య కూడళ్ళు, వీధులలో కెమేరాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని వీటిని ఫైబర్‌గ్రిడ్ కు అనుసంధానం చెయ్యాలన్నారు. దీని కారణంగా క్రైమ్ అరికట్టడమే కాకుండా, వీధులను అపరిశుభ్రంగా చేయడం, దందాలు వంటి అన్నిరకాల నేరాలను అరికట్టగలుగుతామని ముఖ్యమంత్రి తెలిపారు. ఏపనిచేసినా చిత్తశుద్ధితో చేస్తేనే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలమని, ప్రతి ఒక్క అధికారి బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు.

ఈ సమీక్షలో డిజిపి జె.వి.రాముడు, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి ఎ.కె.ఫరిడా, సిఎంఓ ముఖ్య కార్యదర్శి సతీష్ చంద్ర, పోలీస్ ఉన్నతాధికారులు ఎ.బి. వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

❖

గనుల శాఖ పనితీరును సమీక్షించిన ముఖ్యమంత్రి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనింగ్ విధానంపై త్వరలో శ్వేతపత్రం విడుదల చేయనుంది. తన కార్యాలయంలో గనుల శాఖ పనితీరును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించారు. గనుల కార్యకలాపాలను సమర్థంగా నిర్వహించాలని మార్గదర్శనం చేశారు. ఎక్కడా నిర్వహణా లోపాలు ఉండకూడదని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ఇసుక క్వారీల నిర్వహణను చూస్తున్నారని వివరించారు. రీచ్ నుంచి ఇసుక వినియోగదారునికి చేరే సమయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, రవాణా చార్జీలు ఎంత అవుతున్నాయో కూడా పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. వినియోగదారుడికి సంతృప్త స్థాయిలో ఇసుక అందించటమే తమ ధ్యేయమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆర్డరు వచ్చిన 24 గంటల్లో ఇసుక అందించే విధంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని, క్షేత్ర స్థాయిలో అక్కడక్కడా చిన్న చిన్న లోపాలుంటే సరిచేసుకోవాలని నిర్ణయించారు.

బి.సి.లకు స్వర్ణయుగం

2015-16 బడ్జెట్‌లో వెనుకబడిన తరగతులకు కేటాయింపులు

- 2015-16 సంవత్సరానికి సంబంధించిన వెనుకబడిన తరగతుల శాఖకు కేటాయించిన మొత్తం బడ్జెట్ రూ. 3231.45 కోట్లు.
- పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు రూ. 416.00 కోట్లు
- ట్యూషన్ ఫీజురీయింబర్స్‌మెంట్ కొరకు రూ.903.00 కోట్లు
- ప్రీమెట్రిక్ వసతి గృహముల కొరకు రూ. 278.53 కోట్లు
- గురుకుల పాఠశాలల కొరకు రూ. 106.26 కోట్లు
- కళాశాలల బాల బాలికల వసతి గృహముల కొరకు రూ. 69.50 కోట్లు
- బీసీ స్టడీ సర్కిళ్ళ కొరకు రూ.25.00 కోట్లు

బీసీలకు ప్రయోజన పథకాలు

- 64 చేతివృత్తులపై ఆధారపడిన దాదాపు 2 కోట్లమందికి సాయం అందించడానికి బి.సి కార్పోరేషన్ ప్రతి ఏటా రూ. 110 కోట్లకుపైగా నిధులు.
- రజక ఫెడరేషన్, నాయీ బ్రహ్మణ ఫెడరేషన్‌ల ఏర్పాటు.
- బీసీల సంక్షేమానికి ప్రత్యేక ప్యాకేజీ (రూ.400కోట్లు)
- బీసీలకు ఇళ్ళస్థలాల పంపిణీ పథకం అమలు (దాదాపు 12 లక్షల మందికి)

సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న చంద్రన్న ప్రభుత్వం

- తెలుగుదేశం పార్టీ గత 33 సంవత్సరాలుగా నిస్వార్థంగా బీసీలకు సేవలందిస్తూ, వారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటోంది.
- చంద్రబాబు గారి నేతృత్వంలోని ప్రభుత్వం బీసీలకు పెద్దపీట వేసింది...బడ్జెట్ రూపకల్పనే బీసీల బడ్జెట్ గా రూపొందించడం జరిగింది.
- బిసి సబ్‌ప్లాన్ కింద 2015-16 సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం బి.సి సబ్‌ప్లాన్ ప్రక్రియను ఆవిష్కరించింది. 21 శాఖలలోని ప్రణాళికానిధుల ద్వారా రూ. 6,640.00 కోట్లను బిసిల అభ్యున్నతికి, మరియు వివిధ పథకాలకు ఖర్చు చేయుటకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం.
- బీసీల అభ్యున్నతికి మహాత్మ జోతిరావు పూలే ఆశయాల ప్రేరణతో వాటి సాధన దిశగా ప్రభుత్వాన్ని పరుగులు పెట్టిస్తున్న ఘనత చంద్రబాబుదే.

2015-2016 జిల్లాల వారీగా రుణాలు మంజూరు

జిల్లా	బడ్జెట్(కోట్లలో)	లబ్ధిదారులు
అనంతపురం	12.27	4501
ఒంగోలు	8.44	1396
విశాఖపట్నం	15.96	3326
పశ్చిమగోదావరి	13.29	3378
తూర్పుగోదావరి	9.36	3146
నెల్లూరు	5.11	1557
కృష్ణా	9.93	3078
గుంటూరు	6.32	1893
చిత్తూరు	9.76	3040
విజయనగరం	3.95	1303
శ్రీకాకుళం	11.26	3868
కర్నూలు	15.06	3868
కడప	5.56	1654
	126.27	36548



కంధకం కన్నీరెట్టెరా !




వెలుతురులా చీకటిని చీల్చుకుంటూ వెళ్ళేది కంధకం ! కంధకం తెల్లని గుర్రం ! రాకుమారుడు సిద్ధార్థుని బాల్యం నుంచి కంటికి రెప్పలా చూచుకుంది. మహారాజు శుద్ధోధనుని మనసు గ్రహించి సిద్ధార్థుని కంటపడకూడని దృశ్యాలను తప్పించింది. రాజభవనాల సరిహద్దుల్లో తిప్పింది. సిద్ధార్థుడు యశోధరను వివాహమాడేందుకు తన క్షాత్రత్వాన్ని నిరూపించుకోవలసి వచ్చింది. ఇతర రాజకుమారులతో యుద్ధ విద్యలతో పోటీ తప్పనిసరైంది. దేవదత్తుడితో విలువిద్యలో, కత్తి యుద్ధంలో నందునితో, గుర్రపు పరుగులో అనిరుద్ధునితో పోటీ పడ్డాడు సిద్ధార్థుడు. విజయుడైనది కంధకంపై స్వారీ చేసే కదా!

సిద్ధార్థుని వివాహానంతరం కంధకం ఆయన రథానికి చోదకశక్తి అయ్యింది. చెన్నుడు సారథి అయ్యాడు. సిద్ధార్థుని అభిమతం మేరకు కపిలవస్తు పర్యటనకు బయలుదేరారు కంధకం సమేతుడైన చెన్నుడు. వృద్ధులను, రోగులను, మృతులను సిద్ధార్థుడు చూడనే చూశాడు. ఈ విపరిణామాల మూల కారణమేమిటి? వికల మనస్కుడైన సిద్ధార్థుడు జీవితం అర్థాన్ని తెలుసుకునేందుకు రాజ్యాన్ని బహిష్కరించడమే మార్గం అనుకుంటాడు. చెలికాడు చెన్నునితో తన మనసులోని మాటను చెబుతాడు. అర్ధరాత్రి యశోధరను, రాహులుని, కపిలవస్తును విడచిన సిద్ధార్థుని కంధకం పువ్వులా మోస్తుంది. రాజ్యం పొలిమేరలకు చేరుస్తుంది.

అనోమా(అందమైన) నదిని కంధకం లంఘిస్తుంది. సిద్ధార్థుని పాదాలను నాలుకతో తుడుస్తుంది. సిద్ధార్థుడు తన ఖడ్గంతో తన పొడవైన శిరోజాలను కత్తిరించుకుంటాడు. ఆభరణాలను తీసేస్తాడు. దుస్తులను విప్పేస్తాడు. చెన్నుడికి ఇచ్చేస్తాడు, రాజభవనానికి చేర్చమని! ముందుగా ఏర్పాటు చేసుకున్న ఆచ్ఛాదనా వస్త్రాన్ని వల్లెవాటుగా వేసుకుంటాడు. భిక్షాపాత్రను చేతిలో ప్రేమగా నిమురుతూ అమర్చుకుంటాడు. ఇక 'నువ్వెళ్లు' అనే రాకుమారుని మాట, చెన్నుడి చెవికి పిడుగులా తాకింది. రాజసౌధాల్లో తనకేం పని? బతుకైనా చావైనా మీతోనే అంటాడు చెన్నుడు. ముమ్మార్లు వెళ్లమంటాడు సిద్ధార్థుడు. మారు మాటాడలేకపోతాడు. నిశ్చేష్టుడవుతాడు.

సిద్ధార్థుని రాకను దేవగణాలు స్వాగతిస్తుంటాయి. మనుషుల దు:ఖాన్ని దూరం చేసేందుకు, అందమైన ప్రపంచాన్ని ఆవిష్కరించేందుకు సిద్ధార్థుడు జ్ఞానసిద్ధిని పొందనున్నాడని వారి ఆనందం ! ఇటువైపు చెన్నుడి మనసంతా దు:ఖమే ! కారణజన్ముని విడవక తప్పదం లేదని వాపోతూ పద అంటూ కంధకాన్ని అదిలిస్తాడు. కదలదే ! సిద్ధార్థుడు కనుమరుగయ్యేవరకూ చూస్తూ గుండెపగిలి కంధకం నేలకూలుతుంది. కంట అగని కన్నీరు ! ఆ క్షణాన్ని బంధించారు. అమరావతి ఆర్ట్ (నాగార్జునకొండ) శిల్పులు ! రాతిలో పలికిన కవిత్వానికి ఉదాహరణ అయిన ఈ ఘట్టం సాహిత్యంలో అనేక రూపాలు సంతరించుకొంది.

కంధకం కథను గాంధార, మగధ శిల్పరీతుల్లో వివిధ బౌద్ధ స్థూపాలలో శిల్పాలుగా మలచారు. కానీ, అతి పురాతనమైన శిల్పం అమరావతి ఆర్ట్‌లో మాత్రమే ఉంది. అమరావతి ఆర్ట్ అంటే దక్కన్ పీఠభూమిలోని ధరణికోట – నాగార్జునకొండ –అజంతా క్షేత్రాల శిల్ప, చిత్ర విశేషాలని గతంలోనే చెప్పుకున్నాం. మెకంజీ బృందం చిత్రించిన అమరావతి శిల్పపు డ్రాయింగ్‌ని పరిశీలించండి. కంధకం, రాకుమారునికి ఛత్రాన్ని పట్టిన చెన్నుడు కన్పిస్తాడు. స్వాగతిస్తున్న దేవతలూ కన్పిస్తారు. సిద్ధార్థుడేడీ? ఉన్నట్లుగా చూపకనే చూపడం క్రీ.పూ అమరావతి శిల్పులు సాధించిన ఆధునికత ! కాబట్టే ఆధునిక చిత్రకారులనూ అబ్బురపరుస్తూ అమరావతి ఆర్ట్ ప్రపంచ వారసత్వ సంపద అయ్యింది. డ్రాయింగ్‌లోని వివరాలు, కొన్నేండ్లకు ఇంగ్లండ్ చేరి, 1880 లో బ్రిటిష్ మ్యూజియానికి చేరిన అసలు శిల్పంలో లేవు! ఈ మధ్యలో తరుగుదలకు లోనైంది ! ఈ వైనాలు తెలుసుకోవాలంటే వివిధ కాలాల్లోని క్యాటలాగుల పరిశీలన తప్పని సరి. మెకంజీ బృందం డ్రాయింగ్‌ల ఆధారంగా, కోల్‌కతా, ఇంగ్లండ్ చేరగా మెడ్రాస్ మ్యూజియంలో మిగిలిన అమరావతి శిల్పాల గురించి, డా.సి.శివరామకృష్ణమూర్తి 1942లో 'అమరావతి స్కల్ప్చర్ ఇన్ మెడ్రాస్ మ్యూజియం' పేరిట క్యాటలాగ్ రూపొందించారు. డా. డగ్లస్ బ్యారట్ 1954లో 'ద క్యాటలాగ్ ఆఫ్ ద అమరావతి స్కల్ప్చర్ ఇన్ ద బ్రిటిష్ మ్యూజియం' రూపొందించారు. వీటి ఆధారంగా దాదాపు 40 సంవత్సరాలు కృషి చేసి 1992 లో డా. రాబర్ట్ నాక్స్ కొత్త విశ్లేషణలతో క్యాటలాగ్ రూపొందించారు. అమరావతి ఆర్ట్ శిల్పాలను 1950 వరకూ బ్రిటిష్ మ్యూజియం ప్రదర్శించింది. గాలిలో తేమకు సున్నపు రాతి ఉపరితలంలో మార్పులు వస్తున్నాయని గుర్తించి, వీటిని మ్యూజియం నేలమాళిగలో ఉంచారు. దశాబ్దాలుగా



నేలమాళిగలో ఉన్న అమరావతి ఆర్ట్ ప్రదర్శించేందుకు తగిన విధంగా గ్యాలరీలను ఆధునీకరించాల్సి వచ్చింది. మ్యూజియంలకు నిధులు విడుదల చేయడం ఏ ప్రభుత్వానికైనా కొంచెం కష్టమే ! జపాన్ కు చెందిన న్యూస్ పేపర్ కంపెనీ 'అసాహి షింబూన్' ముందుకు వచ్చింది. 5 లక్షల యూరోలను బ్రిటిష్ మ్యూజియానికి గ్రాంట్ గా ఇచ్చింది. ఆ నిధులతో అమరావతి ఆర్ట్ శిల్పాలకు తగిలే గాలిలో తేమ ప్రభావం చూపకుండా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం '33 ఎ' గ్యాలరీలో శాశ్వత ప్రదర్శనలో ఉన్న దాదాపు 70 శిల్పాలు కేవలం అమరావతి స్థూపం నుంచి సేకరించినవే.

మనం దీపాలదిన్నెను దిబ్బగా మార్చేశాం. కొన్ని శిల్పాలు మెడ్రాస్‌లో, మరికొన్ని కోల్‌కతాలో మరికొన్ని ఎక్కడో ఉన్నాయి. బ్రిటిష్ మ్యూజియంలో ఉన్నవి చెక్కుచెదరకుండా ఉన్నాయి. 'అమరావతి ఆర్ట్ భారతీయ శిల్పకళకు తలమానికం. బ్రిటిష్ మ్యూజియానికి గర్వకారణం' అన్నారు తూర్పు దేశాల పురావస్తు విభాగ నిర్వాహకులు జెస్సికా రాసన్ ప్రదర్శనను చూస్తూ: ఈ ఇంగ్లండ్ వాళ్లు మన సంపదనంతా దోచారు అని ఒక భారతీయ మహిళ కన్నీరు పెట్టింది. అవి ఇక్కడకు రావడమే మంచిదయ్యింది. అక్కడే ఉంటే ఉండేవా ? అని మరొక సందర్శకుడు డైరీలో రాస్తూ కంటనీరు పెట్టారు. 'శిల్పాలు సరే, బుద్ధుడు మీ మనస్సుల నుంచి పోకుండా చూడండి' అని కన్నీరు పెడుతోంది కంధకం!

పోస్ట్ స్క్రిప్ట్ : మే 17 వ తేదీన మంగోలియా ప్రధానమంత్రి చిమెగ్ భారత ప్రధానమంత్రి నరేంద్రమోడికి కంధకం అనే గుర్రాన్ని బహుకరిస్తూ 'బుద్ధుని గుర్రం పేరును పెట్టాం' అన్నారు. అలా అంటున్నప్పుడు చిమెగ్ మోములోని మహదానందం యూట్యూబ్ లో చూడవచ్చు. లాస్ వెగాస్‌లో మేలుజాతి గుర్రం పేరూ కంధకమే. చైనా, జపాన్, ఇంగ్లీష్ సాహిత్యంలో కంధకంపై చాలా పాటలున్నాయి. తెలుగువారి ప్రాథమిక పాఠ్యాంశాలలో కంధకం చోటు చేసుకోదగ్గదే కదా!

– పున్నా కృష్ణమూర్తి



- మెహెర్

అతిథి

- మెహెర్

> మెహర్ అసలు పేరు బెజవాడ ఫణీంద్ర కుమార్. నాలుగేళ్ల నాడు రాసిన ఈ 'అతిథి' కథలానే ఎన్నో కథలు అతని సొరుగుల్లో మూలుగుతుంటాయి కాబట్టి రచయితగా, కథకుడిగా తనకి వచ్చిన గుర్తింపు తక్కువ. 'రంగు వెలిసిన రాజుగారి మేడ కథ' అన్న ఓ కథా రచయితగా సాహితీ లోకానికి పరిచయమయ్యాడు. ఆ కథ చదివి, ప్రముఖ కథకులు, సీనియర్ పాత్రికేయులు ఆర్ ఎం ఉమామహేశ్వర రావు ఇలా రాశారు: ”మెహర్! వాక్యం రహస్యం తెలిసినవాడా..ఎవరు నువ్వు? ఎక్కడున్నావ్ ఇంతకాలం? ..... నువ్వు ఎక్కడ ఉన్నా ఎలా ఉన్నా గుప్పెడు అక్షరాలు రాలుస్తూ ఉండవయ్యా అప్పుడప్పుడూ అయినా! నెర్రెలు బారిపోయి ఎదురు చూస్తున్నాం తండ్రీ, తడి గలిగిన నాలుగు అక్షరాల కోసం”

అర్థరాత్రి ఎందుకో మెలకువ వచ్చి దుప్పటి ముసుగు తీసి చూస్తే, నా గదిలో, నా రాత బల్ల ముందు కూర్చుని, టేబిల్ లాంప్ వెలుగులో ఎవరో అపరిచితుడు పుస్తకం చదువుకుంటున్నాడు. తలుపు గడియ వేసి ఉంది. గోడ మీద గడియారం ఒంటి గంట చూపిస్తుంది. ఈ అసంబద్ధ దృశ్యానికి నన్ను నేను సర్దుబాటు చేసుకోవడానికి కాస్త సమయం పట్టింది. నా రోగిష్టి మంచపు కీళ్ళను ఏ మాత్రం మూల్గనీయకుండా, ఒద్దికగా అతని వైపు ఒత్తిగిలి, శ్రద్ధగా పరిశీలించాను. బూడిదరంగు పొడుగు చేతుల చొక్కాను నీలంరంగు జీన్స్ లోకి టక్ చేసుకున్నాడు. ఒక చేయి దవడకు ఊతంగా ఆన్చుకుని, మరో చేత్తో మేజాపై పుస్తకాన్ని అదిమిపెట్టి, చాలా దీక్షగా చదువుకుంటున్నాడు. టేబిల్ లాంప్ అతని ముఖ పార్శ్వపు అంచుల్ని దివ్యంగా వెలిగిస్తుంది. ఎంతసేపటి నుండి చదువుకుంటున్నాడో? సెకనుముల్లు మరో రెండు ఆవృతాలు పూర్తి చేసాక, ఉన్నట్టుండి పుస్తకం మూసి పైకి లేచాడు. తీక్షణమైన ఏకాగ్రత వల్ల కలిగిన బడలికను తీర్చుకోవడానికన్నట్టు, వళ్ళంతా విల్లులా వెనక్కి విరుచుకుని, "హాఆఆఆయ్!" అంటూ దీర్ఘంగా ఆవలించాడు. పుస్తకాన్ని చేతిలోకి తీసుకుని, వెనక్కి తిరిగి, అల్మారా వైపు నడిచాడు. ఈ ప్రయత్నంలో తన కాళ్ళ దగ్గిర ఉన్న ప్రయాణపు లగేజీ నొకదానిని తన్నుకుని ముందుకు తూలి పడబోయాడు. నిలదొక్కు కున్నాడు. అల్మారా చేరుకుని పుస్తకాన్ని వరుసలో సర్ది పెట్టేసాడు. ఇపుడా గూట్లోంచి ఒక్కో పుస్తకాన్నీ తీసి, టేబిల్ లాంప్ వెలుగులోకి వంచి చూసి, మరలా యథాస్థానంలో పెడుతున్నాడు.

అతని వీపు భాగం నా వైపుకు ఉంది. ఇదే అదనుగా నేను నిశ్శబ్దంగా దుప్పటి వెనక్కు తొలగించి, మెల్లిగా, మంచపు అంచుపై లేచి కూర్చున్నాను. చేతికి అందుబాటులో ఆయుధమేదైనా ఉన్నదా అని చుట్టూ పరికించాను. మంచం ప్రక్కన సన్నగా, పొడవుగా ముక్కాలి పీట ఉంది. దాని పైన ఉన్న అలారాన్ని జాగ్రత్తగా మంచం మీద పెట్టి, కొద్దిగా ముందుకు వంగుతూ పీట అడుగు భాగాన్ని అందుకుని, శబ్దం రాకుండా పైకి లేపడానికి ప్రయత్నిస్తుంటే, అతని స్వరం వినపడింది: "మీ దగ్గిర చాలా మంచి కలెక్షన్ ఉంది." తుళ్ళిపడి అతని వైపు చూసాను. తల నా వైపే తిప్పి, నా భంగిమలో ఏ అసహజతా గమనించనట్టు, అభావంగా "ద మాన్ హూ వజె థర్స్‌డే" పేజీలు తిరగేస్తున్నాడు. నేనిక (ఈ భంగిమలో) దొరికిపోయిన దొంగ కావడం ఇష్టం లేక, అదే ఊపుతో పీట చేతిలోకి తీసుకు నిలబడి, "ఎవర్నువ్వు?" అరిచాను. నా ఈ చర్యకు ప్రతిగా అతని మొహంలో కమ్ముకొచ్చిన విభ్రమ నన్ను మరింత అయోమయంలో పడేసింది. నిశ్చేష్టుడై నా వంక, నా చేతిలో ముక్కాలి పీట వంకా మార్చి మార్చి పరకాయిస్తున్న అతన్ని చూస్తే, నిజంగా ఇతను నాకు పరిచయస్తుడేనా, పడుకునే ముందు వరకూ నాతో ఈ గదిలోనే ఉన్నాడా, ఇప్పుడు నేనే విచిత్రంగా ప్రవర్తిస్తున్నానా అన్న అనుమానం కలిగింది. ఆ అనుమానం నా తర్వాతి ప్రశ్నలో కరుకుదనం పాలు కాస్త తగ్గించింది: "ఎవరు మీరు? ఇక్కడేం చేస్తున్నారు?"

అతని నిశ్చేష్టత ఇపుడు బలవంతపు నవ్వులోకి మారింది. నేనేదో పరాచిక మాడుతున్నట్టూ, ఇది అతన్ని నవ్వించక పోయినా (హడలగొట్టినా), ఏదో నా మర్యాద కోసం మొహానికి పులుముకున్నట్టూ ఉంది ఆ నవ్వు. ఎలాగో గొంతు పెగుల్చుకుని, నేను స్పృహలోనే ఉండి మాట్లాడుతున్నానా అన్న తన అనుమానం తీర్చుకోవడాని కన్నట్లు, "ఫణీ?!" అని పిలిచాడు. నాలో క్షణ క్షణానికీ అసహనం పెరిగిపోతుంది. అతనిది నటనో, నిజ వర్తనో అర్థం కావడం లేదు. స్టూలు అలాగే చేతిలో బిగించి పట్టుకుని, రెండడుగులు ముదుకేసి, "అవును ఫణినే... ఎవరు కావాలి?" అన్నాను బెదిరిస్తున్నట్టు. నిజానికి అతని దిట్టం చూస్తే, గట్టిగా పూనుకుంటే, నన్ను నిముషంలో నేల కంటుకు పోయేలా చేయగలడనిపిస్తుంది. కానీ అతనిలో ఏదో తగ్గుబాటు ధోరణి నన్ను తెగించేలా చేసింది. పై పెచ్చు అతని వాలకం కూడా నాలో కాస్త చులకన భావాన్ని పెంచింది. మనిషిలో ఆరడుగుల పొడవూ, నలభైయేళ్ళ వయస్సూ కనిపిస్తున్నా, మొహంలో మాత్రం ఏదో పసిదనం ఉంది. అతని చికిలింపు కళ్ళు ? పెదాలతో ప్రమేయం లేకుండా ? మొహానికి ఓ నిత్య దరహాస ధోరణిని ఆపాదిస్తున్నాయి. మూతి పైన పలుచగా, చివుర్లలో ఏపుగా వేలాడి ఉండే పిల్లి మీసాలు ముఖానికి మంగోలియన్ పోలికల్ని తెచ్చి పెట్టాయి.

ప్రస్తుతం పుస్తకాన్ని జాగ్రత్తగా అలమారలో పెట్టి, నన్ను సముదాయించడానికన్నట్లు ఒక చేయి నా భుజం వైపుగా గాల్లో చాచి, ముందుకో అడుగు వేసాడు. నేను అప్రయత్నంగా ఒక అడుగు వెనక్కి వేసాను. అతను ఆగి, చేతుల్ని నిస్సహాయ సూచకంగా గాల్లో చూపిస్తూ, "కూల్ ఫణీ... ఇందాకేగా మనం కలిసింది; అప్పుడే ఎలా మర్చిపోతావ్," అంటూ ప్రశాంతంగా, సహనంతో అడిగాడు.

ఆ నిబ్బరం నాకు నషాళానికంటేలా చేస్తుంది, "హె హ్హె! ఇందాకేగా మనం ఎక్కడ కలిసాం?" ఉడుకుమోత్తనాన్ని అణుచుకుని వెక్కిరింపుగా అడిగాను.

"ఇప్పుడే... క్షణం క్రితం వరకూ... ఇద్దరం రైల్లో మాట్లాడుకుంటూ..." గుర్తు చేసుకోమన్నట్లు ఆర్థోక్తిలో ఆపి, ప్రోత్సాహకంగా చూసాడు.

హఠాత్తుగా, నిజంగానే నా మెదడు పొరల్లో ఏదో కదలిక ? నిశ్చల తటాకపు అడుగున చేప పిల్ల మెదిలినట్టు.

అతడు కొనసాగించాడు: "నేను రైలు నిడదవోల్లో ఆగాక

కాస్త చెప్పమన్నాను ?"

"? నేనక్కడే దిగాలీ చెప్తానన్నాను," అంటూ అప్రయత్నంగా నేనందుకున్నాను.

ఈ ఊతానికి అతడి ముఖం వెలిగిపోయింది. ఉత్సాహంగా స్వరం పెంచుతూ, "తర్వాత ఇద్దరం కబుర్లలో పడ్డాం ?" అని నన్నందుకో మన్నట్టూ ఆగాడు.

ఇప్పుడిక యవనిక తొలగి యధార్థం భళ్ళున బయట పడింది. సర్వేంద్రియాలూ సత్తువుడిగి పోగా, దీనంగా, బలహీనంగా, "అది కల!" అన్నాను మంచం పై కూలబడిపోతూ.

అతడిక తన చింతలన్నీ తొలగిపోయినట్టు దీర్ఘంగా నిట్టూర్చి, "హమ్మయ్య! కంగారు పెట్టేవ్ కదయ్యా," అంటూ మేజా క్రింద కుర్చీని నా వైపు త్రిప్పి కూర్చున్నాడు.

నేనతని వైపోసారి చూసి తల పట్టుకు కూర్చున్నాను.

"వాట్స్ ద మేటర్ విత్ యూ?" అనునయంగా అడిగాడు.

ఎందుకో ఈ మానవాతీత పరిస్థితిని నా ప్రస్తుత విభ్రమతో సమీక్షించ బూనడం నా మానసికారోగ్యానికి అంత మంచిది కాదనిపించింది. స్థిమితం తెచ్చిపెట్టుకొని, మేకపోతు గాంభీర్యంతో ఇలా అన్నాను: "సీ... వుయ్ హేవె సిచువేషన్ హియర్; నీ కర్థం కావట్లేదు. కాస్త నిదానపడు; ఊహుం దొర్లుకుంటూ పోకు అర్థమైందా." ? ఇది నన్ను నేను ఉద్దేశించి చెప్పుకున్నది బహుశా. అయినా అర్థమైందన్నట్టు తల పంకించి, పరిస్థితి గాఢత అవగతమైనవాడిలా కుర్చీలో నిటారుగా సర్దుకుని కూర్చున్నాడు.

"ఊఁ! చెప్పిపుడు ? నిదానంగా ? చెప్పు," అన్నాను 'నిదానాన్ని' సాధ్యమైనంత నిదానంగా సాగతీసి.

అతను ఉత్సాహంగా మొదలు పెట్టాడు, "వై ఫణీ...! రాత్రి ప్రయాణం. నీదీ నాదీ ఎదురు బొదురు బెర్తులు. నిడదవోలు ఎప్పుడొస్తుందని నేనడిగితే, అక్కడే దిగాలీ వచ్చినపుడు చెప్తానన్నావ్. నెమ్మదిగా మాటల్లో పడ్డాం. ఫలానా అంటే ఫలానా అనుకున్నాం. ఇంతలో ? "

అతన్ని కత్తిరించి మధ్యలో జొరబడి పోయాను, " ? ఇంతలో ఆ కలలోంచి నా కిక్కడ మెలకువ వచ్చింది. నా కిక్కడ మెలకువ వచ్చింది కాబట్టి నే నక్కడ లేను. నే నక్కడ లేను కాబట్టి నువ్విక్కడ కొచ్చేసావ్ ? అంతేనా?" అతడేదో చెప్పబోయాడు. మళ్ళీ అడ్డేసాను; "వద్దు ? అదే చెప్పేది ? దొర్లుకు పోవద్దని! పరిస్థితి నిదానంగా సమీక్షిద్దాం: నిన్ను నా కలలో రైలు ప్రయాణంలో ? లేదా నా రైలు ప్రయాణపు కలలో ? తప్ప మెలకువలో ఇంతకు ముందెన్నడూ చూసిన, కలిసిన స్మృతి లేదు. ఇపుడసలు నీకు నిజంగా ఓ సొంత అస్తిత్వమంటూ ఏడిచిందా; లేక, నువ్వు కేవలం నా అల్లిబిల్లి కల అల్లిన కల్లబొల్లి మనిషివేనా అన్నది ప్రస్తుతానికో వివాదాస్పద అంశం. కాబట్టి రెండు రకాలుగానూ ఆలోచించి చూద్దాం: ఒకవేళ నీకంటూ ఒక నిజ-అస్తిత్వం ఉండి ఉంటే, బహుశా ఈ సమయానికి ఎక్కడో నిక్షేపంగా నిద్రపోతూండి ఉంటావు. ఇది కోటానుకోట్ల మెదళ్ళు



మూకుమ్మడిగా కలలు కనే నిశా సమయం. కాబట్టి, ఏమో ఎవరు చెప్పొచ్చారు, యాదృచ్ఛికంగా ఒకరి కల మరొకరి కలని ఒరుసుకోవడం, చిక్కుపడటం... ఇలాటివేవన్నా సాధ్యమైతే! అలా నీ కలా నా కలా తగులుకొని నువ్వూ నేనూ ఒకే కల్లో, ఒకే రైల్లోకి వచ్చి పడి ఉండొచ్చు. నీ తప్పు లేదు. కాని అక్కడితో ఆగక, నిడదవోలెపుడొస్తుందో చెప్పకుండా నేను కల నుండి నిష్క్రమించి నంతమాత్రాన, నువ్వూ నా వెనకే ఇలా నా వాస్తవిక వ్యక్తిగత జీవితంలోకి చొరబడి గలాభా చేయడం అమర్యాదకరం, కుసంస్కారం. అలాకాక, రెండో రకంగా, ఒక వేళ నీకంటూ అసలో స్వతంత్ర అస్తిత్వమే లేక, నువ్వు కేవలం నా సుషుప్తి పోత పోసిన భ్రమవే అయితే ? ఇపుడే చెప్పేస్తున్నాను ? నీకు నేనే మాత్రం బాధ్యత వహించ బోవటం లేదు," అంటూ ఆయాస పడుతూ ఆగాను.

ఈ చివరి మాట చెవిన పడగానే, అతను కుర్చీని వెనక్కి నెట్టి, ధ్వజస్తంభంలా ఇంతెత్తున పైకి లేచాడు. ఉన్నట్టుండి అతని గోధుమ రంగు ముఖం రక్త సంచలనంతో జేవురించింది; కణతపై పచ్చగా ఒక నరం పైకి ఉబ్బింది. ఆవేశంతో ఊగిపోతూ ఇలా అందుకున్నాడు: "హౌ కెన్యూ సే దట్! నీకు బాధ్యత లేదా! నీ కలలకి నువ్వు జవాబుదారీ కాదా! నీకు నచ్చినట్టు విచ్చలవిడిగా కలలు కనేసి, ఇలా తమ ఆద్యంతా లెరుగని మిథ్యా అస్తిత్వాలకు జీవం పోసి, తర్వాత పూచీ లేదని మిన్నకుంటే, వాటి మానాన

వాటిని వదిలేస్తానంటే ? ఏం తమాషానా?" ? ఈ చివరి మాట పలికేప్పుడు దున్న కుమ్మడానికి తల తాటించినట్టు తల ముందుకి తాటించాడు.

వ్యవహారం చేయి దాటుతున్నట్టు అనిపించడంతో కాస్త తగ్గాను: "అరె! మాట్లాడుతుంటే మధ్యలో వచ్చేస్తావేంటి? కూర్చో కూర్చో!" అనునయంగా అన్నాను. కూర్చున్నాడు; "నే చెప్పేదింకా పూర్తి కానే లేదు. నేను నీకు బాధ్యత వహించనని చెప్పింది బాధ్యత వహించలేక కాదు; సాధ్యం కాదు కనుక. ఇది కల కాదు. ఇక్కడ నువ్వు కుదురుకోలేవు. ఇక్కడ కొన్ని సూత్రాలుంటాయి. బంధనాలూ, పరిమితులూ ఉంటాయి ? తెంచుకోలేనివి. ఉదాహరణకి కాలం; నువ్విక్కడ కలలోలా కాలపు చెరసాలను ఛేదించలేవు: ఆనందంలో ఉన్నా, విషాదంలో ఉన్నా, సమక్షంలో ఉన్నా, నిరీక్షణలో ఉన్నా గంటకు అరవై నిముషాలూ గడిపి తీరాల్సిందే. ఇక్కడ దూరమూ నీకు శత్రువే: ఆమెను చేరుకోవాలంటే నాల్గొందల కిలోమీటర్లూ రైల్లో ప్రయాణించాల్సిందే; అనుకోగానే వళ్ళో వాలలేవు. ఇక్కడ నువ్వు భూమికీ బానిసవే: గాల్లోకి ఎగిరితే తిరిగి భూమ్మీదే వాలాలి; మేఘాల్లోకి పోలేవు. ఇక్కడ హేతువు బాధా తప్పదు: ఆఫీసు కెళ్ళే బస్సెక్కితే చచ్చినట్టు ఆఫీసుకే చేరాలి; అంటార్కిటికా పోలేవు. ఒక్కటి కాదిక్కడ బాధ! ఇక్కడ స్ఖలనమే శృంగారపు గ్రాండ్ ఫినాలీ కాదు; తర్వాతి నైరాశ్యపు లోతుల్నీ అంతే తీవ్రతతో ఎదుర్కోవాలి. ఇక్కడ నిన్ను కత్తితో పొడిస్తే

ఎరుపుటింటున్న ఏషియన్ పెయింట్‌లా రక్తం చిమ్మి ఊరుకోదు; తోడుగా మెలి తిప్పే బాధనూ భరించాల్సిందే. ఇక్కడ నీ స్నేహితులు, స్నేహితులే; శత్రువులు శత్రువులే. ఎందుకు సుఖాన ఉన్న ప్రాణాన్ని దుఃఖాన పెట్టుకుంటావ్! అర్థం చేసుకో."

ఈ వాదనతో అతన్ని చాలా మట్టుకు జయించానని అతని ముఖమే చెప్తుంది. చూపులు నేలకు వాల్చి ఆలోచిస్తున్నాడు. చివరకు తలెత్తి, దిగాలుగా, ఆఖరి ప్రయత్నంలా, "అయినా నాకా నలుపూ–తెలుపూ ప్రపంచం నచ్చలేదు," అన్నాడు.

సందు దొరకడంతో నేన్రెచ్చిపోయాను: "నచ్చక చేసేదేం లేదు. నువ్వో స్వప్న శకలానివి. నాలో ఏ రెండు రాండమ్ న్యూరాన్లు యాదృచ్ఛికంగా రాజుకున్నాయో, నువ్వాడి పడ్డావ్. నా వాస్తవ జీవితంలోని ఎవరి ముక్కో, ఎవరి కన్నో, మరెవరి మూతో కలగాపులగమైతే పుట్టిన కిచిడీవి! యూ డోంట్ బిలాంగ్ హియర్. నిన్నెలా నీ చోటికి పంపించాలో నాకు తెలుసు," అంటూ ఒక్క ఉదుటున కూర్చున్న వాడినల్లా దబ్‌మని మంచంపై ఒరిగి, దుప్పటి నఖశిఖ పర్యంతం ముసుగు లాగేసుకున్నాను. మళ్ళీ యిందాకటి ఆ పాడు కలలోకి వెళ్ళి అతణ్ణి ఆ మాయదారి నిడదవోల్లో దింపేసి, నేను తిరుగు రైలెక్కి గదికి చేరుకుందామన్నది నా ఆలోచన. కళ్ళు గట్టిగా బిగించి నిద్రకుపక్రమించాను. ఆలోచనల్ని, దృశ్యాల్ని ఆవలికి తోలి మెదడును చీకటి పుచ్చడానికి ప్రయత్నించాను. అతడు కుర్చీ లోంచి లేచి గొణుక్కుంటూ గదంతా పచార్లు చేస్తున్న అలికిడి మూసుకుపోతూన్న శ్రవణేంద్రియాలను లీలగా తాకుతుంది. నాకు జోల పాడటాని కన్నట్లు మంచం కూడా లయబద్ధంగా ఊగ సాగింది. కాసేపటికి, అంతా ప్రశాంతమైన శూన్యం ఆవరించి పూర్తి సుషుప్తిలోకి జారిపోతున్నాననగా ? నా చేతిని సందిగ్ధంగా తడుతున్నట్టు అతని స్పర్శ తగిలింది. కోపం బద్దలై "చచ్చేవ్‌రా నువ్వ"నుకుంటూ దిగ్గున లేచి కూర్చున్నాను.

నా నుండి ఇంత చురుకైన ప్రతిక్రియ ఊహించలేదనుకుంటా; ఉలిక్కిపడి వెనక్కు తగ్గాడు. రైలు కుదుపు క్రమంగా కుదుట పడుతుంది. కిటికీ మసక చీకట్లో ఏదో ప్లాట్‌ఫాం వెనక్కి జారుతూ కనిపిస్తుంది. జారి జారి, స్థిరపడింది. "ఛాయ్! ఛాయ్!" అని అరుచుకుంటూ ఓ కుర్రాడు మా కంపార్ట్‌మెంట్ దాటుకుని వెళ్ళాడు.

"నన్ను లేపుతానని చెప్పి మీరే పడుకుండిపోతే ఎలా గురువుగారూ... పదండి... ఇదే నిడదవోలట" అంటూ, భుజాన లగేజీతో, మంగోలియన్ కళ్ళు చికిలించి నవ్వుతున్నాడు.

"We are such stuff as dreams are made on; and our little life is rounded with a sleep."

\- Shakespeare

❖

జై గోంగూర! జై ఆంధ్ర!!



శాకాంబరీ దేవి ప్రసాదం అని గోంగూర పచ్చడిని కీర్తించటం కవుల చమత్కారం. దాన్ని ఆంధ్రమాత అనటంలో ఆంధ్రుల అభిమానం గోచరం అవుతుంది. గోంగూర పుట్టిన దేశంగా భావించే ఆఫ్రికాలో కూడాలేని వ్యామోహం మనకుంది. దాన్ని వాణిజ్యపరంగా మనం ఉపయోగించగలిగితే ఆంధ్రమాత పసిడికాసులు కురిపించగలదని పశోధకులు చెప్తున్నారు. గోంగూరని తినే స్థితిలోంచి అమ్మే స్థితికి మనం మారినప్పుడు, జై గోంగూర...జై ఆంధ్ర అనే నానుడి నిజం అవుతుంది.

గోంగూర పుట్టుక

గోంగూరఅసలు పేరు గోనుమొక్క. గోనుఆకుల్నిగోనుకూర, గోనుగూర, గోంగూర, గో(గూర, అన్నారు.పుంటికూర అనీ పిలుస్తారు. 'గోను' తెలుగులో మాత్రమే ఉంది. దేశీయంగా షొగ్రి(మణిపురి), కుద్రుమ్(బీహార్) అంబాద్(మరాఠి),పులిచకేరై (తమిళం),మెస్తా(బెంగాల్), అనే పేర్లు కనిపిస్తాయి. అంబరి, లాలంబరీ, నలి, అమ్లపీలు, కంటక పీలు లాంటి సంస్కృత పేర్లు చెపుతారు గానీ, అవి నిఘంటువుల్లో కనిపించవు.ఉత్తర ఆఫ్రికాలో తీల్, తిల్, తేల్, తెల్ అని పిలుస్తారు.

తెలుగుపేరుఅక్కడఎందుకుందోపరిశోధించవలసి ఉంది.విదేశాల్లో డెక్కనీ హెంప్ అనీ పిలుస్తారు. తెలుగువాళ్ళ మొక్క అని అర్థం కావచ్చు. గోన, గోను, గోనుగుంట్ల లాంటి ఇంటి పేర్లు తెలుగు వాళ్లలో ఉండటాన్ని బట్టి తెలుగునేలపైన గోంగూర ప్రాచీనతని అంచనా వేయొచ్చు. ఇంతకీ గోంగూర ఆఫ్రికాలో పుట్టిందా లేక ఇండియాలో పుట్టిందా అనేది తేలని సందేహమే!

మౌలికంగా పూలమొక్క

ఈజిప్టులో గోంగూర('కెనాఫ్')ని 4,000 యేళ్ళ క్రితం పండించిన దాఖలాలున్నాయి. కానీ, చరక సంహిత, సుశ్రుత సంహిత, ధన్వంతరి నిఘంటువుల్లో, గోంగూర గురించి వివరాలు లేవు. అందుకని ఇది మన దేశంలోకి మధ్యయుగాల్లో వచ్చి ఉంటుందంటారు. కానీ గోంగూరని ప్రాచీన

మన రుచులకు తగ్గట్టుగా, మన దేశీయ మైన వస్తువుల్ని ఆధునిక పరిజ్ఞానంతో మెరుగైన రీతిలో ఆరోగ్యానికి సహకరించే ఆహార పదార్థాల తయారీ మీద వాణిజ్య పరంగా దృష్టి పెడితే భారతదేశం గోంగూర వాణిజ్యంలో ముందుంటుంది.

కాలంలో పూలమొక్కగా వాడుకున్న సాక్ష్యాలు ఉన్నాయి. అమరకోశంలో గోంగూరకి కర్ణికారం, పరివ్యాధ అనే పేర్లు కనిపిస్తాయి.అభిమన్యుడి రథం మీద ఎగిరే జెండా మీద గోంగూర పువ్వు గుర్తుఉంటుందట! మూలభారతం భీష్మపర్వం(6.26,27)లో శివుడు కర్ణికార(గోంగూర) పుష్పమాలను పాదాలదాకా ధరించాడని ఉంది. గోంగూర తోటలో వేదవ్యాసుడు తపస్సు చేశాడని మూలభారతంలో ఉంది. మధ్య యుగాలనాటి వసుచరిత్ర(3.146),హంసవింశతి(4.11) కావ్యాల్లో గోంగూర ప్రస్తావన కనిపిస్తుంది. జానపద గేయాల్లో గోగులు, గోగులమ్మ, కొండగోగుల ప్రస్తావన కనిపిస్తుంది. గోగులమ్మగ్రామదేవతని “కోమలార్థేందుధరుకొమ్మగోగులమ్మఅని శ్రీనాథుడు భీమేశ్వరపురాణంలో స్తుతించాడు.గోగుపూలతో అందంగా గొబ్బెమ్మలను అలంకరించటం సాంప్రదాయం. శివపూజ చేయకుండా ముద్దముట్టకూడదనే నియమంఉన్నఒక వర్తకుడు బోర్లించిన కుంచాన్ని(ధాన్యం కొలిచే పాత్ర)శివలింగంగా భావించి“కుంచంబు గొండగోగుల(బూజసేసి” అనే వర్ణన వెయ్యేళ్ళ నాటి తెలుగు ప్రజలకు గోంగూర పూలు పవిత్రమైనవని అర్థం అవుతోంది. బహుశా తొలినాళ్లలో పూలమొక్క, నార మొక్కగా ఉపయోగపడిన గోంగూర తరువాతి కాలంలో దాని ఆకురుచి గమనించిఆహార పదార్థంగా వాడటం మొదలెట్టి ఉంటారని ఊహించవచ్చు. గోంగూర ఆకులే ఆంధ్రమాతగా దాని ప్రశస్తిని నిలిపాయి. ఆకుల రుచి మరిగాక పూవుల సంగతి మనం మరిచిపోయాం.

గోగునార

నారనిచ్చే మొక్కల్లో. గోను మొక్కలో 40% నారపదార్థం ఉంటుంది. గోంగూర, జనుము లాంటి మొక్కల్లోంచి వచ్చే నారని గ్రీన్ ఫైబర్ అంటారు. గోగునారని జావా జ్యూట్ అని కూడా వ్యవహరిస్తారు. గోగునారని పురిపెట్టి పురికొస తీస్తారు. దానితో నేసిన పట్టాని “గోనుపట్టా” అనీ, సంచీని “గోను సంచీ” అనీ పిలుస్తారు.దీని ఆకుల్ని కోసుకొంటూ, మొక్కని నిటారుగా పెరగనిస్తే, 150 రోజుల్లో చెరకు గడలంత ఎత్తున 18 అడుగుల వరకూ పెరుగుతుంది. ఈ మొక్కల్ని నీళ్ళలో నానబెడితే నార తేలికగా ఊడివస్తుంది. ఎకరానికి 5–10 టన్నులు గోగునార లేక గోనునార ఉత్పత్తి వస్తుందని అంచనా! శాకాంబరీదేవిని సిరులిచ్చే మొక్కగా మనం గుర్తించాలి.

గోంగూర కాయితం

తెల్లకాగితం తయారీకి పనికొచ్చే 500 మొక్కలతో పోల్చినప్పుడు అమెరికన్లు గోంగూరని అన్నింటికన్నా ఉత్తమమైనమొక్కగా తేల్చారు. అడవులు నరికి, పర్యావరణానికి హానిచేయటాన్ని “గోంగూరతో కాగితం” ద్వారా నివారించవచ్చు.అమెరికా వాళ్ళ తెల్లకాగితం అవసరాల్ని ఈ గోంగూర మొక్కలే తీరు–స్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఆకుల కోసం మొక్కల్ని పీకే మన అలవాటు వలన గోంగూర ఉపయోగాన్ని పూర్తిగా పొందలేకపోతున్నాం. గోంగూర మొక్కలు పెరుగుతాయి.

గోగు నూనె

గోంగూర విత్తనాల్లో ఎక్కువ నూనె పదార్థాలు ఉన్నాయి. 12.9% పీచు పదార్థాలున్నాయి. దీన్లో ఉన్న నూనె పత్తి నూనెతో సమానం అంటున్నారు. ఆ రకంగా నైనా గోంగూరని సద్వినియోగం చేసుకోగలగాలి. పువ్వుల్లోని పోషకాలను కూడా ఆహార పదార్థాల తయారీలో వాడుకుంటే మంచిది. దేశీయమైన ఉత్పత్తుల మీద దేశీయమైన రీతిలో పరిశోధనలు సాగాలి. నూడుల్స్ లాంటివి తయారు చేసేప్పుడు కొవ్వునీ, సీసాన్ని, రంగుల్నీ తెచ్చి కలిపే కన్నా పచ్చగానూ, ఎర్రగానూ ఉండే గోంగూర మొక్క పువ్వుల్ని ఆహారంలో రంగులకు వాడుకోవటం మంచిది. కొవ్వు తొలగించిన గోంగూర విత్తుల పిండిని నూడుల్స్ తయారీలో వాడుకొంటే ఆరోగ్యానికి మరింత మేలు కలుగుతుంది.

ఆరోగ్యానికి గోంగూర

వైద్య శాస్త్ర ప్రకారంగోంగూరలో అపాయకారకమైన రసాయనాలు ఏమీ లేవు. పడకపోవటం దాని స్వభావంకాదు. దాన్ని వండటంలోనే మనం మరికొన్ని జాగ్రత్తలు తీసుకోవాలసి ఉంది. మొదటగా గోంగూరని నీళ్ళలో ఉడికించి, ఆ నీటిని వార్చేయాలి. మిగిలిన గుజ్జులో సంబారాలు చేర్చి తయారు చేసిన పులుసు కూర లేదా పచ్చడి రుచిగానూ, నిరపాయకరం

గానూఉంటుంది. వాతాన్ని, వేడినీ కలిగించని వాటితో మాత్రమే గోంగూరను తయారు చేసుకోవాలి. తగినంత మిరియాల పొడి, ధనియాల పొడి కలిపితే ఎలాంటి ఇబ్బందీ పెట్టకుండా ఉంటుంది. రుచిని పెంచుతుంది. శరీరంలో వేడిని తగ్గిస్తుంది. గోంగూర పువ్వులూ గింజల్ని కూడా కలుపు కోవచ్చు. రుచిగా ఉంటాయి. మనం గోంగూర పచ్చడి చేసుకొంటే యూరోపియన్లు కెనాఫ్ పాష్టో తయారు చేసుకొంటారు.

గోగుపూలలో విషదోషాల్ని హరించే గుణాలు ఉన్నాయని ఆధునిక పరిశోధనలు చెప్తున్నాయి. ఈ పువ్వుల రసం తీసి, పంచదార, మిరియాలపొడి కలిపి కాచినపానకం జీర్ణశక్తిని పెంచుతుంది. లివర్ వ్యాధుల్లో మంచిది. గోంగూర గింజల పొడిని పాలలో కలిపి మరిగించి తాగుతూ ఉంటే లైంగిక శక్తి పెరుగుతుంది. చిక్కిపోతున్న పిల్లలకు ఆహారంగా ఇస్తే త్వరగా వళ్ళు చేస్తారు. కీళ్ళనొప్పుల వ్యాధిలో కూడా వాడతారు.కొండగోగు వేళ్ళను దంచి, చిక్కని కషాయం కాచుకొని పంచదార కలిపి తాగితే, వేసవికాలంలో వడదెబ్బ కొట్టకుండా ఉంటుంది. గోంగూర ఆకుల్ని విరేచన ద్రవ్యంగా ఉపయోగిస్తారు. దగ్గుమందుల్లో కూడా గోంగూర కలుస్తుంది. రక్త హీనతని నివారిస్తుంది. కడుపులో నులిపురుగుల్ని చంపుతుంది. గోంగూరలో గుంటగలగర ఆకు కలిపి పచ్చడి పులుసు వగైరా చేసుకుంటే, అమితమైన రక్తం వృద్ధిని కలిగిస్తుంది. రేచీకటికి ఇది మంచి ఔషధం. ఉడికించిన గోంగూర ఆకు ముద్దని కడితే సెగగడ్డలు మెత్తపడి త్వరగా పక్వానికొస్తాయి. రక్త0 గూడు కట్టిన కౌకుదెబ్బలు తగిలినచోట దీనితో కట్టు గడితే వాపు అణిగిపోతుంది.

మన రుచులకు తగ్గట్టుగా, మన దేశీయ మైన వస్తువుల్ని ఆధునిక పరిజ్ఞానంతో మెరుగైన రీతిలో ఆరోగ్యానికి సహకరించే ఆహార పదార్థాల తయారీ మీద వాణిజ్య పరంగా దృష్టి పెడితే భారతదేశం గోంగూర వాణిజ్యంలో ముందుంటుంది. గోంగూరని అమెరికాలో పేపర్ ఉత్పత్తికి మరింత ఎక్కువగా వాడుకోవటానికి పరిశోధనలు చేస్తున్నారు. ఆస్ట్రేలియాలో బయోటిక్ ఎనెర్జీ కోసం దీన్ని ఉపయోగించుకోవాలని శోధిస్తున్నారు. తైవాన్, జపాన్లలో గింజలనుంచి ఆరోగ్యదాయకమైన నూనె ఉత్పత్తి గురించి ప్రయోగాలు చేస్తున్నారు. ఇండియాలో లేత గోంగూర మొక్కల్ని పీక్కొచ్చి కట్ట 2 రూపాయలకు అమ్ముతుంటే, మనం ఆకులు వలుసుకుని కాడలు పార్శి ఆంధ్రమాత, శాకాంబరి దేవి ప్రసాదం అనుకుంటున్నాం. చైనాలో కొత్తరకం గోంగూర మొక్కల్ని సృష్టించి, పదిరెట్లు ఉత్పత్తి పెంచి, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్లకు అందించాలని చూస్తున్నారు. అదీ సంగతి!

– డా. జి వి పూర్ణచందు

ఒక ఉద్ఘాటన – అనేక సమీకరణలు



ప్రకృతిలో మృదురూపాలు
గ్రీష్మతాకిడికి యాంత్రీకృత జీవితాలైతే
సమయాలన్నీ జడీభూతాలవుతాయి

ఊపిరితిత్తులు కొలిమి తిత్తుల్లా మారి
గడ్డకట్టిన బట్టపీలికలతో చుట్టపెట్టుకొన్న స్వభావంతో
మనుషుల్ని ఏకంగా కీలుబొమ్మల్ని చేసాయి

సృష్టిలో ప్రతీదీ రహస్యాల సొరుగుల్లో దాయబడి
చిన్న చిన్న కదలికలకు సైతం కార్య కారణాలుగా మారి
నిశితమైన దృష్టితో ఆశాజీవులుగా మార్చబడ్డాయి

అవతారాలెన్ని ఎత్తినా, ధర్మోపదేశాలు ఉద్ఘాటించినా
స్వర్ణకిరీటం మోయడానికి కాలంతో పనిలేదు
విలువలు వ్యత్యస్తమైపోతే చాలు..

సమాధులు రాత్రి జన్మించిన ప్రళయాల్లా మారి
దారి దొరకని అపరిచిత హృదయ నిర్వేదాలై
భౌతిక శక్తికి వివిధ సమీకరణలుగా రూపాంతరం చెందాయి!

ఎంతగా ఆలోచించినా.. ఆవేశపూరితులైనా
ఆకాశం అవతలివారిదైనా.. గ్రహాలన్నీ క్షమాపణ కోరినా
బతుకులన్నీ వాంఛాపిపాశులై పాకడంతో ఆగాయి!

దేశపు గర్భంలోనో.. దేహం గుండెల్లోనో
పచ్చని మైదానాల్లోనో.. పలచటి పూరి గుడిసెలోనో
ఎక్కడైతేనేం..? బంధుప్రీతి ఘోరాలకు..!

అవధుల్లేని సమాజ సముద్రపు తీరాల్లో
కనిపించని రత్నమాళిగా భూమి సింగారించుకొని
కొత్త విధాలను స్వర్ణ తోరణాలుగా మార్చుకుంటాయి!
వేల వేల యేండ్లనుండి కనిపించే
మనోభావ పరిస్థితులన్నీ ప్రత్యేక చరిత్రలుగా మారి
నాలుగు చెరుగుల నేలను ఆక్రమించుకుంటాయి!

కూలిన సింహాసనాలు.. ఒరిగిన గుర్రాల చిహ్నాలు
పెచ్చులూడి నేడు అక్షరపు అచ్చులుగా మారి
ధర్మ రథ శకలాలుగా మారి పాఠాలను వల్లిస్తున్నాయి!


ఎత్తైన మహా గగనంలో ఎండిన డొక్కల సన్నివేశాలన్నీ
హతమార్చిన అగ్ని గుండాల్లో సమిధల్లా రూపాంతరం చెంది
కాలిన కాలపు గాయాలకు మందుబిళ్ళలవుతున్నాయి!

గడిచిన ఒక్కొక్క రోజు వందేళ్ళ ఆయువుతో పెనవేసుకుని
అనేక ప్రవర్తనలూ.. అనేక విశ్వాసాలు కలగలుపుకొని
గడ్డిపోచకై అర్రులు జాచే ప్రాణికోటి ఒక్కటవుతుంది.!!

– శైలజామిత్ర

తొలినాళ్ల వెండితెర 'ప్రకాశం'

ఒక ఆత్రేయనీ, ఒక పెండ్యాలనీ పరిచయం చేసిన ఘనత ఆయనకుంది. చిన్న పిల్లలతో మూడు చిన్న సినిమాలు తీసిన ఘనత కూడా ఆయనకి వుంది. 'మంచి సినిమాలు ' చూపించిన ఇంకో ఘనత కూడా ఆయనకి వుంది. ఆయనే కె. ఎస్. ప్రకాశరావుగా సుప్రసిద్ధులైన కోవెలమూడి సూర్య ప్రకాశరావు. చదువు అయిన తర్వాత, ప్రజానాట్య మండలిలో చురుగ్గా పాల్గొన్న ప్రకాశరావుగారు సినిమా వేపు తిరిగారు. అలా తిప్పిన వారు గూడవల్లి రామబ్రహ్మం. మంచి కనుతీరు, కోటేరేసిన ముక్కు, నిటారుగా వుండి ఆకర్షణీయంగా కనిపించిన ప్రకాశరావు చేత రామబ్రహ్మం గారు వేషాలు వేయించారు.



ప్రకాశరావు గారు మొదట్లో నటుడే. కాని, ఆయన ఆలోచన దర్శకత్వం వేపు తిరిగింది. రామబ్రహ్మం గారు సారథి వారికి 'రైతు బిడ్డ' తీసిన తర్వాత, కస్తూరి ఫిలింస్ వారికి 'అపవాదు' (1941) తీశారు. ప్రకాశరావు నాయక పాత్రధారి. నాయిక లక్ష్మీరాజ్యం. 'భార్యని భర్త అనుమానించడం అనే అంశం ఈ సినిమాతోనే ఆరంభమైంది,'అని చెప్పేవారు ఆ సినిమా రచయిత సముద్రాల రాఘవాచార్య. 'అపవాదు'తో ప్రవేశించిన ప్రకాశరావు గొప్ప నటుడిగా ప్రకాశించ లేదు కాని, 'ఒక హీరో వచ్చాడు' అనిపించుకున్నాడు. వెంటనే రామబ్రహ్మం సారథి వారికి 'పత్ని' తీశాడు. ఇందులోనూ ప్రకాశరావు నాయక పాత్రధారి. తమిళ భాషలోని ప్రసిద్ధ కావ్యం 'శిలప్పాదికారం' ఈ సినిమాకి ఆధారం. చారిత్రకం. ఋష్యేంద్రమణి నాయిక. 'కణ్ణగి' పేరుతో ఈ కథ తమిళంలో రెండుసార్లు వచ్చింది. ఇది ప్రజారంజకం కాలేదు. కాకపోతే, అప్పటికే దర్శకత్వం మీద మనసు పడిన ప్రకాశరావు – ఆ దిశగా ఆలోచన చెయ్యడం ఆరంభించారు. సారథి సంస్థ 'గృహప్రవేశం' (1946) ఆరంభించినప్పుడు ప్రకాశరావు గారే దర్శకత్వం చెయ్యాలని అభిలషించినా – ఇంకా కొంత అనుభవం సంపాదించాలని ఎల్ వి ప్రసాద్ గారికి ఆ బాధ్యత అప్పగించారు. ఆ సినిమాలో ప్రకాశరావు నటించలేదు. ప్రసాద్ గారే నాయక పాత్రధారి కూడా. తాను నిర్మాతగా స్వతంత్రా ఫిలింస్ స్థాపించి 'ద్రోహి' (1948) తీసినప్పుడు హీరోగా నటించారు గాని, ప్రసాద్ గారి చేతనే దర్శకత్వం చేయించారు. గృహప్రవేశం, ద్రోహి – రెండు సినిమాలు సంతృప్తికరంగా నడిచాయి. నిర్మాతగా తన పేరు మీదనే ప్రకాష్ ప్రొడక్షన్స్ నెలకొల్పి 'మొదటిరాత్రి'(1950) మొదటి సారిగా డైరెక్ట్ చేశారు ప్రకాశరావు. ఇందులో సి. హెచ్. నారాయణరావు హీరో. సినిమా మీద, నిర్మాణం మీద, దర్శకత్వం మీద అవగాహన పెరగడంతో ప్రకాష్ స్టూడియో పేరుతో సొంత స్టూడియో ఆరంభించారు ఆయన. వరసగా సినిమాలు తియ్యాలని ఆసక్తి. 'దీక్ష' (1951), 'కన్నతల్లి' (1953) తీశాక, 'బాలానందం' (1954) పేరుతో అందర్నీ పిల్లల్నే పెట్టి మూడు చిన్న సినిమాలు (రాజయోగం, కొంటెకిష్టయ్య, బూరెలమూకుడు) తీశారు. "పిల్లలతో సినిమా తియ్యడం, డైరక్టు చెయ్యడం గొప్ప అనుభవం" అని చెప్పేవారు ప్రకాశరావు.


ప్రకాశరావు గారికి కథని నడిపించడం మీద పట్టు వుండేది. నటుల చేత బాగా నటింపజేస్తారు. స్వేచ్ఛా ఇస్తారు. ఆయన దర్శకత్వంలో నేను – ప్రేమనగర్, తాసిల్దారుగారి అమ్మాయి, సత్యానికి సంకెళ్లు, స్త్రీజన్మ మొదలైన సినిమాల్లో నటించాను. 'భలేపాప' అనే సినిమాని కొంతవరకూ డైరక్టు చేసి మానేశారు. 'కీలుబొమ్మలు'అనే సినిమా కూడా అలాగే మానేశారు. నిర్మాత నుండి పూర్తి సహకారం కావాలి ఆయనకి.

'భలేపాప'లో నటిస్తున్నప్పుడు ఆయన ఒక ప్రయోగం చేశారు. తియ్యవలసిన దృశ్యం రచయిత దగ్గర్నుంచి రాలేదు. ప్రకాశరావు గారు తాను రాయకుండా, నటులందర్నీ కూర్చోబెట్టి దృశ్యం వివరించి– "ఈ దృశ్యం ఎలా ఆరంభిస్తారు? నువ్వు ఏదో డైలాగు చెప్పు. దానికి నువ్వేమంటావు? అని నటుల చేతనే చెప్పించి – ఆ దృశ్యం షూట్ చేశారు. నవ్వుతూ నవ్విస్తూ సాగేది ఆయన దర్శకత్వం. దర్శకత్వం చేపట్టిన తర్వాత, నటన మీద ఆసక్తి తగ్గించేసుకున్నారు. తర్వాత ఎప్పుడో 'వంశోద్ధారకుడు' (1972) సినిమాలో గెస్ట్ పాత్ర ధరించారు. ప్రకాశరావు గారి అభిరుచి గొప్పది. గొప్ప కావ్యాలన్నీ చదివారు. మంచి మంచి నవలలు చదివారు. 'సౌందరనందం' 'కళాపూర్ణోదయం' వంటి కావ్యాల్ని సినిమాలుగా తీయాలని కలలుగనే వారు. "తీయ్యెచ్చు గాని, ఉత్తమాభిరుచి గల ప్రేక్షకులే చూస్తారు. వాళ్ళ శాతం చాలా తక్కువ. నిర్మాత మిగలకుండా పోతాడు! ఏం చేస్తాం!" అనేవారు ఆయన. చాలా సినిమాల్లో ఆయన దర్శకత్వ ప్రతిభ కనిపిస్తుంది. దృశ్యాల మేళవింపు , చిత్రీకరణ గమనించి చూస్తే ఆ నేర్పు అవగతమవుతుంది. ఒక కొత్త అబ్బాయిని ప్రధాన పాత్రలో పెట్టి తీసిన 'దీక్ష' విజయం సాధించింది. ఈ సినిమాలోనే ఆత్రేయ రచయితగా పరిచయం. ప్రకాశరావు గారు అతి సరళమైన భాషలో పాటలు రాయించారు. 'మనుషులంటే వీళ్లేనా ?' 'పోరా బాబు పో పోయి చూడు ఈ పట్నం పోకడ' వంటివి.

బందిపోటు దొంగలు, ప్రేమనగర్, కోడెనాగు, సెక్రటరీ, విచిత్ర కుటుంబం, మొదలైన సాంఘిక చిత్రాలతో పాటు రేణుకాదేవి మహాత్యం, మోహినీ రుక్మాంగద పురాణ చిత్రాలు కూడా డైరెక్టు చేసిన కె.ఎస్. ప్రకాశరావు తన దగ్గర పని చేసిన ఆదుర్తి సుబ్బారావు, ఎస్.భావనారాయణ, డి.బి నారాయణ, కొడుకులు రాఘవేంద్రరావు, ప్రకాష్‌లను ప్రోత్సహించి తీర్చి దిద్దారు.


– రావి కొండలరావు

గుండ్రంగా మండే మంటలు




కొవ్వొత్తులు వెలిగించి శాంతి ర్యాలీలు జరుపుతుంటాం కదా.... కొవ్వొత్తి జ్వాల ఎల్లప్పుడూ పైకే మండుతుందేమిటి? కొవ్వొత్తిని అష్టవంకర్లు తిప్పినాసరే దాని జ్వాల పైకే లేస్తుంది. దాదాపుగా అన్ని రకాల మంటల పరిస్థితీ ఇంతే. కానీ
వర్తులాకారంలో మండే జ్వాలల గురించి తెలుసా పిల్లలూ! ముందు మంటలు పైకి ఎగసిపడటానికి కారణం తెలుసుకుందాం. మంటల్లోని వాయువులు వాటి పరిసరాల్లోని గాలి కన్నా చాలా వేడిగా వుంటాయి. అంటే అవి తక్కువ సాంద్రతను కలిగివుండి, గాలి కన్నా చాలా తేలికగా వుంటాయి.

గాలిగాని, ఇతర వాయువులు గాని అధిక పీడనం వుండే ప్రాంతం నుంచి అల్పపీడనం వుండే ప్రాంతానికి కదులుతాయి. అందువల్ల మంటల్లోని వాయువులు కూడా అల్పపీడనం వుండే పై భాగం వైపుగా కదులుతాయి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే, మంటలు మండే దిశని భూమ్యాకర్షణ శక్తి నిర్ధారిస్తుంది. ఒకవేళ భూమ్యాకర్షణ శక్తి ఉండని అంతరిక్షంలో ఏ స్పేస్ షటిల్‌లోనో మంటని పుట్టిస్తే అది గుండ్రంగా గోళాకృతిలో విస్తరించి కన్పిస్తుంది.



దారి కనుక్కోండి

చిన్నారి 'చిత్రం'






ఎం.సాయిక్రిష్ణ
7వ తరగతి,
డిఎవి పబ్లిక్ స్కూల్, ఇబ్రహీంపట్నం.

చిన్నారుల పెయింటింగ్స్‌ను
apchiefeditor@gmail.com కు
ఈ మెయిల్ చేస్తే ప్రచురిస్తాం.



చుక్కలు కలపండి

రంగులు వేయండి



సంఘటిత శక్తి



పూర్వం గ్రామాలలో ఎవరి జీవితం వారు జీవించేవారు లేదా కొద్దిగా ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకొనేవారు. ప్రతి ఒక్కరిలో శక్తి, సామర్థ్యాలు పరిమితంగా వుండేవి కాని గత రెండు శతాబ్ధాలుగా మానవ పరిణామ చరిత్రలో ఎన్నడూ ఊహించి ఎరుగని అనేక అద్భుత మార్పులు చోటు చేసుకోవడం మొదలయ్యింది. ఇది ఎలా సాధ్య పడింది?

తమ శక్తి సామర్థ్యాలను మరొకరిలో, వేరొకరిలో అనుసంధానించి, వివిధ రంగాలలో బృందాలుగా ఏర్పడడం మొదలైన తరువాత సంఘటిత శక్తి ఒక అద్భుతమైన రూపు దాల్చింది. దీనినే ఆంగ్లంలో సినర్జీ అంటారు. జ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానం అనేకానేక కోణాలకు విస్తరించడం మొదలైన తరువాత, వాటిలో ఎక్కడికక్కడ కొన్ని రంగాలను అనుసంధాన పరచడం ద్వారా అపూర్వ శక్తి వినియోగంలోకి రావడం ప్రారంభమయ్యింది.

ఒక మైక్రోస్కోపు నిర్మాణం ఎలా సాధ్యమయ్యింది? అలాగే ఒక కంప్యూటర్ రూపకల్పన ఎలా సాధ్యమయ్యింది. అలాగే కంప్యూటర్ను ఇంటర్నెట్తో అనుసంధాన పరచిన తరువాత విడుదలైన అపూర్వ శక్తిని ఏ కొలమానాలలో కొలవగలం ? అలాగే ఈ ఇరవై ఒకటో శతాబ్ధంలో ఒక జౌత్సాహిక సాంకేతిక నిపుణుడు, పెట్టుబడి పెట్టగల సంస్థలో చేతులు కలిపే ప్రక్రియ ద్వారా అనేక కంపెనీలు ఆవిర్భవించి అవి అగ్రస్థానానికి అవలీలగా చేరుకోవడం సాధ్యపడుతోంది.

ఇద్దరు సాధారణ వ్యక్తులు ఒక లక్ష్యం కోసం సంఘటితమైనప్పుడు అసాధారణ ఫలితాలు వెలువడుతున్నాయి. ఆయా వ్యక్తులకు ఒంటరిగా వున్న శక్తికంటే అనేక వందల రెట్లు శక్తి వంతులుగా మారకలుతున్నారు. అలాగే వివిధ రంగాలలో సాంకేతిక పరిజ్ఞానం కలిగి వున్నవారు ఒక లక్ష్యం కోసం సంఘటితమైనప్పుడు అనేక అద్భుతాలు అవలీలగా సృష్టించబడుతున్నాయి. అసాధ్యాలు సుసాధ్యమవుతున్నాయి. మానవ చరిత్రను మేలు మలుపులు తిప్పుతున్నాయి.

కాని మన సమాజంలో అత్యధిక శాతం మంది అలవాటయిన ఆలోచనలకే అంటిపెట్టుకు వుంటారు. కొత్త ఆలోచనలను దూరంగా త్రోసిపుచ్చుతారు. తమ పాత ఆలోచనలను కడిగిపారవేసే కొత్త ఆలోచనలను ఆహ్వానించడానికి భయపడిపోతారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా నూతన పరిణామాలకు అనువైన రీతిలో తమ ఆలోచనాధోరణిని సవరించుకోవడానికి ఎక్కువ మంది సిద్ధపడరు. ఫలితంగా పాత ఆలోచనలకే మరింత పదును పెట్టడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నూతన రాజధానిని నిర్మించుకోబోతుంది. ఇరవై ఒకటో శతాబ్ధంలో నిర్మితమయ్యే నూతన నగరం ఎలా ఉండాలి? ఈ ప్రశ్నకు సమాధానంగా అత్యధిక శాతం మంది గతంలో ఎలాంటి రాజధానుల నిర్మాణం జరిగిందో, ఇప్పుడు అలాగే జరగాలని చెప్పబోతారు అంతే తప్ప పూర్తి ఆధునికంగా రాజధాని రూపరేఖలను ఎలా తీర్చిదిద్దవచ్చు అని ప్రశ్నిస్తే సరైన సమాధానం లభించదు.

ప్రపంచ వ్యాప్తంగా భవనాల నిర్మాణ కౌశల్యం అనేక కొత్త పుంతలు తొక్కుతోంది. సామాన్య ప్రజల అవగాహనకు, అంచనాలకు అందని విధంగా నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆధునిక ఇంజనీరింగ్ విధానాలను సంతరించుకొన్న భవనాల కళాకౌశలం నిర్ఘాంతపోయేట్లు చేస్తోంది. మనకున్న పరిమిత పరిజ్ఞానానికి పరిమితమైపోకుండా, నూతన అనుభవాలను, ప్రపంచవ్యాప్తంగా వెల్లివిరుస్తున్న ఆధునిక పోకడలను సమ్మిళితం చేసి మన అవసరాలకనుగుణంగా, వేగంగా కదలిపోతున్నా కాలం తెచ్చిపెట్టే మార్పులను తట్టుకోనేలా ఆధునిక భవనాల రూపకల్పన జరగాలి.

రూపకళా పరిజ్ఞానాన్ని సృష్టిలో, నిష్ణాతులైన నిపుణుల పరిజ్ఞానాన్ని వినియోగించుకొంటూ విలక్షణమైన, విశిష్టమైన రీతిలో రాజధాని నిర్మాణం కోసం ఏం చేయాలి ? ముమ్ముందుగా లోతుగా పాతుకుపోయిన పాత ఆలోచనలను వదిలివేయాలి. ఏకలక్ష్యం కోసం ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులో వున్న, ఆధునిక పరిజ్ఞాన ఫలితాలుగా రాణిస్తున్న సాధన సంపత్తులన్నింటినీ అనుసంధానం చేయాలి, స్వప్న సౌందర్యాన్ని వాస్తవ ప్రంపంచంలోకి అనువదించుకోవాలి.

ప్రపంచమంతా ఏక సమాజంగా రూపొందిన వేళ అందరి అనుభవాలను పరిగమనణలోకి తీసుకొని, మనకు కావలసిన రీతిలో వాటిని గ్రుదిగుచ్చాలి. ఇరవై ఒకటవ శతాబ్ధంలో, మన జీవితం మనం జీవించే సౌలభ్యం లేదు. ఈ ప్రపంచంలో ఒకరిగా అన్ని దేశాల సరసన, వాటిలో పోటీ పడుతూ, వాటిని అధిగమించే ప్రయత్నంలో ముందుకు సాగాల్సిందే తప్ప, పూర్వ కాలపు గ్రామాలలాగానే నేటి దేశం ఒంటరిగా మనజాలదు. తోటి ప్రపంచంలోని అన్ని రంగాల నిపుణులతో సంఘటితం కావడం ఇప్పటికే ప్రారంభమయ్యింది. రాజ్ధాని నిర్మాణం నుండి ప్రజల జీవన ప్రమాణాలను అన్ని కోణాలలోను ఉన్నతంగా తీర్చిదిద్దడం వరకు ప్రపంచ నిపుణులలో మనల్ని మనం అనుసంధానించుకొని ఒక సంఘటిత శక్తిగా రూపొందడమే మనకు మార్గదర్శకం. ప్రపంచంలోని వివిధ రంగాలలో మనం సంఘటితమై అద్భుత ఫలితాలను చవిచూడకలుగుతున్నాం. ఔషధ రంగం నుంచి, వాహన రంగం వరకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలీలగా అందిపుచ్చుకోన్నాం. ఇప్పుడు దానిని అన్ని రంగాలకు విస్తరించాలి. మన చొరవతో వివిధ రంగాల్లో విలసిల్లే పరిజ్ఞానాన్ని మన అవసరాలకు అనుగుణంగా మలచుకోవాలి.

– సి.నరసింహారావు

బృహత్పలాయన జయవర్మన్

కొండముది రాగిరేకు శాసనం (క్రీశ. 3వ శతాబ్ది)

అప్పటి కృష్ణా (గుంటూరు జిల్లా 1904 లో ఏర్పడింది), తెనాలి తాలూకా, కొండముది గ్రామంలోని పాటిదిబ్బ దగ్గర దొరికిన ఈ రాగిరేకు శాసనాలు 1901 జూన్‌లో అప్పటి కృష్ణాజిల్లా కలెక్టరు మోరిస్ (ఐసిఎస్)కు చేరగా, జయంతి రామయ్య పంతులు గారి సహకారంతో డా.హుల్జ్ ఈ శాసనపాఠాన్ని, వివరాలను ఎపిగ్రాఫియా ఇండికా వా.6 (పే.315) లో ప్రచురించారు.

మొత్తం 8 రేకులుగల ఈ ప్రాకృత శాసనాక్షరాలు శివస్కంధవర్మ, మైదవోలు శాసనాక్షరాల్ని పోలి ఉన్నాయి. ఈ ప్రాకృత శాసనంలో 'మహేశ్వర', 'బృహత్పలాయన' అనే రెండు సంస్కృత పదాలుండటం గమనించాల్సిన విషయం. ప్రతిరేకు మీద ఎడమవైపు రెండోవరుస మీద 1 నుంచి 8 వరకూ గల అంకెల గుర్తులున్నాయి.

మహేశ్వరపాద పరిగహితులు, బృహత్పలాయన గోత్రానికి చెందిన రాజా సిరిజయవర్మ పాలనాకాలానికి చెందిన ఈ శాసనంలో, తాను బసచేసిన కుదూరు నుంచి కూదూరహారలోని పాంటూరనే గ్రామాన్ని 8 మంది బ్రహ్మణులకుదానమిచ్చినట్లు కుదూరులో నున్న తన ప్రతినిధిని ఆదేశిస్తున్నట్లునూ ఉంది. రాజ సింహాసనాన్నధిష్టించిన 10 సంవత్సరాల తరువాతొచ్చిన చలికాలంలోని మొదటి పక్షంలోని మొదటి రోజున ఈ శాసనాన్ని సైనికాధికారి రాగిరేకుల మీద చెక్కించినట్లుగా కూడా ఉంది.




మొదటి రేకు – రెండో వైపు

పటో..విజయ – ఖందావార

నగరా కూదూరా తో

మహేశ్వర పాద పరిగహి తో



రెండో రేకు – మొదటి వైపు

4) బృహత్పలాయన సగోతా

5) రాజా సిరి జయ వమ్మో

6) ఆనపయతి కూదూరె



రెండో రేకు – రెండో వైపు

7) వాపటం అమ్హెదాని

8) అమ్హ వెజయికె

9) ఆయువధనికె చ


మూడో రేకు – మొదటి వైపు



10) బమ్మహనానం గోతమ సగోత

11) జాయపరస సవగు తజాస

12) తానవస సవిగేజస



మూడో రేకు – రెండో వైపు

13) అసియొ 3 గోగినజస

14) అసియొ 3 కొడినస గోతస

15) భవమ్నజస అసియొ బె 2



రాజముద్ర

బృహత్పలాయన సగోత్రస్య మహారాజ శ్రీ జయవర్మన:


నాలుగోరేకు – మొదటి వైపు

16) భారదాయస రుద వెమ్నహజస

17) అంశిదివధా కంన్హయనస

18) ఈసరదతజస అసి దివ (ధా)

డా ఈమని శివనాగిరెడ్డి – స్థపతి



అర్థం ఎరిగి జీవించాలి

"ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి" అంటాడు యోగేశ్వర కృష్ణుడు. మానవ జన్మ పరంపరంతా ఉద్ధరణ కోసమే! జన్మ వెంట జన్మ. మానవుడు పొందే పరిణామ వికాసానికి మహదవకాశం. పరిణామం చెందాల్సిన అవసరం లేనపుడు కలిగే స్థితే ముక్తి. నిజానికి ప్రకృతి పరంగా ఏర్పడే రుతువులన్నీ పరిణామగత అద్భుతాలే.

"అనేక జన్మల అనంతరం జీవుడు, జ్ఞానాన్ని గురించి ఆలోచిస్తాడు" అంటాడు భగవద్గీతా ప్రదాత. ఒకసారి జ్ఞానాన్ని గురించిన విచారణ ప్రారంభమైతే అది తపనై, తపస్సై, తీవ్ర అన్వేషణై, ఆత్మవిచారమార్గం దొరికి, చివరకు, జన్మచక్రం నుంచి ముక్తుడవుతాడు. ఇది భారతీయ తత్వచింతనలో ఒక అమృతానందరేఖ. కనుక కనుక మరణం ఒక విరామం. అదొక మార్పు. ఈ ముక్త స్థితి అందరికీ సాధ్యమేనా అన్న ప్రశ్నలోనే సాధ్యమేనన్న సమాధానం ఉంది.

అందరికీ సుగతే, 'కాస్త వందూ, వెనకా! అంతే! జన్మ ఎత్తటం వెదలైన తర్వాత ముక్తి తథ్యమని అంటూ అందరికీ అనటంలోనే కుల, మత, వర్గ, వర్ణనలకు అతీతంగా అందరికీ ఉన్న అర్హతను గుర్తు చేస్తుంది.

'జ' అంటే పుట్టేది, 'గత్' అంటే పోయేది. పుడుతూ పోయేది, పోతూ పుడుతుండేది, జగత్తు అని అర్థం.

ఈ జగత్తుకు ఒక గతి ఉంది. ధృతి ఉంది. గమనం ఉంది. గమకం ఉంది. ఒక లయ ఉంది. లీనం కావటమూ ఉంది.

ఆ జగత్ సంక్షిప్త స్వరూపమైన జీవుడికి కూడా ఇవన్నీ ఉన్నాం. పుట్టటం, ఉండటం, పోవటం ఒక నిరంతర ప్రక్రియ. వీటన్నిటితోపాటు జీవుడికి, మనసు ఉంది. ముక్తిమార్గం వైపు నడిపించగలిగినా, కేవలం వస్తు ప్రపంచంలోనే ముంచ గలిగినా, ఉంచగలిగినా మనసే ఆధారం, నిజానికి అన్నిటికీ మనసే కారణం. తన మనసును, అనేక ఆధ్యాత్మిక సాధనా ప్రక్రియల ద్వారా నియంత్రించుకొని, నిగ్రహించుకొని, ముక్తిపథం వైపు నడిపించుకోవటమే సాధన. ఆ నడకే కాలగమనంలో వేగాన్ని పుంజుకొని, ఏదో చేస్తున్నపుడు, దీనికంతటికీ కారణమైన కర్త, కేవలం సాక్షియై ఉంటున్నాడు. పూలదండలో దాగిన దారం వలె, కంటికి కనబడకుండా ఆధారమై, నడిపిస్తున్నాడు. ఇదొక పరమాద్భుత త్రిపుటి.

ముక్తిని అందుకోవటానికి మనసు కారణమవుతున్నది. వర్గ, వర్ణాతీతమైన మనసుకు కులం, గుణమూ లేదు.

ఇంతకీ సుగతి అంటే మంచి స్థితి అనేదే అసలు అర్థం. మాలిన్యమెరుగని, ప్రేమపూరితమైన మనోస్థితే సుగతి! సకల ప్రాణుల పట్ల, ప్రకృతి పట్ల ఎవరి మనసు కరుణాంచితమో, సమంచిత వాత్సల్య మయమో, ఆ మనసు సుగతిలోనే సంచరిస్తుంటుంది. ఈ స్థితి అందుకోలేనిది కాదని, కానీ అందరూ అందుకోవలసినదనే ఎరుకలో ఉండాలి. ఆ అనుకోవటంతోనే అన్వేషణ ప్రారంభం కావాలి. అన్వేషణ, కడగా తనను తాను తెలుసుకోవటంతోనే ముగియాలి. అదే సుగతి. కాస్త ముందూ, వెనుకా అనటంలో, తప్పకుండా సిద్ధిస్తుందన్న అభయం ఉంది. సాధన సక్రమంగా, అర్థమెరిగి చేసుకోకపోతే, వెనుకబడి పోతారన్న హెచ్చరికా ఉంది.

జీవితాన్ని గడిపే వారు కొందరు, నడిపే వారు ఇంకొందరు, జీవించే వారు బహుకొద్దిమంది. జీవితానికున్న పరిమితిని, బలాన్ని, బలహీనతను గుర్తెరిగి ఎవరు జీవిస్తారో వారు సాధకులవుతారు. మనసును శుభ్రం చేసుకొని, నిరతానందాన్ని అనుభవిస్తూ, సాధన చేస్తున్నామన్న స్పృహ సైతం లేని ఆత్మనిష్టలో ఉంటారో, వారి స్థితి, సుగతే!

సుగతి, మరణానంతర సుఖం కాదు. జీవించి ఉండగానే, ఎవరు మోహక్షయాన్ని సాధించుకొని నిత్యతృప్తులై తమ ఉనికి. అస్తిత్వ, వ్యక్తిత్వాల ద్వారా ఇతరులకు ఆనందకారకులవుతారో వారున్న స్థితంతా సుగతే!

సమర్పణ, శరణాగతి, వినయం ముప్పేట హారమైనపుడు, మనసు అనుభవించే స్థితి సుగతే!

ఇంకొకరికి చేసే పాదపూజలు, సేవ పేరుతో చేసే ఊడిగం, మనిషికి సుగతినివ్వవు. నిజానికి అది దుర్గతే!

"అందరినీ ఒకే భావంతో చూడు.

నీకంటే భిన్నమైనది మరొకటి లేదనుకో.

ఉన్నంతకాలం హాయిగా ఉండు.

ఎవరికీ హాని చేయకు.

జరిపిస్తున్న వాడొకడున్నాడనుకో.

దేనితోనూ ప్రమేయం పెట్టుకోకు. సహజంగా ఉండు.

బంధన అసహజం.


ముక్తి సహజం.

ఇంతకు మించి సుగతి, వేరొకటున్నదా? అది అందుకోలేనంత దూరంలో ఉన్నదా? అందరికీ అందనిది సుగతి ఎట్లా అవుతుంది?"

జీవన, జీవనాంతర స్థితుల్ని ఇంత అందంగా, సులభంగా ఆవిష్కరించుకొని, అమ్మ అవనిపై మనం దర్శించినదంతా సుగతే!

వి.యస్.ఆర్. మూర్తి
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

గోమూత్ర శిలాజిత్తు కతా... కమామీషూ!



1986లో కడప కొండల్లోను, 1990లో- కర్ణాటక రాష్ట్రం (బంగారునాయకుని కొండ, తుంకూరు జిల్లా)లోను, మహబూబ్‌నగర్ జిల్లాలోను "గోమూత్ర శిలాజిత్తు" ఉనికిని నేను నా ఓషధీ ప్రస్థానాల ద్వారా బహిర్గతం చేసేవరకు వింధ్యపర్వతాలకు దిగువన (దక్షిణాన) అది దొరుకుతుందన్న విషయమే గ్రంథస్థం కాలేదు! ఇలాంటి ఎన్నో విషయాలు ఇంతవరకు పుస్తకాలకెక్కక పోవడానికి కారణాలు అనేకం. మొదటిది- ఆ ప్రాంతీయులకే వాటి గురించి స్పష్టత లేనప్పుడు ఇతర ప్రాంతాల వారికా సంగతి ఎలా తెలుస్తుంది? కర్ణాకర్ణిగానైనా నలుదిశలా వ్యాప్తి చెందనప్పుడు గ్రంథాల వరకు వెళ్ళే ఆస్కారం ఎలా కలుగుతుంది? రెండవది- పూర్వపు రోజుల్లో- కొంతమంది పండితులు తమకు తెలిసిన వాటిని రహస్యంగా తమదగ్గరే భద్రపరుచుకునేవారు. అందువల్ల కూడ కొన్ని విషయాలు తాళపత్ర గ్రంథాల్లోకి సైతం ఎక్కలేదు! కాని ఈ ఆధునిక ప్రపంచంలో, రహస్యంగా ఉంచేవారికన్న కనీసం పత్రికాముఖంగానయినా తెలియజేసేవారికి యెంతో కొంత ప్రతిఫలం(కీర్తి, కొండొకచో ధనలాభం) దక్కుతుంది. సైంటిఫిక్ పత్రికల్లో మొదటిసారిగా(అందరికన్న ముందు) ప్రచురిస్తే మరి ధోకాయే ఉండదు. అలా అని 'ఇంటర్నేషనల్ కోడ్' నొక్కి వక్కాణిస్తోంది.

ఐతే, శిలాజిత్తు విషయంలో ఒక మతలబు ఉంది. ఆయా కొండప్రాంతాల్లో నివసించే ప్రజలు దానిని వేర్వేరు పేర్లతో పిలుచుకున్నారే తప్ప, 'అదే గోమూత్ర శిలాజిత్త'ని వారికి తెలియదు! ఉదాహరణకు, వైద్యులు గోమూత్రశిలాజిత్తు పేరుతో వాడుకునే 'పదార్థాన్ని' కడపజిల్లాలో నివసించే యెరుకలవారూ, యానాదివారూ "రక్తమండలం" అని పిలుస్తారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని చెంచువారు "కొండముచ్చు మూత్రం" అనీ, నల్గొండ జిల్లా సుగాలీలు "ముచ్చుమూత్రం, మూత్రం రాళ్ళు" అనీ, అనంతపురం జిల్లావారు "ముని రొట్టె, ముని రెట్ట" అనీ పిలుస్తారు. వరంగల్లు, కరీంనగర్ జిల్లాల్లో "మొమ్మాయి" అనే పేరుతో గిరిజన ప్రాంతాల్లో జరిగే సంతల్లో అమ్ముతారు. విజయనగరంజిల్లాకు చెందిన సంబర, తోనం గ్రామాల వైద్యులు "కొండ మలం" అంటారట. తూర్పు గోదావరిజిల్లాలో రంపచోడవరం నుండి అడ్డతీగల వెళ్ళే దారిలో ఉన్న కొండల్లో గోమూత్రం వాసన వేసే బంక పదార్థం (గోమూత్ర శిలాజిత్తు) దొరుకుతుందనీ, అక్కడ ఉండే కొండరెడ్లు, కోయలూ దానిని "రాతి పుండు" అంటారనీ ఈమధ్యనే తెలిసింది. శ్రీకాకుళంజిల్లాలోని పాలకొండ - పర్లాకిమిడి ప్రాంతాల్లో కూడ దాన్ని 'రాతిపుండు' అనే పిలుస్తారట.

పండితులకు అంతు చిక్కని పామర (ప్రాంతీయ) నామాలు!

మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్ననూరు అభయారణ్యంలో 'కొండముచ్చుమూత్రం' రాళ్ళు ఎక్కడ దొరుకుతాయని ఒక చెంచు బిడ్డను అడిగాను. 'కొండముచ్చులు తిరిగేచోట అవి పోసిన మూత్రం గడ్డకట్టి రాళ్ళలా తయారవుతాయ'న్నాడు. తీరా పోయి చూస్తే- నాకేమీ కనబడలేదు. మర్నాడు ఉదయం, మన్ననూర్ అటవీశాఖవారి అతిథిగృహంలో నిద్రలేచిన నాకు- మా జీపు మీద యెక్కి గెంతులేస్తున్నకొండముచ్చుల పటాలాన్ని చూడగానే, యెక్కడలేని ఆనందం కలిగింది! కొండముచ్చులు అక్కడినుండి నిష్క్రమించగానే జీపు దగ్గరకు పోయి అవి విసర్జించిన మూత్రాన్ని వాసన చూసాను. అదో విధమైన గబ్బు(గబ్బిలం పెంట) వాసన వచ్చింది. దానితో "శిలాజిత్తు- గోమూత్రం వాసన వేస్తుందికాని ఇలాంటి 'గబ్బిలం పెంట' వాసన కాదు. కనుక గోమూత్రం వాసనవచ్చే 'కొండముచ్చు మూత్రంరాళ్ళ'కూ, ఈ నల్లమూతి కోతుల మూత్రానికీ యేవిధమైన సంబంధం లేదు" అని తీర్మానించుకున్నాను.

ఏది యేమైనా, హిమాలయాల్లో దొరికేదే నిజమైన శిలాజిత్తని దక్షిణాది వైద్యుల నమ్మకం. ప్రాంతీయ పేర్లతో సేకరించిన మొమ్మాయి, రక్తమండలం, రాతిపుండు మొదలైన వాటిని 'రెండవరకం శిలాజిత్తు'గా కొందరు వైద్యులు గుర్తించడం కాలక్రమేణా జరిగింది కాని- 'రెండూ ఒకటే' అని

తూటాలకు రాలే శిలాజిత్తు!

లద్దాఖ్ లో బార్డర్ సెక్యూరిటీ వారు ప్రతి రోజూ రైఫిల్ ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తారట. ఆ ఫైరింగ్ లో తూటాలు ఒకోసారి యెదురుగా ఉన్న కొండకు తగలడంతో పగిలిన రాళ్ళూ, మట్టి పెళ్ళలూ శిలాజిత్తుతో సహా కింద పడతాయట. ఈ శిలాజిత్తు కోసం ఆ ప్రాంతంలోని చిన్నా చితకా వ్యాపారులు ఫైరింగ్ విరామ సమయంలో ఎగబడతారట. శిలాజిత్తు ఆరోగ్య ప్రదాయినీ, బలవర్ధకమూ అన్న సంగతి తెలుకున్న జవానులు కూడా తూటా దెబ్బలకు కిందపడిన శిలాజిత్తు రాళ్ళను శుద్ధి చేయించుకుని వాడుకుంటారట. భళే మంచి చౌక బేరమూ!

చెప్పడానికి ధైర్యం చాలలేదు! అనువాదాల బ్రతుక్కి అలవాటు పడిన మన 'కవి'రాజులూ, తదితర రాజ వైద్యులూ, తాటి ఆకు గ్రంథాలలో ఉన్న దాన్నే 'పంచమ వేదం'గా తలకెత్తుకున్నారుగాని, స్వకపోల జనిత మేధను ఉపయోగించడానికి సాహసించలేదని అనిపిస్తుంది!

ఇంతకీ గోమూత్ర శిలాజిత్తు దేనికి పనికొస్తుందో చెప్పనేలేదు! అది అనేక ఔషధగుణాల పుట్ట! క్షయ, రక్త హీనత, మధుమేహాలలో పనిచేస్తుంది. జీర్ణక్రియలో ఉపయోగపడే రసాలను నియంత్రించడంలోను, కామెర్లు, మూత్రపిండాలలో రాళ్ళు వంటివి తగ్గడానికి ఉపయోగపడుతుంది. వృద్ధాప్యాన్ని త్వరగా రానివ్వదు. రక్తప్రసరణ వేగం పెంచుతుంది. హుషారైన దాంపత్యజీవితానికి దోహదం చేస్తుంది. హార్మోనులను నియంత్రించడంలోను, రోగనిరోధకశక్తిని పెంచడంలోను దిట్ట. అయితే గుండెజబ్బులున్నవారు వైద్యుల సలహా లేకుండ వాడడం క్షేమం కాదు.

లద్దాఖ్ (లడక్) శిలాజిత్తు కత!

ఆంధ్రప్రదేశ్ శిలాజిత్తు కత ఇలా ఉంటే, హిమాలయాలలో ఉన్న లద్దాఖ్ (లడక్)లో కత మరోలా ఉంది! ప్రస్తుతం మన వైద్యులు వాడే శిలాజిత్తు ఎక్కువ శాతం లద్దాఖ్ పర్వతాలలో సేకరించేదే. అక్కడివారు శిలాజిత్తుని 'కొండ ఎలుక మలం' (Fecal matter of mountain rat) అని పిలుస్తారు. వారికి తెలిసినంతవరకు శిలాజిత్తంటే ఎలుక మలమే! కాని నాకెందుకో నమ్మబుద్ధి కాలేదు. దక్షిణ భారతంలో ప్రాంతీయ పేర్లలాగే ఇందులోనూ యేదో 'కిరికిరి' ఉందనిపించింది. ఆ పర్వతాలలో సేకరించిన ముడి శిలాజిత్తు 'సాంపిల్స్' తెప్పించి, శ్రద్ధగా పరిశీలించి, అటుపై వాటిని మూడు భాగాలుగా విభజించాను. వాటిలో ఒకటి– మట్టిపెళ్ళలూ, మరే ఇతర మలినాలూ లేకుండా 'కలబంద ఆకు కోస్తే వచ్చే రసంతో చేసిన ముసాంబ్రం ముద్ద'లా ఉంది. రెండవది కొండ రాళ్ళలో తవ్విన మట్టి పెళ్ళల్లా ఉంది. మూడవది బటాణీగింజల్లా ఉన్న కొండ ఎలుక మలం (డ్రాపింగ్స్). ఈ మూడవ 'సాంపిల్'లో మొదటి దానిలో ఉన్న ముద్దలాంటి పదార్థం కూడా కొంత కలిసిపోయి ఉంది. ఐతే, అన్ని సాంపిల్సూ గోమూత్రం వాసన వేస్తున్నాయి. ఇందులో మొదటిది కొండరాళ్ళను ఛేదించుకుని బయటకు వచ్చి క్రింద ఉన్న చదునైన ప్రదేశాలలో పడి గడ్డకట్టిన 'అసలు సిసలైన' గోమూత్ర శిలాజిత్తు. దీన్ని ఆయుర్వేద పరమైన శుద్ధులు చేసి వాడుకుంటారు. రెండవదానిలో మట్టి పాళ్ళు యెక్కువకాబట్టి దాన్ని నీళ్ళలో వేసి కరిగించి, వడబెట్టి, ఆరబెట్టగా మిగిలిన శిలాజిత్తు ముద్దను సేకరించి, శుద్ధి చేస్తారు. మూడవ సాంపిల్– కొండ ఎలుక గొద్దులు. వీటిని నీళ్ళలో నానబెట్టి, ఇంతకు ముందు చెప్పినట్లు శిలాజిత్తును వేరుచేస్తారు.

ఇప్పుడు స్పష్టం కావలసింది ... 'ఎలుక మలంలోకి గోమూత్ర శిలాజిత్తు ఎలా ప్రవేశించి ఉంటుంది?' అనేది ఒకటైతే, కస్తూరిమృగం కస్తూరిని తయారుచేసుకున్నట్లు 'కొండ ఎలుకలు స్వయంగా శిలాజిత్తును సృష్టించగలవా?' అనేది రెండవది. నా పరిశోధనలో తేలింది యేమిటంటే... కొండ ఎలుకలు కొండరాళ్ళ పగుళ్ళనుండి స్రవించే శిలాజిత్తును చాల ఇష్టంగా తిని 'పందికొక్కు'ల్లా బలుస్తాయి. తమ మలమూత్రాలను కూడా, అక్కడ కుప్పలు తెప్పలుగా పడిఉన్న శిలాజిత్తు మీదే విసర్జిస్తాయి. అలా విసర్జించిన మలంతోబాటు, జీర్ణకోశంలో అరగకుండా మిగిలిపోయిన(డైజెస్ట్ కాని) శిలాజిత్తు కూడ బయటకు వచ్చేస్తుంది. దానికి తోడన్నట్లు, అప్పటికే ఆ ప్రదేశంలో పేరుకుపోయి ఉన్న 'అసలు శిలాజిత్తు' మీద పడిన ఎలుక గొద్దులు మరింత శిలాజిత్తును పీల్చుకోడంతో దాని గాఢత శాతం పెరిగే ఆస్కారం కూడ ఉంది. సీరియస్గా లేబరేటరీల్లో పనిచేసుకునే పరిశోధకులకు ఈ విషయాలు తెలిసే అవకాశం ఉండదు కనుక– 'శిలాజిత్తు కొండ ఎలుకల మలంలోంచి వస్తుంద'ని నమ్ముతున్నట్లు వారి పరిశోధనాపత్రాలను చదివితే అవగతమవుతుంది.

నెలకొక్క స్రావం!

1997లో మరోసారి బంగారునాయకునికొండకు వెళ్ళినప్పుడు కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు బయటపడ్డాయి. మనుషుల్లోలాగే ఇక్కడ "ఆడ కొండలు, మగ కొండలు" అని వేర్వేరుగా ఉన్నాయట. మగకొండల్లో శిలాజిత్తు 'అప్పుడోసారి, ఇప్పుడోసారి' అన్నట్టు ఊరుతుందట. ఆడకొండల్లో మాత్రం నెలకొక్కసారే స్రవిస్తుందట– నెలసరి ఋతుస్రావంలా! చూసారా? పల్లె ప్రజల పరిశీలనా పాటవం! కాపోతే, ఈ 'స్టేట్మెంట్' పూర్తి సత్యమా లేక అర్ధసత్యమా? అనేది ధృవీకరించవలసిఉన్నది.

అదోపక్కన పెడితే... నేను ఈ సందర్భంగా తెలియపర్చవలసిన విశేషం మరొకటుంది. మీలో కొందరైనా అస్సాం (అసోం/అహోం) వెళ్ళిఉంటారు. అస్సాం వెళ్ళారంటే గువాహటి(గౌహతి)లోనే దిగిఉంటారు. అక్కడిదాకా వెళ్ళాక కొండమీద కొలువై ఉన్న 'కామాఖ్య (కామాక్షి)'ను చూడ్డానికి వెళ్ళకుంటారా? వెళ్ళే ఉంటారు. క్యూలో ఒకరివెనుక ఒకరు నిలబడి దాదాపు గుడి దగ్గరకు చేరేసరికి మీకు మొదటిగా దర్శనమిచ్చేది రాతిగోడ మీద ప్రతిష్ఠించిన (చెక్కి ఉన్న) "యోని" బొమ్మ! సుఖ సంసారాన్ని కాంక్షించేవారు 'దాన్ని' భక్తి శ్రద్ధలతో తాకి, కళ్ళకద్దుకుంటారు. స్థలపురాణం ప్రకారం గుడిలో ఉన్న కామాక్షీదేవికి సంవత్సరానికోసారి– ఆషాడమాసంలో సప్తమినాడు ఋతుస్రావం అవుతుందట. (నెలనెలా యెందుకు కాదోమరి!?). దానికి తార్కాణంగా గర్భగుడి గుండా పారే ఊటనీరు 'ఆ మూడురోజులూ' యెర్రబడుతుందట. అంటే, రక్తస్రావం జరుగుతుందన్నమాట! నేను గువాహటి చాలసార్లు వెళ్ళాను. ఆంధ్రా – కర్ణాటక సరిహద్దులో ఉన్న బంగారునాయకునికొండకు రెండోసారి వెళ్ళిన తర్వాత కూడా మరోసారి కామాఖ్య గుడికి వెళ్ళాను. అప్పుడు హఠాత్తుగా బంగారునాయకునికొండ దగ్గర ఉన్న 'నెలసరి ఋతుమతులుగా ముద్ర పడిన ఆడకొండలు' నా మదిలో మెదిలాయి. దానితో నాకేమనిపించిందంటే– గువాహటిలో ఉన్న ఆయుర్వేద కౌన్సిల్ (AYUSH) వారు కామాక్షికొండల్లో వెదుకులాడితే గోమూత్ర శిలాజిత్తు దొరికేతీరుతుందని!

– కొప్పుల హేమాద్రి



రసాయనిక ఆయుధాల

హింస విధ్వంస రచన

జీవ రసాయనిక ఆయుధాలు చూడడానికి భయంకరమైన వికృత ఆకృతులలో ఏమీ ఉండవు. కాకపోతే అవి హద్దుదాటి బయటకు విడుదలయ్యాయంటే మాత్రం ఉనికిని చాటుకుంటూ విలయతాండవం చేస్తాయి. ఇవి వాతావరణంలో ప్రవేశించి మనిషిప్రాణాలు తీస్తాయి. ఇందులో కొన్ని క్షణాల్లో మనిషి ప్రాణాలు హరిస్తే మరికొన్ని శరీర అవయవాలను యమ యాతనకు గురిచేసి చంపుతాయి.

టియర్ గ్యాస్

దీనిని అల్లరి మూకలను చెదరగొట్టడానికి ఉపయోగిస్తారు. దీని పేరు క్లోరో-ఎసిటో ఫినోన్ (సి.ఎ.పి). దీనికి ఫ్లోర్ పాలిష్ వాసన ఉంటుంది. ఈ వాయువు సోకగానే కళ్లల్లో బాధ, నీళ్ళు వస్తాయి. కళ్లు తెరవడం కష్టం అవుతుంది.

ఇథైల్ అయిడో ఎసిటేట్-దీనిని టియర్‌గ్యాస్‌గా కూడా వినియోగిస్తారు. దీనికి సెల్యులోజ్ వాసన ఉంటుంది. ఇది సోకిందంటే కళ్లల్లో బాధతో పాటు చర్మం కూడా మంటగా ఉంటుంది. ఇటువంటి పరిస్థితి బ్రోమో బెంజిల్ సయినైడ్‌ను టియర్ గ్యాస్ గా వాడినా ఉత్పన్నమవుతుంది.

కాని యుద్ధ రంగంలో వాడే టియర్ గ్యాస్ మనుషుల్ని ఎందుకూ పనికి రాకుండా చేస్తుంది. వామిట్ గ్యాస్ టియర్ గ్యాస్‌లలో బలమైనది. దీనిని శత్రుసైనికులు ఇళ్లనుండి, గుహలు, కోటల నుండి బయటకు రప్పించేందుకు వాడతారు.

మస్టర్డ్ గ్యాస్

డైక్లోరో-డై ఇథైల్ సల్ఫైడ్‌ను మస్టర్డ్ గ్యాస్ గా వినియోగిస్తారు. ఇది ఆవాలు, ఉల్లిపాయలు, అల్లం వాసన కల్గి ఉంటుంది. దీని పని తీరు నెమ్మదిగా ఉంటుంది. ప్రమాదం జరిగిన తరువాత గాని దీని గురించి తెలియదు. దీని ప్రతాపం కళ్లు, ఊపిరితిత్తులు, అచ్ఛాదన లేని శరీర భాగాలపై ఉంటుంది. గుడ్డితనం, గొంతుపోవడం, దగ్గు, చర్మం బొబ్బలెక్కడం వంటి దుష్ఫలితాలు సృష్టిస్తుంది.

ఈ మస్టర్డ్ గ్యాస్‌ను మొదటి ప్రపంచ యుద్ధానంతరం మరింత అభివృద్ధి పరిచారు. ఈ అభివృద్ధి చెందించిన మస్టర్డ్ గ్యాస్ ఊపిరితిత్తుల్లో మంటలు పుట్టించి మెల్లిగా మనిషిని హింసిస్తూ ప్రాణాలు లాగేస్తుంది.

చోకింగ్ గ్యాస్

చోకింగ్ గ్యాస్ అంటే ఫాస్జీన్. ఇది కుళ్లిన బంగాళాదుంపల వాసన కల్గి ఉంటుంది. ఇది ఉత్పత్తి అయ్యే ప్రాంతంలో, తడివున్న ప్రదేశాల్లో తెల్లని మేఘంలా దర్శనం ఇస్తుంది. వర్షం కురిసిందంటే మాత్రం దీని ప్రభావం బాగా తగ్గిపోతుంది. ఈ చోకింగ్ వాయువులు ఊపిరి వ్యవస్థలోని కింది భాగాన్ని, ఊపిరి తిత్తుల్లోని సున్నితమైన భాగాల్ని ఎక్కువగా బాధపెడతాయి. శరీరంలో ఆక్సిజన్ రవాణా అయ్యే వ్యవస్థకు అడ్డంకులు సృష్టించి మనిషిని ఉక్కిరి బిక్కిరి అయ్యేటట్లు చేసి మృత్యుముఖంలోకి గెంటేస్థాయి ఈ వాయువులు. ఈ వాయువులు మనిషిని నరకయాతనకు గురి చేస్తాయి.

మొదటి ప్రపంచ యుద్ధంలో ఈ వాయువులను ప్రయోగించడం వలన చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో 80% శాతం మంది వీటి కారణంగానే మృత్యువాత పడ్డారు.

బ్లడ్ గ్యాస్

బ్లడ్ గ్యాస్ చాలా చురుగ్గా పనిచేస్తుంది. ఆకస్మిక దాడులకు దీనిని ప్రయోగిస్తారు. ఊపిరితిత్తులు వద్ద రక్తంలోకి ఈ ఆక్సిజన్ చేరకుండా అడ్డగిస్తుంది. దానితో ప్రాణం మీదకు వస్తుంది.

అన్ని గ్యాస్‌లలోకి అత్యంత ప్రమాదకరమైన గ్యాస్‌లు నెర్వ్ గ్యాసులు. వీటిని యాంటీకొలీన్ స్టిరేజ్ ఏజంట్స్ అని పిలుస్తారు. ఈ వాయువులు మనిషి మెదడు నుండి నరాలకు అందే సంకేతాలను నిలుపుదల చేస్తాయి. దీనితో శరీరం పనిచేయదు పైగా విషపూరితం అయి-ుపోతుంది.

ఈ జీవరసాయన ఆయుధాలను నిర్లక్ష్యంగా ప్రయోగిస్తే ప్రయోగించే వ్యక్తులు కూడా బలయిపోతారు. వీటిని ప్రయోగించేవారు రక్షణ దుస్తులు, రెస్పిరేటర్లు వంటివి ధరిస్తారు. మొదట్లో ఈ ఆయుధ వాయువుల్ని సిలెండర్లలో నిల్వ ఉంచి శత్రువుల మీదకు దాని నుండి వాయువులను విడుదల చేసేవారు. ఈ పద్ధతిలో వాయువులు వెనుదిరిగి విస్తరించే ప్రమాదం ఉంటుంది. అలా సంభవిస్తే ప్రయోగించిన వారి ప్రాణాలకే ముప్పువాటిల్లుతుంది.

జీవాయుధాలు

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా ఎన్నోరకాల రోగకారక ఆయుధాలు అందుబాటులో వున్నాయి. వీటిని అయిదురకాలుగా వర్ణించవచ్చు. రికెట్సీ, బాక్టీరియా, వైరసెస్, ఫంగై, టాక్సిన్స్.

రికెట్సీ రకానికి చెందినవి టైఫస్, స్క్రబ్ టైఫస్, రాకీమౌంటెన్ స్పాటెడ్ ఫీవర్, క్యూ ఫీవర్ వంటి జ్వరాలు తీసుకువస్తాయి. బ్యాక్టీరియా రకానికి చెందినవి ఆంత్రాక్స్, బాసిలరీ డీసెంట్రీ, కలరావంటి వ్యాధులకు కారణమవుతాయి.

వైరసెస్ రకానికి చెందినవి పచ్చకామెర్లు, హెపటైటిస్, డెంగ్యూ ఫీవర్ వంటి రోగాలకు కారకులవుతాయి. ఫంగై తరగతికి చెందినవి వ్యాలీ ఫీవర్, హెస్టోప్లాస్మా క్యాప్సులేటమ్, నోకార్డియా ఆస్టెరాయిడిస్ వంటి అనారోగ్యాలను వ్యాప్తి చెందిస్తాయి. టాక్సిన్స్ రకం విషాలను వదులుతుంది.

ఆంత్రాక్స్

ఆయుధంగా భయపెడుతున్న 'ఆంత్రాక్స్' అత్యంత ప్రమాదకరమైన ఒక బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్. ఇది క్యుటేనియస్, పల్మొనరీ, గ్యాస్ట్రిక్, మెనింజైటిస్ ఆంత్రాక్స్‌లనే నాల్గురకాలుగా వస్తుంది. కాకపోతే మనుషుల్లో క్యుటేనియస్, పల్మొనరీ ఆంత్రాక్స్‌లే ఎక్కువగా వస్తాయి.

ఈ ఆంత్రాక్స్ అనే వ్యాధి 'బాసిల్లస్ ఆత్రాసిస్' అనే బ్యాక్టీరియా కారణంగా వస్తుంది. ఈ బ్యాక్టీరియా సిద్ధ బీజ స్థితిలో అత్యంత వేగంగా తన సంఖ్యను వృద్ధి చేసుకుంటుంది. ఈ బీజాలు ఎటువంటి ప్రతికూల పరిస్థితితులనైనా తట్టుకుని మట్టిలోగాని, జంత పదార్థాలలో గాని నిల్వ ఉంటాయి. వాటికి అనువైన వాతావరణం లభించగానే అవి బ్యాక్టీరియాగా రూపొంది తమ విశ్వరూపాన్ని చూపుతాయి.

సాధారణంగా ఇవి నేల పొరల్లో దాగి ఉండడం వల్ల సులువుగా జంతువుల మీద దాడికి దిగుతాయి. జంతువుల నుండి ఈ వ్యాధి మనుషులకు రవాణా అవుతుంది.

క్యుటేనియస్ ఆంత్రాక్స్ కారణంగా శరీరం మీద దురదలు వచ్చి నల్లని పొక్కులుగా మారుతాయి. మెల్లిగా వాచి చుట్టు పక్కల కణాలకు వ్యాపిస్తాయి. ఈ వ్యాధిని వెంటనే గుర్తిస్తే పెన్సిలిన్ వాక్సిన్ ద్వారా దీనిని నివారించవచ్చు. ఎటువంటి చికిత్స తీసుకోకపోతే ఈ ఇన్‌ఫెక్షన్ లింపుగ్రంధులు, రక్తంలోకి సైతం వ్యాపిస్తుంది. కొద్దిరోజుల్లోనే రోగి మరణిస్తాడు.

పల్మొనరీ ఆంత్రాక్స్

పల్మొనరీ ఆంత్రాక్స్ శ్వాస ద్వారా సరాసరి శ్వాస నాళాల్లోకి వెడుతుంది. ఇదే జరిగిందంటే రోగి మృత్యువాత పడినట్లే. పరిసర వాతావరణంలో ఆంత్రాక్స్ ఉందన్న అనుమానం రావడంతో వాక్సిన్ తీసుకోవడం వల్ల కొంతవరకు ఈ వ్యాధి సోకకుండా అరికట్టవచ్చు.

అణ్వాయుధాలు కంటే క్రూరంగా మనిషిని బలి తీసుకునే ఈ జీవ, రసాయన ఆయుధాలు శాస్త్రవిజ్ఞాన ప్రగతికి తార్కాణాలో లేక శాస్త్రవిజ్ఞాన వక్రగతికి ప్రతీకలో మనిషి తనకు తానే ప్రశ్నించుకోవాల్సి ఉంది. ప్రమాదకర పరిస్థితులలో రక్షణ కోసం వినియోగించాల్సినవి మనుషుల భక్షణ కోసం వినియోగించడం ఎంత వరకూ సమంజసమో ఆలోచించుకోవాలి.

– సి.వి సర్వేశ్వర శర్మ

భానుమతి గడుసుదనం



ఇద్దరు అగ్రతారలు నిర్మాతలైతే, ఒకరు తీసే చిత్రంలో మరొకరు నటించవలసి వస్తే, పారితోషికం విషయంలో ఎలా ఒక అవగాహనకు రావడమనేది ఓ చిక్కు సమస్య. అటువంటి సమస్యను ఎన్టీఆర్, భానుమతి ఎదుర్కోవలసి వచ్చింది! ఆ సందర్భం ఏమిటంటే, ఎన్టీఆర్ తన సొంత చిత్రం 'తాతమ్మకల'లో భానుమతి గారిని ప్రధాన పాత్రకు ఎంపిక చేసినప్పుడు, ఆమెకు పారితోషికం ఎంత ఇవ్వాలనే అంశం చర్చకు వచ్చింది. అప్పుడు భానుమతి గారే ఓ సలహా చెప్పారు. ఎన్టీఆర్ తాము మామూలుగా తీసుకునే పారితోషికంలో ఐదువేల రూపాయలు తగ్గించి తనకిమ్మని సూచించారు. అప్పట్లో అత్యధిక పారితోషికం తీసుకునే ఎన్టీఆర్ కాస్త ఆలోచించి, ఒక మొత్తాన్ని నిర్ణయించి, ఆమెకు చెక్కు పంపించారు. అంటే తను ఆమెకు ఇవ్వాల్సిన రెమ్యూనరేషన్ కాబట్టి, సహజంగా బాగా తగ్గించే అమౌంట్ వేసి ఉంటారని సినీ పండితులు అంటారు. అలా జరుగుతుందనే ఊహించిన భానుమతి, ఆ మొత్తానికి మరో ఐదువేల రూపాయలు కలిపి చెక్కు రాసి పంపిస్తూ, తను ఎన్టీఆర్ తో తీయబోయే 'అమ్మాయిపెళ్ళి' చిత్రానికి ఆయనను బుక్ చేశారు. ఈ సంగతి తెలుసుకున్న తక్కిన చిత్ర నిర్మాతలు భానుమతి గారి గడుసుతనానికి ఆశ్చర్యపోయి నవ్వుకున్నారు.

ఎస్వీఆర్, గుమ్మడి హీరోలైవుంటే...



కారెక్టర్ యాక్టర్స్‌గా ప్రసిద్ధులైన ఎస్.వి. రంగారావు, గుమ్మడి వెంకటేశ్వరరావు మొదట హీరోలుగానే చిత్రరంగ ప్రవేశం చేశారన్నది చాలా మందికి తెలియని విషయం. ఎస్వీఆర్ 1946లో విడుదలైన 'వరూధిని'లో హీరోగా ప్రవరాఖ్యుడి పాత్ర ధరించారు. అందులో దాసరి తిలకం వరూధిని పాత్ర ధరించారు. ఆమె ఎవరో కాదు...హాస్యనటిగా ఎంతో పేరు తెచ్చుకున్న గిరిజ తల్లిగారు. ఐతే, 'వరూధిని' చిత్రం అపజయం పాలైంది. ఇక గుమ్మడి గారికైతే, మొదట 'జైవీర బేతాళా' అనే జానపదచిత్రంలో హీరోగా నటించే అవకాశం వచ్చింది. అందులో కథానాయిక –జమున! ఐతే, ఏవో కొన్ని సమస్యల వల్ల ఆ చిత్రం పూర్తికాలేదు. ఎస్వీఆర్, గుమ్మడి గార్లకు హీరో పాత్రల్లో అలాంటి చేదు అనుభవాలు మొదట్లో ఎదురైనా, అది తెలుగు చిత్ర సీమకు మంచిదే అయింది. దానివల్లే ఇద్దరు అద్భుతమైన కారెక్టర్ యాక్టర్లు వెండితెరకు లభించారు.

రజనీకాంత్ కలం బలం

'చదువుకున్న యువకులు కష్టపడి పనిచేయడానికి ఇష్టపడడం లేదు. సోమరితనానికి అలవాటు పడుతున్నారు. కానీ శ్రమించడంలో గల ఆనందాన్ని గుర్తించడం లేదు. చదువులేని వాళ్లే కష్టపడి పని చేయాలని, ఇతరుల మీద అధారపడకుండా, తమ



కాళ్లమీద తామే నిలబడి బ్రతకాలని కోరుకుంటున్నారు. ఈ నాటి యువతీ యువకుల్లో విప్లవ భావాలు రగులుకోవాలి. వాళ్ల కృషి పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంది".

'అయోధ్యలో రామాలయం కడతారట" (ఓ వ్యక్తి) "కాదు...కాదు...అయోధ్యలో మసీదు కడతారట" (మరోవ్యక్తి) వాళ్ల మాటలు వింటూ ఉన్న మూడో వ్యక్తి – "ముందు ఆ రెండింటినీ మీ హృదయాల్లో కట్టుకోవాలి" అంటాడు.'చెత్త కబుర్లు చెప్పకండి...గాంధీ టోపీ పెట్టుకున్న వాళ్లంతా గాంధేయవాదులు కారు. ఉపన్యాసాలు ఇచ్చినంత మాత్రాన నాయకులై పోరు. ప్రజా సమస్యలు అర్థం చేసుకుని , వాళ్లకోసం పాటుపడే వాళ్లే నిజమైన ప్రజా నాయకులు...."

ఇలాంటి పదునైన సంభాషణలు మామూలుగా ఓ అభ్యుదయ సినిమా రచయిత ఎవరైనా రాసి ఉండవచ్చని సినిమా అభిమానులు అనుకోవచ్చు. కానీ వీటిని రాసింది ప్రసిద్ధ నటుడు రజనీ కాంత్! ఒక దశలో దేశ పరిస్థితులను చూసి, ఆవేశంతో, తనలోనూ ఓ రచయిత ఉన్నాడని నిరూపించడానికా అన్నట్లు 'వళ్లి' అనే సినిమాకి ఆయన సంభాషణలు సమకూర్చారు. ఆ తమిళ చిత్రాన్ని చూసి, ఆయన రాసిన డైలాగ్స్ కు ముగ్ధులైన విజయాధినేత బి.నాగిరెడ్డి ఆ చిత్రాన్ని 'విజయ' పేరుతో అనువదించి, తెలుగులో విడుదల చేశారు!

బి.ఎన్.కు కోపం వస్తే...?



ప్రసిద్ధ దర్శక నిర్మాత బి.ఎన్.రెడ్డి స్వతహాగా మృదు స్వభావి. ఆయన సినిమాలూ సాధారణంగా ఉదాత్త భావాలనే ప్రతిబింబిస్తాయి. అవేవీ ఒక్క సెన్సార్ కట్‌కు కూడా గురి కాలేదంటే, దాన్ని బట్టే ఆయన చిత్ర నిర్మాణ ధోరణిని అంచనా వేయవచ్చు. ఆయన నిజ జీవితంలో కూడా ఎవరినీ, ముఖ్యంగా తన నటీనటులు, టెక్నీషియన్లు ఎవరినీ నొప్పించేలా మాట్లాడేవారు కాదు.

ఒక సారి ఆయన తీస్తున్న చిత్రంలోని హీరోయిన్ ఓ అగ్రనటి. షూటింగ్‌కు రెండు గంటలు ఆలస్యంగా వచ్చింది. చిత్ర నిర్మాణంలో ప్రతి నిమిషమూ చాలా విలువైనది. ఎందుకంటే ఖర్చుల మీటరు క్షణ క్షణానికీ పెరిగిపోతూ ఉంటుంది. అప్పటికే బి.ఎన్ సహనాన్ని కోల్పోయి సెట్లో అటూ ఇటూ సీరియస్ గా పచార్లు చేస్తున్నారు. తక్కిన ఆర్టిస్టులూ విసుగ్గా ఆమె కోసం ఎదురుచూస్తున్నారు. ఇంతలో మేకప్ వేసుకుని సెట్లోకి వచ్చిన ఆ నటి ముక్తసరిగా డైరెక్టర్ గారితో 'సారీ' అంది, ఆలస్యంగా వచ్చినందుకు! బి.ఎన్ కోపాన్ని తనలోనే అణచుకున్నారు. ఎందుకంటే కోప్పడితే, ఆమె నటించవలసిన సన్నివేశం బాగా రాదని ఆయన భయం. అందుకని ఆ కోపాన్ని దిగమింగుకుని, సన్నివేశాన్ని ఆమెకు వివరించాక శోక సన్నివేశం కాబట్టి కంట్లో గ్లిసరిన్ వేసుకోమని సూచించారు. హీరోయిన్ ఆయన వంక వింతగా చూస్తూ "సార్...నేను గ్లిసరిన్ లేకుండా కన్నీళ్లు తెప్పించగలను" అన్నారు ధీమాగా.


అప్పుడు బి.ఎన్. "అమ్మా...గ్లిసరిన్ లేకుండా ప్రొడ్యూసర్లకి కన్నీళ్లు వస్తాయి కానీ మీకెలా వస్తాయమ్మా" అన్నారు. ఆ నటికి ఆయన మాటల్లోని అంతరార్థం స్ఫురించకపోయినా, సెట్లో ఉన్న తక్కిన వాళ్లకు బాగా అర్థమై లోలోన నవ్వుకున్నారు. తను ఆ మాత్రమైనా ఆ అగ్రనటికి అలా ఓ చురక వేయగలిగానని బి.ఎన్ కు ఓ సంతృప్తి. ఆయన కోపం ఆ మేరకే పరిమితమై ఉండేది!

– బి.కె. ఈశ్వర్

మనుషుల్ని ఆత్మీయంగా కలిపేది, కలపగలిగినది భాష మాత్రమేనని ఒక అనుభవశాలి చెప్పారు. ఎక్కడో దేశం కాని దేశంలో యిద్దరు వ్యక్తులు కలుస్తారు. వారిద్దరి మాతృభాష ఒకటే అయినపుడు, ఒక్కముక్కలో ఆత్మీయులైపోతారు. ఆనాటి సుదీర్ఘ ఓడ ప్రయాణాలలో భాష మాత్రమే సాన్నిహిత్యం పెంచేది. ఆర్థిక, జ్ఞాన, అధికార వ్యత్యాసాలు అడ్డుగా నిలవక, హాయిగా కలుపుగోలుగా ఒకే భాషలో మాట్లాడుకోడానికి దోహద పడేది. ఒకే భాష తరువాత ఒకే యాస మరింత చేరువ చేస్తుంది. దేశాన్ని మాత్రమే కాక ప్రాంతాన్ని స్పష్టంగా సూచిస్తాయి యాసలు. దానితో వారి రుచులు, అభిరుచులు, సంప్రదాయాలు, మర్యాదలు చక్కగా కలుస్తాయి. మానసిక విశ్లేషకులు దీనిపై విస్తృత పరిశోధనలు చేశారు. ఆజ్ఞలకు అనుగుణంగా పని చేయాల్సిన సైనిక శాఖల్లాంటి చోట భాషా ప్రభావం గాఢంగా వుంటుందని చెప్పారు. ఒక పొగడ్త, ఒక మందలింపు, సూచన, సలహా సొంత భాషలో ప్రాంతీయ యాసలో విన్పించినపుడు సూటిగా మనసుకి నాటుకుంటుందని నిరూపణ అయింది. సొంత నేలకు దూరంగా వున్నపుడు స్వభాష వినాలని తహ తహ లాడతారట. ఇది సహజం కదా. రకరకాల కారణాలతో తెలుగు భాషని విస్మరిస్తున్నాం. కాదంటే కల్తీ చేసి వాడుతున్నాం. అందరం కలిసి కలగూరగంపగా ఒక కొత్త పలుకుబడిని, దానికి అనుగుణంగా వ్యాకరణాన్ని రూపొందిస్తున్నాం. అది రకరకాల మాధ్యమాల ద్వారా వేగంగా వ్యాపిస్తోంది. వెలిసిపోయిన తెలుగు నుడికారం స్వారీ చేస్తోంది. ఈ సందర్భంలో అసలు తెలుగుని కాపాడుకుందాం.

– సంపాదకుడు

యెంకి పాటలు



నండూరి సుబ్బారావు (1895–1957) యెంకి పాటలు ఒక ఉప్పెనలా వచ్చి తెలుగు నేలను ముంచెత్తాయి. సహజమైన తెలుగు పలుకుబడి, పాత్రోచిత యాస, వ్యంగ్యాలు, కాకు స్వరాలు తెలుగు వారిని అలరించాయి. జానపద పాటలకు దగ్గరగా వున్నా యెంకి పాటలు విభిన్నంగా వినవస్తాయి. " గుండె గొంతుకలోన కొట్లాడుతాది, కూకుండ నీదురా కూసింత సేపు " అనే భావాలు యెంకి పాటల ఆనవాళ్లు. వీరు వారు అనకుండా ఆ రోజుల్లో యెంకికి నాయుడు బావకి పట్టం కట్టారు.

యెంకి వంటి పిల్ల లేదోయి లేదోయి
యెంకి నా వంకింక రాదోయి రాదోయి!
మెళ్లో పూసల పేరు
తల్లో పూవులు సేరు
కళ్లెత్తితే సాలు
కనకాబిసేకాలు!

సెక్కిట సిన్నమచ్చ
సెపితె సాలదులచ్చ
వొక్కనవ్వే యేలు
వజ్ర వొయిడూరాలు!

పదము పాడిందంటె
పాపాలు పోవాల
కతలు సెప్పిందంటె
కలకాల ముండాల!

a ఇలా సాగే ఆ సాహిత్యం సరికొత్త పదబంధాలతో, భావ చిత్రాలతో తెలుగు వారి గుండెల్లో నిలబడి పోయింది. "ఎలుతురంతా మేసి ఏరు నెమరేసింది" లాంటి సరికొత్త ప్రతిపాదనలు అందరినీ అబ్బురపరిచాయి. యెంకి తెలుగింటి ఆడపడుచుగా శాశ్వత స్థానాన్ని సంపాదించుకుంది. ఆ రోజుల్లో ద్వారం వెంకట స్వామినాయుడు లాంటి విద్వాంసులు వయొలిన్ పై యెంకి పాటల్ని పాడి రంజింప చేసేవారు. ఆ పాటలను అనుకరిస్తూ ఎన్నో పాటలు వచ్చాయి గాని యివి మాత్రమే నిలిచాయి. వందేళ్ల తరువాత కూడా యెంకి నవవధువుగానే ద్యోతకమవుతూ వుంటుంది. తెలుగు సాహిత్యసుందరికి పాపిట బొట్టు యెంకి పాట.

శేషేంద్ర జాలం

తెలుగుని సంస్కృతాన్ని కొత్తగా వినిపించిన గొప్పకవి గుంటూరు శేషేంద్ర శర్మ (1927–2007). శేషేంద్రది ఒక యుగం. "కవిత్వం ఒక



మెస్మరిజం/కవికన్ను ఒక ప్రిజం/ నేను సృష్టించిన అలంకారం' అన్నారు శేషేంద్ర. దాదాపు ఆయన అన్ని రచనలలోనూ ప్రౌఢ వచన కవితా శైలిని విజయవంతంగా ప్రదర్శించారు. వాచవిగా నాలుగు :

బాబూ! నీ చిన్ని కన్నీటి బిందువుతో ఏ సముద్రం గర్జిస్తూ వుందో నాకు తెలుసు; అందుకే నేను చెట్లతో మొరపెట్టుకుంటున్నాను, "ఆకులు కాదు తుపాకులు కాయం"దని.

భూమిని బుజ్జగిస్తాను, లలితంగా లాలిస్తాను, వెన్నలాంటి మిన్నుతో గోరు ముద్దలు చేసి పైర్ల పసినోళ్లకందిస్తాను.

మనిషి చేస్తున్న శుష్క ఆర్భాటం చూస్తూ కొండలు వికటాట్టహాసం చేస్తున్నాయి. సముద్రం విశ్వాస వాసనలేని ప్రహ్వహాసం చేస్తోంది. ఆకాశం కడుపు చెక్కలయేట్టు నవ్వుతోంది. జ్ఞానకక్షులైన పురాతన అడవులు మౌనవ్యాఖ్యలతో తలలు పంకిస్తున్నాయి.

చెట్టు లేకపోతే పోనీ, ఇల్లు లేకపోతే పోనీ, చెట్టులాంటి నా చేత్తో నీకు నీడ యిస్తా–పొలాల మీద ఇంద్రధనుస్సు వంగింది. రాపోదాం, కొడవళ్లు దాల్చిన చేతులు ఎగరేస్తూ.

సామెతలు



గుర్రం చవలం జీను ముచ్చవలం – చవలం అంటే ఒకనాటి చిన్న నాణెం. పావలాలో నాలుగోవంతు. అణా ఖరీదు చేసే గుర్రానికి ముక్కానీ జీను తగిలిచ్చినట్టు అని అర్థం. నిష్పత్తి లేని ఖర్చు సందర్భంలో వాడే సామెత.

గుర్రానికి కడుపు కాలితే ఆరిగ గడ్డి కూడా మేస్తుంది. ఆరిగ గడ్డి అంటే పొట్టిగా నల్లగా బిరుసుగా వుంటుంది. తినడానికి పనికిరాదు. చీకదు కాబట్టి ఇంట్లకు కప్పుతారు. దీన్నే రెల్లు గడ్డి అంటారు.

గువ్వ కూర్చున్న టెంకాయ్, గూబకూర్చున్న కొంప కొరగావు చెట్టుపై వుండగానే తెగులు వల్ల కొబ్బరి నీరు లేకుండా చెడిపోవడాన్ని గువ్వకూర్చోడం అంటారు. గూబ అంటే గుడ్లగూబ. ఇది యింటి మీద వాలడాన్ని అరిష్టంగా భావించే వారు. ఈ సామెతను సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే పడికట్టు పదాలు, నమ్మకాలు అన్నీ తెలియాల్సిందే.

పందుము తిన్నా పరగడుపే, ఏదుం తిన్నా ఏకాదశే – పందుము, ఏదుం అనేవి ధాన్యపు కొలతలు. ఎంత తిన్నా ఏమీ తిననట్టు మాట్లాడే వారికోసం వచ్చిందీ సామెత. పరగడుపు అంటే ఏమీ తినని కడుపు. ఏకాదశి అంటే ఉపవాసం.

రామ అచ్చులు!




సుమారు అరవై ఏళ్లనాడు మా వూరుబడి శ్రీరామా హిందూ పాఠశాలలో ప్రాథమిక విద్య నేర్చుకున్నాను. అప్పట్లో అందరు ఉపాధ్యాయులూ అన్ని చదువులూ అన్ని తరగతులకూ చెప్పేవారు. పిల్లలకు విద్య నేర్పడానికి రకరకాల కిటుకులు ప్రయోగిస్తుండేవారు. ఒకటో తరగతిలో అఆలు నోటికి పట్టించడానికి మా అయ్యవారు రామనామంతో కలిపి యీ పాట పాడించేవారు.

రాముడ – రాముడా / రాముడి – రాముడీ /
రాముడు – రాముడూ / రాముఋ – రాముౠ /
రాముడె – రాముడే / రాముడొ – రాముడో /
రాముడై – రాముడౌ / రామం – రామ:

పుఠం ?!

"అమ్మా! గోంగూర పులుసు మహత్తరంగా వుంది!"



"ఎందుకుండదు... పెట్టాల్సిన పుఠాలన్నీ పెట్టాక"

అంటుంది అమ్మ. పుఠం అంటే వండడం, వుడికించడం అంటే చాలదు. పుఠం వేయడం, పుఠం పెట్టడం ఒక ప్రత్యేక ప్రక్రియ. పశువుల దాణాకి వులవల్ని వుడికిస్తారు. వాటిని గట్టికుండలో పిడకల దాలి మీద సన్నటి సెగపై వుడికిస్తారు. అవి పచనమై, గుగ్గిళ్లుగా మారడానికి ఒక పూట పడుతుంది. "నువ్వొచ్చేసరికి వులవలు వుడుకుతాయ్" అంటే చాలా సేపు పడుతుందని ధ్వని. ఇక వులవచారు కాలాలంటే యింకోపూట పడుతుంది. అప్పుడు వులవలు వుడికి పోయి, తెడ్డుతో నలిపితే లేహ్యంలా అవుతుంది. దాన్ని నీళ్లతో కలిపి పలచగా చేస్తే వులవచారు అవుతుంది. దీన్ని మళ్లీ పుఠం పెట్టి, వండి వార్చి అద్భుతమైన వంటకం చేస్తారు.

అసలు "పుఠం" అనే మాట. ఆయుర్వేద ఔషధాల తయారీలో వాడేమాట. అక్కడ నించి నిత్యవాడుకలోకి వచ్చింది. అనేక దీర్ఘవ్యాధులకు పనిచేసే కృష్ణాభ్రకభస్మం ఎలా చేస్తారో చెబితే పుఠం అంటే ఏమిటో స్పష్టమవుతుంది. నాణ్యమైన అభ్రకం రేకుల్ని శుద్ధిచేసి, మూలికలు ఆకుల రసాలతో మర్దనాలు చేసి వందపుఠాలు పెట్టాలి. అప్పుడు అభ్రకపు రేకులపైనుండే తళుకు పోతుంది. దాన్ని రసాలలో రుచ్చి, పదునులో తీసి బిళ్లలుగా ఆరబెట్టాలి. బాగా ఎండాక మట్టిమూకుళ్లలో పెట్టి సీలువేసి, నేలలో పిడకల మధ్య ఒక క్రమంలో పేర్చి అగ్నితప్తం చేస్తారు. తెల్లవార్లూ అలా కాచి చల్లార్చి ఆనక ఆ బిళ్లల్ని రకరకాల రసాలతో మర్దనా చేసి, రుబ్బి, మళ్లీ బిళ్లలు చేసి ఆరపెడతారు. మళ్ళీ పుఠం పెడతారు. ఈ పుఠానికి మూడురోజులు పడుతుంది. ఇలా వంద పుఠాలు అంటే దాదాపు సంవత్సర కాలం వెచ్చిస్తే శతపుఠ అభ్రకభస్మం తయారవుతుందిట! పుఠాన్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే యింత పుఠమూ పెట్టాల్సిందే.

